
# ఉపశ్రీ

## ఇంతింతై వటుడింతయై



అనామకుడు

ఉపశ్రీ మేన-అల్లుడు

# ఉషశ్రీ

## ఇంతింతై వటుడింతయై

అనామకుడు

ఉషశ్రీ మిషన్
విజయవాడ

**Ushasri Intintai Vatudintaai**
By Anaamakudu

First Edition : 2017

© Ushasri Mission

Published by :
Ushasri Mission
Radio Artistes Colony
Vijayawada - 520 008
www. ushasri.com

For Copies :
All Major Book shops
and
Ushasri Mission
9848598797
9912477763

Digital Copies :
Kinige.com

Price : Rs.200/-
US $ 10

**ISBN: 978-93-5291-527-9**

Printed at
Anupama Printers
126, Shantinagar,
Hyderabad - 28. Ph: 23391364
E-mail: anupamaprinters1978@gmail.com

# ముందోమాట

## రాయించిన అనామిక

నా “ రమణీయం” కథల సంపుటి ముందు మాట “ దాంపత్య ఋతుసంహారం” చివరలో–ముళ్ళపూడి వెంకటరమణగారు – “ రాసిన అనామకుడికీ, రాయించిన అనామికకూ శతమానంభవతి” అని ఆశీర్వదించారు.

ఆయన ప్రస్తావించిన అనామిక నాకు మరదలూ – శ్రీమతీ – ఎవిరీథింగ్ ఐన డాక్టర్ గాయత్రీదేవి.

ఆ అనామికే ఈ పుస్తకాన్నీ రాయించింది. రాయించింది కాదు. రాయించుకుంది. ఇది తను చెప్పిన కథే. తన నాన్న కథ. తన నాన్న ఎవరో కాదు. తెలుగువాళ్ళకి పరిచయం చెయాల్సిన అవసరం లేని ఉషశ్రీ.

ఐతే ఉషశ్రీ కథని నేను చిన్నప్పట్నుండీ వింటూనే విన్నాను. ఉషశ్రీ కథంటే ఉషశ్రీ చెప్పిన కథ కాదు. ఉషశ్రీ గురించి కథ. అంటే ఉషశ్రీ కథే.

ఉషశ్రీచెల్లి నాకు తల్లి. ఆవిడ నాకు ఎన్నో కథలు చెప్పేది. అందులో వాళ్ళ పుట్టింటి కథలు ఎక్కువగా ఉండేవి. కథలంటే కల్పించి చెప్పినవి కావు. చెప్పడంలో కల్పన ఉన్నవి. అవన్నీ నాకు బాగా గుర్తున్నాయి.

ఈ కథ రాయించిన అసలు అనామిక గాయత్రీదేవే ఐనా – తన అన్నయ్య గురించి బోలెడు కబుర్లు చెప్పిన మా అమ్మ కూడా ఈ కథ రాయించడం వెనక ఉన్న ఓ అనామిక.

ఆవిడే కాదు – పెళ్ళికి ముందూ తరవాతా కూడా నాకు మరదళ్ళే ఐన మరో ముగ్గురు అనామికలు – పద్మావతీ, వైజయంతీ, కళ్యాణలక్ష్మి – ఉన్నారు.

ఇందరు రాయించే అనామికలుంటే – రాసే అనామకుడికి పనేముంది.

* * *

అనే అనుకున్నాను రాయడం మొదలెట్టినప్పుడు. ఐతే –

అందరికీ బాగా తెలిసిన వ్యక్తి ఉషశ్రీ. అతని గురించి ఎందరో ఎంతో రాసారు. అతని రచనల గురించి పరిశోధనలే జరిగాయి. అందుకే ఏం రాస్తున్నా ఎవరో రాసిందే రాస్తానేమో అని అనిపించడం మొదలెట్టింది.

అప్పుడే ఓ విషయం అర్థమైంది. అతని రచనల గురించి రాయాల్సిన పనిలేదు. ఆ పుస్తకాలూ, సీడీలూ జనం దగ్గర, వాళ్ళ గుండెలకి చేరువగా ఉన్నాయి.

ఉషశ్రీ పుట్టిందే రచయితగానో, ఉపన్యాసకుడిగానో కాదు. అలా అవడానికి వాగ్దేవి కటాక్షం ఉంది. తల్లితండ్రుల ఆశీర్వాదం ఉంది. గురువులు నేర్పిన విద్య ఉంది. సాహితీమిత్రుల అండ ఉంది. మహా రచయితల ప్రభావం ఉంది. అన్నింటికీ మించి ఉషశ్రీ కృషి ఉంది.

పుట్టిన కాకరపర్రూ, పెరిగిన ఆలమూరూ, చదివిన భీమవరం, ఉద్యోగం చేసిన హైదరాబాదూ, విజయవాడా – అన్నీ – ఉషశ్రీని ఆదరించి, చేరదీసి, అంచెలంచెలుగా పైకెక్కించాయి. ఉపన్యాసాలూ, రచనలూ ఉషశ్రీలో ఒక పార్శ్వం. ఉషశ్రీకి మరో పార్శ్వం ఉంది. అది చాలా మందికి తెలియదు. అందులో ఓ కొడుకూ, ఓ అన్నా, ఓ నాన్నా, ఓ స్నేహితుడూ, ఓ హితుడూ ఉన్నారు. గురువుగారూ అంటూ జనాల నమస్కారాలు అందుకుంటున్న ఉషశ్రీ – ఇంట్లోకి అడుగుపెట్టగానే – అమ్మానాన్నల దగ్గర పిల్లాడే– కూతుళ్ళకి నాన్నే – మనవరాలు పుట్టగానే ఆ పసికందుకి తాతే.

ఆ ఉషశ్రీ తెలిస్తే కానీ – అతని కలంలో అంత మంది మనుషుల్ని ఆకట్టుకుని, వాళ్ళ మనస్సుల్ని కట్టిపడేసే వేగం, పదునూ, ఆకర్షణా ఎలా వచ్చాయో తెలియదు.

ఆలమూరుగట్ల మీద బెరుకుగా తిరిగిన కుర్రాడు – అందరినీ ఆకట్టుకునే ఉపన్యాసకుడిగా ఎలా పెరిగాడో తెలియదు.

ఉషశ్రీ సామాన్యమైన మనిషి కాదు. ఐతే అలా అసామాన్యుడిగా ఎలా ఎదిగారన్నది చాలా మందికి తెలియని కథ.

ఈ కథ కథకుడు ఉషశ్రీ కథ కాదు. సూర్యప్రకాశదీక్షితులు కథ. అలాగని పూర్తిగా దీక్షితులి కథ కూడా కాదు. చుట్టూ ఉన్న చిన్ని ప్రపంచంలో ఎవరో కొందరికి మాత్రం తెల్సేటట్లు ఉండిపోవల్సిన దీక్షితులు జగమెరిగిన ఉషశ్రీ అవడానికి, అతనిలోనూ, అతని దగ్గర వాళ్ళలోనూ ఉన్నదేంటో వెతికే కథ.

ఐతే ఈ కథ ఉషశ్రీ ఫలానా తేదీన పుట్టారుతో మొదలవదు. ఒక సంఘటన తర్వాత మరొకటిగా ఉండదు. ఎందుకంటే ఇది కాలంలో అటూ ఇటూ తిరుగుతూ ఉషశ్రీ పెద్దమ్మాయి – తన నాన్న చల్లని జ్ఞాపకాల్ని హాయిగా ఏరుకుంటూ మెల్లగా నెమరేసుకుంటున్న కథ.

గాయత్రీదేవి ఉషశ్రీ గురించి చెప్పిన కథ.

ఓ కూతురు నాన్న గురించి చెప్పిన కథ.

నవంబర్ 10, 2017 **అనామకుడు**

# కథాక్రమంబెట్టిదనిన . . .

ముందోమాట – రాయించిన అనామిక

1 నాన్న నాన్నయ్యారు ........ 7
2 నోరెట్టుకు బతుకుతాడు ........ 10
3 అనుకున్నది సాధించారు ........ 13
4 భాగ్యనగరం ........ 16
5 విజయవాటిక ........ 19
6 బ్రహ్మాండాంత సంవర్ధియై ........ 23
7 పందిళ్ళూ, గుళ్ళూ, బళ్ళూ ........ 26
8 అండాదండానాన్నే ........ 30
9 మిలియన్ దాటుంటాయి ........ 34
10 ఇల్లుకట్టిచూడు ........ 38
11 భద్రాచలం ........ 41
12 పెళ్ళిచేసిచూడు ........ 45
13 వేంకటేశ్వరకళ్యాణం ........ 49
14 జ్వలితజ్వాల ........ 52
15 ఎన్నిరాశారో నాన్న ........ 56
16 ఆలమూరు ........ 59
17 పడుతూలేస్తూ ........ 64
18 పరుగందుకున్నారు ........ 67
19 తరుణసాహితి ........ 70
20 అమ్మా నాన్నా ........ 73
21 నాన్నప్రకృతి ........ 78
22 అన్నీనాన్నతోనే ........ 84
23 భారతంపెట్టె ........ 89

24 మనవరాలి మాయ ........................................ 94
25 కర్కాటకం ........................................ 97
26 మళ్ళీ దొడ్డమ్మ ఇంటికి ........................................ 102
27 మహానిర్యాణం ........................................ 105
28 పునరావలోకనం ........................................ 108

**మధ్యలో ఓ మాట – అపూర్వం ........................................ 112**

29 రామాయణంలో హనుమంతుడు ........................................ 113
30 అంతా నాన్నమయం ........................................ 117
31 స్వస్తి ........................................ 121


**ఇంకా**

i. ఉషశ్రీ ఇష్టాలు ........................................ 131
ii. ఉషశ్రీ ముందూవెనకా ........................................ 132
iii. ఉషశ్రీ రచనలు ........................................ 134
iv. ఉషశ్రీమిషన్ కార్యక్రమాలు ........................................ 137

చివరోమాట – రాసిన అనామకుడు ........................................ 139



# నాన్న నాన్నయ్యారు



అమ్మకీ నాన్నకీ పెళ్ళైంది 1956 మే ఐదున. నేను వాళ్ళకి పెళ్ళయిన నాలుగో ఏట పుట్టాను. అమ్మానాన్నల పెళ్ళైంది పల్లెపాలెంలో. నేను పుట్టిందీ అక్కడే. అమ్మ పుట్టిల్లు ఆ ఊరే.

ఈ మధ్య నేను వెళ్లలేదు కానీ – పల్లెపాలెం పేరుకి తగ్గట్టు పల్లెటూరు. ఇప్పటి సంగతి తెలియదు కానీ కొన్నేళ్ళ క్రితం వరకూ కూడా అక్కడకి వెళ్ళాలంటే యానాం వెళ్ళి, అక్కడ నుండి బస్సులో ఇంజరం వెళ్ళి, అక్కడ నుండి నడవాలి. మధ్యలో ఓ కాలువను – నీళ్ల లోతుని బట్టి బల్లకట్టు మీదో – నడుస్తూనో – దాటాలి.

నేనింక రేపో మాపో పుడ్తాననగా – నేను పుట్టగానే నన్ను చూసేద్దామన్న ఉత్సాహంతో – నాన్న పల్లెపాలెం ప్రయాణమయ్యారుట – అమ్మా చెప్తూ ఉండేది. తల్చుకుంటే నాకెంత సంతోషంగా అనిపిస్తుందో. అప్పటికి నాకు నేను పుట్టానని కానీ, నాన్న వచ్చారని కానీ తెలియదు. తర్వాత్తర్వాత అమ్మ దగ్గర వినివిని తెలుసుకున్నాను.

పల్లెపాలెం ఊళ్ళోకి వెళ్తోంటే ఉన్న మొదటి వీధిలో మొదటి ఇల్లే కృష్ణావధాన్లు గారిది. కృష్ణావధాన్లు గార్లు అమ్మకి బాగా కావల్సిన చుట్టం. అమ్మా వాళ్ళ ఇంటికి ఎన్నేళ్ళగానో పౌరోహిత్యం చేసినాయన. వయసులోనూ, జ్ఞానంలోనూ పెద్దాయన.

అయన్ని తర్వాత నేను చూసాను కానీ – అయన గురించి నాకు తెలిసిందంతా అమ్మ దగ్గర విన్నదే. అమ్మ పల్లెపాలెం గురించీ, అక్కడి మనుషుల గురించీ ఎప్పుడూ చెప్తూ ఉండేది.

మనిషి ఎంత ఎదిగినా, ఎన్ని ఊళ్ళు చూసినా, ప్రపంచం ఎంత తిరిగినా – ఎక్కడో ఒక మూల – తన మూలాలని పదిలంగా దాచుకుంటాడు. అమ్మ హైదరాబాద్, విజయవాడలలో ఎన్నాళ్ళు ఉన్నా – పల్లెపాలెంలో ఐన వాళ్ళు ఎవరూ లేకపోయినా – ఆ ఊరు గురించి తల్చుకుంటూనే ఉండేది. అప్పుడు అమ్మని చూస్తే ఏంటా

అంతలా ఆలోచిస్తోంది అని అనిపించేది. ఇప్పుడు తెలిసొస్తోంది. జీవితమే అంత. చాలా విషయాలు అనుభవిస్తే కానీ తెలియవు. ఎన్నో విషయాలు తెలుసుకునేటప్పటికి ఆలస్యం ఐపోతుంది. తెలిసొచ్చాక చెయ్యగలిగింది ఏముండదు. నాన్న గొప్పతనం, నాన్న ఉన్నన్ని రోజులూ నాకు పూర్తిగా తెలియలేదు. ఆయన నన్ను విడిచి వెళ్ళాకే ఆయనంటే ఏమిటో తెలిసొచ్చింది. నాన్న నాన్నగా ఎలాంటి వారో కూడా నాన్న లేని పాతికేళ్ళలోనే ఎక్కువ తెలిసింది.

నేను పుట్టినప్పుడు చూడ్డానికి వస్తూ – నాన్న దానిమ్మ పళ్ళని తీసుకొచ్చారట. ఎక్కడ నుండి తీసుకొచ్చారో ఎందుకోసం తీసుకొచ్చారో తెలియదు. అసలు నాన్న అప్పుడు ఎక్కడ ఉండేవారో కూడా తెలియదు.

నాన్న 1957లో భీమవరం కాలేజీలో బీయే పూర్తి చేసాక రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో కొన్నాళ్ళు ట్యూటర్గా ఉద్యోగం చేసారు. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్ళి పత్రికల్లో పని చెయ్యడం మొదలెట్టారు. నేను పుట్టేటప్పటికి  నాన్న రాజమండ్రిలోనో, హైదరాబాద్‌లోనో ఉండి ఉంటారు. ఏ ఊళ్ళో ఉన్నారో ఎవరినైనా అడిగితే తెలియచ్చు. ఇంతవరకూ ఎవరినీ అడగలేదు. ఇప్పుడు అడగాలని కూడాలేదు. ఎక్కడ నుండి వచ్చారన్నది కాదు నాకు కావల్సింది – వచ్చారన్న ఆలోచనే నాకు ఆనందంగా అనిపిస్తుంది.

నాన్న ఊళ్ళోకి రావడం తన ఇంటి అరుగు మీద కూచుని చూసారట కృష్ణావధాన్లు గారు.

సరిగ్గా సమయానికి వచ్చావోయ్ దీక్షితులూ! ఇప్పుడే వ్యాసి ఆడపిల్లను కంది అని నాన్నకి చెప్పారుట. ఆ మాట వినగానే నాన్న తన దగ్గరున్న దానిమ్మపళ్ళని ఆయన కాళ్ళ దగ్గర పెట్టేసారుట. నాన్నలో ఏ కోశానా ఆడపిల్ల పుట్టిందన్న నిరుత్సాహం లేదుట. అది ఇప్పటి మాట కాదు. ఐదున్నర దశాబ్దాల క్రితం సంగతి. నేనే కాదు, నా తర్వాత ముగ్గురు ఆడపిల్లలు పుట్టినా నాన్న ఏ మాత్రం నిరుత్సాహపడలేదు. ఓ ఆడపిల్లగా నాకది ఎంతో ఆనందంగా అనిపిస్తుంది. ఎవరయినా నలుగురూ అడపిల్లలేనా అంటూ సాగదీస్తూంటే, “ఆహా నలుగురు ఆడపిల్లలు ” అంటూ తన గంభీర స్వరంతో గర్వంగా జవాబిచ్చేవారు.

కృష్ణావధాన్లు గారు పళ్ళు తీసుకుంటూ – దానిమ్మపండు లాంటి పాప పుట్టిందని ఈ పళ్ళు నాకిస్తున్నావా – అని నాన్ననీ నన్నూ ఆశీర్వదించారుట. ఆయన్ని నేను కొంచెం పెద్దయ్యాక ఓ సారి చూసాను. ఆయనే పండులా ఉండేవారు. హాయిగా నవ్వేవారు, చక్కగా కబుర్లు చెప్పేవారు. అలాంటాయన ఆశీర్వాదంతో మొదలైంది – నాకు నాన్న కూతురిగా జీవించేయోగం.

అక్కడ నుండి ఇంటికొచ్చి నన్నెత్తుకుని ఉంటారు. అమ్మ చెప్పిన కథలో ఆ విషయం లేదు. ఎత్తుకునే ఉంటారు. పిల్లలు పుట్టిన వెంటనే వాళ్ళని  నాన్నలు చూడకూడదు లాంటి పట్టింపులూ ఆచారాలూ ఏవైనా ఉన్నా వాటిని నాన్న పట్టించుకుని ఉండరు.

ఇప్పటికీ తల్చుకుంటే ఎంత హాయిగా ఉందో ఆ ఆలోచన. అమ్మ కడుపులోంచి నాన్న చేతుల్లోకి.



ఆ చేతులే నన్ను చిన్నప్పుడు ఎత్తుకుని ఆడించినవి. అవే నన్ను పట్టుకుని నడక నేర్పించినవి. వాటితోనే నా అన్న ప్రాశనా, అక్షరాభాస్యం అయ్యాయి. నాకు స్నానాలు చేయించి, అన్నాలు తినిపించి బళ్ళోకి తీసికెళ్ళినవి ఆ చేతులే.

నాన్న చేతుల బలమే పిల్లలకి శ్రీరామ రక్ష – ముఖ్యంగా ఆడపిల్లలకి నాన్నలే అండ.

నా తర్వాత ముగ్గురూ ఆడపిల్లలే, నేను పుట్టిన రెండున్నరేళ్ళకి పద్మా, ఆ తర్వాత ఓ సంవత్సరానికి జయా పుట్టారు. జయపుట్టిన ఐదేళ్ళకి కళ్యాణి పుట్టింది.

ఆడవాళ్ళకి ఎన్నో రకాల కష్టాలు పెట్టిన ప్రకృతి కొన్ని గొప్ప వరాలు కూడా ఇచ్చింది. పిల్లని కడుపులో మోసి, కని, పాలిచ్చి పెంచి పెద్ద చెయ్యగలిగే శరీరాన్ని ఇచ్చింది. అంతకు మించి ఆ పనులన్నీ ఆనందంగా చేసే మనస్సుని ఇచ్చింది. అలాగే తండ్రి ప్రేమని ఇచ్చింది.

ఆ ప్రేమే నా జీవితాన్ని చుట్టేసింది.

ఉషశ్రీ ప్రసిద్ధుడే - ఈ గ్రంథము ( అమృత కలశం )
ఆయన ప్రసిద్ధికి మరీ దోహదమే చేస్తున్నది.
ఆయనింక నిట్టి గ్రంథములు వ్రాసి,
ఈ మార్గమునకు ఉపదేష్టయగు గాక !
"ఇది ఉషశ్రీ మార్గము"
అన్న ప్రతిష్ఠ బడయు గాక !

- విశ్వనాథ సత్యనారాయణ





# నోరెట్టుకు బతుకుతాడు



నేను పుట్టిన ఐదేళ్ళ తర్వాత –1965లో – నాన్నకి హైదరాబాద్ ఆలిండియా రేడియోలో ఉద్యోగం వచ్చింది. అప్పటికి పద్మా, జయంతీ పుట్టారు.

ఆలిండియా రేడియోలో నాన్న చేరేసరికే ఆలిండియా రేడియోకి ఆకాశవాణి అని పేరు పెట్టారు కానీ అందరూ ఆలిండియా రేడియో అనే అనేవారు.

రేడియోలో చేరడానికి ముందే నాన్న కొన్నాళ్ళు ప్రాంతీయ వార్తలు చదివారు. ప్రాంతీయవార్తలు చదివే నళినీమోహన్ గారు సెలవులో వెళ్తే – కేజువల్ న్యూస్ రీడర్‌గా పిలిచారు నాన్నని. పదిహేను రోజుల పాటేమో నాన్న ప్రాంతీయవార్తలు చదివింది.

ప్రాంతీయవార్తలు చదువుతున్నది పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు అని చెప్పుకునే వారు. నాన్నకి వాళ్ళ నాన్న పెట్టిన పేరు సూర్యప్రకాశ దీక్షితులు, అదే నాన్న అసలు పేరు. నాన్నకి వాళ్ళనాన్న పెట్టిన పేరు కంటే నాన్న తనకి తాను పెట్టుకున్న ఉషశ్రీ పేరే లోకానికి తెలుసు.

రేడియో ఉద్యోగానికి ముందు నాన్న చాలా పత్రికల్లో పని చేస్తూ ఉండేవారు. పత్రికల్లో పని చేస్తూ ఆలిండియా రేడియోలో తన మాట అప్పుడప్పుడూ వినిపిస్తూ ఉండేవారు. కథలూ, కవితలూ, ప్రసంగాలూ, చదువుతూండేవారు.

పొత్తూరి వెంకటేశ్వరరావు గారు ఒకసారి నాతో – నాన్నా ఆయనా ఆంధ్రప్రభలో కొన్నాళ్ళు కలసి పని చేసారని చెప్పారు. నాన్న ఆలిండియా రేడియో ప్రసంగాలకి – ఆంధ్రప్రభ ఆఫీసు నుండి ఖాళీ దొరికినప్పుడు వెళ్ళొస్తూండేవారని కూడా చెప్పారు. ఆ తర్వాత ఆయన ఆంధ్రప్రభ సంపాదకులుగా పనిచేసారు. విజయవాడలో మా ఇంటికి వస్తూండేవారు. అమ్మ వంటరుచి చూసి ఆనందించిన వాళ్ళలో అయనా ఉన్నారు.



అప్పటికింకా ముందు ముచ్చట ఒకటి అత్త చెప్తూండేది. ఆలిండియా రేడియోలో మొదటి సారిగా నాన్న మాట వినిపించింది 1952లో. అది విశ్వనాథ సత్యనారాయణ గారి చెలియకట్ట మీద ప్రసంగంట. వినడానికి ఆలమూరులో మామ్మ దగ్గర రేడియో లేదు. ఊళ్ళోనే ఊరి ప్రెసిడెంట్ లాంటి కొందరిళ్ళలో తప్ప రేడియోలు లేవు. మామ్మ ఎవరింటికీ వెళ్ళి వినే ప్రసక్తే లేదు. అత్తలు ఎవరిళ్ళకో వెళ్ళి విన్నారుట.

అని చెప్పేసి అత్త – అబ్బాయి ఆలిండియా రేడియోలో ఉద్యోగం చేస్తాడని కానీ – చేసినా ఇంతిలా గొప్పవాడైపోతాడని కానీ తెలియదు. తెలిస్తే ఆ రోజుల్లో అలా ఎవరింటికో వెళ్ళి వినేవాళ్ళమో లేదో అని అని– వెళ్ళుండే వాళ్ళమేలే – అబ్బాయి గొంతు రేడియోలో వినకుండా ఎలా ఉండేవాళ్ళం అని తేల్చేసేది.

అత్తంటే నాన్నకి పెద్ద చెల్లెలు. నాకు పెద్దత్తా – అత్తా కూడా. నాకు పెళ్ళైనప్పట్నుంచీ అత్తతో కలసి ఉన్నాను. నాన్న గురించి ఎన్ని కబుర్లు చెప్పుకునే వాళ్ళమో. నాన్న చిన్నప్పటి విషయాలు ఎన్ని చెప్తూండేదో అత్త.

అబ్బాయంటే నాన్నే. అమ్మా నాన్నలకే కాదు. తమ్ముళ్ళకీ, వాళ్ళ స్నేహితులకీ కూడా నాన్న అబ్బాయే. అత్త నాన్నని ఎప్పుడూ అన్నయ్య అనేది కాదు. అబ్బాయనే చెప్పేది. ఆఖరికి నాన్న ఆఖరి తమ్ముడు రాఘవబాబయ్య కూడా నాన్నని అబ్బాయనే అంటాడు.

ఈ సందర్భంలోనే మరో రెండు సంగతులు గుర్తుకొస్తున్నాయి.

ఒకటి – దీపావళి పండగకి నాన్న తన చిన్నప్పుడు చక్రపొట్లాలు తిప్పడానికి భయపడ్డం. నిజానికి చక్రపొట్లాలంటే నాకు తెలియవు. అత్త చెప్పేది చూస్తే – అవేవో తాడుకి కట్టిన మతాబాల్లా అనిపిస్తాయి నాకు. వాటిని పట్టుకుని తోటి మగపిల్లలు తిరుగుతోంటే, అలా వెళ్ళడానికి భయపడి – నాన్న ఇంట్లో ఉండిపోయేవారుట. ఇంత పిరికివాడు వీడెలా బతుకుతాడో అని మామ్మ భయపడుతూ ఉండేదిట. ఆరోజు ఆవిడకి తన అబ్బాయి ఇలా మైకు ముందు కూచుని తెలుగువాళ్లందరి చేతా తన మాట వినిపించుకుంటాడని తెలియదు కదా అని నవ్వేసేది అత్త.

రెండోది – అట్లతద్దికి జరిగే ముచ్చట. ఓపెద్ద చెట్టుకి ఉయ్యాల వేసుకుని అమ్మాయిలు ఊగుతారనుకుంటా అట్లతద్దికి. ఆలమూరులో చెరువు గట్టున ఉన్న చెట్లకి ఉయ్యాలలు వేసుకుని ఊగేవారుట. ఉయ్యాలంటే చిన్నది కాదు. ఎత్తుగా తాడు ఉయ్యాల. అందులో కూచుని ఊగడమే కష్టం. దానికి తోడు ఆ ఉయ్యాలల్ని ఊపేవాళ్ళు గట్టిగా రాక్షస ఊపులా ఊపేవారుట. అదీ చెరువు మీదకి. అదంతా ఓ పెద్ద కోలాహలం. అత్త ఉత్సాహంగా చెప్పేది.

అలా ఊగడానికి వెళ్ళే ఆడపిల్లల్ని ఆటపట్టించడానికి అబ్బాయిలు దూలగొండాకులేసుకు వెంటబడేవారుట. వాటి నుండి తప్పించుకుంటూ ఆడుకునే వారుట ఆడపిల్లలు.

ఇవన్నీ నాకు తెలియవు. అత్త చిన్నప్పటి విషయాలు అంటే నాన్న చిన్నప్పటివి కూడా. ఈ ప్రస్తావన అంతా ఎందుకంటే నాన్న అందరి మగపిల్లల్లా దూలగొండాకేసుకుని అమ్మాయిల వెనకపడ్డంలో వెనకపడేవారుట. నాన్న పెద్ద తమ్ముడు కిష్టబాబయ్య నాన్న కన్నా చిన్నైనా చురుగ్గా ఉండేవాడుట. నోట్లో నాలుకలేని వాడు వీడెలా బతుకుతాడో అని మా మామ్మ నాన్న గురించి బెంగ పడేదిట.





నాన్న అమ్మాయిల వెనక దూలగొండాకు వేసుకుని తరమడమనే ఆలోచనే నాకు నవ్వుగా అనిపిస్తుంది. నిజానికి నాన్నకి కూడా అలాంటి పనులు చెయ్యాలని అనిపించి ఉండకపోవచ్చు. దూలగొండాకులూ, చక్రపొట్లాలూ – నాన్న చిన్నప్పుడే నాన్నకి చిన్నతనంగా అనిపించి ఉండవచ్చు. అవన్నీ నాన్న చెయ్యకపోవడం మామ్మకి చిన్న తనంగా అనిపించడం సహజమేమో కూడా.

ఇంత భయస్తుడు వీడు జీవితంలో ఎలా నెగ్గుకొస్తాడో అని నాన్న గురించి బెంగపడి – శ్రీధర వెంకయ్య గారికి నాన్న జాతకం చూపించారుట.

వెంకయ్యగారంటే ఆరోజుల్లో బాగా పేరున్న జ్యోతిష్కులుట. అయన నాన్న జాతకం చూసి – మీరేం భయపడకండి వీడు నోరెట్టుకు బతికేస్తాడు అని చెప్పారుట. ఆయన మీద నమ్మకం ఉన్నా నాన్న నోరెట్టుకు బతికేస్తాడంటే ఎవ్వరూ నమ్మలేక పోయారుట. మహా ఐతే నోరెట్టుకుని పిల్లలకు పాఠాలు చెప్పే బడిపంతులు ఉద్యోగం చేస్తూ బతుకుతారని అనుకున్నారుట. అదీ కాకపోతే వ్రతాలకీ, నోములకీ మంత్రాలు చదువుతూ జీవితం గడిపేస్తారని అనుకున్నారుట.

నాన్న అనర్గళంగా రామాయణ, భారత, భాగవత ప్రవచనాలు ఊరూరా చేస్తారనీ, ఇలా లక్షలాది మందిని ప్రభావితం చేస్తారనీ, అవి శ్రోతల మనసుల్లో ఇంతగా నిలిచిపోతాయనీ ఎవరూహించారని అనేది అత్త .

నాలుగున్నర దశాబ్దాలు ఆయన స్వరం రామాయణ భారతాలకీ, భద్రాద్రి రాముడి కళ్యాణానికీ పర్యాయపదం అయిపోయింది. శ్రీధర వెంకయ్యగారు సూచించిన నోరెట్టుకు బతకడం అంటే ఇదేనేమో.

సంస్కృతులకు అది వ్యాస భారతం,

తెలుగు వాళ్ళకు ఇది సమాస భారతం

\- మధునాపంతుల సత్యనారాయణ.



# అనుకున్నది సాధించారు



నా చిన్నప్పుడు నాన్న బాలానందం ప్రోగ్రాంకి తీసికెళ్ళడం నాకు గుర్తొస్తోంది. న్యాయపతి రాఘవరావు దంపతులు అన్నయ్య– అక్కయ్యలుగా కార్యక్రమం నిర్వహించేవారు. కార్యక్రమానికి వచ్చే పిల్లల్ని వాళ్ళు స్వంత పిల్లల్లా చూసుకునేవారు. తెలుగులో పిల్లల కార్యక్రమాలకి ఒరవడి దిద్దింది ఆ దంపతులే. ముఖ్యంగా రాఘవరావు గారు. నేనేం పాడినట్లో, మాట్లాడినట్లో నాకు గుర్తులేదు.

అక్కడే రతన్ ప్రసాద్ గారు నన్ను దగ్గరకి తీసుకొని ముద్దు చేసేవారు. చిన్ని పిల్లని. అందునా ఉషశ్రీ కూతురిని. ఆ రోజుల్లో – నాన్నా రతన్ ప్రసాద్ గారూ కార్మికుల కార్యక్రమాన్ని చేసేవారు. అందులో కార్మికులు పనుల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలూ, వాళ్ళు తెలుసుకోవలసిన చట్టాల వివరాలూ చెప్తూండేవారు.

అప్పట్లో ఆలిండియా రేడియోలో శ్రోతలకి ఉల్లాసం కలిగించే కార్యక్రమాలతోపాటు ఉపయోగించే కార్యక్రమాలు కూడా ప్రసారం చేసేవారు. ప్రభుత్వం ప్రజలకి మంచి విషయాలు తెలియచెయ్యడానికి రేడియోని చక్కగా వాడుకునేది.

ఐతే విజ్ఞానదాయకమైన కార్యక్రమాలని వినోదాత్మకంగా అందించడం సులభం కాదు. అలాంటి కార్యక్రమాన్ని కూడా సరదాగా నలుగురికీ ఆసక్తి కలిగేలా నడిపే వారు నాన్న. ఆ కార్యక్రమంలో నాన్న పేరు మల్లేశ్ అని గుర్తు. రతన్ ప్రసాద్‌గారు రమణక్కో, చిన్నక్కో. సత్యనారాయణ గారనుకుంటా ఏకాంబరంగా ఉండేవారు. ఈ మధ్య కలిసినప్పుడు కూడా రతన్ ప్రసాద్ గారు ఆ రోజులు తల్చుకుంటూ నాన్నని గుర్తు చేసుకున్నారు.

ఆ రోజుల్లోనే ఫేమిలీ ప్లానింగ్ కార్యక్రమాలు కూడా చేసేవారు నాన్న, ఆ కార్యక్రమంలో నాన్న పేరు గుర్తుకు రావడంలేదు. అందులోనే అనుకుంటా శారదా అశోకవర్ధన్ గారూ హేమలత గారూ ఉండేవారు.





నాన్న ఫేమిలీ ప్లానింగ్ కార్యక్రమం చేస్తూ ఎక్కువ పిల్లల్ని కనకూడదని చెప్తున్న రోజుల్లో నాన్నకి మేం ముగ్గురు ఆడపిల్లలం. అలాంటి నాన్న ఆ కార్యక్రమం చెయ్యడం ఏమిటని అనుకునే ఉంటారు. ఆ కార్యక్రమం నాన్న చేస్తుండగానే – కళ్యాణి పుట్టింది. మేం నలుగురం అయ్యాం. అప్పుడు నాన్న పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించేసుకున్నారు.

ఆ విషయం ఎలా తెలిసిందో – అమ్మ ఏడుపు – మగపిల్లాడు పుట్టాలి కదా అంటూ. నాన్న నేను చేస్తున్న ఉద్యోగమే కుటుంబ సంక్షేమం గురించి. మగపిల్లాడు కావాలంటూ నేను కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోకపోతే నా ఉద్యోగమే పోతుందని చెప్పారు. అది అబద్ధమే ఐనా నిజం.

నాన్న మగపిల్లాడే కావాలని అనుకోకపోవడం నిజమైన నిజం. తనకి ఆడపిల్లలే ఉన్నారు, మగపిల్లలు లేరని నాన్న ఒక్క రోజు కూడా ఎవరితోనూ అనలేదు. ఇంకా పైపెచ్చు నాకు నలుగురూ ఆడపిల్లలే అని గర్వంగా చెప్పేవారు. చెవులకీ మనస్సుకీ ఎంత మధురంగా వినిపించేవో ఆ మాటలు.

ఇంగ్లీష్‌లో లాస్ట్ బట్ నాట్ లీస్ట్ అంటారు. అలాగ నాన్న హైదరాబాద్ ఆలిండియా రేడియో జీవితంలో ముఖ్యమైనది చివరగా గుర్తు చేసుకుంటున్నాను.

అది లాల్ బహదూర్ శాస్త్రి గారి హైదరాబాద్ పర్యటన సందర్భంగా నాన్న చేసిన ప్రత్యక్ష ప్రసారం. పాకిస్తానుతోయుద్ధానికి అవసరమైన నిధులని పోగు చెయ్యడం కోసం అప్పటి ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి గారు దేశమంతా తిరుగుతూ హైదరాబాద్ వచ్చారు. ఆయన పర్యటనని ప్రత్యక్ష ప్రసారం చేసింది హైదరాబాద్ ఆలిండియా రేడియో.

ఆ ప్రత్యక్షప్రసార కార్యక్రమాన్ని నాన్నకి అప్పగించారు. అప్పటికి నాన్న ఆలిండియా రేడియోలో చేరి ఎక్కువకాలం అవలేదు. ఐనా నాన్న అంతకుముందు చేసిన కార్యక్రమాలని దృష్టిలో పెట్టుకుని, నాన్న చెయ్యగలరని నాన్నకి అప్పచెప్పారాపనిని. ఆ ప్రత్యక్ష వ్యాఖ్యానం ఒక రకంగా నాన్న ఆలిండియా రేడియోలో చేరకముందే నాన్నకి కలిగిన ఓ ఆలోచనకి కార్యరూపం.

మహాత్మాగాంధీగారి మరణవార్త యావద్భారతదేశాన్నే కాదు ప్రపంచాన్ని కూడా కుదిపేసింది. అప్పుడు జనం మనస్సులు కదిలిపోయేలా గాంధీగారి అంతిమ యాత్రకి రన్నింగ్ కామెంటరీ ఇచ్చింది మెల్విన్ డిమెల్లో. గాంధీ గారి పార్థివ శరీరాన్ని బిర్లాగృహం నుంచి రాజఘాటుకి తీసికెళ్తున్న వాహనం పక్కనే – రేడియో వారి వాహనంలో ప్రయాణించేస్తూ – ఏడు గంటలసేపు డిమెల్లో చేసిన కామెంటరీ విన్న వాళ్లకి – వాళ్ళే స్వయంగా ఢిల్లీలో ఉండి అంతిమ యాత్ర చూస్తున్నామనిపించేలా ఉందని చాలా మంది అంటారు.

డిమెల్లో చెప్పిన విషయాలూ, చెప్పిన తీరూ – విన్న వారిని దుఃఖసాగరంలో ముంచెత్తాయని ఇప్పటికీ రాస్తూ ఉంటారు. భారతదేశ బ్రాడ్ కాస్టింగ్ చరిత్రలో – ఆ రోజు డిమెల్లో చేసిన రన్నింగ్ కామెంటరీ చిరస్థాయిగా నిల్చిపోయింది. ఆ ఏడు గంటల కామెంటరీ ఎందరెందరినో కామెంటరీ వృత్తిగా తీసుకునేందుకు ప్రేరేపించిం దంటారు. పదిహేడేళ్ళ ప్రాయంలో ఆ కామెంటరీ విన్న జస్దేవ్ సింగ్ అందులో ప్రముఖులు.



తర్వాత నలభై ఏళ్ళకి పైనే – భారతదేశ స్వతంత్ర, గణతంత్ర దినోత్సవాలకి – రేడియోలో, టీవిలో ప్రత్యక్ష ప్రసారం చేసారు జస్దేవ్ సింగ్. ఆయన ప్రత్యక్ష ప్రసారాలకి గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనకి పద్మభూషణ్ ఇచ్చి సత్కరించింది కూడా. ఆయనకి డిమెల్లో మహాత్మాగాంధీ అంతిమ యాత్ర ప్రత్యక్ష ప్రసారమే స్ఫూర్తి.

నాన్నకీ అంతే. డిమెల్లోని వినే – ఆకాశవాణిలో అవకాశం వస్తే – ప్రత్యక్ష ప్రసారం అలా చెయ్యాలి అని అనుకుంటూ ఉండేవాడినని చెప్పే వారు నాన్న.

1965 లో హైదరాబాద్ ఆకాశవాణిలో చేరిన కొన్నాళ్ళకే – లాల్ బహదూర్ శాస్త్రి గారి హైదరాబాద్ పర్యటన సందర్భంగా – ప్రత్యక్ష ప్రసారం చేసే మొదటి అవకాశం వచ్చింది నాన్నకి. నాన్న ఉద్యోగానికి కొత్త కానీ మాటకి కాదు. నాన్న మాట రేడియో వాళ్ళకీ కొత్త కాదు.

మొదటి అవకాశం కదా విజృంభించి ఉంటారు. కొత్తకుర్రాడిని క్రికెట్ టీంలో తీసుకుంటే తన సత్తా ఎలా చూపిస్తాడో అలా చెప్పుంటారు. ఆయన చెప్పే భారత కథాపరంగా చెప్పాలంటే తిక్కనగారు రాసిన సింగంబాకటితో పద్యంలో అర్జునుడి లాగా అన్న మాట.

విజృంభించే ఉంటారు అని ఎందుకంటున్నానంటే అప్పటికి నేనింకా చిన్న పిల్లను. నాకు నాన్నేం చేస్తున్నారో తెలియదు. అప్పుడే కాదు. ఆ తర్వాత కూడా నాన్న చేస్తున్న కార్యక్రమాల గొప్పతనం నాకు తెలియదు. కొన్నైతే నేను వినలేదు కూడా. ఒక్కోసారి నాన్న ప్రత్యక్ష ప్రసారాలో, భారతప్రసంగాలో విన్న వాళ్లెవరో కనిపించి – నాన్న కార్యక్రమం విన్నాం ఎంత గొప్పగా ఉందనుకున్నావు, అని అన్నప్పుడు కూడా నాన్న గొప్పతనం పూర్తిగా నాకు తెలిసిందని నేననుకోను.

నాన్న ఎప్పుడూ తన పిల్లలు తన్నో ప్రముఖుడిగా చూడాలని అనుకోలేదు. నాన్నగా చూడాలని అనుకున్నారు. మేమూ నాన్నగానే చూసాం. అంతవరకూ బావుంది. ఐతే నాన్న రచనల్ని ఆ రోజు కూడా అనుభవించి ఆనందించి ఉంటే ఇంకా బావుండేది.

ప్రతి శనివారమూ అరగంటసేపు
ఆంధ్రదేశంలోని ప్రతి గృహాన్నీ
నైమిశతపోవనంగా మార్చి వేసిన
ఐంద్రజాలికుడు ఉషశ్రీ

– శనగన నరసింహస్వామి





# భాగ్యనగరం



ఆకాశవాణిలో చేరడానికి ముందు నుండే హైదరాబాద్లో ఉండేవారు నాన్న. రాజమండ్రిలో ట్యూటర్ ఉద్యోగం వదిలేసి హైదరాబాద్ వచ్చాక పత్రికలలో పనిచేస్తూ ఉండేవారు. ఏ పత్రికలోనూ ఓ సంవత్సరం పైన పని చేసినట్లు లేదు.

అలాచేస్తూ, మానేస్తూ చేస్తూన్న ఉద్యోగాల్లో వచ్చే జీతాలూ, పత్రికలవాళ్ళు రచనలకీ, ఆలిండియా రేడియో వాళ్ళు ప్రసంగాలకీ ఇచ్చిన పారితోషికాలూ – వాటితో మమ్మల్ని ఎలా పెంచారో తల్చుకుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

నన్నే సంవత్సరంలో హైదరాబాద్ తీసుకు వచ్చారో కానీ – నేను మరీ చిన్నపిల్లగా ఉన్నప్పుడు కొన్నాళ్ళు మా దొడ్డమ్మా వాళ్ళింట్లో ఉండేవాళ్ళమని మా అమ్మ చెప్తూండేది. అమ్మ అక్కని కొందరు పెద్దమ్మ అనీ, కొందరు దొడ్డమ్మ అనీ అంటారు. మాకు దొడ్డమ్మ అలవాటైంది. ఆవిడ నిజంగా దొడ్డ మనిషే. పెద్దనాన్న గారు అంత కన్నానూ. ఇంకా స్థిరమయిన సంపాదన లేని నాన్న స్నేహితులతో ఎక్కడో ఉంటూ మమ్మల్ని దొడ్డమ్మ ఇంట్లో ఉంచారు. ఎప్పుడూ ఎవరింట్లోనూ ఎక్కువగా ఉండడానికి కానీ మమ్మల్ని ఉంచడానికి కానీ ఇష్టపడనినాన్న కూడా దొడ్డమ్మ వాళింట్లో మమ్మల్ని కొన్నాళ్ళు ఉంచడానికి మొహమాట పడలేదు. దొడ్డమ్మకీ నాన్నకీ బాగా చనువు ఉండేది.

దొడ్డమ్మ వాళ్ళిల్లు దిల్సుఖ్ నగర్లో మెయిన్ రోడ్ మీదే ఉండేది, పెద్దదొడ్డి పక్కన ఇల్లు. ఇప్పుడూ ఆ యిల్లు అలాగే ఉంది. చుట్టుపక్కలే అంతా మారిపోయింది. దొడ్డమ్మతోనూ ఆ యింటితోనూ మాకున్నదేంబంధమో– నాన్న చివరి రోజుల్లో నాన్న హైదరాబాద్ మలక్పేట హాస్పిటల్లో ఉన్నప్పుడు నేను దొడ్డమ్మా వాళ్ళింట్లోనే ఉన్నాను. కొన్ని బంధాలు చిత్రంగా కట్టి పడేస్తాయి. దొడ్డమ్మతో మా అనుబంధం అలాంటిది.



అక్కడున్నప్పుడే నాన్న పత్రికల వాళ్ళో ఆలిండియా రేడియో వాళ్ళో ఏదైనా పారితోషికం ఇస్తే అది దొడ్డమ్మకి ఇచ్చేసేవారు. ఊరికే వాళ్ళింట్లో మమ్మల్ని ఉంచడం నాన్నకి కష్టంగా ఉండి ఉంటుంది. కానీ ఆర్థిక పరిస్థితులూ అనుకూలంగా ఉండి ఉండవు. అసలు నాన్నెక్కడ ఉండేవారో నాకు తెలియదు.

దొడ్డమ్మ ఇంట్లో మేం ఎక్కువ రోజులు ఉండలేదనుకుంటా. వాళ్ళింటికి దగ్గర్లోనే అద్దె ఇంటికి మారిపోయాం. అక్కడ ఉన్నప్పుడే నాన్న మమ్మల్ని మూసీనది ఒడ్డున నడిపించేవారు. అక్కడ చిన్ని చిన్ని రంగుల రాట్నాలు ఉండేవి. వాటిమీద ఎక్కించి తిప్పించే వారు. మరీ చిన్న పిల్లైనా పద్మ ఎక్కేసేది. నాన్న ఎక్కించేసేవారు.

అక్కడ నుండి చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి గుడి దగ్గర ఇంటికి మారాం. అప్పటికి నాన్న ఆలిండియా రేడియో ఉద్యోగంలో చేరుంటారు. ఆఫీసుకి దగ్గరగా ఉంటుందని మకాం అక్కడకి మార్చుంటారు. ఆలిండియా రేడియో ఉద్యోగంతో ఆదాయం కూడా కొంతపెరిగి ఉంటుంది. అప్పుడే ఉద్యోగం వచ్చిందనీ, ఆర్థిక పరిస్థితి స్థిరపడచ్చుననీ – నాన్న తన ఆప్తమిత్రులు కే కే రామానుజాచార్యులు గారికి ఉత్తరం రాసుకున్నారు కూడా.

నాన్న రామానుజాచార్యులు గారికి రాసుకున్న ఉత్తరాలు కొన్ని నా దగ్గరున్నాయి. అందులో నాన్న ఆయనకి తన జీవితంలోని ఒడిదుడుకులన్నీ రాసుకున్నారు. నేను పుట్టినప్పటి ఆనందమూ, ఉద్యోగం లేనప్పటి బాధా – మనస్సు విప్పి చెప్పుకున్నారు.

హైదరాబాద్ ఆలిండియా రేడియోకి దగ్గర్లోనే నౌబత్ పహాడ్, కాలా పహాడ్ పేరిట రెండు కొండలుండేవి. నిజానికి అవి కొండలేం కావు. గుట్టలు. నౌబత్ పహాడ్ పైనే నాలుగు స్తంభాల మీద డోం లాంటి కట్టడం ఉండేది. అక్కడ నుండి టేంక్ బండ్ బాగా కనిపించేది. ప్రస్తుతం కాలా పహాడ్ మీద బిర్లా వారి వేంకటేశ్వరస్వామి గుడి వచ్చింది. నౌబత్ పహాడ్ మీద ప్లేనటేరియం వచ్చింది.

ఆలిండియా రేడియోకి దగ్గర్లోనే పబ్లిక్ గార్డెన్స్. ఆ గార్డెన్స్‌లోనే జూ ఉండేది. జూ తోపాటు మ్యూజియం కూడా ఉండేది. జూ అక్కడ నుండి వెళ్ళిపోయింది కానీ మ్యూజియం ఇంకా ఉంది. అందులో ఓ మమ్మీకాలి గోరు కనిపిస్తూ ఉంటుంది. నాన్నే చూపించారు అవన్నీ. ఆ తర్వాత ఈజిప్ట్ వెళ్ళి అక్కడ మ్యూజియంలో మమ్మీలు చూసినప్పుడు నాన్న హైదరాబాద్ మ్యూజియంలో మమ్మీని చూపించిన సన్నివేశం కళ్ళకి కట్టినట్లు కనిపించింది.

వీటన్నిటికీ నాన్న తీసికెళ్ళడం నాకు గుర్తుంది. అమ్మా, నాన్నా, నేనూ, బుల్లి చెల్లెళ్ళూ, నౌబత్ పహాడ్‌కి వెళ్ళికూచోడం నాకు లీలగా కాదు. స్పష్టంగా గుర్తొస్తోంది. నాన్నతో పిక్నిక్ ఎలా మర్చిపోతాను. హైదరాబాద్ గూడు రిక్షాలో అందరం కలిసి వెళ్ళేవాళ్ళం. అమ్మ ఏదో ఒక పిండివంటకం చేసుకుని తీసుకొచ్చే ఉంటుంది. ఆవిడ చెయ్యకపోతే నాన్న చేయించే ఉంటారు.

ఆలిండియా రేడియోలో చేరిన కొత్తలోనే నాన్న ఏదో ఒక ట్రైనింగుకి ఓ నెలరోజులు సిమ్లా వెళ్ళారు. అప్పుడు కొత్త పేటలో నాన్న స్నేహితుడు సుబ్బారావు గారింట్లో ఉంచారు మమ్మల్ని. ఆయన ఎవరో నాకు తెలియదు. నాన్న చిన్నప్పటి స్నేహితులెవరో అయ్యుంటారు. ట్రైనింగైె వెనక్కివస్తూ మాకు స్వెట్టర్లు కొని తీసుకొచ్చారు. నాన్న తెచ్చిన స్వెట్టర్ నా దగ్గర చాలా రోజులు ఉంది. విజయవాడ వెళ్ళాక కూడా వాడుకున్నాను – నాన్న సిమ్లా నుండి తెచ్చిన స్వెట్టర్ అని చెప్పుకు మురిసిపోతూ.

స్వెట్టర్లే కాకుండా ఆ చలిదేశం విశేషాలు మోసుకొచ్చారు. అక్కడి చలి గురించీ, టీకి నీళ్ళు కాచుకోడంలోని ఇబ్బందుల గురించీ చెప్తుండేవారు. పిల్లలకి నాన్నల మాటలు ఎంతెలా గుర్తుండిపోతాయో. తర్వాత సిమ్లా,





స్విట్జర్లాండ్, ఛికాగో, ఎక్కడి చలి ప్రదేశానికి వెళ్ళినా – నాన్న చెప్పిన అప్పటి విశేషాలు గుర్తొస్తూనే ఉంటాయి నాకు. చిక్కడపల్లి ఇంటి తర్వాత మరో మూడిళ్ళలో ఉన్నాం.

మొదటిది ఖైరతాబాద్‌లో పెద్ద వినాయకుణ్ణి పెట్టే చోటుకిసరిగ్గా ఎదురుగా ఉన్న ఇల్లు. ఆ ఇంట్లో ఉన్నప్పుడే నా పుట్టిన రోజుకి రతన్ ప్రసాద్ గారినీ, దేవులపల్లి కృష్ణశాస్త్రి గారినీ ఇంటికి తీసుకొచ్చారు నాన్న, అప్పటికే కృష్ణశాస్త్రి గారి కంఠానికి ఆపరేషనైపోయింది. ఆయన మాట్లాడలేక పోయేవారు. నాకు శుభాకాంక్షలు కాగితం మీదే రాసిచ్చారు. అమ్మ వంట బావుందంటూ ప్రసంశ కూడా కాగితం మీదే చేసారు. ఆ ప్రదేశం ఇప్పటికీ పెద్దగా మారలేదు.

తరవాత నల్లకుంటలో రామాలయం పక్కన ఇల్లు, నేనక్కడే ఆంధ్ర మహిళా సభ వాళ్ళ స్కూల్లో మూడో క్లాసు చదివాను. ఆ తర్వాత పంజగుట్టలో ఇల్లు. అది బాగా గుర్తుంది. అక్కణ్ణుంచే నాన్నకి ట్రాన్స్ఫర్ అయ్యి విజయవాడ వెళ్ళిపోయాం.

ఆ మూడు చోట్లకీ అప్పుడప్పుడు వెళ్ళి చూసొస్తుంటాను నేను. ఏ ఇల్లూ ఉత్తి ఇల్లు కాదు. ఇటికా సిమెంట్ సున్నం కాదు. ఇల్లంటే మనుషులూ జ్ఞాపకాలూ. నాకైతే అన్ని ఇళ్ళలోనూ నాన్న కనిపిస్తారు. నాన్న చెప్పిన కథలూ, పద్యాలూ, పాటలూ వినిపిస్తూనే ఉంటాయి. అన్నీ నిన్న మొన్న జరిగినట్లు అనిపిస్తాయి.

ఏమీ తెలియని తనపు రోజులవి. బావున్నాయని కూడా తెలియని రోజులు. తల్చుకుంటే ఎంత బావున్నాయో అని అనిపించేంత బావున్న రోజులు.

నాన్నకి హైదరాబాద్ నుండి విజయవాడ ట్రాన్స్ఫర్ అవుతోందంటే నేను బాధ పడ్డాను. హైదరాబాద్ వదిలి వెళ్ళడం ఎందుకని ఏడ్చాను. విజయవాడ పిచ్చి ఊరని గునిసాను. నిజానికి హైదరాబాద్ గురించీ తెలియదు, విజయవాడ గురించీ తెలియదు. చిన్నతన్నం. ఉన్న ఊరే గొప్పదనుకునే అమాయకత్వం. అప్పటికి నాలుగో క్లాసు చదువుతున్న నాకు ఏం తెలిసి అంత బాధపడిపోయానో ఇప్పుడు తల్చుకుంటే నవ్వువస్తుంది.

ఎంతమ్మా రెండేళ్ళలో వెనక్కి వచ్చేద్దాం అంటూ ధైర్యం చెప్పారు నాన్న. ఐతే అప్పుడు నాకు తెలియని విషయం ఒకటుంది. నాన్న విజయవాడ వెళ్తున్నది ఒక ప్రమోషన్ మీదని తెలియదు నాకు. నాన్న చెప్పలేదు. అలాంటివి చెప్పడం నాన్న గుణం కాదు. తిట్టుకుంటూ రైలెక్కాను.

ఆ ప్రయాణం నన్ను విజయవాడకి దగ్గర చేస్తుందని అనుకోలేదు. ఆ ప్రయాణం నాన్నని ఏ కొందరికో కానీ సాధ్యం కాని శిఖరాగ్రాలు ఎక్కించే ప్రయాణం అవుతుందని అసలు అనుకోలేదు. నిజానికి ఆ రైలు ప్రయాణం నాన్న విజయ యాత్రకి నాంది.

> **రామాయణ భారతాలను జీవనపథ నిర్దేశాలుగా**
> **దర్శించాలనే కోరిక ఉన్న వారికి**
> **ఉషశ్రీ ఉపన్యాసాలు స్నిగ్ధ గవాక్షాలు**
> **- భుజంగరాయ శర్మ**



# విజయవాటిక



హైదరాబాద్ నుండి విజయవాడకి బయల్దేరింది1969 ఏప్రిల్ ఒకటో తారీకున. నాకు బాగాగుర్తు. ఏప్రిల్ ఒకటంటే ఫూల్స్‌డే కదా – ఆ రోజు హైదరాబాద్ వదిలి వెళ్ళడం గురించి ఫ్రెండ్స్‌తో కలసి ఫూల్స్ జోకులేసుకున్నాం. ఐతే ఆ ఫూల్స్ రోజే మా జీవితాల్ని మలుపుతిప్పే రోజని తర్వాత కదా తెలిసొచ్చింది.

ఆ రోజు తిథి చతుర్దశి. రాత్రి రైలెక్కాం. మంచిరోజు చూసుకుని వెళ్ళమని స్నేహితుల్లో కొందరు చెప్పారు నాన్నకి. నాన్న వారాలూ వర్జ్యాలూ నమ్మే మనిషి కాదు. నాన్న నమ్మరంటే నాన్న గురించి తెలియని వాళ్ళు నమ్మకపోవచ్చు. రోజులన్నీ మంచివే అని ఆ రోజే ప్రయాణం పెట్టారు నాన్న.

ఆరుగురం రైల్లో బయల్దేరాం. ఆలిండియా రేడియో వారి ధర్మమా అని అది ఫస్ట్ క్లాసులో ప్రయాణం. అదే మొదటిసారి ఫస్ట్ క్లాసెక్కడం. ఈ తర్వాత విమానాల్లో బిజినెస్ క్లాసులో విదేశీ ప్రయాణాలు చేసినా – నాన్నతో రైల్లో చేసిన ఆ ప్రయాణం నేనెప్పటికీ మర్చిపోలేనిది.

కళ్యాణి నెల్ల పిల్ల. దానికి టిక్కెట్ లేదు. అది కాకుండా మేం అయిదుగురం. నలుగురికి ఒక కేబిన్. ఇంకొకరికి మాత్రం ఇంకో కేబిన్. ఎవరెళ్ళి విడిగా పడుక్కుంటారు. కళ్యాణి అమ్మ పక్కనా జయంతి నాన్న పక్కనా పడుక్కున్నారు.

నాన్న కొత్త ఊరి గురించీ, కొత్త చోట ఉద్యోగం గురించీ ఆలోచిస్తూ ఉండి ఉంటారు. అప్పుడవేం తెలియవుగా. విజయవాడలో ఎన్నాళ్ళునాన్నా అని నాన్నని నేను అడుగుతూనే ఉన్నా. నాన్నేదో చెప్తూనే ఉన్నారు.

అప్పుడు మాకున్న సామానంతా మాతో రైల్లో వచ్చేసింది. వంట గిన్నెలూ, పడక సామాన్లూ తప్ప ఇంకేం లేవు. మాయింట్లో కుర్చీలూ, ఫేనూ కొనిపించింది విజయవాడ వచ్చిన కొన్నేళ్ళకి భట్టు మావయ్య గారు. భట్టు మావయ్య గారంటే – విజయవాడ ఆలిండియో రేడియోలో పనిచేసిన పన్నాల సుబ్రహ్మణ్య భట్టు గారు. చెణుకుల్లాంటి కార్యక్రమాలు చేస్తూండేవారు. తర్వాత్తర్వాత స్నేహితుల్లో పెసరట్టుల భట్టుగా పేరు సంపాదించుకున్నారు కూడా. విజయవాడలో రైలు దిగడం దిగడం రిక్షాలు చేసుకుని మాచవరంలో సుబ్బామవయ్య ఇంటికి బయల్దేరాం. సుబ్బామవయ్య





అంటే సుబ్రహ్మణ్యం గారు. చిర్రావూరి సుబ్రహ్మణ్యం గారు. చిరకాలంగా నాన్నకి స్నేహితులు. మా అందరికీ అతి సన్నిహితులు.

సుబ్మావయ్య అప్పుడు విజయవాడ హిందీ ప్రచారసభలో పనిచేస్తూండేవారు. ఆయనకి చుట్టూ పెద్ద ఖాళీ స్థలం ఉన్న పెంకుటిల్లు ఇచ్చారు సభ వాళ్ళు. ఉండేది ఒక్కాయన. ఆయన మమ్మల్ని ఆ ఇంట్లో ఉండమని, మేం అక్కడున్నన్ని రోజులూ ఇంటికి ఓ పక్కనున్న చిన్న గదిలో ఉండేవారు.

స్టేషన్నుండి సుబ్మావయ్య ఇంటికి రిక్షాలో వెళ్తూంటే నాకు మురుక్కాలవలూ, పందులూ కనిపించాయి. దానికి తోడు ఊళ్ళో శ్రీరామనవమి పందిళ్ళు వేసి ఉంచారేమో – వాటి చుట్టూ చెత్తగా తాటాకులూ, అరిటాకులూ, పడేసి ఉన్నాయి. అంతకు నాలుగు రోజుల ముందే శ్రీరామనవమి అయింది. ఏంటి నాన్నా ఈ పందులూరు వెళ్ళిపోదాం అని నేనంటూంటే – ఎంతమ్మా రెండేళ్ళే మళ్ళీ హైదరాబాద్ వెళ్ళిపోదాం అని ఊరడించారు నాన్న.

మేం ఏప్రిల్లో  విజయవాడ వెళ్ళడం వల్ల మమ్మల్ని వెంటనే స్కూల్లో చేర్పించే పని తగల్లేదు నాన్నకి. మాకూ సుబ్మావయ్య ఇంటి ఆవరణలో హాయిగా ఆడుకుంటూ కాలక్షేపం చేసే అవకాశం కలిగింది. నెమ్మది నెమ్మదిగా విజయవాడ అలవాటవడం మొదలెట్టింది. ఓ రెండు నెలల తర్వాత స్కూల్లో చేరాక – హైదరాబాద్ వదిలేసామే అన్న ఆలోచనేపోయింది.

ఇవన్నీ జీవితంలో ఎవరికి వారు అనుభవించి తెలుసుకునేవి. నాన్న అప్పటికే ఆలమూరూ, రాజమండ్రీ లాంటి ఊళ్ళొదిలేసి హైదరాబాద్ వెళ్ళి ఉండడం వల్ల మార్పు మనిషికి మంచిదే అని నాన్నకి అప్పటికే అర్థం అయ్యుంటుంది.

దేశవిదేశాల్లో ఎన్నో చోట్లు తిరిగొచ్చాక – ఈ రోజు నాకూ బాగా తెలిసొచ్చింది – ఎక్కడకీ వెళ్ళకుండా ఉన్నచోటే ఉండాలనుకోడం మనిషి ఎదుగుదలకి ఒక అవరోధం అవుతుందనీ – మానసికంగా మనిషి ఎదగడానికి మార్పు ఎంతగానో దోహదం చేస్తుందనీ.

వేసవి సెలవులయ్యాక నన్ను ఐదో క్లాసులో వెయ్యడానికి స్కూళ్ళకోసం చూసారు నాన్న. చూసి చూసి ఏడిద కామేశ్వరావు గారు పెట్టి నడిపిస్తున్న బాలభారతి స్కూల్లో  చేర్పించారు. ఏడిద కామేశ్వరరావు గారికి ఆలిండియా రేడియోతో ఉన్న సంబంధం ఒక కారణం అయ్యుంటుంది. అంతకన్న ముఖ్యంగా ఆ స్కూలు, పిల్లలకి చదువొక్కటే రుద్దడానికి కాకుండా – సంగీతం, నాట్యం లాంటివి నేర్చుకుందుకు కూడా ప్రాముఖ్యతనిచ్చే స్కూలుగా తీర్చిదిద్దుతున్నారని ఆలోచించి ఉంటారు.

స్కూలు గవర్నర్పేటలో రహమాన్ పార్కుకి పక్కన ఉండేది. అది మాచవరంలో మేం ఉంటున్న సుబ్మావయ్య ఇంటికి దూరమే. మరీ చిన్నపిల్లలని పద్మనీ, జయంతినీ వెంటనే స్కూల్లో చేర్పించలేదు. జయంతిని ఒకటో క్లాసులో కొత్తగా చేర్పించాలి. పద్మకి హైదరాబాద్లో రెండో క్లాసు పూర్తయ్యింది. మూడులో చేర్పించాలి. కళ్యాణి ఇంకా ఏడాది పిల్ల. నన్ను మాచవరం నుండి బాలభారతి స్కూలుకి నాన్న సైకిల్లో తీసికెళ్ళేవారు. ఎంత అందమైన అనుభవం అది. ఎంత ఆనందకరమైన అనుభూతి అది. ఏ ఆడపిల్లకైనా వెనక్కితిరిగి చూసుకుంటే నాన్న సైకిల్



వెనక్కాల కూచుని స్కూలుకి వెళ్ళానన్న జ్ఞాపకం కన్న మధురమైనది ఏముంటుంది? అది నాకుంది. నాన్నిచ్చిన తీపి గుర్తు. పొద్దున్న ఆఫీసుకి వెళ్తూ నన్ను స్కూలు దగ్గర దింపి ఆలిండియా రేడియో స్టేషనుకి వెళ్ళిపోయేవారు.

విజయవాడ ఆలిండియా రేడియో మొదలైనప్పట్నుంచీ ఇప్పుడున్న చోటే ఉంది. నాన్న విజయవాడ రేడియో స్టేషన్లో చేరేడప్పటికి ఆఫీసూ, స్టూడియోలూ, బ్రిటిష్ కాలంనాటి పాత బంగాళాలో ఉండేవి. తర్వాత కొన్నాళ్ళకే ఇప్పుడున్న మేడలోకి వచ్చాయి. రేడియో స్టేషన్ ఉన్నచోటే ఉంది కానీ చుట్టూ ఉన్న ప్రపంచం పూర్తిగా మారిపోయింది. సాయంత్రం స్టేషన్నుండి వెనక్కి వస్తూ మళ్ళీ నన్ను సైకిలెక్కించుకుని ఇంటికి తీసికెళ్ళిపోయేవారు.

అప్పుడే నాకు సుబ్బావయ్య ఇంటి ఆవరణలో సైకిల్ నేర్పించడానికి ప్రయత్నించారు నాన్న. నన్ను సైకిలెక్కించి, వెనక పట్టుకుని తొక్కించేవారు. నాకు సైకిల్ తొక్కడం రాలేదు కానీ నాన్న నేర్పించడం మాత్రం ఓ మరపురాని జ్ఞాపకంలా మిగిలిపోయింది. పంచె పైకి కట్టుకుని, సైకిల్ గట్టిగా పట్టుకుని, పరుగు లాంటి నడకతో నా వెనకే నాన్న తిరగడం – నాకు కళ్ళ ముందు కనిపిస్తూనే ఉంది.

నాకు తెలిసినప్పట్నించీ నాన్న పంచే లాల్చీలే వేసుకునేవారు. మరి చిన్నప్పుడేమైనా పేంట్లు వేసుకున్నారేమో తెలియదు. ఊళ్ళో అందరిచేతా గురువుగారిగా గౌరవింపబడుతున్న నాన్న – పంచె పైకి కట్టేసుకుని రోడ్డు మీదకెళ్ళిపోవడం బావుండదని, నాన్నకి పైజామాలు కొని తీసుకొచ్చి ఇచ్చారు నాన్నకి బాగా ఆప్తులైన కే కే రామానుజాచార్యులు గారు. నాన్న జీవిత కథలో ఆయన మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటారు. ఎన్నేళ్ళ స్నేహం వాళ్ళది? ఎంత గాఢమైంది?

ఆచార్యులుగారు ఇచ్చారంటూ ముచ్చటపడిపోయి నాన్న పైజామా కట్టుకుంటే – చూళ్ళేకపోతున్నాం నాన్నా అని మేం గోల పెట్టేసాం. అమ్మానాన్నల్ని ఒకలాగ చూడ్డం అలవాటయ్యాక – వాళ్ళు మరోలా ఉంటే చూళ్ళేరు పిల్లలు. వాళ్ళని మారనివ్వరు. అమ్మానాన్నలు – మా పిల్లలు ఇలానే ఉండమన్నారంటూ – గారంగా ఫిర్యాదులు చేసినట్లు చేస్తూ – పిల్లలు చెప్పిందే చేస్తారు. అదీ తల్లితండ్రులకీ పిల్లలకీ ఉన్న బంధం. అదే నాన్నచేత పైజామాలు కట్టనియ్యకుండా చేసింది. ఆ పైజామాలని సగం దాకా చింపేసి ఇంట్లో లాగుల్లా కట్టేసుకున్నారు నాన్న.

మాచవరంలో సుబ్బావయ్య ఇంట్లో ఉన్నది ఐదారునెలలేనేమో. అక్కడ నుండి సూర్యారావుపేటలో ఓ ఇంటికి మారాం. అప్పటి నుండి ఇళ్ళు మారుతూనే ఉన్నాం. ఐతే అన్నీ సూర్యారావుపేటలోనే. అక్కడక్కడే గుడుగుడు గుంచంలా. అప్పుడప్పుడు అక్కడ వీధులు తిరుగుతూ మేం ఉన్న ఇళ్ళన్నీ చూస్తూ ఉంటాను. ఒక్కో ఇంటికీ ఒక్కో సంఘటన ముడిపడి ఉంటుంది.

నేనే క్లాసు చదువుతున్నప్పుడు ఏ ఇంట్లో ఉండేదాన్నో గుర్తు తెచ్చుకుంటూ ఉంటాను. అలాగే ఏ ఇంట్లో ఉన్నప్పుడు ఎవరు పుట్టారో, ఎవరి పెళ్ళయిందో కూడా గుర్తు తెచ్చుకుంటూ ఉంటాను. అప్పటి సంఘటలకి మేం మారిన ఇళ్ళే కొండగుర్తులు.





ఐటీఐ కోలనీ దగ్గర స్వంత ఇల్లు కట్టుకునే వరకూ ఇళ్ళు మారుతూనే ఉన్నాం.

సూర్యారావుపేటకి మారిన తర్వాత పద్మనీ, జయంతినీ బాలభారతిలోనే చేర్పించారు. ఐదో క్లాసులో అక్కడ చేరిన నేను పదో క్లాసు వరకూ అక్కడే చదివాను. అప్పటికి విజయవాడ నా ఊరైపోయింది. హైదరాబాద్ వెనక్కి వెళ్ళిపోయింది.

అప్పటి నుండి ఇప్పటి దాకా మీ ఊరేంటని ఎవ్వరడిగినా విజయవాడ అని చెప్పే మనస్సు వచ్చేసింది. ఎంత మార్పు.


ఐతే నాకు జరిగిన మార్పు ఎంత – నాన్నకి జరిగిన పెను మార్పుతో పోలిస్తే.

ఆకాశవాణి శ్రోతలకూ, అశేష ఆంధ్రపాఠక లోకానికీ
శిష్ట వ్యావహారిక విశిష్ట శైలీ విన్యాసంతో
భారత రామాయణాది గాథలను
కదళీపాక ప్రమాణ గద్యంలో అందించారు ఉషశ్రీ

– సి. రాఘవాచారి



# బ్రహ్మాండాంత సంవర్ధియై



నాన్న ఏప్రిల్ రెండున విజయవాడ ఆలిండియా రేడియోలో అడుగుపెట్టారు. ఆరోజు పౌర్ణమి. బుధవారం. నాన్న మంచి రోజు చూసుకోకుండా వచ్చిచేరినా – అది మంచిరోజే అయింది. నేననేది అది తిథి వార నక్షత్రాల ప్రకారం మంచిరోజని కాదు. అది నాకు తెలియదు కూడా.

ఏ ముహూర్తాన నాన్న విజయవాడ ఆలిండియా రేడియో స్టేషన్లో అడుగెట్టారో – ఆ అడుగు ముందుకు అలా దూసుకుపోయింది. వామనుడి పాదంలా దేశమంతా వ్యాపించింది. అందుకే ఆ రోజు మంచిరోజని అంటున్నాను.

నాన్న విజయవాడలో చేరాక – పసిడిపంటలు కార్యక్రమం చెయ్యడం మొదలెట్టారు. రైతులకి వ్యవసాయం గురించి సమాచారం అందించే కార్యక్రమం అది. అందులో వంగడాల గురించీ, వ్యవసాయ పద్ధతుల గురించీ, ఎరువుల గురించీ, పురుగుల మందుల గురించీ చెప్పేవారు. ఆ కార్యక్రమంలో నాన్న పేరు చిన్నబాబు అనుకుంటా. నాగరత్నమ్మగారూ, హనుమంతరావుగారూ ఉండేవారు. వాళ్ళ పేర్లు అమ్మడూ, పెద్దబాబూ అని గుర్తు.

కార్మికుల కార్యక్రమం లాగా దీన్ని కూడా – వినోదం విజ్ఞానం కలిపి – వినాలనిపించేలా చేసేవారు.

అసలు ఆ కార్యక్రమం కోసమే ఇంటర్వ్యూలు జరిగాయనీ, అందులో నాన్న ప్రతిభ చూసి సెలెక్ట్ చేశారనీ, నాన్నకి ప్రమోషన్ ఇచ్చి విజయవాడ పంపించారని తర్వాత నాన్న దగ్గరే విన్నాను నేను. ఏం ప్రొమోషన్ అది! జీవిత గమనాన్ని మార్చేసిన ప్రొమోషన్!! తలుచుకుంటే ఒళ్ళు గగుర్పొడిచేలాంటి ప్రొమోషన్!!!

నాన్న విజయవాడలో ఆలిండియా రేడియోలో చేరిన రెండేళ్ళకో, మూడేళ్ళకో బాలాంత్రపు రజనీకాంతరావుగారు స్టేషన్ డైరెక్టర్‌గా వచ్చారు. ఆయనికి నాన్నా, నాన్న చరిత్రా, రచనలూ, మాటా – అన్నీ తెలుసు.





ఆయన తనకి తాను సంగీత సాహిత్యాలలో ఎంతో సాధించినవారు. ఎందరినో వెలుగులోకి తీసుకు వచ్చినవారు. తెలుగు లలిత సంగీతానికీ సాహిత్యానికీ మార్గనిర్దేశం చేసిన మహానుభావులు. రేడియోలో లలిత సంగీతానికి ఓ ప్రత్యేకమైన స్థానాన్ని ఇచ్చి, రేడియో ద్వారా లలిత సంగీతానికి గౌరవం సంపాదించి పెట్టిన ఘనులు. ఘంటసాల లాంటి ఆణిముత్యాన్ని గుర్తించి బయటకి తీసుకురావడంలో ఆయన హస్తం ఉందంటారు.

నాన్ననీ, నాన్న ప్రతిభనీ గుర్తించి నాన్నకి సరిపోయే కార్యక్రమాన్ని నాన్నకి అప్పగించారు రజనీకాంతరావుగారు.

నాన్నే ఒకసారి రాసుకున్నారు – బాలాంత్రపు రజనీకాంతరావుగారనే అమృతహస్తం తన చేతుల్ని పట్టుకుని బయటకి లాగకపోయుంటే – పురుగుమందుల గొందుల్లో, ఎరువుల చెరువుల్లో కొట్టుమిట్టాడుతూ ఉండేవాడినని.

కార్యక్రమం పేరు ధర్మసందేహాలు. అదో అరగంట కార్యక్రమం. ముందుగా మొదలెట్టింది శనివారాలు మధ్యాహ్నాలు. ఒంటిగంటన్నరకి మొదలయ్యేది.

అందులో పురాణాది విషయాల మీద శ్రోతల ప్రశ్నలకి నాన్న చేత సమాధానాలు చెప్పించడం మొదలెట్టించారు. శ్రోతలు పంపిన ప్రశ్నలని అడిగే పని కొన్నాళ్ళు సి. రామ్మోహనరావుగారు చేసారు. తర్వాత చాలా సంవత్సరాలు ఏ బీ ఆనంద్‌గారు చేసారు. శ్రోతల ధర్మసందేహాలని వాళ్ళు అడగడం. నాన్న సమాధానాలు చెప్పడం. అందులో భాగంగా ఓ ఐదు నిమిషాలసేపు భారతం చెప్పించేవారు. ఆ ఐదు నిమిషాలు పెరిగింది. పెరిగి పెరిగి భారతమే అరగంటా ఆక్రమించేసుకుంది. చివర్లో ఒకటో రెండో ప్రశ్నలకి సమయమిచ్చేది.

భారతం తెలుగుదేశమంతా విస్తరిల్లింది. అసలు భారతం కథే ప్రజాదరణ ఉన్న కథ. దానికి తోడు నాన్న చెప్పే తీరు.

చిన్న గాలిలా మొదలైన ప్రవచనం అనతికాలంలోనే మహాప్రభంజనంలా మారింది. దేశాన్నంతా ముంచెత్తేసే తుఫానులా  అయిపోయింది. కొన్నాళ్ళకే అది పెను సునామీలా హోరెత్తింది.

ఇప్పటి ఇంటర్నెట్ యుగంలో ఏదైనా వార్త కానీ, పాట కానీ తొందర తొందరగా జనంలోకి పాకేస్తే దాన్ని వైరల్ అంటున్నారు. ఇప్పుడు వైరల్ అవడానికి ఫేస్బుక్కులూ ట్విట్టర్లూ ఉన్నాయి.

ఇవేమీ లేని రోజుల్లోనే – ఆలిండియా రేడియోలో నాన్న భారత ప్రవచనం వైరల్ అయిపోయిందని అనాలి. మొదలెట్టిన కొంత కాలంలోనే అందరినీ ఆకట్టుకుంది. రోజులు గడుస్తున్న కొద్దీ అభిమానుల్ని పెంచుకుంటూ పోయింది. ఇంతింతై వటుడింతయై అన్నట్లు త్రివిక్రమావతారం ఎత్తి తెలుగు వాళ్ళందరి హృదయాలనీ ఆవరించేసుకుంది.

వింటే భారతం వినాలీ కాస్తా – వింటే ఉషశ్రీ భారతం వినాలి ఐపోయింది.

శనివారాలు మధ్యాహ్నాల నుండి ఆదివారాలు మధ్యాహ్నాలకి చొచ్చుకొచ్చేసింది ధర్మసందేహాల కార్యక్రమం.

ఆదివారాలు మధ్యాహ్నం పన్నెండూ పన్నెండున్నర మధ్య ఓ అరగంట తెలుగునాడంతా ప్రభుత్వం విధించని కర్ఫ్యూ ఉండేది. ఎవరిళ్ళలో వాళ్ళు ఉషశ్రీ భారతం వినడానికి  రేడియోల ముందు కూచునే వారు. బయటికి



వచ్చేవారు కాదు. టీకొట్లూ, బస్టాండులూ – ఎక్కడ రేడియోలు ఉంటే అక్కడ జనం గుమిగూడి పోయేవారు. రోడ్ల మీద జనం ఉండేవారు కాదు. ట్రాన్సిస్టర్ ఉన్నవాళ్ళు కూడా శ్రద్ధగా వినడం కోసం కదిలేవారు కాదు.

కొందరైతే స్నానాలు చేసి మడిగట్టుకుని వినేవారు. ఇంకొందరు రేడియోలకీ, ట్రాన్సిస్టర్లకీ పూజలు చేసి మరీ వాటి ముందు కూచునేవారు. ఇది నిజంగా నిజం. లక్ష్మణ యతీంద్రులవారు ఒకసారి ఒక సంఘటన గుర్తు చేసుకున్నారు. ఆయన ఓ ఆదివారం మధ్యాహ్నం – భారతం వినడానికి తొందరగా ఇంటికి వెళ్ళాలని – ఓ రిక్షావాడిని వస్తావా అని అడిగారట. ఆ రిక్షావాడు ఓ అరగంట తర్వాత వస్తానని అన్నాడుట. అదేంటంటే గురువుగారి భారతం వినాలని అన్నాడుట. గురువుగారంటే నాన్నే. అంతలా ప్రజల్లోకి పాకిపోయింది నాన్న భారతం.

ఇదంతా నాన్న కంఠం చేసిన గారడీ. దేవుడు నాన్నకి ఓ ప్రత్యేకమైన కంఠాన్ని ఇచ్చాడు. అందులో ఓ గాంభీర్యం ఉంటుంది. ఓ మార్దవం ఉంటుంది. ఓ మాధుర్యం ఉంటుంది. అన్నింటికీ మించి ఓ సులువు ఉంటుంది.

ప్రతి అక్షరం స్పష్టంగా వినిపిస్తుంది. ప్రతి అక్షరం ప్రాణం పోసుకుంటుంది.

ఏ మాటను ఎంత పైకి లేపాలో, దేన్ని ఎంత కిందకి దింపాలో ఆ కంఠానికి తెలుసు. ప్రతిమాటకూ ఉన్న అర్థం అంతరార్థం అందులోంచి అవలీలగా వచ్చేస్తాయి.

చెప్పే ఆ కంఠం నాన్నకి దేవుడిచ్చిన వరమే ఐనా – చెప్పాల్సిన విషయం నాన్న ఏళ్ళ తరబడి కృషి చేసి సంపాదించుకున్నది. చిన్నప్పుడు ఉబుసుపోని కబుర్లతో కాలం గడిపెయ్యకుండా – చదువుకుంటూ, చదివినవి మననం చేసుకుంటూ, వాటిని స్నేహితులతో చర్చించుకుంటూ, తాతగారికి భారత రచనలో సాయం చేస్తూ, సాధించినది.


చెప్పాల్సినవి నిరంతర కృషితో నాన్న సాధించారు. చెప్పే కంఠాన్ని దైవదత్తమైన వరంగా పొందారు.

భారతంతో మొదలైన నాన్న రేడియో ప్రవచనం, భాగవత రామాయణాలని పూర్తి చేసుకుని మళ్ళీ భారతానికి చేరుకుంది.

వెయ్యిమందిలో ఒకడు కవి కాగలిగితే
లక్షమందిలో ఒకడు వక్త కాగలుగుతాడని వెనుకటికి ఒక సూక్తి.
ఉపన్యాసాన్ని ఒక కళగా రూపొందించి,
తన రామాయణ, మహాభారతోపన్యాసాలతో
యావదాంధ్రదేశాన్నీ ఉర్రూతలూగించిన
ఉపన్యాసకేసరి ఉషశ్రీ

– బేతవోలు రామబ్రహ్మం

# పందిళ్ళూ, గుళ్ళూ, బళ్ళూ



విజయవాడ ఊళ్ళోకి వస్తూ ఏ శ్రీరామనవమి పందిళ్ళని చూస్తూ తిట్టుకున్నానో – ఆ పందిళ్ళే నాన్న ఉపన్యాసాలకి పందిళ్ళయ్యాయి.

రేడియోలో నాన్న మాటను వినే జనం – నాన్నని చూడాలనీ నాన్న మాటని నేరుగా వినాలనీ అనుకోడం మొదలెట్టారు. నాన్నని ఉపన్యాసాలకి పిలవడం మొదలెట్టారు.

మొదలెట్టడం పెరిగిపోవడం ఒక్కసారే. విజయవాడలో మొదలైనవి – చుట్టూ ఊళ్ళకీ, పక్క జిల్లాలకీ అక్కడ నుండి కోస్తాంధ్ర అంతా పాకిపోయాయి.

నాన్న ఉపన్యాసాలు కావాలంటూ ఇంటికి వచ్చే జనం పెరిగిపోయారు. ఎక్కడెక్కడి సంస్థలవాళ్ళూ, సభలవాళ్ళూ, గుళ్ళవాళ్ళూ – ఫలానా తారీఖున మీ ఉపన్యాసం కావాలంటూ అడగడానికి వస్తూండేవారు. సినిమా వాళ్ళ కాల్షీట్ల లాగ ఐపోయాయి నాన్న ఉపన్యాసాల డేట్లు.

ఒక డైరీలో ఏ రోజు ఎవరికి ఒప్పుకున్నారో రాసుకోవడం అవసరమైపోయింది నాన్నకి. అలాంటి ఒకడైరీ నా దగ్గర ఉంది. కొంత కాలానికి పరిస్థితి ఎలా అయిందంటే – నాన్న ఉపన్యాసం కోసం అడగడానికి వచ్చినవాళ్ళు – వాళ్ళ కార్యక్రమాన్ని నాన్న డైరీలో ఖాళీ ఉన్న రోజుకి మార్చుకునేవారు.

గుళ్ళల్లో, పందిళ్ళలో – ఎక్కడ చూసినా నాన్నే. అన్ని చోట్లా నాన్న మాట వినడానికి తండోపతండోపాలుగా వచ్చే జనమే.

ఇంటిపేరు పురాణపండ ఎలా వచ్చి ఉంటుందో నాకైతే తెలియదు. ఐతే తాత పురాణపండ రామమూర్తిగారు – ఉభయగోదావరి జిల్లాలలో పురాణాల ఉపన్యాసాలు ఇస్తూ ఉండేవారు. నేనెప్పుడూ మా తాత ఉపన్యాసాలు వినలేదు కానీ ఆ ఉపన్యాసాల గురించి ఎందరో గొప్పగా చెప్పుకోవడం విన్నాను. నాన్న వాళ్ళ నాన్న గురించి చెప్తూనే ఉండేవారు.



తాత వెనక రేడియో లేదు. ప్రసార మాధ్యమం అండ లేకుండా, ప్రచారం ఎలా సాగిందో కానీ – తాత పురాణ వాచస్పతిగా, ఉపన్యాస సార్వభౌమగా బాగా పేరు తెచ్చుకున్నారు. నాన్నది తాత అంశేకదా. ఉపన్యాస కళ పూర్తిగా అబ్బింది నాన్నకి. అబ్బిందని అనడం కన్నా ఆకళింపు చేసుకున్నారని అనాలేమో. ఇంకా చెప్పాలంటే ఆ కళని స్వంతం చేసుకున్నారని అనాలి.

తాత మైకు ముందు నిలబడే మాట్లాడేవారుట. నాన్న ఎక్కువగా కూచునే ఉపన్యాసం చెప్పేవారు. నాన్న ఉపన్యాసం ఓ గంటకి మించి ఉండేది కాదు. తాత ఉపన్యాసం గంటకే పరిమితం కాదుట. తాత ఓ ఊరు ఉపన్యాసాలకి వెళ్తే – రెండు మూడు నెలలుండేవారుట. నాన్నది ఎక్కడి కథ అక్కడే.

తాత భారతంలో కుంతీ కర్ణుల సంభాషణ ఘట్టం చెప్తోంటే కంట తడిపెట్టని వారుండేవారు కాదని చెప్తారు. అలానే కీచక సంహార ఘట్టాన్ని వర్ణిస్తోంటే ఒళ్ళు గగుర్పాటు చెందని శ్రోత ఉండేవాడే కాదని ప్రతీతి.

నాన్న ఉపన్యాసాలలోనూ వర్ణనలు ఉంటాయి. ఐతే అవి దీర్ఘంగా సాగవు. వర్ణన కన్నా ఆ కథనీ పాత్రలనీ – మనిషికీ, సమాజానికీ అన్వయించి మాట్లాడ్డం ఎక్కువగా ఉంటుంది. భారతాది కథల్లోని సారాన్ని – నలుగురికీ అర్థం అయ్యేలా చెప్పారు. మూల గ్రంథాలని చదవాలన్న ఆసక్తి కలిగేలా చేసారు. అదే నాన్న ఉపన్యాసాలని జనానికి దగ్గర చేసేసి ఉంటుంది.

సామాన్యంగా భారతం, రామాయణం, భాగవతం లాంటి కథలు చెప్పించడానికి గుళ్ళని ఎన్నుకుంటారు. అక్కడికి ఎక్కువగా వయస్సు మీరినవాళ్ళు వస్తూంటారు. నాన్న అలాంటిచోట్ల ఆ కథల్ని చాలాసార్లు చెప్పారు. వాళ్ళూ ఎంతో శ్రద్ధగా విని, నాన్నకి దూరం నుండి దండాలు పెట్టుకునో, దగ్గరకొచ్చి పాదాభివందనాలు చేసుకునో వెళ్ళేవారు.

ఐతే నాన్న ఉపన్యాసాలు కాలేజీల్లో కూడా ఉండేవి. కుర్రాళ్ళు విరగబడి వచ్చేవారు. నాన్నకి కూడా వాళ్లని చూస్తే ఓ ఉత్సాహం వచ్చేదేమో– కథ చెప్పే తీరు మారిపోయేది.

నాన్నకీ కాలేజీ పిల్లలకీ మధ్య ఓ తమాషా కెమిస్ట్రీ ఉండేది. ఈ రోజు సినిమాల్లో కెమిస్ట్రీ అన్న మాటను హీరోహీరోయిన్లు ప్రేమని ఎంత బాగా పండించగలిగారని చెప్పడానికి వాడుతున్నారు.

నాన్న తన ఉపన్యాసాలలో కాలేజీ కుర్రాళ్ల మీద విరుచుకుపడే వారు. వాళ్లు కోప్పడేవాళ్ళు కాదు. సంబరపడిపోయేవాళ్ళు. ఆ సంబంధాన్నే నేను కెమిస్ట్రీ అంటున్నాను.

ఐతే కాలేజీలో నాన్న ఉపన్యాసానికి – నేను మొట్టమొదట వెళ్ళినప్పుడు మాత్రం భయపడిపోయాను.

విజయవాడలో ఓ కాలేజీలో నాన్న ఉపన్యాసానికి వెళ్ళాను. ఇంటర్ చదవుతున్నానేమో. అదే మొదటిసారి కాలేజీలో నాన్న ఉపన్యాసానికి నేను వెళ్ళడం. ఆవరణంతా నిండిపోయింది.

నాన్న ఉపన్యాసాలు ఎప్పుడూ ముప్పావుగంటో, గంటో – అంతకు మించి ఉండేవి కావు. అదీ ఉపన్యాసం మొదలు ఆరంటే ఆరే. ఓ నిమిషం అటూ ఇటూ అయ్యేది కాదు. గంట ఉపన్యాసం అంటే గంటా ఐపోగానే స్వస్తి అంటూ లేచేసేవారు. అలాగని కథ మధ్యలో ఉండిపోయేది కాదు.

కాలేజీలో విద్యార్థులందరూ ఎదురు చూస్తున్నారు. నాన్నని చూడగానే "గురువుగారూ" అంటూ అరుపులతో స్వాగతం చెప్పారు. వాళ్ళు నాన్ననో సినిమా హీరోలా చూసేవారు. అంటే సినిమా హీరోలే గొప్పవారని కాదు.





సామాన్యంగా – అప్పుడూ, ఇప్పుడూ కూడా – సినిమా వాళ్ళ మీద కుర్రకారు అభిమానం ఎక్కువ పెంచుకుంటుంది. అలాంటి అభిమానం నాన్న సంపాదించుకున్నారు. అలా అనుకుంటే గర్వం కాదు కానీ, ఆనందంగా ఉంటుంది.

అందరి చేత గురువుగారూ అని అనిపించుకుంటూ పాదాభివందనం చేయించుకున్నా, నాన్నకి గర్వం లేదు. అదృష్టం కొద్దీ నాకూ రాలేదు. నాన్నంత గొప్పదాన్నని కాదు. నా వరకు నేను.

నాన్న మాట్లాడ్డం మొదలెట్టారు. ఆ సన్నివేశం నాకు కళ్ళముందు ఇంకా కనిపిస్తూనే ఉంది.

మధ్యలో వాళ్ళని కవ్వించడానికన్నట్లో, కథలో భాగంగానో, ఈ కాలపు కుర్రాళ్ళని రాక్షసులతోనూ, కోతులతోనూ పోలుస్తూ మాట్లాడ్డం మొదలెట్టారు. నాకు భయం వేసింది. అంతమంది ఉన్నారు. వాళ్ళకి కోపం వచ్చి నాన్ననేదన్నా చేస్తారేమో అని ఆదుర్దా పెరిగింది.

నాన్న మాటలు వాళ్లకి కోపం తెప్పించలేదు. తెప్పించలేదు సరికదా – ఆనందం కలిగించాయి. వాళ్ళకి నాన్న కథ చెప్పే తీరు ఎంత నచ్చిందంటే నాన్న వాళ్ళని ఏదన్నా అంటున్నారేమోనన్న స్పృహే వాళ్లకి కలగలేదు. ఆ కథనంలో వాళ్ళు కొట్టుకుపోతూ ఆనందంతో చప్పట్లు కొట్టేస్తున్నారు. ఈలలు వేస్తున్నారు. కొందరైతే కూచోలేక గురువుగారూ అంటూ ఎగిరిపోతున్నారు.

నాకు భయం పోయింది. ఇప్పటికీ తల్చుకుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. కలలా కనిపిస్తుంది. ఎంత మాయచేసేవారో నాన్న ఆ గొంతుతో.

ఆ గొంతు ఆంధ్రదేశంలో ఎంత పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుందంటే – ఆ కంఠధ్వని అనుకరించని మిమిక్రీ కళాకారుడు లేరంటే అతిశయోక్తికాదేమో.

అవి డెబ్భై ఎనభై దశకాలు. అప్పటి కుర్రాళ్ళు ఇప్పుడు ప్రపంచం నలుమూలలా ఉన్నారు. కొందరైతే పెద్ద పెద్ద ఉద్యోగాల్లోనో, వ్యాపారాల్లోనో స్థిరపడ్డారు. నేను ఎక్కడకి వెళ్ళినా వాళ్ళు కనిపిస్తారు. మేం ఫలానా కాలేజీలో చదువుకున్నప్పుడు మీ నాన్నగారి ఉపన్యాసం విన్నాం అంటూ ఆనందంగా చెప్తారు. కొందరైతే మేమే నాన్నగారిని మా కాలేజీకి తీసుకువెళ్ళాం అంటూ గర్వంగా గుర్తుకు తెచ్చుకుంటారు.

ఇప్పుడు వాళ్ళేం చిన్న పిల్లలు కారు. నా వయస్సో నా కన్నా పెద్దో కూడా ఉంటారు. మీకు నమస్కారం పెడితే గురువుగారికి పెట్టినట్లుంటుంది అని దండం పెడతారు. ఒక్కోసారి పాదాభివందనం చేస్తారు. ఈ అనుభవం నాకు అమెరికాలో చాలా నగరాల్లో అయింది. బొంబాయిలోనూ మద్రాసులోనూ అయింది. ఇక ఆంధ్రదేశంలో ఐతే సరేసరి.

నేను ఆయుర్వేదం చదువుకున్నాను. అప్పుడు నా దగ్గరికి వైద్యానికి ఇంత మంది నాన్న అభిమానులు వస్తారని తెలియదు. వైద్యం కోసం నా దగ్గరకి వచ్చే వారిలో చాలామంది నా దగ్గర, నాన్నని తల్చుకుంటారు. ఆనందిస్తారు. నన్ను ఆనందింపచేస్తారు. ఆయుర్వేదం చదువుకున్నందుకు ఈ రోజు సంతోషంగా అనిపిస్తోంది.

నాతో స్కూల్లో, కాలేజీలో చదువుకున్న పిల్లలు చాలా మంది నన్ను గుర్తు తెచ్చుకుందుకు ఉషశ్రీ గారమ్మాయి అనే అనుకుంటారు. అంటారు. ఇదంతా ఎందుకంటే – ఇంతమందికి గుర్తుండిపోయిన నాన్న లేరని అనిపించనే



అనిపించదు. ఎక్కడకెళ్ళినా, ఎవరితో మాట్లాడినా, నాన్న పేరు వినిపిస్తూనే ఉంటుంది. నాన్న ప్రస్తావన వస్తూనే ఉంటుంది. ఇంక నాన్న లేరనే భావనే ఉండదు.

ఇక్కడో విషయం చెప్పుకోవాలి.

ఎన్నో ఉపన్యాసాలు ఎన్నెన్నో చోట్ల ఇచ్చినా – ఉపన్యాసం చెయ్యడానికి వెళ్ళే ప్రతీసారీ – అదే మొదటిసారి వెళ్తున్నట్లుండేవారు నాన్న. శవాసనం వేసుకుని ప్రశాంతంగా పడుకునేవారు. ఆ సమయంలో మేమెవరిమైనా మాట్లాడిస్తే – ఎప్పుడూ లేనిది – చిరాకు పడేవారు.

ఆ రోజు ఏం చెప్పాలా అని ఆలోచించుకునే వారేమో అని ఇప్పుడు నేను అనుకుంటున్నా. అంతకృషి చేసేవారు కాబట్టే – ఎక్కడ ఉపన్యాసం చెప్పినా కొత్త విషయం ఏదో ఒకటి ఉంటూనే ఉండేది. అది ఒక పాత్రని చూడ్డంలో కొత్త కోణం కావచ్చు. ఒక సంఘటన వెనక మానసిక సంఘర్షణ కావచ్చు. ఆ పాత్రకో, సంఘటనకో – ఈ కాలం మనుషులతోనూ, సమాజంతోనూ ఉన్న సంబంధం కావచ్చు.

తర్వాత తర్వాత నాన్న కాగితాలూ, డైరీలూ చూసినప్పుడు – ఉపన్యాసాలలో చెప్పడానికి ఎన్ని విషయాలు రాసుకుంటూ ఉండేవారో – తెలిసొచ్చింది. శ్లోకాలు రాసుకునేవారు. ఎవరో చెప్పిన మంచి వాక్యాలు రాసుకునేవారు.

ఇవేకాకుండా – ఉపన్యాసం జనం బుర్రల్లోకి చొచ్చుకుపోయేందుకు – రాజకీయాలో, సినిమాలో, క్రికెట్టో జోడించేవారు.

అప్పటికప్పుడు మాట్లాడెయ్యలేక కాదు – ఉపన్యాసాల ముందర ప్రశాంతంగా పడుకుని ఆలోచించుకున్నది. తను చెప్పేది జనానికి ఎలా ఉపయోగిస్తుందో అని ఆలోచించుకోడానికి.

ఇదంతా ఎందుకంటే – వేల సంవత్సరాలుగా వస్తున్న భారతాది ఉద్గ్రంధాలలోని సారం – ఈ తరానికి అందచెయ్యాలన్న ఆశయసాధన కోసం.

తన జీవితం అంతా ఆ ఆశయ సాధన కోసమే అంకితం చేసుకున్నారు నాన్న.

**చదివాను నీ రామాయణం. నీ పుస్తకంలో ఘట్టాలు**
**మూలం కలిగించిన అనుభూతికి తక్కువ కాకుండా**
**మనస్సును అలరించాయి. కిష్కింధలో పంప, ఋతువ్వులు,**
**తార, వాలి సజీవంగా కనబడ్డారు. ఒక మహత్తర శక్తి**
**ఆవేశించి పలికిస్తే గాని రాయాలంటే పొసగదు**

**-ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి**





# అండా దండా నాన్నే



ఏడో క్లాసులో నాకు క్లాసు ఫస్టొచ్చినందుకు – ఎనిమిదో క్లాసులో స్కాలర్ షిప్పుగా డెబ్భైయైదు రూపాయలు ఇచ్చారు. ఇప్పుడు డెబ్భైయైదు రూపాయలంటే అసలు డబ్బులా అనిపించదు కానీ, అప్పుడది ఎక్కువే.

బాలభారతి స్కూల్లో అదే మొదటిసారి అలా స్కాలర్‌షిప్ ఇవ్వడం. ఒక ప్రత్యేక కార్యక్రమం పెట్టి స్కాలర్ షిప్ డబ్బుని బహుమతిగా ఇచ్చారు నాకు. ఆ కార్యక్రమానికి నాన్న వచ్చారు. నాన్నని మాట్లాడమన్నారు ఆ కార్యక్రమం నిర్వహిస్తున్న మా స్కూలు టీచర్లు.

"నేను ఉషశ్రీగా రాలేదు – ఉపన్యాసాలు ఇవ్వడానికి. నేను వచ్చింది గాయత్రీదేవి నాన్నగా. కూతురికి బహుమతి వచ్చినందుకు ఆనందిస్తున్నా" అన్నారు నాన్న ఆ వేదిక మీద. అంతే. ఏ వేదిక ఎందుకో అదే తప్ప వేరే మాట్లాడేవారు కాదు.

నాకు బహుమతి వస్తే చాలా సంతోషించేవారు. సంతోషించేవారని తర్వాత తర్వాత చాలా సందర్భాలలో నాకు తెలిసొచ్చింది. ఐతే నా ఎదురుగుండా ఎప్పుడూ పొగిడేవారు కాదు. నాన్న తన స్నేహితులతోనో, నా చెల్లెళ్ళతోనూ చెప్పేవారుట. వాళ్ళ మాటలలో నాన్న ఆనందం నాకు పరోక్షంగా తెలిసేది.

నన్నెప్పుడూ నువ్వు చదువుకో అని చెప్పలేదు. ఒక్కోసారి నేను ఎక్కువసేపు చదువుతోంటే ఎందుకమ్మా అంతసేపు చదువుతావు. కాస్త విశ్రాంతి తీసుకో అని అనేవారు.

నేను తొమ్మిదీ, పదీ క్లాసులకొచ్చేసరికి నాన్న ఊరూరా ఉపన్యాసాలతో చుట్టుపక్కల ఊళ్ళకి వెళ్ళొస్తూ ఉండేవారు. ఆయన వెళ్ళేది ఒకట్రెండు రోజులకే ఐనా, నాన్న ఇంటి దగ్గర లేకపోతే మా నలుగురికీ బోసిపోయినట్లుండేది. తిరిగి రాగానే మేం పరిగెత్తుకుంటూ నాన్న దగ్గర చేరిపోయేవాళ్ళం. మమ్మల్ని పక్కన



కూచోపెట్టుకుని ఎక్కడెక్కడ ఏవేం జరిగాయో చెప్తూండేవారు. మేం నాన్న ఊళ్ళో లేనప్పుడు ఏమేం చేసామో చెప్తూంటే వినేవారు.

మా ఇంట్లో ఒక పడక్కుర్చీ ఉండేది. నాన్న ఎప్పుడూ అందులోనే కూర్చునేవారు. అందులోనే కళ్ళు మూసుకుని ఆలోచించుకుంటూ ఉండేవారు. ఆ కుర్చీకి ఉన్న చేతుల మీద రైటింగ్ పాడ్ పెట్టుకుని, దాని మీద కాగితాలు పెట్టుకుని రాసుకునేవారు. దానిమీద కూర్చునే మా కబుర్లు వినేవారు. ఆ పడక్కుర్చీలో కూచుని నవ్వుతూ, మాతో మాట్లాడుతుండే ఆ సన్నివేశం మా మనస్సులోంచి ఎప్పటికీ చెదిరిపోదు. ఆ కుర్చీలో నాన్న విగ్రహం అలా కళ్ళముందు ఉన్నట్లే ఉంది.

నాన్న ఉపన్యాసాలకి వెళ్ళిన ఊళ్ళ నుండి – ఏ ఊరికి ఏది ప్రత్యేకమో అది తీసుకొచ్చేవారు. భీమవరం నుండి పూతరేకులు, వేటపాలెం నుండి జీడిపప్పు. చెరకు పానకం ఏ ఊరినుండి తెచ్చేవారో జ్ఞాపకం రావడం లేదు. నేను కాస్త పెద్దదాన్ని అయ్యాక చీరాల నుండి చీరలు. నాన్న సెలెక్షన్ బావుండేది. కాకపోయినా ఆడపిల్లలకి నాన్న తెచ్చినదేదయినా అందులో నిండి ఉన్న ప్రేమే కనబడుతుందని నా మనసుకి అనిపిస్తుంది. నాన్నలకీ అంతే అనుకుంటా. కూతుళ్ళు ఏం చేసినా అందులో వాళ్ళు ప్రేమనే చూస్తారనుకుంటా. నేను చిన్నతనంలో కొన్ని వంటల ప్రయోగాలు చేసేదాన్ని. ప్రయోగం విఫలం అయ్యింది అని నాకు అనిపించినవి కూడా మా నాన్న అమోఘం అనుకుంటూ హాయిగా తినేసేవారు. ఆముదమయినా, చేదుగా ఉండే ఆయుర్వేద ఔషధమయినా అమృతంలా తీసుకోగలిగిన మా నాన్నకి నా ప్రయోగాలని ఆస్వాదించడం అంత కష్టం కాదు. కాకపోయినా కూతురి చేతి వంట కదా.

ఉపన్యాసాలు ప్రారంభం అయిన కొత్తలో శాలువాలూ, పూలదండలూ తీసుకొచ్చేవారు. నెమ్మది నెమ్మదిగా ఇంటికి తీసుకురావడం మానేసి అక్కడ కనిపించిన చిన్న పిల్లలకి ఇచ్చేసేవారు. కొన్ని నాన్న కూడా వెళ్ళిన శిష్యులకి ఇచ్చేసేవారు.

ఎప్పుడైనా ఇంటికి పూలదండ తీసుకువస్తే ఆ రోజు మా అమ్మకి పండగే. మాకు పూలజడలు వేసేది. నాకు పెద్ద జడ ఉండేది. చెల్లెళ్ళకి కాస్త పొట్టి జుట్టు. వాళ్ళకి సవరాలు పెట్టి పూలజడలు వేసేది. అందులో ఓ విచిత్రం ఉండేది. ఆ పూలన్నీ ఓ అట్ట మీద కుట్టేది. ఆ అట్ట జడని మాలో ఎవరిమైనా ఎప్పుడైనా వేసుకోగలిగేవాళ్ళం. అంతేకాదు. రాత్రి దాన్ని జళ్ళలోంచి తీసేసి గోడ మేకులకి తగిలించి – మర్నాడు మళ్ళీ వేసుకునేవాళ్ళం. అదో ముచ్చట.

నేను పదోక్లాసు కూడా మంచి మార్కులతో పాసయ్యాను. మా స్కూలు ఫస్టు కూడా నాదే. నాన్నకి ఆనందం. అలాగని హడావిడేం చేసెయ్యలేదు. అయిన దానికీ కాని దానికీ హడావిడి చెయ్యడం నాన్న అలవాటు కాదు.

మా పనులన్నీ మేము స్వతంత్రంగా చేసుకోవడం అలవాటు చేశారు నాన్న. నా పదో క్లాసు నాటికే నా పనులన్నీ నేనే చేసేసుకునేదాన్ని. మారీస్ స్టెల్లా కాలేజీలో ఇంటర్లో నా తిన్న నేనే చేరిపోయా. నేను తీసుకున్న బైపీసీ గ్రూపుకీ నాన్న ప్రమేయం లేదు.





నువ్విది చెయ్యి ఇలా చెయ్యి అని చెప్పడం నాన్న నైజం కాదు. నడవడం నేర్పించారు. నడిపిస్తూనే ఉండలేదు. అలాగని వదిలెయ్యలేదు. సరిగ్గా నడుస్తున్నానో లేదో చూస్తూనే ఉన్నారు. అవసరం ఐతే చెయ్యి అందించడానికి సిద్ధంగా ఉండేవారు.

ఏ కూతురికైనా అంతకన్న కావల్సింది ఏముంటుంది?

నేను స్కూల్లో ఉన్నప్పుడే ఒక అల్లరి మూక నా వెంటపడుతోంటే, రెండు మూడు రోజులు ఓపికపట్టి నాన్నతో చెప్పాను. నాన్న భయపడిపోయి మరోదార్లో రామ్మా అని సలహా ఇవ్వలేదు. ఇవన్నీ మామూలే పట్టించుకోకమ్మా అని తప్పించుకోలేదు. మర్నాడు నేనొస్తున్న దారి దగ్గర కర్రపట్టుకుని నిలబడ్డారు. ఆ అల్లరి కుంకలు కనబడగానే వాళ్ళమీద గట్టిగా కేకలు వేస్తూ కర్ర ఎత్తి గదిమి తరిమేసారు. అలాంటి నాన్న, నాలాంటి ఆడపిల్లలకి ఎంత అండో.

నాన్న రాజమండ్రి కాలేజిలో ట్యూటర్గా ఉన్నప్పుడు కూడా ఇలాంటి పనే చేసారని చెప్పారు సుబ్మావయ్య (చిర్రావూరి సుబ్రహ్మణ్యంగారు). ఎవరో విద్యార్థి ఇంకో విద్యార్థినిని అల్లరి చెయ్యబోతోంటే వాణ్ణి కొట్టారుట. అలా కొట్టేటప్పుడు – తరవాత గొడవ ఏదైనా అవుతుందేమో అన్న భయం లేదు నాన్నకి. తప్పుపనిచేస్తున్న వాళ్లతో – నువ్వు చేస్తున్న పని తప్పు అని చెప్పడానికి ధైర్యం కావాలి. అది ఉంది నాన్నలో అని నాకు గర్వంగా ఉంటుంది.

ఇంటర్ పరీక్షలయ్యాక నేను ఎమ్.బి.బి.ఎస్ ఎంట్రన్స్ రాస్తానని అన్నప్పుడు వద్దనలేదు. కానీ ఓ మాటన్నారు. నీకు సీటు రాకపోతే ఏడవనంటేనే రాయి – అని.

నాకు మార్కులు బాగా రాకపోతేనో, రాంకు రాకపోతేనో – నేను ఏడుస్తానని నాన్నకి తెలుసు. పిల్ల గురించి తండ్రి కన్నా ఎవరికి  ఎక్కువగా తెలుస్తుంది? నా బలాలూ, బలహీనతలూ నాన్నకే తెలుసు. అందుకే ఆ మాట అన్నారు. సామాన్యంగా ఈ రోజుల్లో కన్నవారు రాంకులు తెచ్చుకోమని పిల్లల్ని ఒత్తిడి చెయ్యడం తెలిసినదే. మా నాన్న అటువంటి నాన్న కాదు.

ఎంట్రన్స్ కోచింగ్లో నన్ను గుంటూరులో చేర్పించారు. నాకు ఎంట్రన్స్‌లో రావల్సినన్ని మార్కుల కన్న కాస్త తక్కువ వచ్చాయి. ఫ్రీసీటుకి రావల్సిన రాంకు రాలేదు. నేను ఏడ్చానేమో తెలియదు. వచ్చే సంవత్సరం మళ్ళీ రాయమ్మా అని అన్నారు నాన్న. మళ్ళీ రాయడం ఇష్టం లేదు నాకు.

ఐతే డొనేషన్ కట్టి నన్ను చేర్పించమని నేను అడగలేదు.

నాన్నకి వచ్చే జీతం ఎక్కువేం కాదు. అందులోనే జాగ్రత్తగా నలుగురినీ పెంచి పెద్ద చేస్తున్నారు.

ఇప్పుడు విపరీతంగా పెరిగిపోయిన కన్స్యూమరిజం – అప్పట్లో ఇంత ఎక్కువగా లేదేమో. ఒకవేళ ఉన్నా దాని ఛాయ మా ఇంట్లో పడకుండా చూసుకున్నారు.

నాకు కానీ చెల్లెళ్లకి కానీ ఒంటిమీద బంగారం ఉండేది కాదు. లేదన్న ఆలోచనే ఉండేది కాదు. లేకుండా పెంచారు నాన్న.



పెద్ద ఇల్లో, ఖరీదైన బట్టలో, బంగారం నగలో లేవన్న ఆలోచనే కలిగేది కాదు. ఎక్కడికెళ్ళినా ఉషశ్రీగారమ్మాయి అనేవారు. అది ఎన్ని నగలపెట్టు?

చాలా ఏళ్ళు మా ఇంట్లో కుర్చీలూ ఫేనూ లేవు. గేసు కూడా లేదు. కుక్కర్ లాంటివే లేవు. అమ్మ అడుగుతూ ఉండేది. ఐనా నాన్న జాగ్రత్తగా గడుపుకొచ్చేసేవారు.

అలాంటి నాన్నని నేను డొనేషన్ కట్టి చదివించమని అడుగుతానా? అంతేకాదు. డొనేషన్ కట్టి చదవకూడదన్న నియమం కూడా ఉంది నాకు.

అప్పుడే నా చదువుగతిని నిర్దేశించడానికన్నట్లు రేడియోలో పనిచేసే మల్లాది సూరిబాబు గారి తమ్ముడు మా ఇంటికి వచ్చారు. ఆయుర్వేదం చదువు గురించీ, విజయవాడలో ఆయుర్వేదం కాలేజీ గురించీ చెప్పారు. అక్కడ చదవడం మంచిదని చెప్పి వెళ్ళిపోయారు. కొన్ని నాటకాల్లో కొన్ని పాత్రలు ఒక డైలాగు చెప్పి వెళ్ళిపోతూంటాయి. ఆ పాత్రకీ ఆ నాటకానికీ ఆ డైలాగు తప్ప మరేం సంబంధం ఉండదు. సూరిబాబుగారి తమ్ముడిది నా జీవన నాటకంలో అలాంటి పాత్ర. అదే చాలా ముఖ్యమైన పాత్ర.


ఆయన మాటల ప్రభావంతో నేను విజయవాడ ఆయుర్వేద కళాశాలలో డిగ్రీ చెయ్యడానికి చేరిపోయాను.

విధి అంటే అదే. సూరిబాబు గారి తమ్ముడు మా జీవితంలోకి సరిగ్గా ఆ రోజు రాకపోయుంటే – నేనేం చదివేదాన్నో. ఇంకేం చదివినా – ఇలా ఇందరు పాఠకులూ, శ్రోతలూ, పేషెంట్లుగా – నా దగ్గరకొచ్చి నిత్యం మా నాన్నని గుర్తుచేసుకునే వారే కాదు. ఈ అదృష్టానికి కారణం మాత్రం ఆ రోజు ఆయన రావడమే.

నా విద్యా, నా వైద్యం రోజూ నాన్న అభిమానులని కలిసే అవకాశం కలిగించాయి. ఆ ఆనందాన్ని నిత్యం అనుభవించే అవకాశాన్నిచ్చాయి.

ఉషశ్రీకి పళ్ళు బయట పడకుండా పెదవ్విలు అటూ ఇటూ నెట్టి
కళ్ళు అరోనెరో మూసి నవ్వడం సహజమై పోయింది.
ఆ భీమవరం నవ్వుకి జతగా కనుబొమలొకసారి ఎగరేసేవాడు
– ఏలూరిపాటి అనంతరామయ్య

# మిలియన్ దాటుంటాయి




నాన్న రేడియో ప్రవచనాలలోనూ, స్టేజీ ఉపన్యాసాలలోనూ – నేను శ్రోతగా ఉండిపోయాను కానీ పుస్తక ప్రచురణలో మాత్రం పాల్గొగలిగాను. నాన్న పుస్తకాల ప్రచురణ మా ఇంట్లో కుటుంబ పరిశ్రమగా కొనసాగింది. అమ్మా, చెల్లెళ్ళూ, నేనూ ఆ శ్రమలో పూర్తిగా పాలుపంచుకునేవాళ్ళం.

1973 లో మొదలైన రేడియో ప్రవచనాలు ఆంధ్రదేశమంతా మారుమోగిపోయాయి. అభిమానులు నాన్న చెప్పే కథలను పుస్తకాలుగా తీసుకురావాలని కోరడం మొదలెట్టారు. డెబ్భైలలో కేసట్టులు జనంలోకి చొచ్చుకొచ్చెయ్యలేదు. సీడీలింకా రాలేదు. వెబ్ పుట్టనేలేదు. పుస్తకమే ప్రజలకి తెలిసిన సాధనం.



పందొమ్మిది వందల యాభైలలో మా తాతగారు పురాణపండ రామమూర్తిగారు వ్యాస భారతాన్ని యథాతథంగా తెలుగు వచనంలో వేసే బృహత్కార్యక్రమాన్ని మొదలెట్టారు. ఆ పుస్తక రచనలో నాన్న ఆయనకి సాయం చేసారు. ఆ ప్రచురణ యజ్ఞం మొదలు పెట్టే నాటికి ఇంకా నాన్న డిగ్రీ పూర్తి కాలేదు. పెళ్ళి అవ్వలేదు. ఆ రచన కోసం భారతాన్ని అమూలాగ్రం దీక్షగా చదివాననీ, అప్పటి ఆ దీక్షే – భారతం మీద అంత పట్టుని ఇచ్చిందనీ అప్పుడప్పుడు నాన్న మాతో అంటూ ఉండేవారు.

ఆదిపర్వం నుండి మొదలెట్టి ఒక్కో పర్వాన్నీ ఒకటో రెండో పుస్తకాలుగా వేస్తూ వచ్చారు తాతగారు. ఎవరెవరో ఇచ్చిన విరాళాలతో సాగిన ప్రచురణ అది. ప్రతి ప్రచురణకీ అట్టమీద బొమ్మ ఒక్కటే. వ్యాసుడు చెప్తోంటే వినాయకుడు రాస్తున్నట్లుండే బొమ్మ. ఆ కవర్ పేజీ డిజైను వెనక నాన్న చెయ్యి ఉందో లేదో తెలియదు. ఆ బొమ్మ మాత్రం నాకు బాగా గుర్తు.

ఆ ప్రచురణ చాలా ఏళ్ళు సాగుతూనే ఉంది. తొందరగా అయిపోడానికి భారతం చిన్న గ్రంథం కాదు. మా తాతగారు పెద్ద కామందూ కాదు.

ఏది ఏమైనా తాతగారు తలపెట్టిన యజ్ఞం పూర్తికానేలేదు. తరువాత దాదాపు దశాబ్దానికి నాన్న తనదైన శైలిలో భారత ప్రచురణకి అంకురార్పణ చేసారు. అంకురార్పణ అని ఎందుకు అంటున్నానంటే – ఆ రోజు నాన్న వేసిన విత్తు బలంగా వేళ్ళూనుకుని త్వరత్వరగా మహావృక్షంలా పెరిగిపోయింది. ఆ ఎదుగుదల తలచుకుంటోంటే నిజమేనా అని అనిపిస్తూంటుంది. నిజమే అని అనుకున్నప్పుడు ఆనందంగా ఉంటుంది.

భారతాన్ని స్వంతం చేసేసుకున్నారు నాన్న. తన స్వంతమైనదాన్ని ప్రజల సొంతం చెయ్యడానికి పూనుకున్నారు. అందుకు ఆ మహాగ్రంథంలోని ముఖ్యమైన ఘట్టాలను సంగ్రహీకరించారు. చదివే వాళ్ళకి మూలం చదవడంలేదనే లోపం లేకుండా – కథను నడిపించారు. ఇంక ఆయన భాష. పాఠకులని మైమరపించే భాష.

భారతం మూడు భాగాలుగా వెయ్యడానికి ప్రయత్నం మొదలెట్టారు. నాన్నకి వాగ్దేవి కటాక్షం ఉన్నంత లక్ష్మీదేవి కటాక్షం లేదు. పుస్తకాలు వెయ్యాలన్న సంకల్పం ఉంది కానీ వేసేందుకు కావాల్సిన సంపద లేదు.

అందుకు నాన్న ఎన్నుకున్న మార్గం వినూత్నమైంది. ఇప్పుడు క్రౌడ్ ఫండింగ్ అనీ, క్రౌడ్ సోర్సింగ్ అనీ– ఎక్కువమంది దగ్గర చిన్న చిన్న మొత్తాలు తీసుకుని సినిమాలు తీస్తున్నారు. ఈ పద్ధతిని నాన్న ఆనాడే మొదలెట్టారు.

తన పుస్తకానికి ప్రజల కోరికా, నమ్మకమే పెట్టుబడి అనుకున్నారు. భారతం మూడు భాగాలుగా ప్రచురిస్తున్నాం – ముందుగా పది రూపాయలు మనీ ఆర్డర్ పంపిన వాళ్ళకి మూడు భాగాలూ ప్రచురించగానే పంపిస్తామని ప్రకటన చేసారు. ప్రకటన అంటే పత్రికలకు డబ్బిచ్చి వేసుకున్న ప్రకటన కాదు. దినపత్రికలలో చిన్న కాలంలో ప్రచురించిన వార్త.

ఆ వార్త దావానలంలా దేశమంతా పాకిపోయింది. మా ఇంటికి మనీ ఆర్డర్లు రావడం మొదలెట్టాయి. ఇప్పటి జనానికి మనీ ఆర్డర్ అంటే ఏమిటో తెలిసే అవకాశం లేదు. అదింకా కార్డులూ, కవర్లూ, టెలిగ్రాములూ, మనీఆర్డర్లు రాజ్యమేలుతున్న కాలం. రేడియో స్టేషన్లకిలాగానే పోస్టాఫీసులకీ అది స్వర్ణయుగం.





వచ్చిన మనీ ఆర్డర్లన్నీ పక్కన పెట్టుకుని పేర్లూ అడ్రసులూ రాసుకునే పని పిల్లలం మేం చెయ్యడం మొదలెట్టాం. అప్పుడు నేను తొమ్మిదో క్లాసు, చెల్లెళ్ళు ఇంకా చిన్న క్లాసులు, ఆఖరి చెల్లి కళ్యాణి స్కూలుకి వెళ్ళడం మొదలెట్టింది.

నాన్న పుస్తకం కావాలని జనం పంపిస్తున్న డబ్బుతో ప్రచురణ మొదలెట్టారు. 1973 లో భారత ప్రచురణలు అన్న పేరుతో మొదలైంది నాన్న పుస్తకాల ప్రచురణ.

పుస్తకం కాకినాడలో ఉన్న స్నేహితుడి ప్రెస్‌లో అచ్చేయించారు. దాని పేరు శ్రీపతి ప్రెస్స్. ప్రూఫ్ రీడింగ్ పని మాదాకా రాలేదు. తర్వాత తర్వాత మేం కొంచెం పెద్దయ్యాక ఆ పని మేమే చేసేవాళ్ళం.

పుస్తకం క్రౌన్ సైజులో వేయించారు. దానికి బాపుగారి అట్ట. అట్ట కూడా ఆర్ట్ పేపర్ మీద మూడు రంగుల్లో అచ్చు వేయించారు. ఆ అట్టని పుస్తకాలకి తొడిగే పని మేము చేసాం. అదెంత సరదాగా చేసామో.

సామాన్యంగా పిల్లల స్కూలు పుస్తకాలకి నాన్నలు అట్టలు వెయ్యడం సహజం. మా పుస్తకాలకి నాన్న అలా వేసారు కూడా. ఐతే నాన్న పుస్తకాలకి అట్టలు వేసే భాగ్యం మాకు దక్కింది. ఎంత అరుదైన అదృష్టం అది. పుస్తకాల్ని మనీఆర్డర్లు పంపించిన వాళ్లకి – బ్రౌన్ కాగితాలలో చుట్టి, ట్వైన్ దారాలతో కట్టి, అడ్రెసులు రాసి, రిజిస్టర్డ్ పోస్ట్ చేసే పనంతా మేమే చేసేవాళ్లం.

మొదట ప్రచురించిన పుస్తకాలు అలా అలా అమ్ముడైపోయాయి. డబ్బు పెద్దగా మిగిలింది ఏమీలేదు. ఇంకో పుస్తకం వేసుకునేంత వచ్చిందేమో.

భారతం తర్వాత రామాయణం వేసారు. ఏ పుస్తకం వేసినా పుస్తకాల షాపులవారికి కమిషన్ ఇచ్చి అమ్మలేదు. షాపులకిచ్చే కమిషన్ లేకుండా – పాఠకుడికి తక్కువ ధరకి భారత, రామాయణ, భాగవతాలు ఇవ్వడమే నాన్న ఆశయం.

నాన్న అనుకున్నట్లే సాగింది ప్రచురణ యజ్ఞం. ఎన్ని పుస్తకాలు ఎన్నెన్నిసార్లు ప్రచురించామో. పుస్తకాలు అలా వేస్తూండగానే అయిపోతూండేవి.

ప్రకటనలూ, మనీఆర్డర్లు కూడా అవసరం లేకుండా పోయాయి. ఉపన్యాసాలకి వెళ్ళిన చోటల్లా జనం విపరీతంగా కొనుక్కు తీసికెళ్తూండేవారు.

ఇంటింటా నాన్న రాసిన భారత రామాయణ భాగవత గ్రంథాలయాలు వెలిసాయి. ఇలా ఆ ప్రయత్నం సాగుతుండగానే –

రేడియోలో నాన్న భారత ప్రసంగానికి శ్రీకారం చుట్టడానికి రజనీకాంతరావుగారు విజయవాడ కేంద్రంలో చేరినట్లు – తిరుమల తిరుపతి దేవస్థానం వారి చేత నాన్న భాగవతాన్ని ప్రచురించే కార్యక్రమానికి పీవీ ఆర్కే ప్రసాద్ గారు తితిదేలో చేరారు.

ఆయన హయాంలోనే – దేవస్థానం వారు చాలా తక్కువ ధరకి భాగవతాన్ని ప్రజలకి అందించే ప్రయత్నంలో నాన్న రాసిన భాగవతాన్ని ప్రచురించారు. 1978 లో బ్రహ్మోత్సవాలకి భాగవతం విడుదల చేసారు దేవస్థానం



వాళ్ళు. ఆ సందర్భంగా నాన్నని తిరుమలకి ఆహ్వానించారు. నాన్నతో పాటు మేమూ వెళ్ళాం. దేవస్థానం వారి మర్యాదలతో శ్రీవారి దర్శనం అయింది. సాధారణంగా నాన్న తన కార్యక్రమాలకి మమ్మల్ని అందరినీ తీసుకువెళ్ళేవారు కాదు. తిరుపతికి తీసికెళ్ళారు. తరువాత శ్రీశైలం కూడా అలాగే దేవస్థానం వారి ఆహ్వానం మీద మమ్మల్ని అందరినీ తీసుకెళ్ళారు.

భాగవతం తర్వాత రామాయణ భారతాలని వేసారు. అవి అయ్యాక సుందరకాండా, భారతంలో చిన్న కథలూ ప్రచురించారు తితిదేవారు. దేవస్థానం వారు ఏ పుస్తకం ఎన్ని కాపీలు వేసుంటారో అన్న కుతూహలంతో కొన్నేళ్ళ క్రితం వాళ్ళ కార్యాలయంలో కనుక్కుంటే – భాగవత, రామాయణ, భారతాలూ, సుందరకాండా – ఏదీ ఒక లక్షకి తక్కువ కాకుండా అయినట్లు చెప్పారు. వాటిలో కొన్ని లక్షన్నర దాటి పోయాయన్నారు. నేను కనుక్కుని దశాబ్దం కాలం అయింది. ఇప్పటికి ఎన్ని పుస్తకాలు అయ్యుంటాయో.

తితిదే వారు వేసినవీ, మేము వేసినవీ – అన్నీ కలిపి వేసిన పుస్తకాలు ఎన్ని లక్షలపైనో లెక్కే తెలియదు. ఎప్పుడూ లెక్కల అలవాటు లేదు నాన్నకి. ఆ తర్వాత మిత్రావారూ, మహాలక్ష్మి వారూ ఎన్నిసార్లు ఎన్నెన్ని పుస్తకాల ముద్రణ, పునర్ముద్రణ చేసారో – ఎన్ని పుస్తకాలు ఎంతమందిని చేరాయో – తలచుకుంటే గర్వం, సంతోషం ఉప్పొంగుతాయి.

ఉదతల్లాగా ఉషశ్రీ మిషన్ పేరుతో మేమూ నాన్న పుస్తకాలు కొన్ని వేసాం.

**తీరా ఇంట్లోకి వెళ్ళాక ఇంత ఉషశ్రీ కూడా నిక్కరులేసుకున్న కుర్రాడిలాగ మారిపోయారు. వాళ్ళ నాన్నగారి కళ్ళలోకి సూటిగా చూడకుండా అమ్మకేసి, నాకేసి, ద్వారబంధాలకేసి, దిక్కులకేసి చూస్తూ, మనం ఒళ్ళు దగ్గర పెట్టుకుని అంటాం చూడండి - అలా మాట్లాడారు.**

**- ధారా రామనాథశాస్త్రి**





# ఇల్లు కట్టి చూడు



మేము సొంతిల్లు కట్టుకోడం చాలా తమాషాగా జరిగిపోయింది. ఇల్లు కట్టేందుకు కావల్సిన ఆర్థికపరమైన వెసులుబాటు లేనివారు రకరకాల మార్గాలు అనుసరించి ఓ ఇంటివారవుతూంటారు. అలాంటి ఆలోచనల జోలికే పోదు నాన్న మనస్సు. అప్పు చెయ్యడం ఆయన నైజమే కాదు.

వచ్చేకొద్దిపాటి జీతంతో నలుగురు పిల్లల్ని పెంచుకుంటూ వచ్చారు – ఎవ్వరికీ ఏ లోటూ రాకుండా, ఎవ్వరి చదువూ ఆగిపోకుండా. అదీ ఆదాయం ఖర్చుల గురించి అంతగా అవగాహన లేని మా అమ్మతో కలిసి.

ఆవిడ ఏదైనా ఖరీదైన వస్తువు కావాలని అడిగితే ఏదో మాట తప్పించి చెప్పేసేవారు. మనస్సులో ఆవిడ అడిగింది చెయ్యలేకపోతున్నానే అని అనిపిస్తూ ఉండేదేమో. ఐనా ఎప్పుడూ ఎవ్వరి దగ్గరా అప్పు తీసుకోలేదు.

ఎవరింట్లోనో ఏవేవో వస్తువులు ఉన్నాయన్న ఆలోచన ఆయనకెప్పుడూ లేదు – మాకూ లేకుండా పెంచారు.

ఈ రోజుల్లో అప్పులతోనే ఇంట్లో ఖరీదైన వస్తువులు కొనేస్తున్నారు. వాహనాలు కొనేస్తున్నారు. ఆ రోజుల్లో ఎవరైనా కొనేవారేమో నాకు తెలియదు. నాన్న ఆ పని చెయ్యలేదు. నాన్న మా ఇంటిని నడిపిన తీరును తలుచుకుంటే – ఈ రోజు నాకు గర్వంగా ఉంటుంది.

నేనీ మాట ఎవరితోనైనా అంటే వాళ్ళకి అర్థం కూడా కాకపోవచ్చు. ఉపన్యాసాలూ, పుస్తకాలూ – మమ్మల్ని సంపదలో ముంచేసి ఉంటాయని అనిపించచ్చు చాలామందికి. అవి మొదలయ్యాక పరిస్థితి కొంచెం బాగు పడుంటుంది. అంతే.

ధనసంపద లేకపోవడాన్ని చిన్నతనంగా అనుకోలేదు. అనుకోవాల్సిన అవసరమే లేదు. ఉషశ్రీని ఒక గొప్ప వక్తగా, గురువుగారిగా గుర్తించే జనం మధ్య డబ్బుతో పనేం ఉంది? మాకు చెప్పి కాదు– సామాన్యంగా బతికి చూపించి – మాలో విలువల్ని పెంచారు నాన్న.

**అనామకుడు**



ఇదంతా మొదలైంది సొంతిల్లు కట్టడం దగ్గర కదూ? విజయవాడ ఆలిండియా రేడియోలో పని చేస్తున్న కొందరు కలిసి ఐటీఐ దగ్గర స్థలాలు కొంటూ – నాన్నని కూడా కొనమని బలవంతపెడితే – దగ్గరున్న కాస్త డబ్బుతో మాకు ఓ మూడొందల గజాల స్థలం కొన్నారు. ఆలిండియా రేడియో ఉద్యోగులు కొన్న స్థలాలు అవడంతో – మా కాలనీకి రేడియో ఆర్టిస్టుల కాలనీ అన్న పేరు పెట్టారు. రేడియో కాలనీ అనీ అనేవారు. మా ఇంటికి ఆనుకునే ఓలేటి వెంకటేశ్వర్లు గారిల్లు. మా వీధిలోనే రెండిళ్ళ అవతల పన్నాల సుబ్రహ్మణ్య భట్టుగారు, వెనక వీధిలో ఎన్.సి. జగన్నాథాచార్యులు గారు, వింజమూరి లక్ష్మిగారు. కాలనీ సంగీత సాహిత్యాల నిలయం. ఇప్పుడు తల్చుకుంటూంటే చాలా ఆనందంగా అనిపిస్తుంది. మా కాలనీని ఆనుకునే ఎల్.ఐ.సి కాలనీ. ఆ ఇళ్ళు లక్ష్మీ నిలయాలూ, మావి సరస్వతీ నిలయాలూ అని అనుకునేవాళ్లం.

మా అడ్రస్ – ఉషశ్రీ, ఏఐఆర్ కాలనీ, విజయవాడ – 8. సింపుల్‌గా మూడు లైన్ల అడ్రస్. అప్పుడు భారత ప్రచురణలు పేరన మా నాన్న ప్రచురించిన పుస్తకాల్లో ఆ అడ్రస్సే ఉంటుంది, ఇప్పుడు మేము ఉడతల్లా ఉషశ్రీ మిషన్ పేరుతో వేస్తున్న పుస్తకాల మీద అదే “చిరు”నామా.

1981లోనే అనుకుంటా ఒక రోజు – ఇంటి శంకుస్థాపన అని చెప్పారు నాన్న. అంతవరకూ నాన్న స్థలం కొన్నట్లే తెలియదు మాకు. మాకే కాదు, అమ్మకి కూడా. ముందుగా చెప్పడం, హడావిడి చెయ్యడం ఆయన పద్ధతి కాదు.

శంకుస్థాపన చేస్తున్న రోజున కట్టాలని అనుకున్నది పెంకుటిల్లు. అంతకు మించి కట్టగలమని అనుకోలేదు. ఆరు గదులతో పెంకుటిల్లుకి పునాదులు తవ్వించడం మొదలెట్టారు.

ఇల్లు కట్టించడం నాన్న వల్ల అయ్యేపని కాదు. దానికి కావాల్సిన సామాన్లు కొనడం, మేస్త్రీ చేత పని చేయించడం నాన్న పరిధిలో పనులే కావు. దానికి న్యూ స్టూడెంట్ బుక్ సెంటర్ గోపాలరావుగారి సాయం తీసుకున్నారు. ఆయనకి డబ్బిస్తూ – నాకు లెక్కలు చెప్పక్కర్లేదు – ఇల్లు కట్టించి ఇవ్వండి చాలని అన్నారు. అన్నట్లుగానే ఎప్పుడూ ఆయన్ని డబ్బు లెక్కల గురించి అడగనే లేదు. ఆయన అడిగినప్పుడల్లా – దగ్గర ఎంత ఉందో అంతా ఆయన చేతుల్లో పెట్టేవారు. ఆయనే దగ్గరుండి అంతా చూసిపెట్టారు. లెక్కలూ ఆయనే చూసుకున్నారు.

ఇల్లు కట్టడం మొదలెట్టే సమయానికి డబ్బు కాస్త వెసులుబాటు అవడంతో – పెంకుటిల్లు కాస్తా డాబా అయింది. స్థలంలో వెనకభాగం ఇల్లు. ముందు భాగమంతా నాన్నకి నచ్చినట్లు మొక్కలూ, చెట్లూ.

గృహప్రవేశం 1982లో అయింది. మా తాతగారూ, మామ్మా వచ్చారు. వాళ్లచేతే చేయించారు కార్యక్రమం అంతా.

మేము ఇల్లు కట్టుకున్న కొన్ని నెలలకి తాతగారు రాజమండ్రిలో పోయారు. ఆ సమయానికి నాన్న నెల్లూరులో ఉపన్యాసాలకి వెళ్లారు. అప్పుడు ఇప్పట్లా సెల్ఫోన్లు లేవు. అసలు ఫోన్ల వాడకమే తక్కువ.

వెళ్తూ వెళ్తూ ఫలానా చోట ఉంటానని చెప్పి వెళ్ళే అవసరం కాని అలవాటు కానీ లేవు నాన్నకి. అందుకే మాకు వార్త తెలిసి మేము రాజమండ్రి వెళ్ళినా నాన్నకి కబురు చెప్పలేకపోయాం. అప్పటికీ ఎన్నో రకాలుగా ప్రయత్నం చేసాను నేను. నెల్లూరులో పేరున్న హోటళ్ల ఫోన్ నంబర్లు కనుక్కుని ఫోన్లు చేశాను. నాన్న దొరకలేదు.





ఇదంతా ఎందుకు గుర్తుకొస్తోందంటే – తాత అంతిమ సంస్కారాలకి దగ్గర నాన్న లేరు. రాలేకపోయినందుకు ఆయన బాధ పడుంటారు. అది ఎవరికి తెలుస్తుంది. రాలేదనే అనిపిస్తుంది. నాన్న రాలేదని ఎవ్వరైనా అంటే నాకు బాధేస్తుంది. సంజాయిషీలు చెప్పడం, జరిగిపోయిన దాని గురించి అనవసర చర్చలు చెయ్యడం నాన్న లక్షణం కాదు. మనం చెయ్యాల్సిన పని మనం చెయ్యాలమ్మా – ఎవరైనా ఏదైనా అంటారని కాదు – అని అనేవారు నాన్న. అలానే – మనం ఆలోచించాల్సింది – ఎవరైనా బతికి ఉన్నప్పుడు మనం వాళ్లకి ఏం చేసామా అనే కానీ – పోయాక వాళ్లకి ఎంత ఘనంగా కర్మ చేసామని కాదమ్మా అని అనేవారు.

నాన్న గురించి తెలియని వాళ్లకి ఆయన ఇలా ఆలోచిస్తారని తెలియదు. భారతం, రామాయణం, భాగవతం చెప్తున్న గురువుగారు ఏవో పాతకాలం ఆచారాల్లో మునిగిపోయి ఉంటారని అనుకుంటారు జనం. కానీ నాన్న ఆలోచనలూ, పనులూ సహేతుంగా, విప్లవాత్మకంగా ఉంటాయని చాలా మందికి తెలిసుండకపోవచ్చు.

అది తాత పోయిన తర్వాత మామ్మ విషయంలో కొట్టొచ్చినట్లు కనిపించింది. ఆచారం ప్రకారం మామ్మ జుట్టు తీయించెయ్యాలని – ఆ ఆచారాన్ని నమ్మిన చుట్టాలందరూ అనుకున్నారు. ఆ ప్రయత్నం మొదలెట్టారు కూడా. అమ్మని అలా చూళ్ళేమని ఏడ్చింది మా అత్త. ఆ సమయానికి అక్కడ ఉన్న నాన్న తనదైన పద్ధతిలో "జుట్టు తీయించడం లాంటి పనులేం పెట్టుకోవద్దు" అని గట్టిగా చెప్పారు. నాన్న మాట ఆజ్ఞలా, శాసనంలా ఉండేది. నాన్న చెప్పిన తీరుకి ఎవ్వరూ నోరెత్తి మాట్లాడలేకపోయారు. వాళ్ళంతా మనస్సులో ఏమనుకున్నారో, వెనుక ఏమన్నారో తెలియదు. ఐనా అవన్నీ నాన్న పట్టించుకునేవారు కాదు. నాన్న గురించి బాగా తెలిసిన కొండముది శ్రీరామచంద్రమూర్తిగారు, సంప్రదాయం + విప్లవం = ఉషశ్రీ అని రాసారు. అదీ మానాన్న ఉషశ్రీ అంటే. అదే మానాన్న ఉషశ్రీ.

> కాకినాడ చేరిన ఉషశ్రీ సహజంగానే,
> అక్కడి సాహితీ సంచలనానికి కేంద్ర బిందువయ్యాడు.
> సన్నిధి రాజు సుబ్రహ్మణ్యం. కొర్లపాటి శ్రీరామమూర్తి,
> యం. ఆర్.బి. నరసింహారావు, శర్మలతో కలిసి
> అంగర లాడ్జిని సాక్షాత్తూ లిటరరీ హంగర్ లాడ్జిగా మార్చాడు.
> అరుణ పత్రిక ఉషశ్రీ ఘాటైన వ్యాసాలతో అరుణిమ దాల్చింది
> – పోలాప్రగడ సత్యనారాయణ



# భద్రాచలం



నాన్న రేడియోలో భారత రామాయణ భాగవత కథలు చెప్పడం, ఆ కథలనే ప్రజల్లోకి వెళ్ళి ఉపన్యాసాలు చెయ్యడం, వాటినే మళ్ళీ మళ్ళీ చదువుకునేలా పుస్తకాలుగా రాయడం – ఇవన్నీ ఒక ఎత్తు. భద్రాచలంలో శ్రీరామనవమికి సీతారామకళ్యాణాన్ని కళ్ళకి కట్టినట్లు వినిపించడం ఒక ఎత్తు. అశేషాంధ్ర ప్రజానీకం – సంవత్సరానికి ఒకసారి జరిగే కళ్యాణాన్ని కన్నుల పండుగలా చూడలేకపోయినా – వీనుల విందుగా వినగలుగుతున్నామని పులకించిపోయేలా చెప్పేవారు.

మనదేశంలో – అందులో తెలుగునాట – సీతారాములు ఆరాధ్య దంపతులు. వారిద్దరి కళ్యాణాన్నీ ఎంతో ఉత్సాహంతో చేసుకుంటారు జనం. ఊరూరా జరుగుతాయి పెళ్ళిళ్ళు, ఐతే మన పక్క మాత్రం కళ్యాణం అంటే – భద్రాచలంలో జరిగే సీతారామకళ్యాణమే.

తమ అరణ్యవాసంలో సీతారాములు తిరిగింది – భద్రాచలం పరిసరాల్లోనే అని జనం నమ్మకం. గోదావరీ నదీ తీరంలో ఉన్న భద్రాచలం పరిసరాల్లోనే పర్ణశాల ఉందంటారు. అక్కడే సీత చీర ఆరపెట్టుకున్న చోటుని చూపిస్తారు కూడా. అందులో నిజానిజాలు పక్కన పెడితే – అది కొన్ని వందల సంవత్సరాలుగా వస్తున్న ఒక పవిత్ర భావన అని తల్చుకుంటే మనస్సు పులకరిస్తుంది.

నాగరికతలు నదుల ఒడ్డున పుట్టాయి. అక్కడే పునీత భావనలు పుట్టాయి. వాటిని పుట్టించడానికి కొందరు మహానుభావులు పుట్టారు. రామదాసు అలాంటి ఒక మహానుభావుడు. రాముణ్ణి తన గుండెల్లో నింపుకుని భద్రాచలం గుడిలో నిలిపాడు. ఆ భద్రాచల రాముడే తెలుగు వాళ్లందరి గుండెల్లోనూ నిండిపోయాడు.

ఏటేటా అక్కడ కళ్యాణం జరుగుతుంది. ఆ వేడుకని రేడియో వారు ఎప్పుడు వినిపించడం మొదలెట్టారో నాకు తెలియదు కానీ – మేము విజయవాడ వెళ్ళడానికి కొన్నేళ్ళకు ముందు నుండే జమ్ములమడక





మాధవరామశర్మగారు ఆ కళ్యాణాన్ని వినిపించేవారు. వినడానికి తెలుగువాళ్ళంతా రేడియోల ముందర కూచునేవారు. శ్రీరామనవమి పండగంటే జమ్ములమడక వారి సీతారామకళ్యాణ ప్రత్యక్ష ప్రసారంలా ఉండేది ఆ రోజుల్లో.

ఆయన రేడియో ఉద్యోగికాదు. ఐనా ఆయన్ని పిలుస్తూనే ఉండేవారు. తన కళ్యాణం నలుగురికీ చెప్పించుకుందుకు భద్రాచల రాముడే ఆయన్ని పుట్టించుకున్నట్లుండేది ఆయన కళ్యాణాన్ని వర్ణించే తీరు. ఆయన మాట నిండు గోదావరీ ప్రవాహమే. సీతమ్మా సిగుపడకమ్మా అని ఆయన అంటూ ఉంటే నిజంగానే సీతాదేవి సిగ్గుపడుతూ కూచున్నట్లు కనిపించేది వింటున్న యావన్మందికీ.

మేము విజయవాడకి వెళ్ళిన సంవత్సరమే – అప్పుడు విజయవాడ స్టేషన్లో పనిచేస్తున్న శ్రీనివాసన్ గారు– మాధవరామశర్మగారికి వ్యాఖ్యానంలో సాయం అందించడానికి – నాన్న పేరు సూచించారు.

శ్రీనివాసన్ గారికి నాన్న హైదరాబాద్లో కార్మికుల కార్యక్రమం చెయ్యడం తెలుసు. నాన్న చేసే పద్ధతి నచ్చిందనీ విజయవాడ ఆలిండియా రేడియోకి నాన్న వస్తే బావుండునని అనుకున్నాననీ – శ్రీనివాసన్గారు నాన్న గురించి రాసిన ఓ వ్యాసంలో రాశారు.

అందుకే నాన్న విజయవాడ రాగానే – జమ్ములమడకవారికి సాయంగా – నాన్నని భద్రాచలం పంపిద్దామనుకున్నారు.

శ్రీనివాసన్గారు అరవాయనే ఐనా తెలుగు కార్యక్రమాలు బాగా చెయ్యాలన్న పట్టుదల ఉన్నాయన అని నాన్న అంటూండేవారు. ఆయన హయాంలోనే దువ్వూరి వెంకటరమణ శాస్త్రి గారి జానకితో జనాంతికం విజయవాడ స్టేషన్నుండి ప్రసారమైంది. తర్వాత కొన్నేళ్ళకి శ్రీనివాసన్ గారు విజయవాడ స్టేషన్ డైరెక్టరుగా వచ్చారు కూడా.

నాన్న భద్రాచలం వెళ్ళారు. జమ్ములమడకగారు చెప్పే తీరుని గమనించారు. తన ధోరణిలో చెప్పడం ప్రారంభించారు. శర్మగారు ప్రయాణం చెయ్యలేని దశ చేరే సరికి – ఆయన లేని లోటుని నాన్న పూరించారు. తనదైన ప్రత్యేకబాణీలో కళ్యాణాన్ని వినిపించేవారు. అప్పట్నుండి ఓ దశాబ్దం పాటు భద్రాచల సీతారామ కళ్యాణం ఉషశ్రీ నోట వినడానికి జనం ఎదురుచూసేలా చెప్పారు వ్యాఖ్యానం. ఈనాటికీ శ్రీరామనవమి నాడు నాన్నని తల్చుకునేవారూ, తల్చుకున్నామని నాతో చెప్పేవారూ ఎందరో. ఇప్పటికీ ఇంటర్నెట్లో శ్రీరామనవమి నాడు అప్పుడెప్పుడో నాన్న చెప్పిన కళ్యాణాన్ని వింటున్నారు జనం.

ప్రత్యక్ష ప్రసారం అంటే ఒక దృశ్యాన్ని – శ్రవణ మాధ్యమంలో వినిపించడం. కళ్ళు చూడాల్సిన చిత్రాన్ని చెవుల ద్వారా మనస్సుకి చూపించడం. పుట్టి నేర్చుకున్నారో, పూర్వజన్మ సుకృతంగా వచ్చిందో – ఆ విద్య సునాయాసంగా వచ్చేసింది నాన్నకి.

ఈ విషయంలో నాన్నకి స్ఫూర్తి డిమెల్లో. డిమెల్లోని వినే – ఆకాశవాణిలో పనిచేసే అవకాశం వస్తే – ప్రత్యక్ష ప్రసారం అలా చెయ్యాలి అని అనుకుంటూ ఉండేవాడినని చెప్పేవారు నాన్న.

ఆ స్ఫూర్తితోనే ఎదిగారు. హైదరాబాద్ రేడియోలో చేరిన కొన్నాళ్ళకే నాన్నకి ప్రత్యక్ష ప్రసారం చేసే మొదటి అవకాశం – అప్పటి ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి గారి హైదరాబాద్ పర్యటన సందర్భంగా వచ్చింది.



అప్పట్నుండీ రకరకాల ప్రత్యక్ష ప్రసారాలు చేశారు.

రాజమండ్రి–కొవ్వూరు మధ్య రైలు వారధి ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారం చేసింది నాన్నా, శంకరమంచి సత్యం మావయ్యగారూ. నాన్న కొవ్వూరు పక్క, సత్యం మావయ్యగారు రాజమండ్రి పక్క. శంకరమంచి సత్యంగారంటే అమరావతి కథల్ని సృజించిన కథాశిల్పి. హరహర మహాదేవ వంటి శ్రావ్య నాటకాల్ని అందించిన కళాస్రష్ట.

ఆ తర్వాత విజయవాడలో కాకాని వెంకటరత్నం అంతిమయాత్రకి నాన్న చెప్పిన అప్రత్యక్ష ప్రసార ప్రహసనం మర్చిపోలేం. ఆ ప్రహసనం ముందో విషయం చెప్పాలి. 1969 లో మేము హైదరాబాదులో ఉండగా తెలంగాణా ఉద్యమం జరిగింది. మా స్కూళ్ళు మూసేసారు. అవి తెరిచేలోపుగానే మేము హైదరాబాద్ వదిలిపెట్టి విజయవాడకి వచ్చేసాం. ఐతే మేము విజయవాడ చేరిన మూడేళ్ళకి ఆంధ్ర ఉద్యమం మొదలైంది. మళ్ళా బందులూ, స్కూళ్ళ మూతలూ చూసాం.

జై ఆంధ్ర ఉద్యమం జోరుగా ఉన్నప్పుడే 1972 డిసెంబరులో విజయవాడలో పోలీసుల కాల్పుల్లో ఎనిమిది మంది ప్రాణాలు పోయాయి. అది జరిగిన రెండు రోజులకి కాకాని వెంకటరత్నం గారు గుండెపోటుతో మరణించారు.

ఊరంతా ఉద్రేక వాతావరణం. వాహనాల రాకపోకల మీద నియంత్రణ. దానికి తోడు ఆకాశవాణిలాంటి ప్రభుత్వ సంస్థల వాహనాలు కనిపిస్తే చాలు కాల్చేస్తామనేంత ఆగ్రహావేశాలతో జనం. కాకాని అంతిమయాత్ర కామెంటరీ చెప్పమన్నారు నాన్నని. నాన్న రేడియో స్టేషన్ స్టూడియోలో కూచుని బీసెంట్ రోడ్డులో ఉక్కు కాకాని అంతిమయాత్ర ఊరేగింపు ఎలా జరుగుతోందో, తెన్నేటి విశ్వనాథం గారు ఆ ఊరేగింపుని ఎలా నడిపిస్తున్నారో అనర్గళంగా చెప్పేసారు. చూసి చెప్పింది కాదా వ్యాఖ్యానం. అందుకే అది పేరుకే ప్రత్యక్ష ప్రసారం – నిజానికి అప్రత్యక్ష ప్రసారం.

గాంధీగారి అంతిమయాత్రకి అద్వితీయంగా రన్నింగ్ కామెంటరీ చెప్పిన డిమెల్లో స్ఫూర్తితో ప్రత్యక్ష ప్రసారాలు మొదలెట్టి – జమ్ములమడక మాధవరామశర్మగారి దగ్గర మెలకువలు నేర్చుకుని – భద్రాచల సీతారామ కళ్యాణోత్సవాన్ని – ఓ దశాబ్దం పాటు – ఆకాశవాణి ద్వారా అందరి ఇళ్ళలోకి తీసికెళ్ళారు. అందరినీ ఆనంద సాగరంలో డోలలాడించారు.

దాదాపు దశాబ్దంపైగా నాన్న భద్రాచలం సీతాకళ్యాణానికి వెళ్ళి, వెళ్ళలేని వారికీ, వెళ్ళినా దూరానికి కనబడని వారికీ కళ్ళముందు కనిపించేలా చేశారు. అన్నిసార్లు వెళ్ళినా మమ్మల్ని కానీ మా అమ్మనికానీ తనతో తీసుకు వెళ్ళలేదు. మేము ఎప్పుడూ అడగలేదు కానీ మా అమ్మ మాత్రం నన్ను కూడా తీసుకెళ్ళండని అడుగుతూ ఉండేది. నేను డ్యూటీ మీద వెడుతున్నాను, కుటుంబాన్ని తీసుకెళ్ళను అనేవారు. నిజానికి నాన్న తన కూడా అమ్మని తీసికెళ్తే అడిగేవారు లేరు కానీ, తన అధికారాన్ని ఏనాడూ వ్యక్తిగతంగా ఆయన వాడుకోలేదు.

మొత్తం మీద అమ్మని నాన్న భద్రాచలం తీసుకెళ్ళడం జరగలేదు. తరువాత ఎప్పుడో మా పెద్ద చెల్లి పద్మ తీసుకెళ్ళింది. పుట్టిన అయిదున్నర దశాబ్దాలకి నేను భద్రాచలానికి వెళ్ళాను. అందరికీ సీతారాముల్ని చూసిన ఆనందం కలుగుతుంది. నాకు మాత్రం అక్కడికి చేరగానే నాన్న కళ్యాణం చేయించిన రాముణ్ణి చూస్తున్నాననే భావన కలిగింది. ఆ అనుభూతి నాలో నిండిపోయి తన్మయత్వానికి గురి చేసింది. నాన్న ఎక్కడ కూర్చుని ప్రత్యక్ష





వ్యాఖ్యానం చెప్పారో తెలుసుకుని ఒక్కసారి మూడు దశాబ్దాల వెనక్కి వెళ్ళిపోయాను. ఆనాడు రేడియోలో వినిపించిన నాన్న కంఠం ఆ క్షణం నా చెవుల్లో, మారుమోగినట్లయ్యింది. ఆ భావాన్ని వ్యక్తం చెయ్యగల భాష నాకు లేదు. బహుశా ఈ అనుభూతి పొందడం కోసమే ఆనాడు నాన్న ఉన్నప్పుడే భద్రాద్రికి వెళ్ళలేకపోయానేమో.

ఏదో సాధించాలనే ఆకాంక్షలు ఎందరికో ఉంటాయి. అవి తీర్చుకునే అవకాశం కొందరికే వస్తుంది. డిమెల్లో ప్రత్యక్ష వ్యాఖ్యానం విన్ననాడు నాన్నకి ఆ విద్య గురించి అవగాహన ఉండి ఉండదు. కానీ తనకే అటువంటి అవకాశం వస్తే, అంత గొప్పగా చెప్పాలి అనుకున్నారు నాన్న. ఆ అవకాశం వచ్చింది. తెలుగులో ప్రత్యక్ష వ్యాఖ్యానం అనుకోగానే ఈనాటికీ ఉషశ్రీ పేరు తల్చుకునేలా వ్యాఖ్యానించారు నాన్న. ఎందరికి ఉంటుంది అటువంటి అదృష్టం?

What drew out the best in him as a man of letters
was his presentation in impressionistic prose
of Sitaramakalyanam at Bhadrachalam
an assignment that lasted several years

- The Hindu



# పెళ్ళి చేసి చూడు



ప్రతి సంవత్సరం భద్రాచలం వెళ్తూ – అందరికీ తన కంఠస్వరం ద్వారా సీతారామకళ్యాణం చూపిస్తున్న రోజుల్లోనే నా పెళ్ళి చేసారు నాన్న.

నా పెళ్ళి చెయ్యడం నిజానికి కష్టం అయ్యుండకూడదు నాన్నకి. నాన్న పెద్దచెల్లి కొడుకుతోనే నా పెళ్ళి.

బావ అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తూనే ఉండేవాడు. మేమూ మద్రాసులో వాళ్ళింటికి వెళ్ళాం. ఐతే పెళ్ళి గురించి ఎవరో ఒకరు మాట్లాడాలి కదా?

మా తాతగారు 1983 జనవరిలో పోయారు. ఆయన ఉన్నప్పుడైతే – పెద్ద కొడుకు కూతురికీ, పెద్ద కూతురు కొడుక్కీ – పెళ్ళి మాటలకీ, పెళ్ళికీ తనే పెద్దై చేసేసి ఉండేవారేమో. తాత ఉండగా నా చదువు పూర్తవలేదు. అయ్యాక చూద్దాంలే అని అనుకుని ఉంటారు తాత.

తాత పోయిన సంవత్సరం వరకూ ఎవరూ పెళ్ళి మాటలు ఎత్తలేదు. ఓ సంవత్సరం పోయాక మొదలైంది పెళ్ళి ప్రస్తావన ఎలా తేవాలా అన్న సందిగ్ధత.

నాన్నని తలచుకుంటే నాకు నవ్వూ, జాలీ కలుగుతాయి. తనంతట తాను తన చెల్లెలి ఇంటికి వెళ్ళి పెళ్ళి ప్రస్తావన తేలేకపోయారు. ఆ పనికి తన ఆఖరి తమ్ముడు, మా రాఘవ బాబయ్య అవసరం అయ్యాడు. నాన్న కన్నా ఇరవై ఏళ్ళు చిన్నవాడైన బాబయ్యని మద్రాస్ సాయం తీసుకుని వెళ్ళి మా పెద్దత్తతో మాట్లాడించి పెళ్ళి నిశ్చయం చేసుకుని వచ్చారు.

సామాన్యంగా నాన్నంటే అన్ని పనులూ చేసెయ్యగలరని అనుకుంటారు పిల్లలు. దానికి తోడు దేశమంతా ఉపన్యాసాలతో అందరి ఆదరణ పొందిన వ్యక్తి మా నాన్న. తన చెల్లెలి దగ్గరకి సంబంధం గురించి మాట్లాడడానికి బాబయ్య తోడు లేకుండా వెళ్లలేకపోయారంటే నవ్వుగా అనిపిస్తుంది.

ఎంతటి మనిషైనా అన్ని పనులూ చేసెయ్యలేడు. కొన్ని పనులు చెయ్యడానికి అవసరమైన చాకచక్యం, ధైర్యం కొందరికి ఉండవు. కొన్ని లౌకికమయిన పనులు చెయ్యడానికి కావల్సిన శక్తీ ధైర్యం నాన్నకిలేవే అని జాలి కలుగుతుంది. అదే లక్షణంతో పుట్టిన నేను నాన్నని చూసి జాలిపడ్డాను అని అంటోంటే నన్ను చూసి నేనే నవ్వుకోవాలి. ఇప్పుడు అదే చేస్తున్నా.





పెళ్ళి నిశ్చయం చేసుకుని మద్రాస్ నుండి వచ్చి ఎన్ని రోజులు సంతోషించారో తెలియదు కానీ – పెళ్ళికి చాలా రోజుల ముందు నుండే – నాకు పెళ్ళి చేసి నన్ను పంపించెయ్యాలని బెంగపడిపోయారుట. రాత్రుళ్ళు ఒక్కరే డాబా మీదకి వెళ్ళిపోయి ఏడ్చేవారుట. ఈ విషయం నాకు అప్పుడు తెలియదు. నా దగ్గర బానే కబుర్లు చెప్పేవారు.

తర్వాత నాన్న స్నేహితులు చెప్తే తెలిసింది. కణ్వుడంతటి మహర్షే పెంచిన మమకారంతో శకుంతలని అత్తవారింటికి పంపిస్తూ బాధపడ్డట్లు రాసాడు కాళిదాసు. అవన్నీ చదివిన నాన్న. ఆ కథల్ని తెలుగులో రాసిన నాన్న.

ఐనా నాకు పెళ్ళి చేసి పంపించడానికి బెంబేలు పడిపోయారు. అదీ ఎవరికో తెలియని వారికిచ్చి పెళ్ళి చెయ్యడం కాదు. సొంత చెల్లెలి కొడుక్కి. ఒకరికొకరికి పుట్టినప్పటి నుండీ తెలిసిన ఇంటికి పంపిస్తూ బాధపడ్డారంటే – మా నాన్న మనస్సెంత నాన్న మనస్సో కదా?

నేనన్ని పనులూ బాగా చేసేసుకోగలనని నేననుకునేదాన్ని. నాన్న ఏమో అదొత్తి అమాయకురాలు ఎలా బతుకుతుందో అని అనేవారు. నాకు నాన్న ఎందుకలా అనుకుంటున్నారో, అంటున్నారో అర్థం అయ్యేది కాదు. తర్వాత తర్వాత నాన్న అనుకున్నదే సరైందని నాకు అర్థమైంది. నాకు చదువూ పెయింటింగులాంటివి వచ్చు కానీ – మనుషుల మాటల్లోని అంతరార్థాలు అర్థం చేసుకోవడం కానీ – వాళ్లతో గట్టిగా మాట్లాడి పని చేయించుకోవడం లాంటివి కానీ రావు. నాలోని ఆ బలహీనత నాన్నకి తెలిసినట్లు నాకు కూడా తెలియదు.

1984 నవంబర్ పదో తారీకు రాత్రి నా పెళ్ళి – నేను కావాలనుకున్న బావతో – మా ఇంటి డాబా మీదే మా పెళ్ళి. మా బావైతే పెళ్ళి శుభలేఖే వేయించలేదు. నా పెళ్ళికి నాన్న వేయించిన శుభలేఖ మా నాన్న తన పెళ్ళికి వేయించుకున్న శుభలేఖలాగానే సరదాగా ఉంటుంది.


పెళ్ళైన రెండో రోజే నేను హైదరాబాదుకి బయల్దేరాను. ఆ రాత్రీ నాన్న ఏడ్చారుట.

హైదరాబాదు విజయవాడకి దగ్గరవడంతో పెళ్ళయ్యాక నేను ఎక్కువసార్లే మా ఇంటికి వెళ్తూండేదాన్ని. వచ్చిన ప్రతీసారీ – నాన్న ఆప్యాయంగా చూసే చూపూ, ఆదరంగా పలకరించే మాటా – నా జీవితంలో మర్చిపోలేని మధుర జ్ఞాపకాలు.

బుచ్చిబాబు చివరికి మిగిలేది నవలంతా రాసి చివరికి, చివరికి ఏమిటని ప్రశ్నించుకుని, జ్ఞాపకాలు అని తేలుస్తాడు. వడ్డెర చండీదాసు రెండు భాగాల అనుక్షణికం ఆఖరులో జీవితమంటే క్షణికాల దొంతర అని ముగిస్తాడు. లత మోహనవంశిలో కృష్ణుడి చేత చాలాసార్లు రాధతో – నీ జ్ఞాపకాలతో లోకాన్నే జయిస్తాడు నీ వంశీ – అని అనిపిస్తుంది.

నా జీవితానికీ నాన్న జ్ఞాపకాలు మిగిలాయి. అవే నాకు సంతోషాన్నిచ్చేవి. అవే నాకు మార్గదర్శకాలు కూడా. నాన్న లేకుండా ఉన్న గత పాతికేళ్ళూ, అవే నాకు తోడుగా ఉన్నాయి. ఇంకా ఉంటూనే ఉంటాయి.

నేను హైదరాబాదులో ఉన్నప్పుడు రెండు మూడు సార్లు వచ్చారు నాన్న. నేను బొంబాయి వెళ్ళాక అక్కడకి రాలేదు. అమ్మనీ, చెల్లెళ్లనీ పంపుతూ ఉండేవారు. అంతకన్న ముఖ్యంగా ఉత్తరాలు రాస్తూండేవారు నాకు. ఎన్నో కాదు. కొన్నే. ఐతే ఆ కొన్నే ఎన్నో ఉత్తరాల పెట్టు. అవన్నీ ఇప్పుడూ నా దగ్గర ఉన్నాయి.



నాకు పెళ్ళైన ఆరేళ్లకి 1990లో ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు నాలుగు రోజులు తేడాతో చేశారు. పెద్దచెల్లి పద్మ పెళ్ళి మురళితో అయింది. అందులోనూ కొంత విశేషం ఉంది. మేము సూర్యారావు పేటలో ఉన్నప్పుడు మురళీ వాళ్ళు అక్కడే ఉండేవారు. అప్పట్నుండే వాళ్ళిద్దరూ ఒకరితో ఒకరు బాగా స్నేహంగా ఉండేవారు.

పద్మకి ఎవరో అబ్బాయితో పెళ్ళి చూపులు పెట్టించారు. అతను చూసుకుని వెళ్ళాక పద్మ చెప్పింది మురళిని పెళ్ళి చేసుకుంటానని.

ఆ మాట ముందే చెప్తే ఈ పెళ్ళి చూపుల గోల తప్పేది కదే అని అన్నారు కానీ ఏమీ కేకలెయ్యలేదు. గోల చెయ్యలేదు. పిల్లలకి కావల్సిన స్వేచ్ఛ ఇవ్వడం ఆయన మనస్తత్వం. అప్పుడు కూడా అబ్బాయి తల్లితండ్రులతో మాట్లాడ్డానికి రేడియోలో నాన్న ఆప్తులు పాండురంగారావుగారు సాయం అవసరమైంది.

పద్మ పెళ్ళి నిశ్చితార్థం అవుతున్న రోజుల్లోనే – రెండో చెల్లి జయంతి పెళ్ళికుదిర్చారు. కుదిర్చారని అంటున్నాను కానీ – పెళ్ళి కుదర్చడం లాంటి పనులు నాన్న ఎక్కడ చెయ్యగలరు. స్వంత చెల్లెలి దగ్గరకి నా పెళ్ళి గురించి మాట్లాడ్డానికి చిన్న తమ్ముణ్ణి తీసికెళ్ళాల్సి వచ్చింది.

ఇల్లు కట్టించే పనిని గోపాల్రావు గారికి అప్పగించినట్లు, జయంతికి సంబంధం చూసే పనిని సత్యప్రసాద్‌గారి చేతుల్లో పెట్టారు. సత్యప్రసాద్‌గారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆఫీసర్. సాహిత్యంలో ప్రవేశం ఉన్న మనిషి. ఇప్పుడు సినిమా డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న ఆదిత్యకి నాన్నగారు.

ఆయనకు నాన్నంటే చాలా గౌరవం. ఆయనే పూనుకుని జయంతికి సుబ్రహ్మణ్యం సంబంధం చూసారు.

ఫిబ్రవరి ఒకటిన పద్మ పెళ్ళి, నాలుగున జయంతి పెళ్ళి. పద్మ పెళ్ళి మా ఇంటి డాబా పైన వేసిన గదుల్లోనే. మురళి పెళ్ళి ఆర్భాటాలు ఏవీ వద్దంటే – ఇంట్లోనే పెళ్ళి చేసారు. చేసారు అన్నమాట అన్ని విధాలా అన్వయిస్తుంది. ఎందుకంటే ఆ పెళ్ళికి మంత్రాలు చదివిన పురోహితుడు మా నాన్నే. అలాంటి అదృష్టం ఎందరు ఆడపిల్లలకి కలుగుతుంది. పౌరోహిత్యం నాన్న వృత్తి కాకపోయినా పద్మకి ఆ అదృష్టం కలిగింది. నాన్నే మంత్రాలు చదువుతూ కన్యాదానం చేశారు.

పెళ్లంతా అరగంటలో ఐపోయింది. వచ్చింది మేమూ వాళ్ళూ కలిసి ఓ పాతికమంది. నాన్న మంత్రాలు చదువుతోంటే వాళ్ళిద్దరూ దండలూ, ఉంగరాలూ మార్చుకున్నారు. మురళి తాళి కట్టాడు. అంతే – పెళ్ళైపోయింది.

నా పెళ్ళీ, పద్మపెళ్ళీ మా సొంతింట్లోనే కానీ – జయంతి పెళ్ళి పద్మ పనిచేసే స్కూల్లో జరిగింది. నా పెళ్ళి ముహూర్తంలాగే దానిదీ అర్ధరాత్రి ముహూర్తమే. పెళ్ళి తంతు కాస్త దీర్ఘంగానే సాగింది. నాన్నకి అసలే ఎక్కువసేపు కూచుందుకు ఓపిక ఉండదు. దానికి తోడు అప్పటికే నాన్నకి నడుం నొప్పి మొదలైంది. ఏదో ఓపిక పట్టి కూచుని పెళ్ళి చేసారు. ఆ తర్వాత తెలిసింది అది మామూలు నడుం నొప్పి కాదనీ, ఉడుంలా పట్టిన కర్కాటకం నొప్పని. అవేం తెలియకుండా, ఎవరికీ తెలియనివ్వకుండా చెల్లెళ్ళిద్దరి పెళ్ళిళ్ళూ నాలుగు రోజులు తేడాతో చేసేసారు.

నాన్న ఉండగా కళ్యాణి పెళ్ళి అవలేదు. అప్పటికి అదింకా చిన్న పిల్ల. ఇంకా పెళ్ళి చేసుకునే వయస్సు కాదు.

మా పెళ్ళిళ్ళు తల్చుకుంటోంటే – నాన్న రాసిన పెళ్ళాడేబొమ్మా లేఖావళి గుర్తొస్తోంది. పెళ్ళి వయస్సు వస్తున్న ఓ చెల్లెలికి అన్నగారు రాస్తున్నట్లు – ఆడపిల్లల పెళ్ళిళ్ళ గురించి తన ఆలోచనల్ని లేఖలుగా రాసారు. ఎన్ని విషయాలు రాసారు నాన్న వాటిలో!

నాన్న 1961లో రాసారు కానీ – ఈ రోజు పెళ్ళి చేసుకోబోయే అమ్మాయిలు కూడా ఆలోచించాల్సిన విషయాలు ఉన్నాయి ఆ లేఖావళిలో.

ఆలోచనల్ని లేఖల్లో అందించే ప్రక్రియని, ఎంత సమర్థవంతంగా నిర్వహించారో నాన్న.

## Broadcaster par Excellence

– పోతుకూచి సూర్యనారాయణమూర్తి



# వేంకటేశ్వర కళ్యాణం




నాన్న భారత రామాయణ భాగవతాల ఝరిలో జనమంతా ఎంత కొట్టుకుపోయారంటే – నాన్న అంతకు ముందు రాసిన కథలకి దూరమైపోయారు. ఉపన్యాసకుడు ఉషశ్రీ విశ్వరూపం ముందు కథకుడు ఉషశ్రీ విగ్రహం చిన్నదైపోయింది.


ఈ ప్రవచనాలూ, ఉపన్యాసాలూ చెయ్యడానికి ముందు నాన్న కథలు చాలానే రాసారు. కొన్ని నవలలు రాసారు. రెండు నృత్యనాటికలు కూడా రాసారు.

అన్నింటికన్న ముందుగా నాకు గుర్తుకొచ్చేది – వేంకటేశ్వర కళ్యాణం నృత్యనాటిక. అది మా పెద్ద చెల్లి పద్మ పుట్టడానికి కాస్త ముందుగా రాసినట్లున్నారు. అసలందుకే చెల్లి పేరులో పద్మ వచ్చి చేరింది.

నాన్న స్నేహితుడు వీరభద్రాచారిగారితో కలిసి రాసిన నృత్యనాటిక అది. వీరభద్రాచారి గారూ, నాన్నా భీమవరం కాలేజీలో కలిసి చదువుకున్నారు. వీరిద్దరూ కలిసి రాయడం మొదలైంది కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లోనే.

భీమవరం కళాశాల సంస్కృతి ఉత్సవాలలో ప్రదర్శనకి రాగహృదయం అనే నృత్యనాటిక – వేంకటేశ్వరకళ్యాణం రాయడానికి ముందే వీరిద్దరూ కలిసి రాసారు. ప్రథమ ప్రదర్శన 1955 నవంబర్లో జరిగింది. 1957 ఫిబ్రవరిలో ఆ నృత్యనాటకాన్ని పుస్తకంగా ప్రచురించారు. పుస్తకం ఆఖరి పేజీలో ఆ కార్యక్రమం వివరాలు ఉన్నాయి.

ఆ పేజీలోనే ప్రచురణకి అనుమతినిచ్చిన విజయవాడ ఆలిండియా రేడియోకి కృతజ్ఞతలు చెప్పారు. అంటే అది రేడియోలో కూడా ప్రసారం అయ్యుంటుంది – నాన్న రేడియోలో చేరడానికి చాలా ఏళ్ళ ముందే. ఎప్పుడో ఎలా తెలుస్తుంది ఇప్పుడు నాకు?





ఆ నాటికని ఆంధ్రా యూనివర్సిటీలో మార్షల్ టిటో ముందు ప్రదర్శించినట్లు చదివాను నేను. మోదుకూరి జాన్సన్ గారు వేయించారనుకుంటా.

రాగహృదయం అశ్వఘోషుడి కథ. దాన్ని భీమవరం కాలేజీలో నాన్న గురువుగారైన నండూరి రామకృష్ణమాచార్య గారికి గురుదక్షిణగా సమర్పించుకున్నారు. ఆ తర్వాత చాలా ఏళ్ళకి నాన్న తన షష్టిపూర్తి సమయంలో నండూరి రామకృష్ణమాచార్యులుగారినీ, బాలాంత్రపు రజనీకాంతరావు గారినీ భక్తిపూర్వకంగా సన్మానించుకున్నారు.

వేంకటేశ్వర కళ్యాణం నా మనస్సుకి హత్తుకుపోడానికి కారణం ఆ పుస్తకం మా ఇంట్లో నలభైయిదేళ్లకి పైనుంచి ఉండడమే. ఇప్పుడూ నా దగ్గర ఉంది. దాన్ని చూస్తూ ఉండిపోవాలనిపించేది, చిన్నప్పుడు. ఇప్పుడూ అదంటే నాకు చాలా ఇష్టం.

పుస్తకమంటే అచ్చేసిందో – లేక నాన్నో వీరభాద్రాచారి గారో తమ చేతిరాతతో రాసిందో కాదు. అది ఆచార్యులు గారు తయారు చేయించిన ఆల్బం లాంటి అద్భుతమైన పుస్తకం. ఆచార్యులు గారంటే నాన్నకి భీమవరం కాలేజీ రోజుల్నుంచీ ఆప్తులైన కే. కే. రామానుజాచార్యులు గారు.

నల్లని దట్టమైన ఆర్ట్ పేపర్ మీద అందంగా కుమార్ అనే చిత్రకారుడి చేత నృత్యనాటికనంతా రాయించారు. అంతే ఐతే అందులో వింతేం లేదు. నృత్యనాటికలోని సన్నివేశాలకీ, పాటలకీ సరిపోయేలా ఫ్లోరసెంట్ రంగుల్లో బొమ్మల్ని వేయించారు. ఏ పాటకి సంబంధించిన బొమ్మను – ఆ పాట పక్కన అంటించారు.

పాటలూ, బొమ్మలూ చక్కగా అతుక్కుపోయేలా అందంగా తీర్చిదిద్దారు. ఆ పుస్తకాన్ని చూసిన వాళ్లకి తప్ప అందులోని అందం, అద్భుతం తెలియవు. ఎంతచెప్పినా అర్థం చేసుకుని ఆనందించలేరు. నేను అనుభవిస్తున్న ఆనందాన్ని నలుగురితోనూ పంచుకోవాలన్న కోరికతో – ఆ పుస్తకాన్ని అలానే చిన్న సైజు లో 2012లో అచ్చు వేయించాను. అది అందంగానే వచ్చింది కానీ – ఆల్బంని చూసిన అనుభూతి కలగడం లేదు.

వేంకటేశ్వర కళ్యాణాన్ని నటరాజ రామకృష్ణ గారు తన శిష్యులతో కలిసి ప్రదర్శనలిచ్చేవారు. అసలు వేంకటేశ్వర కళ్యాణాన్ని నటరాజ రామకృష్ణ గారి ప్రదర్శనల కోసమే రాశారు నాన్న. ఆ రోజుల్లో ఆ నృత్య నాటిక ప్రఖ్యాతి గాంచింది. ఆ నాటికని వాళ్ళు రిహార్సల్స్ చేస్తున్నప్పుడు నాన్నతో పాటు నేను కూడా వెళ్ళేదాన్నని అమ్మ చెప్పేది. వాళ్ళు చేసే నాట్యాన్ని చూస్తూ నేను కూడా కొంత ప్రయత్నించేదాన్ననీ, నా చిన్నారి చేష్టలు వాళ్ళందరికీ ముద్దుగా అనిపించేవనీ అమ్మ అనడం లీలగా గుర్తొస్తోంది. అప్పుడు మేము హైదరాబాద్ చిక్కడపల్లి లో వెంకటేశ్వర స్వామి గుడికిదగ్గర్లో ఉండే వాళ్ళం. రిహార్సల్స్ దగ్గర్లోనే జరుగుతుండేవనుకుంటా.

నాటికలోని పాటల్ని ఇంట్లో అమ్మ పాడుతూ ఉండేది. నా చిన్నప్పుడే కాదు – మేము పెద్దయ్యాక కూడా –మేము హైదరాబాద్ నుండి విజయవాడకి వెళ్ళిపోయాక కూడా – అమ్మ ఆపాటలు పాడుతూనే ఉండేది. విని విని అవి మాకు కూడా కొంచెం నోటపట్టాయి. అవి మనస్సులోనూ, గొంతులోనూ ఎంత దిగిపోయాయో.

ఈ మధ్య ఈటీవీలో స్టార్ మహిళ కార్యక్రమంలో పాల్గోడానికి అక్కాచెల్లెళ్ళం నలుగురం వెళ్ళాం. మేము వెళ్ళింది మామూలుగా పాల్గొనేవాళ్ళలా కాదు. నలుగురం కలిసి ఉషశ్రీ గారి కూతుళ్ళుగా చేసిన ఓ ప్రత్యేకమైన కార్యక్రమం. దాన్ని ఈటీవీ వాళ్ళు నాన్న జన్మదినం సందర్భంగా 2015 మార్చ్ 16 న ప్రసారం చేసారు.



కార్యక్రమంలో పాల్గొనే వాళ్ళంతా మామూలుగా సినిమా పాటల డాన్సులు చేస్తుంటారు. మేము అలాంటి డాన్సులు ఎలాగూ చెయ్యలేం – చెయ్యం. దానికి తోడు కార్యక్రమం చేస్తున్నది నాన్న పేరన. నాన్న గురించీ, ఆయన రచనల గురించీ మాట్లాడాం. అందులో భాగంగానే వేంకటేశ్వర కళ్యాణంలోని మేలుకొలుపు పాటని నేనూ, ఆఖరి చెల్లి కల్యాణీ  కలిసి పాడాం.

చెప్పడం మర్చిపోయా –  వేంకటేశ్వర కళ్యాణం పుస్తకంలో పాటల రాగాలూ తాళాలూ రాసుంటాయి. నాన్నకి  సంగీతం అంతగా రాదు. అవన్నీ వీరభద్రాచారి గారు చూసుకునుంటారేమో? ఆయన నాకు గుర్తున్నారు. ఆయన తన కుటుంబంతో తీయించుకున్న ఫొటో ఒకటి మా ఇంట్లో ఇప్పటికీ  ఉంది కూడా. నాన్న స్నేహితుల్ని ఎవరిని చూసినా, కలిసినా – నాకు నాన్నని చూసినట్లూ, కలిసినట్లూ ఉంటుంది.

నాన్నకి పాడ్డమే కాదు – పద్యం రాగ యుక్తంగా చదవడం కూడా రాదు. “పద్యం పాడ్డం వస్తేనా “ అని ఒక్కోసారి అనేవారు. ఎంత సాధించినా ఇంకా ఇది చెయ్యగలిగితేనా అని అనుకునే మనిషే ఏదైనా చెయ్యగలుగుతాడు. అలా అనుకుంటూ ఉండగలిగారు కాబట్టే ఎప్పటికప్పుడు కొత్తగా తనని ఆవిర్భవించుకుంటూ ఉండేవారు  నాన్న.


ఇంట్లో అటూ ఇటూ తిరుగుతూ – శివుడూ తాండవమూ చేసేనమ్మా – అని పాడుతూ ఉండేవారు. అదే కాదు – కలభసుందరా గమనా – అంటూ కూడా పాడేవారు. రాగం తాళం శ్రుతీ – ఏవీ ఉండేవి కావు. ఐనా అన్నీ ఉన్నట్లు – చేతులు కదిపేస్తూ, తలాడించేస్తూ పాడేసేవారు. అలా మాంచి ఉత్సాహంతో పాడే నాన్నని మేము ఆనందంగా చూస్తూ కూర్చునేవాళ్ళం. ఇలా రాస్తూంటే కళ్ళముందు ఈ క్షణంలోనే జరుగుతున్న అనుభూతి కలుగుతోంది.

> Ushasri is one of the very few telugu literary figures who absorbed in himself the sacred classics sufficiently and assimilated the epic thought to such a remarkable degree that he became an eminent interpreter to his own people in genaral and to the youth in particular
>
> \- P. Srinivasan





# జ్వలిత జ్వాల




ఆల్బం లాంటి వేంకటేశ్వరకళ్యాణం పుస్తకం తయారు చేయించడమే కాదు – ఆచార్యులు గారు నాన్న కథల పుస్తకాల ప్రచురణ కూడా తనే స్వయంగా పూనుకుని చేసారు.

నాన్న పత్రికలకి రాసిన కథల ప్రతులు నాన్న దగ్గర ఉండేవో లేవో కూడా. దాచుకోడం నాన్న నైజం కాదు. ఆచార్యులుగారే వాటిని జాగ్రత్త పెట్టుకుని ఉంటారు. లేనివాటిని సేకరించుకుని ఉంటారు.

1962–63 లలో నాన్న కథల్ని మూడు పుస్తకాలుగా వేసారు. మూడింటినీ తరుణ సాహితి పేరుతోనే ప్రచురించారు. తరుణ సాహితి అంటే నాన్న తన ఆలమూరు మిత్రులు కొందరితో కలిసి స్థాపించుకున్న సమితి.

మూడు కథల్ని జ్వలితజ్వాల పేరుతో ఓ సంకలనంగా అచ్చువేసారు. ఆ మూడు కథలూ కాస్త పెద్దవి. పెద్దకథలని అనచ్చు. నవలికలు అన్నా అనచ్చు.

ఆ పుస్తకానికి అట్టమీద బొమ్మ వెంబు చేత వేయించారు. ముందు మాట రాసిచ్చింది త్రిపురనేని గోపీచంద్. ఆ పుస్తకంలో జ్వలితజ్వాల కాకుండా ఇంకో రెండు కథలుంటాయి కానీ జ్వలితజ్వాల ఓ ప్రత్యేకమైన రచన.

ఎలా రాసారో నాన్న జ్వలితజ్వాల కథని. నా చిన్నప్పుడు నాకు అది అంతగా అర్థం కాలేదు. ఇప్పటికీ పూర్తిగా అంతుపట్టిందని అనలేను.

కానీ ఈ రోజు అది ఎంత గొప్పకథో, ఎంత గొప్ప కథనమో కొంచెం కొంచెం తెలుస్తోంది.

ఒక్కోసారి నాకు అనిపిస్తుంది. మంచికథలని ఏరి వేసే ఎన్నో కథా సంకలనాలలో ఈ కథ ఎందుకు ఉండదా అని. ఏ సంకలన కర్తనీ తప్పు పట్టడం కాదు కానీ, అంత మంచి కథని ఎవ్వరూ ఎందుకు తీసుకోడం లేదో.

ముందుగా అది ఓ రెండు పేజీల కథగా కృష్ణాపత్రికలో అచ్చయిందని రాసుకున్నారు నాన్న. ఆ చిన్నకథని నేనెక్కడా చూళ్ళేదు.



దాన్నే పెంచి జ్వలితజ్వాలగా రాసి ఎన్నో పత్రికలకి పంపారుట. ఎవ్వరూ వేసుకోకపోతే – భారతికి పంపించారుట. పంపిస్తూ మీక్కూడా అక్కర్లేకపోతే చెత్తబుట్టలో దాఖలు చెయ్యమని రాసారుట. తిప్పి పంపడానికి స్టాంపులు కూడా పెట్టలేదుట. భారతి వాళ్ళు వేసుకున్నారు. భారతి లాంటి సాహితీ విలువలున్న పత్రికలో పడాల్సిన కథని మరో పత్రిక ఎలా వేసుకుంటుంది?

ఆ కథ ఎలా ఊహించావు నాన్నా? ఊహించిన దాన్ని అంత అందంగా ఎలా చిత్రీకరించావు? అని నాన్నని అడగాలనిపిస్తుంది ఇప్పుడు.

చదువుతున్నంత సేపూ – లీలావతీ, వెంకట్రాయుడూ కళ్ళ ముందు కనిపిస్తూనే ఉంటారు.

అసలా కథలో సంఘటనలు విచిత్రంగా జరుగుతాయి. లీలావతి ఏ డాక్టర్ దగ్గర పురుడు పోయించుకుని చిట్టిని కంటుందో, ఆ డాక్టర్ వెంకట్రాయుడి మిత్రుడు. అంతవరకూ సరే. లీలావతి ఎప్పుడు పురిటికి ఆ డాక్టర్ దగ్గర ఉందో సరిగ్గా ఆ సమయానికే వెంకట్రాయుడు అక్కడకి వెళ్తాడు. జరక్కూడదని కాదు. అలా జరిగిందని రాయాలని నాన్నకెలా తట్టిందా అని.

అలాగే ఏ జడ్జీ చిట్టికి ఉరిశిక్ష వేస్తాడో ఆ జడ్జీ వెంకట్రాయుడి మిత్రుడే. అది కొంతవరకూ ఒకే వృత్తిలో ఉండడం వల్ల జరిగే అవకాశం ఉంది. ఆ జడ్జే లీలావతికి చిట్టిని ప్రసాదించిన తండ్రి. ఎంత నాటకీయత ఉందా కథలో?

అత్త అంటూ ఉండేది – అదేదో జరిగిన సంఘటననే అబ్బాయి కథగా రాసానని అనేవాడు, అని. అది నిజమే ఐనా – అలా ఎలా అల్ల గలిగారో నాన్న?

జ్వలితజ్వాలని కథ అనాలా? పెద్ద కథ అనాలా? నవలిక అనాలా? నవల అనాలా? నాటకీయత ఉంది కాబట్టి నాటకం అనాలా? ఏం అంటే ఏం – అదో గొప్ప రచన.

వింతేమిటంటే – అది అన్నీ అయింది. దాన్నే కొంచెం పెంచి సంతప్తులు అనే నవల చేసారు. ఎమెస్కో వాళ్ళు వేసారు దాన్ని.

ఆ తర్వాత దాన్నే ఆకాశవాణిలో పైడికటకాలు అన్న నాటకంలా ప్రసారం చేసారు. దాని నాటకీకరణ పేరి కామేశ్వరరావు గారు. అందులో వెంకట్రాయుడులా నటించింది రామచంద్ర కాశ్యప గారు. మహానటులు ఆయన. ఎంత బాగా జీవించారో వెంకట్రాయుడి పాత్రలో. నా చెవుల్లో ఇంకా ఆయన లీలా అని పిలుస్తున్నట్లే ఉంది. అంత మంచి కంఠం ఆయనది.

అది విజయవాడ రేడియో కేంద్రం స్వర్ణయుగం. ఎన్ని గొప్ప కార్యక్రమాలు తయారయ్యాయో ఆరోజుల్లో. అందులో ఈ నాటకం ఒకటి. ఎందుకు చెప్తున్నానంటే – తొంభైల్లో మేము మద్రాసులో ఉంటున్నప్పుడు నేను రేడియో లో నా ప్రసంగాల రికార్డింగుకి వెళ్తూండేదాన్ని. అక్కడ పద్మజానిర్మల గారు ఉండేవారు. మంచి మంచి కార్యక్రమాలు చెయ్యాలన్న తపనా, పట్టుదలా ఉన్న ఆవిడ. ఆవిడ ఓ సారి పైడికటకాలు గురించి మాట్లాడుతూ చాల గొప్ప నాటకం కానీ ఇప్పుడు మనం మళ్ళీ చెయ్యలేం అని అన్నారు.

ఓ కథ – కథగా, నవలగా, నాటకంగా రావడం – అన్ని ప్రక్రియల్లోనూ బావుండడం జ్వలితజ్వాలకి చెల్లింది. ఎందుకంటే ఆ కథా, కథనం అలాంటివి. అంతా నాన్న కలంలో ఉంది.





ఆ కథలో – పురాణాలలోని పాత్రల్నీ, సంఘటనల్నీ ఎన్నిటినో ఎంత అందంగా సందర్భోచితంగా వాడుకున్నారో నాన్న. ఎన్ని వర్ణనలు పురాణకథల్లోంచి తీసుకున్నారో. పురాణ కథలమీదా, పాత్రల మీదా, వాటి స్వభావాల మీదా, కావల్సినంత పట్టు ఈ కథ రాసేటప్పటికే ఉంది నాన్నకి. వాటిని చెప్పడానికి కావల్సిన అధికారం వచ్చేసింది. అదే తర్వాత్తర్వాత నాన్న అలవోకగా భారతాది కథల్ని చెప్పేందుకు పునాదైంది.

ఈ విషయాన్నే విశ్వనాథ సత్యనారాయణ గారు, నాన్న అమృతకలశం కథా సంపుటికి ముందుమాటలో – ముందుచూపుతో "ఇది ఉషశ్రీ మార్గము అన్న ప్రతిష్ఠ బడయు గాక" అని రాసారు. ఆయన మాట యథార్థం అయ్యింది.

అమృతకలశం పురాణాల కథల సంపుటి. అందులో నాలుగు కథలు ఉన్నాయి. ఒకటి అమృతకలశం. ఆచార్యులుగారు ప్రచురించిన మూడు సంకలనాలకీ – ఆ సంకలనంలో ఉన్న కథల్లో ఒక కథ పేరే పెట్టారు.

అమృతకలశం కథ క్షీరసాగరమథనం కథ. దేవదానవులు అమృతం కోసం పాలకడలిని మథించారు. దానికి మేరు పర్వతం కవ్వం అయింది. వాసుకి తాడయ్యాడు. కొండ మునిగిపోకుండా విష్ణువు కచ్ఛప రూపంలో అడ్డం నిలిచాడు. విశ్వం కేన్వాసు మీద చిత్రించబడ్డ గొప్ప దృశ్యమది. ఆ దృశ్యాన్ని మాటల్లో చిత్రీకరించారు నాన్న.

చిలకగా చిలకగా పాలకడలిలోంచి అమృతం పుడుతుంది. విష్ణువే మోహినిగా వచ్చి అమృతాన్ని పంచుతాడు. జగన్మోహిని మోహంలో పడ్డ శివుడు మోహిని వెంట పరుగెత్తుతాడు. హఠాత్తుగా మాయనుండి బయటపడి స్థాణువవుతాడు. పరుగాపిన మోహిని వెనుదిరిగి శిలారూపం దాలుస్తాడు.

ఇదీ అమృతకలశం కథ. ఇదే తూర్పు గోదావరి జిల్లాలో ఆలమూరు దగ్గర్లోనే ఉన్న ర్యాలిలోని జగన్మోహిని విగ్రహం కథ. విగ్రహం ముందు పక్క విష్ణువు. వెనకపక్క జగన్మోహిని. అద్భుతమైన శిల్పం.

నాన్న చిన్నప్పుడు ఆ ఆలయాన్నీ, ఆ శిల్పాన్నీ చూసుంటారు. తన మదిలో నిల్చిపోయిన రూపాన్ని అమృతకలశం కథలో అందంగా ఆవిష్కరించారు, అద్భుతమయిన తన భాషా సౌందర్యంతో. ఆ కథా సంపుటిలో మిగతా మూడు కథలూ పౌరాణిక కథలే. అన్నీ బావుంటాయి – అని నేను చెప్పడం ఏం బావుంటుంది?

మూడో పుస్తకం సాంఘిక కథల సంకలనం. పుస్తకం పేరు అందులో ఒక కథపేరే – మల్లె పందిరి. మల్లెపందిరిని కథనలేం. అదీ పెద్దకథా–నవలికా విభాగంలోకి వస్తుంది. నిజానికి మల్లెపందిరి కథలో కథేం ఉండదు పెద్దగా. పెళ్ళైన కొత్తలో ఒక జంట ఒకరినొకరు అర్థం చేసుకోడంలో పడిన ఇబ్బందులూ, విడిగా ఉంటున్నప్పుడు చేసిన ఆలోచనలూ విరివిగా ఉంటాయి.

ఐతే అందులో ఒక విచిత్రాన్ని ఇరికించారు. భార్యని భర్తకి దగ్గర చేసేందుకు శకుంతలని ఎన్నుకున్నారు. అదే సమయంలో భర్తని భార్యకి దగ్గర చేసేందుకు ఉమని తయారు చేసారు. ఇంతాచేసి శకుంతల చెల్లెలే ఉమ అని ముగించారు.

ఆకథలో తండ్రి కూతురిని ప్రేమగా చూసుకోడం చదువుతోంటే – ఆ తండ్రి నాన్ననే అనిపిస్తుంది. నాన్నంటే ఎలా ఉండాలో, నాన్న నాన్నైతే తను ఎలా ఉంటారో – ఊహించుకుని రాసినట్లు ఉంటుంది ఆ కథ.

కథా చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారిని చాలా అభిమానించారు నాన్న. ఆయన కథల్ని అధ్యయనం చేసారు. కథలు రాయడంలో ఆయన మార్గం అమోఘం, అనితరసాధ్యం.



శ్రీపాద వారి చాలా కథల్లో సంభాషణలు తప్ప ఇంకేం ఉండవు. ఆ సంభాషణల్లోంచే పాత్రల పేర్లూ, వాళ్ళ నైజాలూ, ఆలోచనలూ ఆవిష్కరించడం ఆయనకే చెల్లింది. ఆ శైలిని నాన్న అక్కడక్కడా కాస్త స్పృశించారని అనిపిస్తుంది మల్లెపందిరి చదువుతోంటే.

కథలు చెప్పడంలో బహు నేర్పరీ, మహా గడసరీ ఐన మల్లాది రామకృష్ణశాస్త్రి గారి గుబాళింపు కూడా నాన్నకి కొంచెం అంటిందేమో తెలియదు – ఆయన్ని కూడా అభిమానంగా చదివారు నాన్న.

మల్లెపందిరి కథ నిడివితో పోలిస్తే ఆ సంపుటిలో మిగతా కథల నిడివి చాలా తక్కువ. ఆ కథల్లో – పెళ్ళి చేసుకోబోయే యువతీయువకులు ఉంటారు. కొత్తగా పెళ్ళైన దంపతులు ఉంటారు. వాళ్ళ ముచ్చట్లు ఉంటాయి. ఎదురుచూపులు ఉంటాయి.

ఆ కథల్లో నాకు చిన్నప్పట్నుంచీ ఇష్టమైన కథ కడుపులో పాపాయి. ఆ కథలో నెలలు నిండి పుట్టింటికి వెళ్తున్న వెంకటలక్ష్మి, కడుపు పండడంకోసం ఎదురుచూస్తున్న శకుంతలా ముఖ్యపాత్రలు. అంతకన్న ముఖ్యమైన పాత్ర – వెంకటలక్ష్మి మొదటి సంతానం – మూడేళ్ళు కూడా నిండని కళ్యాణి. ఆ చిన్నారి కళ్యాణిని నేనే అనుకుంటూ చదువుకుంటూ ఉండేదాన్ని ఆ కథను. ఎంత బావుండేదో ఆ కథ నాకు.

ఆ కథలన్నింటిలోనూ సరసమైన సంభాషణలుంటాయి. ఐతే ఎందులోనూ మితిమీరిన శృంగారం ఉండదు. ఈ కథ నాన్న రాసారు అని అనుకుందుకూ అనేందుకూ ఎక్కడా సిగ్గుపడాల్సిన అవసరమే లేకుండా ఉంటాయి కథలన్నీ. అలా అనుకుందుకు నాకు గర్వంగా ఉంటుంది.

ఐతే నాన్న మేధస్సులోంచి అద్భుతంగా ఉద్భవించిన ఈ కథ రత్నాలన్నీ – ఆయన భారత కథా ప్రవచన సాగరంలో అడుక్కెళ్ళిపోయాయి.

శంకరాభరణం సినిమా – విశ్వనాథ్ గారు అంతకు ముందు తీసిన సినిమాలని ఎలా తెరమరుగు చేసేసిందో – అలాగన్నమాట. ఆయన తీసిన జీవనజ్యోతీ, శారదా, ఓసీతకథా లాంటి సినిమాల్ని మర్చిపోయారు ఆయన అభిమానులు. శంకరాభరణం తరవాత – ఆయన చేత సంగీత నృత్య ప్రాధాన్య చిత్రాలనే తీయించారు.

అలానే నాన్న జ్వలితజ్వాల లాంటి కథ రాసారని మర్చిపోయారు అభిమానులు. నాన్నని భారత రామాయణ భాగవతాలకి అంకితం చేసేసారు.


Ushasri has no pre-conceived ideas,
nor does he support blind faith and supertition.
His greatest asset is his belief in the truth of Dharma
and in the Love of God.

- R. M. Challa





# ఎన్ని రాశారో నాన్న




నాన్న కథల్ని 1962–63 లలో పుస్తకాలుగా అచ్చేసారు. అంటే వీటిని అంతకు ముందే యాభైలలో రాసుండాలి. అంటే నాన్న వయస్సు ముప్ఫై కన్న తక్కువే అయ్యుంటుంది.

ఏ కళాకారుడికైనా సృజనాత్మకత ముప్ఫై సంవత్సరాలలోపే ఉన్నత శిఖరాగ్రానికి చేరుకుంటుందని అంటారు. రాజేశ్వరరావు గారు మల్లీశ్వరి సినిమాకి సంగీతం అందించే నాటికి ఆయన వయస్సు ముప్ఫైకి కాస్త తక్కువే. ఆ సినిమా సంగీతం ఆయన సృజనాత్మకతకి పరాకాష్ఠలా అనిపిస్తుంది. ఆ తర్వాత కూడా ఆయన ఉన్నతమైన సంగీతాన్ని అందించారు కానీ, మల్లీశ్వరి అన్నింటికీ ఓ మెట్టుపైనే ఉన్నట్లుంటుంది.

అలానే నాన్న జీవితంలోనూ. అప్పటి వయస్సులో రాసిన కథల్లో నాన్న సృజనాత్మకత కొట్టొచిన్నట్లు కనిపిస్తుంది. ఏం మల్లెపందిరి? ఏం అమృతకలశం? ఇంక జ్వలితజ్వాల – అద్భుతః. నవలా లేఖావళి ప్రక్రియలో నాన్న రాసిన పెళ్ళాడే బొమ్మా–రాసి యాభై ఏళ్ళు దాటినా నేటి తరానికి కూడా అది మార్గ దర్శకంగా నిలుస్తుంది.

ఈ కథలు రాయడం సంకలనాలుగా వేయడం అయిపోయాక – ఇంటింటా గ్రంథాలయం పేరిట ఎమెస్కో వాళ్ళు మొదలెట్టిన పుస్తక యజ్ఞంలో నాన్న రాసిన ప్రేయసి–ప్రియంవద అనే జంట నవలల్ని అచ్చు వేశారు వారు. అవి సరదా కథలు. రాగాలా–సరాగాలా అన్నట్లు సాగిపోయే కథలు. ఆ తర్వాత ఎమెస్కో వాళ్ళకి జ్వలితజ్వాల కథను సంతప్తులు నవలగా ఇచ్చారు.

ఈ పుస్తకాలతో పాటుగానే ఎమెస్కో వాళ్ళు ప్రాచీన గ్రంథాలను వేస్తూ నాన్న చేత పింగళి సూరన గారి కళాపూర్ణోదయాన్ని వచనంలో రాయించుకున్నారు. ఎంత గొప్ప కథా కథనం కళాపూర్ణోదయం? శ్రీకృష్ణుడూ, కలభాషిణీ, నారదుడూ, మాయా రంభా, మాయా నలకూబరుడూ, మణికంధరుడూ, కళాపూర్ణుడూ – ఇలా ఎన్నో పాత్రలతో కథ సాగిపోతుంది.



అది ఏదో పురాణంలోంచి తీసుకుని చెప్పిన కథ కాదు. అంతా సూరనగారి సృష్టి. అంత కల్పితమైంది కాబట్టే – దాన్ని తెలుగులో తొలి నవల అని అంటూంటారు.

అంత అందమైన కథను మాతో పంచుకోవాలన్న ఉబలాటంతో మాకు మా చిన్నప్పుడు ఆ కథ చెప్తూండేవారు నాన్న.

ఆ కథని నాన్న వచనంలో రాసారు. ఆ పుస్తకాన్ని తర్వాత స్వాతి మాసపత్రికలో అనుబంధంగా కూడా వేసారు.

కళాపూర్ణోదయం కాకుండా ఎమెస్కో వాళ్ళు నాన్న చేత మనుచరిత్ర కూడా రాయించుకున్నారు. మనుచరిత్ర పెద్దన్న గారి మహాద్భుత సృష్టి. వరూధినీ ప్రవరుల సంభాషణలూ, వరూధినీ మాయాప్రవరుల శృంగారమూ, స్వరోచి వేటా, మనోరమా వృత్తాంతమూ, స్వారోచిష మనుసంభవం – అద్వితీయమైన వర్ణనలతో, అజరామరమైన పద్యాలతో ఆవిష్కరించారు పెద్దన్న. ఐతే పెద్దన్నది నారికేళ పాకం. అంత సులభంగా అర్థం అవదు.

పెద్దన్న గారి పద్యాల్లోని అందాలను ఆస్వాదించలేని సామాన్యుల కోసం – సులభంగా అర్థమయ్యేలా, మూలంలోని సొగసులు పోకుండా – సరళవచనంలో మనుచరిత్రని చెప్పారు నాన్న. నాన్న రాసిన మనుచరిత్రని కూడా స్వాతి మాసపత్రికలో అనుబంధంగా అచ్చేసారు.

స్వాతి గురించి తల్చుకుంటోంటే – ఏదిసత్యం? ఏదసత్యం? శీర్షిక గుర్తొస్తోంది. ఆలిండియా రేడియోలో నడిపిన ధర్మసందేహాలు శీర్షికతోనే నాన్న ఆంధ్రజ్యోతిలో పాఠకుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేవారు. కొన్నేళ్ళు నడిపాక ఆంధ్రజ్యోతి వాళ్ళు ఆ శీర్షికని నిలిపివేస్తోంటే – ఆ శీర్షికనే మరోపేరుతో స్వాతి వారపత్రికలో నాన్న చేత మొదలెట్టించారు బలరాంగారు.

శీర్షిక పేరు ఏదిసత్యం? ఏదసత్యం? అదీ పాఠకుల ప్రశ్నలకి నాన్న సమాధానాలే. సమాధానాల్లో ప్రశ్నకి జవాబు ఉండేది. అంతకు మించి కొంటెతనం ఉండేది. విమర్శ ఉండేది. చాలా ప్రశ్నలకి జవాబులు కాకుండా తిరుగు ప్రశ్నలు ఉండేవి. రకరకాల ప్రశ్నలు వచ్చేవి. అడిగిన వారికి నచ్చేలా – చదివిన వారందరూ మెచ్చేలా సమాధానాలిస్తూ నడిపించారు ఆ శీర్షికని.

ఆ శీర్షిక నాన్న పోయేవరకూ నడుస్తూనే ఉంది. కొన్ని వారాలకి సరిపడే ప్రశ్నలూ సమాధానాలూ స్వాతి పత్రికకి ముందుగానే ఇచ్చేవారు నాన్న. అందుకనే నాన్న పోయాక కూడా కొన్ని వారాలు ఆ శీర్షిక నడిచింది.

ఇవే కాకుండా – ఈ తరం మహామనీషి – స్వామి వివేకానంద గురించి పుస్తకం రాసారు నాన్న. వివేకానందస్వామి వేదాలనూ, ఉపనిషత్తులనూ కూలంకషంగా నేర్చినజ్ఞాని. పతంజలి యోగశాస్త్రాన్ని మథించిన యోగి. భగవద్గీతను మమేకం చేసుకున్న ఆచార్యుడు. నిద్రిస్తున్న భారత జాతిని జాగృతం చెయ్యడానికి – తను సంపాదించుకున్న జ్ఞానాన్ని – అందరికీ అర్థం అయ్యేలా – పుస్తకాలుగా, ఉపన్యాసాలుగా అందించారు ఆయన.

ఆయన నాన్నకి మార్గదర్శి. ఆయన జీవితాన్నీ, ప్రబోధాలనీ – వివేకానందం అన్న పుస్తకంగా రాసారు. ఇవి కాకుండా ఎన్నోకథలూ, గేయాలూ, పద్యాలూ, వ్యాసాలూ రాసారు. వాటిలో కొన్నింటిని కలంపేర్లతో రాసారు. నాన్న నాకు చెప్పిన తన కలం పేర్లలో కొన్ని – మృణాలిని, శుచిముఖి, అనామిక, వైశంపాయన. ఇంకో ముచ్చటైన పేరు వ్యాసశ్రీమతి. అది అమ్మ పేరైన వ్యాస సత్యవతి లోంచి తీసుకున్నారు.

నాన్నకి ఎంతో ఇష్టమైన కళ్యాణి పేరుతో కూడా రచనలు చేసారు. భీమవరం కాలేజీలో ప్రదర్శనకి నాన్న రాసిన పెళ్ళికొడుకులు నాటిక నాన్న కళ్యాణి కలం పేరుతోనే రాసారు. ఆ పేరుతోనే తరుణసాహితీసమితి తరఫున 1950 లో ప్రచురించారు. సమితి ప్రచురించిన మొదటి పుస్తకం అదే. నాకు తెలిసి నాన్న పుస్తకాలలో అచ్చైన మొదటి పుస్తకం కూడా అదే.

అన్నింటి కన్న నాకు సరదాగా అనిపించేది “ తరాలు అంతరాలు” అన్న నవలకి వాడుకున్న గాయత్రి అన్న కలంపేరు. చిన్నప్పుడు మా ఇంట్లో ఆ పుస్తకాన్ని చెల్లెళ్లకి చూపిస్తూ నాన్న నా పేరుతో ఈ నవలని రాసారు తెలుసా అని చెప్తూండేదాన్ని. నిజంగా ఆ రోజున అది నిజమని తెలియదు. ఆ తర్వాత నాన్న అది నిజమని చెప్పినప్పుడు నాకు నిజంగా ఎంత సంతోషమేసిందో. నా పేరుని కలంపేరుగా పెట్టుకుని నాన్న నవల రాసారంటే ఆనందం కాదూ?

నాన్న రాసిన “రామాయణంలో హనుమంతుడు” (ఎవరితో ఎలా మాట్లాడాలి?), “భారతంలో రాయబారాలు” (ఎవరు ఎలా మాట్లాడతారు), “ఉషశ్రీ ఉపన్యాసాలు” అన్ని తరాల వారూ అన్ని కాలాలలో చదివి, జీర్ణించుకుని తమ జీవితాలకి అన్వయించుకోతగిన పుస్తకాలు, తమ వ్యక్తిత్వాన్ని వికసింపచేసుకోడానికి ఉపయోగపడే మార్గదర్శకాలు కూడా.

ఇవి నాకు తెలిసినవి. నాకు తెలియనివి, వివిధ పత్రికలలో అచ్చయినవి ఎన్ని రాశారో నాన్న! ఎన్నో... ఎన్నో... ఎన్నెన్నో....

శత్రుత్వంలో ప్రారంభమైన మైత్రి చిరకాలం మన్నుతుంది
అనేవారు మా నాన్నగారు.
సరిగ్గా అలాగే జరిగింది, ఉషశ్రీతో నా స్నేహం.
శతృత్వంతోనే ప్రారంభమైంది.
ఏ మాత్రం పొరపొచ్చాలు లేకుండా ఇంతకాలం సాగింది.
- ఆవంత్స సోమసుందర్



# ఆలమూరు




ఉషశ్రీ కలంపేరుని ఏ సందర్భంలో ఏ రచనకి వాడుకోడం మొదలెట్టారో కానీ అదే నాన్న పేరైపోయింది. అభిమానుల్లో చాలా మందికి నాన్న అసలు పేరు తెలియదు.

మామ్మా తాతలు నాన్నకి పెట్టిన పేరు సూర్యప్రకాశదీక్షితులు. ఇంటి పేరు పురాణపండతో కలిపి నాన్న పూర్తి పేరు పురాణపండ సూర్యప్రకాశదీక్షితులు.

అందులోంచి పురాణాల సారాన్ని గ్రహించారు. సాహిత్య దీక్షను తీసుకున్నారు. ప్రకాశాన్ని సాధించారు . ఐతే ఆ పేరుని మాత్రం ఉంచుకోలేదు. ఉషశ్రీగా మార్చుకున్నారు.

సూర్యప్రకాశదీక్షితులు ఉషశ్రీగా మారడానికి రంగం సిద్ధమైంది నాన్న చిన్నతనం గడిపిన ఆలమూరులోనే.

ఐతే నాన్న పుట్టింది ఆలమూరులో కాదు. కాకరపర్రులో. అది తణుకు దగ్గరో చిన్న ఊరు. ఊరు చిన్నదే కానీ పెద్ద పేరున్న పండితులకి ఆలవాలమైన ఊరు. అక్కడ తెలుగు కన్న సంస్కృతం ఎక్కువ వినిపించేదిట చాలా రోజులు. పెద్దన్నగారి అచట పుట్టిన చిగురుకొమ్మైన చేవ లాంటి ఊరు. నాన్న చేవకి ఆ ఊరిలో పుట్టడం కూడా ఒక కారణమేమో. నేను పుట్టింది కాకరపర్రని గొప్పగా చెప్పుకుంటారు నాన్న.

పశ్చిమ గోదావరి జిల్లాలోని కాకరపర్రుకి – తూర్పు గోదావరి జిల్లాలోని ఆలమూరు – ఏడు గోదావర్ల అవతల అని అనేవారుట. అందులో రెండు గోదార్లు – అఖండ గోదావరి రెండుగా విడిపోయాక నిండుగా ప్రవహిస్తున్న గౌతమి, వశిష్ట నదులు. ఆ రెండూ కాకుండా మరో ఐదు గోదార్లు – ఐదు కాలువలు అయ్యుంటాయి.

తాత కాకరపర్రు నుండి ఆలమూరు వలస రావడమంటే సప్తగోదావర్లు దాటొచ్చినట్లే. అలా వలస వెళ్ళడం తాత జీవితంలో పెద్ద మార్పు తీసుకొచ్చిందనిపిస్తుంది. హైదరాబాద్ నుండి విజయవాడకి చేరిన తర్వాత నాన్న జీవితంలో జరిగిన పెద్ద మార్పు లాంటిదే – తాత కాకరపర్రు నుండి ఆలమూరు మారాక ఆయన జీవితంలోనూ జరిగిందనుకుంటా.





పౌరోహిత్యం, జ్యోతిషం, ఆయుర్వేదం వంటి వాటితో కాలక్షేపం చేసుకుంటున్న తాత – రామాయణ భారత కథల ఉపన్యాసకుడిగా అవతారమెత్తింది ఆలమూరు చేరాకే.

ఆ ఆలమూరులోనే నాన్న బాల్యం గడిచింది.

ఆలమూరు మరీ పెద్దది కాదు. అలాగని చిన్న పల్లెటూరూ కాదు. ఊరికి నాలుగు పక్కలా చెరువులు. అందులో ఒకటి  నాగుల చెరువు. – ఆ చెరువుకి ఒకపక్క జనార్దనస్వామి ఆలయం. మరో పక్క శివాలయం. చెరువు గట్టు మీద చెట్లు. ఆ చెట్ల నీడనే సిమెంటు అరుగులు.

చిన్నప్పుడు నాన్న ఆ చెరువు గట్ల మీదే గడిపారు – ఆకతాయిలా అల్లరి చేసుకుంటూ కాదు – పుస్తకాలు చదువుకుంటూ – వాటిని మననం చేసుకుంటూ – పద్యాన్నీ, గద్యాన్నీ అభ్యసిస్తూ, ఆస్వాదిస్తూ, ఆరాధిస్తూ.

నాన్న చిన్నప్పుడు నాన్న  చేసిన ఆ పనులన్నీ నా చిన్నప్పుడు నాకు తెలియవు. తర్వాత్తర్వాత తెలిసొచ్చింది. నాన్న పోయాక నాన్న చిన్ననాటి స్నేహితులు చిర్రావూరి సుబ్రహ్మణ్యం గారూ, కే కే రామానుజాచార్యులు గారూ – నాన్న గురించి చెప్తోంటే నాన్న తన జీవితానికి ఎంత పునాది వేసుకున్నారో కొంచెం కొంచెం తెలిసొచ్చింది. అంత పునాది ఉంది కాబట్టే అంత ఎత్తుకు ఎదగగలిగారు నాన్న.

చిన్నప్పుడు నాన్న  ఆలమూరు ఎలిమెంటరీ స్కూలుకి వెళ్ళుంటారు. అక్కడే మిడిల్ స్కూలు చదువూ అయ్యుంటుంది. సంచీలో పుస్తకాలు పెట్టుకుని స్కూలుకి వెళ్తున్న నాన్న రూపం – ఎంత ప్రయత్నించినా నేను ఊహించలేకపోతున్నాను. ఆ కాలంలో ఫొటోలు తీయించుకోడం చాలా తక్కువ గా ఉండి ఉంటుంది. నాన్న చిన్నప్పటి ఫొటోలేం లేవు మా దగ్గర –  ఆ రోజుల్లో నాన్న ఎలా ఉన్నారో చూసేందుకు.

నాన్న చిన్నప్పటికింకా కరెంట్ రాలేదు ఊళ్ళో. లాంతర్ల వెలుగులోనే చదువులు. ఏం చదివి ఉంటారో నాన్న? మామ్మ ఒళ్ళో నేర్చుకున్న భాగవతమూ, తాత దగ్గర నేర్చిన భారతమూ కాకుండా.

పెద్దబాలశిక్ష క్షుణ్ణంగా చదివి ఉంటారు. అమరకోశం వల్లెవేసి ఉంటారు. అప్పటి విషయాలు తల్చుకుంటోంటే నా భాషలోనే మార్పు వస్తోంది. క్షుణ్ణంగా, వల్లెవేయడం లాంటి మాటలొచ్చేస్తున్నాయి. ఇప్పుడు అలాంటి మాటలు అనడమూ లేదు. వినడమూ లేదు.

పెద్దబాలశిక్ష నా చిన్నప్పుడు నేనూ నాన్న దగ్గర కూచుని నేర్చుకున్నాను. అమరకోశం కూడా నేర్పించారు నాన్న.

భారత రామాయణ భాగవతాలే కాకుండా – మనుచరిత్రా, కళాపూర్ణోదయం, విజయవిలాసం వంటి గ్రంథాలని చదవడానికి శ్రీకారం చుట్టుంటారు. పుస్తకాల్లోనే మునిగిపోయి ఉంటారు నాన్న.

* * *

ఆలమూరులో కొన్నాళ్ళు నాన్నా వాళ్ళంతా  మాతామహులైన కామన్న గారింట్లోనే ఉన్నారట. తర్వాత తాత సొంతిల్లు కొన్నారుట.

ఆ ఇంటికో చిన్న చరిత్ర ఉందని విన్నాను. తాత కొనేసరికే ఆ యిల్లు కట్టి యాభై ఏళ్ళ పైన అయిపోతోందిట. పిల్లలందరికీ సరిపోతుందని – అంత పాతదైనా ఆ పెద్ద ఇంటిని కొన్నారుట తాత. అమ్మిన దంపతులు మద్రాసులో ఉండేవారుట.



వివరాలు పూర్తిగా నాకు తెలియవు కానీ తాత కొన్నప్పుడు ఆ యిల్లు ఏదో వివాదంలో ఉందిట. అమ్మిన దంపతులకి హక్కు ఉండే అవకాశం ఎక్కువే కానీ అప్పటికి వాళ్లకి పిల్లలు లేరుట. వాళ్లకి పిల్లలు పుడితే – హక్కులెలా ఉంటాయో – చూసుకుని కొనుక్కోండి అని తాతకి ఎవరో సలహా ఇచ్చారుట.

వాళ్లకి పిల్లలు పుడితే నాకన్న సంతోషించే వాడుండడని అన్నారుట తాత. ఆ పిల్లలే వచ్చి ఇల్లు అడిగితే ఇచ్చేస్తానని కూడా అన్నారుట. తాతెవరు. మా నాన్నకి నాన్నే కదా. అలా అనుకోగలగడం మా రక్తంలో ఉందేమో. నాన్నైనా ఖచ్చితంగా అలానే అనేవారు. అదే చేసేవారు. ఈ మాట నేను అనడం కాదు నాన్నని తెలిసిన ఎవరయినా అంటారు.

ఆ ఇల్లు అమ్మిన వాళ్లకి తర్వాత పిల్లలు పుట్టారుట కానీ ఏ లావాదేవీలూ, గొడవలూ రాలేదు. అంతే కాదు – వాళ్ళూ మేమూ సయోధ్యగానే ఉన్నాం. ఇంతకీ వాళ్ళెవరో కాదు.

విజయవాడ ఆలిండియా రేడియోలో నాన్న చేత భారత ప్రవచనం మొదలెట్టించిన బాలాంత్రపు రజనీకాంతరావు గారి అత్తా మామలు. రజనీకాంతరావు గారి భార్య – వాళ్లకి పుట్టిన పిల్ల. అందుకనే నాన్న ఆవిడని మా ఇంటి ఆడపడుచు అని అనేవారు. ఆలమూరింటి ఆడపడుచే కదా ఆవిడ!

ఆ యింటి ముందు రెండు పక్కలా అరుగులు. ఆ అరుగుల్ని ఆనుకుని గదులు. అరుగుల మధ్యనున్న మెట్లని ఎక్కి ఇంట్లోకి వెళ్తే ఒక హాలు. హాలుకి రెండుపక్కలా రెండు మిద్దెగదులు. హాలు దాటితే ఒక వసారా. వసారాకి ఒక పక్క వంటిల్లు. మరోపక్క గది.

ఆయింటిని చూస్తోంటే అత్త చెప్పిన ఒక సంగతి, నాన్న చిన్నప్పటి సంగతి ఒకటి గుర్తొస్తోంది. చిన్నప్పుడోసారి నాన్నని తేలు కుట్టిందిట. బాధతో రాత్రంతా అలా కూచునే ఉన్నారుట నాన్న, ఎవ్వరినీ లేపకుండా. తెల్లారాక ఎందుకు లేపలేదని అడిగితే – లేపి మీ నిద్రకూడా పాడుచెయ్యడం ఎందుకని అన్నారుట. అంత చిన్న వయస్సులో కూడా ఎవ్వరినీ కష్టపెట్టకూడదనే నాన్న ఆలోచన. ఆ సన్నివేశం గుర్తొస్తే బాధతో ముడుచుకు కూచున్న నాన్నే కళ్ళముందు కనిపిస్తున్నారు.

ఆ ఇంట్లోనే నాన్న మామ్మాతాతలతో, అత్తలతో, బాబయ్యలతో కలిసి పెరిగారు. అక్కడే మామ్మకి వంటలో సాయం చేసారు. పిండి రుబ్బారు, గంజి వార్చారు, పొట్టుపొయ్యి కూరారు.


ఆ అరుగుల మీద పడుక్కునే – విశ్వనాథ సత్యనారాయణ గారి రామాయణకల్పవృక్షాన్ని అధ్యయనం చేసారు. అక్కడే స్నేహితులతో కలిసి పెట్టబోయే తరుణసాహితీసమితి గురించి ఆలోచించారు. ఆయింట్లోనే భువనవిజయం వంటి నూతన ప్రదర్శనల ప్రణాళికలకి శ్రీకారం చుట్టారు.

జననీ జన్మభూమీ అంటారు. ఆలమూరు నాన్న జన్మభూమి కాకపోయినా అలాంటిదే.

అక్కడే నాన్న తొలి అడుగులు వేసింది. అక్కడి చెరువుల్లోనే ఈత నేర్చుకున్నది.

అక్కడే మా మామ్మ నుండి సంస్కృతిని, తాత నుండి సంస్కృతాన్నీ అందుకున్నది.

అక్కడే తాత నాన్నకి భారత రామాయణాలని విడమరిస్తే, మామ్మ జీవితపు విలువల్ని వివరించింది.





ఆఊరి లైబ్రరీలోనే నాన్న పుస్తకాల్లో మునిగిపోయింది. ఆ చెరువు గట్ల మీదే తన సాహితీ మిత్రులతో కలిసి చదివిందంతా నెమరువేసుకున్నది.

అంతా ఆలమూరులోనే.

* * *

అలాంటి ఆలమూరుతో నాకు యాభైయేళ్ళగా సంబంధం ఉంటూనే ఉంది. నాన్న పెరిగిన ఊరుకి వెళ్ళి వేసవి సెలవులు గడపడం – చిన్నప్పుడంతగా తెలిసేది కాదు కానీ ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే ఎంత సంతోషంగా ఉంటుందో.

నన్నూ చెల్లెళ్ళనీ మా వేసవి సెలవులకి ఆలమూరు పంపించేవారు నాన్న. నాకు పన్నెండేళ్ళప్పట్నుంచే చెల్లెళ్ళని తీసుకుని ప్రయాణం. నాకే పన్నెండేళ్ళంటే – వాళ్ళింకా చిన్నవాళ్ళు – కళ్యాణయితే మరీ బుడత.

అప్పుడు భయం వెయ్యలేదు. ఇప్పుడు తల్చుకుంటే మాత్రం అలా ఎలా వెళ్ళానా అని భయం వేస్తుంది. అసలు నాన్న ఎలా పంపించారా అని ఆశ్చర్యం కలుగుతుంది. నాన్నకి భయం వేసేది కాదో. వేసినా, పిల్లలకి ధైర్యం చెప్పి పంపించాలని అనుకుని, తన భయాన్ని మనస్సులో దాచుకుని పంపించే వారో.

మాచేతికి మా ఇంటి అడ్రెస్ రాసిన కార్డొక్కటి ఇచ్చేవారు. దిగగానే అది పోస్ట్ చెయ్యడమే మాపని. ఆకార్డు విజయవాడలో మా ఇంటికి చేరగానే మేము ఆలమూరు క్షేమంగా చేరామని నాన్నకి తెలుస్తుంది కదా? మాకు శ్రమ లేకుండా – నాన్నకి ఆందోళన లేకుండా – నాన్న చేసిన ఆలోచన అది. మొబైళ్ళ సంగతి పక్కన పెడదాం – ఫోన్లు కూడా అందరి ఇళ్ళలోనూ లేని రోజులు. మమ్మల్ని పంపించినా మేము చేరామా లేమా అన్న బెంగ నాన్నకి ఉండేది. పైకి కనిపించనిచ్చేవారు కాదు. అంతే.

మేం మా చిన్నప్పుడు తాతగారింటికి వెళ్ళి ఆడుకున్న ఇంట్లోనే నాన్న తన చిన్నతనంలో ఉండేవారన్న ఊహ – అప్పుడు కాకపోయినా – తర్వాత మనస్సుకి ఎంత హాయిగా అనిపించేదో.

మేం ఊరి చెరువుగట్ల మీద ఆడుకున్న చోటే – నాన్నా ఆయన స్నేహితులూ – సాహిత్యాన్ని తింటూ, తాగుతూ కాలం గడిపారని అనుకుంటోంటే – ఎంత సంతోషంగా ఉంటుందో.

ఊళ్ళో లైబ్రరిలోకి వెళ్ళినప్పుడు – ఇక్కడ నాన్న కూచునుంటారు కదా అని అనిపిస్తుంది. లైబ్రరీలో కొన్ని పుస్తకాలు నాన్న చిన్నప్పుడు చదివినవి అయ్యుండచ్చు. ఎంత వింత అనుభవమో అది? చిన్నప్పుడు నాన్న ఏ లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలని తినేస్తూ, తాగేస్తూ కాలం గడిపారో, అక్కడకి నేనూ నా చిన్నతనంలో వెళ్ళడం. నాన్న చదివిన పుస్తకాలనే నేనూ తిరగెయ్యడం మధురాతి మధురమైన అనుభవం.

* * *

నాన్న చిన్నప్పుడు పెరిగిన ఊరికీ, ఇంటికీ నేను వేసవి సెలవులకి వెళ్ళి సరదాగా గడపడం ఒక విశేషమైతే – అంత కన్న పెద్ద విశేషం – అదే ఇంటికి – నాన్న మనవరాలు అపరాజిత కూడా చిన్నతనంలో చాలాసార్లు వెళ్ళడం. అది ఆ యింటి నాలుగోతరం పిల్ల.



ముత్తమ్మామ్మా అంటూ మా మామ్మ దగ్గర ఆడుకునేది. మామ్మకి పెద్దకొడుకూ పెద్ద కూతుళ్ళ మనవరాలది. మామ్మ తొంభై ఏళ్ళకి పైనే బతికింది. ఆరోగ్యం చివరిదాకా బానే ఉండేది.

మామ్మ – తాత పోయినప్పటి కన్న – నాన్న పోయినప్పుడే ఎక్కువ బాధపడినట్లనిపిస్తుంది నాకు. అరవైరెండేళ్ళ కన్నకొడుకుని పోగొట్టుకోడం ఏ తల్లికైనా ఎంతకష్టమో.

నాన్నకి మామ్మంటే ఎంత ఇష్టమో నాకు బాగా తెలుసు. మామ్మ మా ఇంట్లో ఉన్నప్పుడెప్పుడైనా సరే – ఆవిడ తిందా ఆవిడ లేచిందా ఆవిడ పడుక్కుందా – అని అడుగుతూనే ఉండేవారు. నాన్న పోవడం ఆవిడని బాగా కుంగతీసేసింది.

మా మామ్మ ఉన్నన్నాళ్ళూ – మా అమ్మాయిని తీసుకుని ఆలమూరు తరచు వెళ్ళొస్తూ ఉండేవాళ్ళం. మామ్మ పోయాక వెళ్ళడం తగ్గిపోయింది.

ఆలమూరు ఇంటిని కిష్టబాబయ్య పెద్ద పిల్లాడు రామం చూసుకునేవాడు. వాడి పేరు తాతపేరే – రామమూర్తి. ఏం అవసరం వచ్చిందో – ఈ మధ్యనే ఆ యిల్లు ఎవరికో అమ్మేసాడు.

కొనుక్కున్న వాళ్ళు – వందేళ్ళ పైనే వయస్సున్న ఆ ఇంటిని కూల్చేసారు. ఇప్పుడక్కడ ఇంటి ఆనవాలే లేదు.

ఇల్లంటే ఇటుకలూ కర్రలూ కావు. మనుషులూ, మమతలూ, మమకారాలూ.

వేసవి సెలవుల్లో ఆలమూరు వెళ్తున్నప్పుడు – బస్టాండులో బస్సు దిగి రిక్షావాడితో పురాణపండ రామ్మూర్తి గారింటికని చెప్తే చాలు – తీసికెళ్ళిపోయేవాడు. అక్కడకి ఉత్తరం రాయాలంటే అడ్రెస్ మీద పురాణపండ రామమూర్తి, ఆలమూరు, తూర్పు గోదావరి జిల్లా అని రాస్తే సరిపోయేది.

ఇప్పుడా ఇంటికీ పురాణపండకీ సంబంధం లేదు. ఇంత చరిత్ర ఉన్న ఆ ఇల్లు లేదు అనుకుంటే కళ్ళు చెమరుస్తాయి.

**ఉషశ్రీ ఉపన్యాసం**

**గంట అంటే గంటే**

**ఏభై తొమ్మిదీ కాదు, అరవై ఒకటీ కాదు**

**- పేరి కామేశ్వరరావు**

# పడుతూ లేస్తూ




ఆలమూరులో మిడిల్ స్కూలు అయ్యాక, హైస్కూలుకి నాన్న ఆలమూరు వదిలి రామచంద్రపురం వెళ్ళాల్సి వచ్చింది. అప్పటికింకా ఆలమూరులో హైస్కూలు రాలేదుట.

నాన్నకి ఆలమూరు వదిలి వెళ్ళడం ఇష్టం ఉండుండదు. దానికి తోడు మామ్మని వదిలిపెట్టి ఉండడం నాన్నకి మహాకష్టం అయ్యుంటుంది.

వారం చివర్లలో ఇంటికి రావల్సిన నాన్న – ఎప్పుడు వచ్చెయ్యాలని అనిపిస్తే అప్పుడు వచ్చేసేవారుట. ఒక్కో సారి తాత గుర్రం బండి మీద తీసికెళ్ళి  దింపి ఆయన పని మీద ఇంకో ఊరెళ్ళి సాయంత్రానికి తిరిగొచ్చేలోగా నాన్న ఇంట్లో ఉండేవారుట.

తాతగారు నాన్నని వెళ్ళమని అరవడం లేదు. నాన్న ఆయనతో వెళ్ళనని అనడం లేదు. ఆయన తీసికెళ్ళి దింపడం, నాన్న వచ్చెయ్యడం.

రామచంద్రపురం హైస్కూల్లో చదువుకునే రోజుల్లోనే  తెలుగు భాష మీద పట్టు సాధించారు నాన్న. అక్కడే నాన్న ప్రఖ్యాత వైయాకరణి వెంపరాల సూర్యనారాయణ గారి దగ్గర శిష్యరికం చేసారు. ఆయన దగ్గరే చిన్నయ్య సూరిని అధ్యయనం చేసారు.

ఏం సూరి ఆ చిన్నయ్య? బాలవ్యాకరణం – వ్యాకరణంగా కాదు – ఒక గద్య కావ్యంలా అందించారు. ఒక్కో సంధి సూత్రం ఒక్కో చిన్ని పద్యంలా వినిపిస్తుంది. ఎన్నేళ్ళైనా నోటికి అలవోకగా వచ్చేస్తుంది. ఇంక నీతి చంద్రికలోని భాష గురించి చెప్పేదేముంది?

నాన్న వెంపరాలవారి దగ్గరే బాలవ్యాకరణం, నీతిచంద్రికా చదువుకున్నారు.  అప్పుడే –  భాష మీద మోహం పెంచుకున్నానని చెప్పేవారు నాన్న.  పెద్ద పెద్ద సమాసాలతో మాట్లాడ్డం అలవాటు చేసుకున్నారు.



రామచంద్రపురంలో హైస్కూలు చదువు పూర్తి చేసాక – 1947–48 లో అనుకుంటా – ఇంటరుకి భీమవరం కాలేజీలో చేరారు.

అక్కడ మొదటి సంవత్సరం అయ్యాక – కారణం నాకు సరిగ్గా తెలియదు కానీ – కాలేజీ నుండి నాన్నని పంపించేసారు.

అప్పుడు ఇంటరు చదవడానికి కాకినాడ పీ ఆర్ కాలేజీలో చేరారు.

అక్కడ మొదలైంది నాన్న పరీక్షలు వరసగా తప్పడం. రెండేళ్లలో పూర్తవాల్సిన చదువు ఆరేళ్ళు సాగింది. నాన్నకి కాలేజీ చదువుల మీదా, పరీక్షల మీదా శ్రద్ధే కలగలేదు. ధ్యాసంతా సాహిత్యం మీదే.

పత్రికలకి కథలూ వ్యాసాలూ రాయసాగారు. తరుణసాహితీసమితిని పెంచి పెద్దచేసారు. సాహితీ మిత్రుల్ని చేరదీసి సభలూ సమావేశాలూ నిర్వహించారు. కాకినాడలో అంగర లాడ్జిని లిటరరీ హంగర్ లాడ్జిగా మార్చేసారని రాసారొకచోట సత్యం మావయ్య.

ఒకపక్క సాహిత్యంలో పైకి ఎదుగుతున్నా – మరోపక్క ఇంటర్ చదువు మాత్రం కుంటుతోంది.

తాత పట్టు వదల్లేదు. ఆయనకి నాన్న ఎలాగైనా డిగ్రీ సంపాదించుకుని ఉద్యోగంలో చేరాలన్న కోరిక బలంగా ఉండేది. పట్టుపట్టి పంపిస్తూనే ఉన్నారు. పరీక్షల ఫీజులకి డబ్బు ఇస్తూనే ఉండేవారు.

కొన్ని సార్లు పరీక్ష ఫీజు కట్టేవారే కాదుట నాన్న. ఆ ఫీజుని ఎవరో కుర్రాళ్ళకి ఇచ్చేసేవారుట. కొన్ని సార్లు ఫీజు కట్టినా పరీక్ష రాసేవారు కాదుట. ఎప్పుడైనా తప్పక రాయాల్సి వచ్చినా చదివే వారు కాదుట. ఫలితం తెలిసిందే.

అదంతా భరించారు తాత.

ఇవన్నీ నాకై నాకు తెలిసిన విషయాలు కావు. నాన్న గురించి విన్నవి. విన్నప్పుడు నాన్నెందుకలా ఉండేవారని అనిపించేది. ఐతే ఈ రోజు అదేం చిన్నతనంగా అనిపించడంలేదు. కొందరు కొన్నింటికోసం పుడతారు. నాన్న డిగ్రీలకోసం పుట్టలేదు. సాహిత్యం కోసం పుట్టారు. అటువంటి నాన్నని తీసికెళ్ళి చదువు చట్రంలో పెడితే అందులో ఇమడగలరా?

స్కూళ్ళకీ, కాలేజీలకీ కట్టుబడే మనిషి కాదు నాన్న. క్లాసులకి వెళ్ళడం, పరీక్షలకి చదవడం నాన్నకి కుదిరే పనులు కావు.

పరీక్షల రిజల్టొస్తుందని ఇంట్లో వాళ్ళు ఎదురు చూస్తోంటే – నాన్న ఈసారీ గొరిగేసిందని నవ్వుకుంటూ ఇంటికి వచ్చేవారుట. అత్త చెప్పేది. నాన్న నవ్వుని నేను ఊహించుకోగలను. లోకం పట్టని నవ్వు. లోకం నవ్వుతుందన్న బెంగే లేని అమాయకపు నవ్వు. తాత అసలు ఏమీ అనేవారే కాదుట. మామ్మ ఏడ్చేదిట.

చివరికి తాత పట్టుదలే గెల్చింది. కొన్నేళ్ళయ్యాక నాన్నకి విసుగెత్తిందో – నాన్నలో మార్పొచ్చిందో – ఫీజు కట్టి, సరిగ్గా చదువుకుని, బాగా పరీక్ష రాసి, ఇంటర్ పాసయ్యారు. పరీక్షలో గెలిచి, తాత సహనం ముందు ఓడిపోయారు.





తాత అంత పట్టుపట్టి నాన్నని చదివించడం వల్లే వాడికి రేడియోలో ఉద్యోగం వచ్చింది – అదే వాడి జీవితానికి అన్ని రకాలుగానూ మంచి చేసింది – అని అత్త అంటూ ఉండేది.

ఎవరి జీవితం ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పడం కష్టం. ఎవరివల్ల, ఎందువల్ల జీవితం ఎత్తులకి ఎగురుతుందో లోతులకి దిగుతుందో తెలియదు. ఐతే ఏం జరిగినా కార్యకారణాలని వెతుక్కోడం మానవసహజం. అలా వెతుకుతూ పోతే – అత్త చెప్పింది నిజం. ఉద్యోగమే లేకపోతే – అదీ రేడియో ఉద్యోగం కాకపోతే నాన్న జీవితం ఎలా ఉండేదో.

నాన్న విజయానికి కారణాలు చూస్తే – అందులో తాత పేరు తప్పకుండా ఉండాలి. నాన్నకి నాన్న గానే కాదు. నాన్నని పట్టభద్రుణ్ణి చేసిన పట్టుదల మనిషిగా.

ఆయనపరంగా చూస్తే – ఆయన ఎంత బాధపడి ఉంటారో. కొడుకు ప్రయోజకుడు కావాలని కన్నతండ్రి ఎంత తాపత్రయపడతాడో. ఆయన అదంతా పడుంటారు. ఆయన కళ్ళెదురుగా కొడుకు జీవితాన్ని పాడు చేసుకుంటున్నాడేమో అని ఎంత మథనపడుంటారో. ఐనా తను అనుకున్నది వదల్లేదు.

నాన్నంత మొండిగా ఉంటోంటే తాత నాన్నని కొట్టలేదా అని అడిగితే – కొట్టడం కాదు తిట్టను కూడా తిట్ట లేదు – మాట్లాడేవారు కాదంతే – అని అనేది అత్త. అని ఆయన నాన్నని కొట్టింది ఒక్కసారే. అది చదువు గురించి కాదు అని నాన్న గురించి ఓ కథ చెప్పేది.

చదువుతున్న రోజుల్లో నాన్న సిగరెట్టు కాలుస్తున్నట్లు ఎవరో తాతకి చెప్పారుట. ఇంటికొచ్చి సిగరెట్లు కాలుస్తున్నావా అని తాత అడిగారుట. ఎవడు చెప్పాడు? అని అడిగారుట నాన్న. అప్పుడు కోపం పట్టలేక ఉయ్యాలకి వేసే గొలుసుతో కొట్టారుట నాన్నని.

తర్వాత ఎందుకు కొట్టానో చెప్తూ – వాడు చదవనందుకు వాణ్ణి ఏమీ అనడంలేదు. సిగరెట్లు కాలుస్తున్నావా అని అడిగినప్పుడు కూడా విషయం తెలుసుకుని కాలుస్తోంటే మానెయ్యమని మందలిద్దామనే అడిగాను. కానీ వాడు ఎవడు చెప్పాడు అని చెప్పినవారిని అవమానించాడు. ఆ చెప్పిన ఆయన ఎంత పెద్దమనిషో వాడికి తెలుసా? అని అన్నారుట.

అప్పటికే నాన్నకి విశ్వనాథ సత్యనారాయణ గారి అనుకరణగా మాటలో పెళుసు అలవడిందేమో

అయితే నాకు తెలిసిన దగ్గర నుండీ నాన్న, వాళ్ళ నాన్న ముందు నిలబడి మాట్లాడేవారు కాదు, ఆయన ముందు సిగరెట్టు కాల్చేవారూ కాదు.

**ఇరవై ఏళ్ళనుండీ ఇప్పుడున్నట్లే ఉంటున్నాడాయన.**
**పరుగు నడకలో ప్రతిఫలించే భావనైశిత్యం.**
**దారుణాఖండల శస్త్రతుల్యం అనిపించే మాట తీరు.**
**శషభిషలెరుగని వ్యగ్ర మనస్తత్వం"**
**- కొండముది శ్రీరామచంద్రమూర్తి**



# పరుగందుకున్నారు




ఇంటర్ పూర్తయ్యాక – 1954 లోనేమో – నాన్న డిగ్రీకి భీమవరం కాలేజీలో చేరారు. ఏ భీమవరం కాలేజీ ఐతే నాన్నని ఇంటర్లో భరించలేనని పంపించేసిందో – అదే కాలేజీ నాన్నకి ఎర్రతివాసీతో స్వాగతం పలికింది.

నాన్న కోసమే ఆ కాలేజీలో – తెలుగు సాహిత్యంలో బీయేని ప్రారంభించారుట – నండూరి రామకృష్ణమాచార్యులు గారు.

భీమవరం కాలేజీలో నాన్నకి ఆయన గురువులు. ఆయనతో పాటే దిగుమర్తి సీతారామస్వామి గారు.

అలాంటి గురువుల్ని పొందడం ఎంత అదృష్టం నాన్నకి? ఐతే ఇక్కడో సంగతి చెప్పుకోవాలి. ఏ గురువుకైనా చాలా మంది శిష్యులు ఉంటారు. అందులో కొందరే గురువులు ప్రసాదించింది స్వీకరించ గలుగుతారు. అది నాన్న చెయ్యగలిగారు. నండూరి రామకృష్ణమాచార్యులు గారు నాన్న గురించి రాస్తూ ఈ విషయం ప్రస్తావించారు. ఆయన నాన్నలో ముత్తెపు చిప్ప ఉందని అన్నారు. గురువులు కురిపించిన స్వాతి చినుకులు నాన్నలో ఉన్న చిప్పలో పడి సాహిత్యపు ముత్యాలయ్యాయని అన్నారు.

ఈ సందర్భంలో నాకు నండూరి వారు రాసిన శీర్ణమేఖల గుర్తొస్తోంది. ఎంత అందమైన కల్పన అది?

దుర్యోధనుడు లేని సమయంలో దుర్యోధనుడి శయ్యామందిరానికి కర్ణుడు వస్తాడు. దుర్యోధనుడి పట్టమహిషి భానుమతి దుర్యోధనుడు త్వరలోనే వస్తాడని కర్ణుడికి చెప్తుంది. కర్ణుడు అక్కడే కూచుని భానుమతితో చదరంగం ఆడుతూ ఉంటాడు. ఆట సాగుతుండగా దుర్యోధనుడు వస్తాడు. దుర్యోధనుడిని చూసి భానుమతి లేస్తుంది. ఆట మధ్యలో మానేసి లేచేస్తోందేమో అనుకుని కర్ణుడు భానుమతిని ఆగమంటూ కొంగు పట్టుకుంటాడు. కర్ణుడి చేతి నుండి కొంగుని విడిపించుకునే ప్రయత్నంలో మేఖల జారిపోయి మణులు నేలకు రాలుతాయి. అప్పుడు దుర్యోధనుడు నేలమీద పడిన వాటిని ఏరి భానుమతికి ఇస్తాడు. ఇచ్చి కర్ణుడు తెలియక చేసిన తప్పిదాన్ని





మన్నించమని భానుమతిని అర్థిస్తాడు. భానుమతి చిర్నవ్వితే – ఆనందంతో కర్ణుణ్ణి తీసుకుని సౌధాగ్రానికి వెళ్తాడు దుర్యోధనుడు.

దుర్యోధనుడికి మిత్రుడి మీద ఉండే నమ్మకాన్ని చెప్పడానికి ఇంతకన్న గొప్ప కథ ఎక్కడ దొరుకుతుంది? ఇంతకీ ఇది భారతంలో లేని కథ. నందూరి వారి స్వయంకల్పితం.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే – అలాంటి అద్భుతమైన పద్యఖండికని రాసిన నందూరి వారికి భీమవరం కాలేజీలో శిష్యులు మా నాన్న. కథలు అల్లడం  రాకుండా పోతుందా మరి?

భీమవరం కాలేజీలోనే వీరభద్రాచారిగారితో కలిసి రాగహృదయం నృత్యనాటిక – ఆ కాలేజీలో ప్రదర్శనకోసమే రాసారు. ఆచారి–ఉషశ్రీ జంట రచనలకి అక్కడే నాంది. ఆ తర్వాత వారిద్దరూ కలిసి వేంకటేశ్వర కళ్యాణం నృత్యనాటికని రాసారు.

అక్కడి ప్రదర్శనకే పెళ్ళికొడుకులు నాటిక కూడా రాసారు. ఆ ప్రక్రియకి అక్కడే శ్రీకారం చుట్టారు కానీ, ఆ తర్వాత నాటికలు ఏంరాసినట్లు లేదు.

అలాగే ఆ కాలేజీలో ఉండగానే నాటకంలో వేషం కూడా వేసారు. బెల్లంకొండ రామదాసుగారిరాసిన పునర్జన్మ నాటకంలో తండ్రి పాత్రలో నటించారు. బహుమతి కూడా అందుకున్నారు. ఆ తర్వాత ఎప్పుడూ నాటకాల్లో వేసినట్లులేదు.

పెద్దయ్యాక  సినిమాల్లో కనబడాలనే సరదా కాస్త ఉండేది నాన్నకి. విజయవాడ నుండి మద్రాసు వెళ్ళిన దర్శకులు ఎవరైనా వేషానికి పిలుస్తారేమో అని అనేవారు. నాన్నని  సినిమాలో వేషం వెయ్యమని అడగడానికి భయం మొహమాటం ఉండుంటాయి కదా ఎవరికైనా. గురువుగారిని సినిమాల్లో వేషం వేస్తారా అని ఎలా అడుగుతారు? ఏమైనా ఆ సరదా పూర్తిగా తీరనే లేదు నాన్నకి.

పూర్తిగా అని ఎందుకు అంటున్నానంటే – నాన్న వెండి తెరమీద కనిపించలేదు కానీ వినిపించారు. మహాత్ముడు పుట్టిన దేశం అనే డాక్యుమెంటరీకి నాన్న చేత వ్యాఖ్యానం చెప్పించుకున్నారు. ఇప్పుడు ఆ డాక్యుమెంటరీ ఎక్కడ దొరుకుతుందో తెలియదు.

వెండితెర సరదా తీరలేదు కానీ,  బుల్లి తెరమీద కనిపించారు. మద్రాసు దూరదర్శన్ వాళ్ళు నాన్న చేత ధర్మసందేహాలు కార్యక్రమాన్ని చేయించి ప్రసారం చేసారు. అందులో ప్రశ్నలు అడిగింది – పేరాల లక్ష్మణరావు గారు.  అలాగే హైదరాబాదు దూరదర్శన్ వాళ్ళూ అలాంటి కార్యక్రమం చేసారు. అందులో సందేహాలు అడిగింది విశ్వనాథ పావనశాస్త్రి గారు.

ఆరోజుల్లో దూరదర్శన్ తప్ప ఇంకేం ఛానెళ్ళూ ఉండేవి కావు. దూరదర్శన్‌లో కూడా ప్రాంతీయ కార్యక్రమాలు రోజులో కొన్ని గంటలు మాత్రమే ఉండేవి.  అప్పటికి ఈ చానెల్స్  వచ్చి ఉంటే – రేడియో తోపాటు – టీవీని కూడా పాలించేవారు నాన్న. అనితర సాధ్యమయిన ఆ ఉపన్యాస శైలి ఆకట్టుకోనిదెవర్ని?

ఇంతకీ ఇదంతా భీమవరం కాలేజీలో నాన్న నాటకం దగ్గర మొదలైంది. భీమవరం కాలేజీ నుండే  బీయే డిగ్రీ వచ్చింది. అది ఇంటర్లా దండయాత్ర డిగ్రీ కాదు. ఏకధాటిగా ఉతీర్ణుడైన డిగ్రీ.



భీమవరం కాలేజీ నాన్న జీవిత గమనాన్ని మార్చేసింది. మనుషులందరికీ ఒక్కో సమయం ఒక్కో ప్రదేశం అచ్చొస్తాయి. నాన్నకి భీమవరం కాలేజీ అలా అయింది. అక్కడే నాన్నని అర్థం చేసుకోగల గురువులు దొరికారు. "వాళ్ళ చేతుల్లోనే నేను ఉషశ్రీ గా మలచబడ్డాను "అని నాన్న ఎన్నో సార్లు గుర్తు చేసుకునేవారు. నాన్న జీవితంలో భీమవరం కాలేజీకి ముందూ తర్వాతా అని రెండు భాగాలు ఉన్నాయి. ముందు భాగం ఉద్యోగం. తర్వాత భాగం విజయం.

ఇంతకీ – నాన్న కాలేజీకి పేంటూ చొక్కా వేసుకున్నారో, పైజామా లాల్చీ వేసుకున్నారో, పంచ కట్టుకుని పైన కండువానో లాల్చీనో వేసుకున్నారో – నా ఊహకందడం లేదు.

ఐతే భీమవరం కాలేజీలో చదువుతున్నప్పటిదే అనుకుంటా – ఒక ఫొటో ఉంది. అది నాన్నకి ఉత్తమ విద్యార్థి అవార్డు ఇచ్చినప్పటి ఫొటో. అందులో నాన్నని చూస్తుంటే ఇది నాన్నేనా అనిపిస్తుంది.

భీమవరం కాలేజీ చదువయ్యాక కొన్నాళ్ళు రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో ట్యూటర్ గా పని చేసారు నాన్న.

అప్పుడే మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారి ఆధ్వర్యంలో నాన్న తన స్నేహితులతో కలసి రాజమండ్రిలో సాహిత్య గౌతమి అనే సంస్థను నడిపారు.


ఆ కాలంలోనే తాత నడిపిన భరద్వాజ ప్రెస్సు పనులు చూసుకునేవారు నాన్న. తాత తలపెట్టిన వ్యాసభారతాన్ని తెలుగులో ప్రచురించే పెద్ద కార్యక్రమానికి వెనక సాయంగా ఉన్నారు.

అప్పటి నాన్న అడ్రెస్ రాజమండ్రిలో గోదావరి స్టేషన్ దగ్గరే ఉన్న విక్రమహాలు అనుకుంటా. నా చిన్నప్పుడు కొన్నాళ్ళు అక్కడ మా తాత ప్రెస్ పనులు అవుతూ ఉండేవి. ఇప్పుడు అక్కడ ఏముందో?

అక్కడ నుండి నాన్న నెమ్మదిగా హైదరాబాదు చేరుకున్నారు.

**ఉషశ్రీ ఉద్యోగం చేస్తూ ఎప్పుడూ తలవంచలేదు.**
**అన్యాయంతో పొత్తు గలపలేదు.**
**విజయవాడ రేడియోలో ఆయన చేరాక**
**క్రమంగా ఆయన వ్యక్తిత్వంలో వక్త, ప్రవక్త లక్షణాలు విచ్చుకున్నాయి.**
**రేడియో కార్యక్రమాలకు రంగూ, రుచీ, వాసనా వచ్చాయి.**
**- కోవెల సుప్రసన్నాచార్య**

# తరుణసాహితి




ఓ పక్క ఇంటరు చదువుని సాగదీస్తూ – మరోపక్క సాహితీ అధ్యయనం సాగించారు నాన్న .

చదువుకి రామచంద్రపురం, కాకినాడ, భీమవరాలకి వెళ్తున్నా – సాహితీ కార్యక్రమాలకి కేంద్రబిందువు ఆలమూరే.

ఆలమూరు ఇంటి అరుగులూ, గదులూ నాన్న సాహిత్య వ్యాసంగానికి మల్లె పందిర్లయాయి. ఊళ్ళోని లైబ్రరీ నాన్న సాహితీ పిపాస తీర్చే అమృత కలశంగా మారింది. పుస్తకాలే నాన్నలో నిరతంరం జ్వలించే సాహిత్య జ్వాలని వెలిగించిన చెకుముకి రాళ్ళయ్యాయి.

ఆ ఊరి నాగుల చెరువు గట్టు మీదున్న అరుగుల మీదే నాన్నా, సత్యం మావయ్యా (పోలాప్రగడ సత్యనారాయణ) కనకాల బాబయ్యా (కనక్ ప్రవాస్) కలిసి తరుణ సాహితీ సమితికి అంకురార్పణ చేసారు.

ఆ ఆలోచన ఎన్నాళ్ళు – ఇంటి అరుగుల మీదో, గదుల్లోనో, గుళ్ళ ఆవరణల్లోనో, చెరువుల ఒడ్డునో – వారిలో రగిలి రగిలి – చివరికి కార్యరూపం దాల్చిందో.

నాన్నా, సత్యం మావయ్యా, కనకాల బాబయ్యా – ముగ్గురూ అప్పటికి పదిహేను ఇరవై ఏళ్ళ మధ్య వయస్సులో ఉన్నారు. సాహిత్య మథనం చేస్తూ, రచనలు చేస్తూ – ఒకరికొకరు తోడుగా ఎదిగారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో కుటుంబ నేపథ్యం. ఒక్కొక్కరిదీ ఒక్కో మనస్తత్వం. ఒక్కొక్కరికీ ఒక్కో విషయంలో పట్టూ పట్టుదలా. ఆ ముగ్గురి ఆలోచనకి కార్యరూపమే తరుణసాహితీసమితి.

1948 లో విజయదశమి నాడు పుట్టింది వారి సాహితీసమితి.

1998 లో – సమితి స్వర్ణోత్సవం జరిగింది. అప్పటికి నాన్న లేరు. అందరూ నాన్నని తల్చుకున్నవాళ్ళే. ఆ సందర్భంలో తీసుకు వచ్చిన ప్రత్యేక సంచికలో సత్యం మావయ్య నాన్న గురించి రాస్తూ – ఉషశ్రీ ఉత్సాహ ఉద్వేగాలతో ఉద్యమస్ఫూర్తితో ముందుకు ఉరికే ఒక ఆవేశ తరంగం అని రాసారు. నాన్న ఉద్యమస్ఫూర్తే సమితిని ముందుకు నడిపించి ఉంటుంది.



ఇప్పుడు పెద్ద పెద్ద కంపెనీలు నడుపుతున్న చాలా మంది చిన్నపిల్లల్ని చూస్తే ఆశ్చర్యమనిపిస్తుంది కానీ – దాదాపు ఆరు దశాబ్దాల క్రితం, తన చిన్నతనంలోనే ఒక పెద్ద కార్యక్రమాన్ని మొదలెట్టారు నాన్న. తరుణ సాహితీ సమితికి పెద్ద అండగా ఊళ్ళోని పెద్దల సాయం సంపాదించారు. అందులో తాత పురాణపండ రామ్మూర్తీ, ఊరి పెద్ద నరసింహదేవర సత్యనారాయణ గారూ ఉన్నారు.

ఆ తర్వాత కొన్ని నెలలకే – ఈ ముగ్గురితో సుబ్బామయ్యా (చిర్రావూరి సుబ్రహ్మణ్యం గారు), తల్లాప్రగడ సుబ్బారావు గారూ చేరారు.

సమితి కార్యక్రమాల్లో భాగంగా సాహిత్యంలో దిగ్గజాలైన వాళ్ళనెందరినో ఆలమూరు తీసుకు వచ్చారు. పండగ వచ్చిందంటే చాలు – జనార్దనస్వామి గుడిలో ప్రముఖుల ఉపన్యాసం పెట్టేవారు. జమ్ములమడక, నండూరి, ఇంద్రగంటి, వేదుల, మధునాపంతుల, పురిపండా – ఎందరెందరో మహాకవుల్ని ఆలమూరికి రప్పించారు.

తరుణసాహితి ఆధ్వర్యంలోనే విశ్వశ్రీ పత్రికని నడిపారు. అందులో భాగంగానే విశ్వనాథ ప్రత్యేక సంచిక ఒకటి తీసుకు వచ్చారు. వీటన్నిటి వెనకా ఉషశ్రీ ఉత్సాహోద్వేగాలే ఎక్కువగా ఉన్నాయని నాన్న మిత్రులు చెప్పేవారు.

విశ్వనాథ సత్యనారాయణ గారిని పిచ్చిగా అభిమానించారు నాన్న. ఆ విషయం తర్వాత మేం విజయవాడలో ఉన్న రోజుల్లో నేను స్వయంగా చూసాను. ఆయన మీద అభిమానంతోనే ఆయన ప్రత్యేక సంచిక వెయ్యడమే కాకుండా దాన్ని నలుగురిలోకీ తీసికెళ్ళడానికి ఆంధ్రదేశమంతా తిరిగారని అంటారు నాన్న మిత్రులు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఒకసారి ఆరెమ్ చల్లా గారు నాన్న గురించి రాసిన వ్యాసంలో ఉషశ్రీ ఆ సంచికనీ, విశ్వనాథనీ భుజాల మీదెత్తుకుని ఊరూరా తిరిగారని రాసారు.

దానికి అయిన ఖర్చుకి నాన్నే స్వయంగా డబ్బు పెట్టారుట. నాన్న దగ్గర డబ్బెక్కడిది? తాతకి తెలియకుండా – మామ్మ తన నగలు తాకట్టు పెట్టి ఇచ్చిన డబ్బుతో – పుస్తకం అచ్చేసార్ట. ఆ పుస్తకం వేసి ఆర్థికపరంగా చేదు అనుభవం మిగుల్చుకున్నారని కే కే రామానుజాచార్యులు గారు అంటూండేవారు.

తనకి నచ్చి ఏ పనైనా చేయ్యాలనుకుంటే ముందువెనకలు చూసేవారు కాదుట నాన్న.

విశ్వనాథ సత్యనారాయణ గారి మీద నాన్నకున్న అభిమానం, తన దగ్గర లేని సొమ్ము గురించి ఆలోచించకుండా ప్రత్యేక సంచిక వేసేలా చేసింది. అలా చేసేసే మనస్సుంది కాబట్టే ఎన్నో ఎన్నెన్నో పనులు చెయ్యగలిగారు. ఇది నేను చెయ్యగలనా లేదా అని ఆలోచించుకుంటూ కూచుని ఉంటే ఎలాగుండేవారో. ఇలా మాత్రం కాదు. విశ్వనాథ సత్యనారాయణ గారిని ఎంత అభిమానించారో, శ్రీశ్రీనీ, కృష్ణశాస్త్రినీ – అంతే అభిమానించారు.

కవులనెంత అధ్యయనం చేసారో, కథకులనీ అంతగానే మథించారు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి గార్ల కథలు పాఠాల్లా చదివారు.

చదివినవి మళ్ళీ మళ్ళీ నెమరు వేసుకోడం, స్నేహితులతో ముచ్చటించుకోడంతో – అవన్నీ నాన్నలో ఇంకిపోయాయి. ఎప్పుడు ఏది కావల్సి వస్తే అది సునాయాసంగా పైకి వచ్చేసేది.ఏది మాట్లాడినా, రాసినా – తరగని రత్నాల గని నాన్న అధీనంలోకి వచ్చేసింది. కాదు శోధించి సాధించుకున్నారు నాన్న.





ఇవన్నీ సాధించడానికి తరుణసాహితీసమితి సాయపడింది. సమితిని స్థాపించిన ముగ్గురికీ తర్వాత వారి జీవితాలలో చేసిన పనులకి పునాదిగా నిలిచింది.

కనకాల బాబయ్య కనక్ ప్రవాసిగా రచనలు చేసారు. తరుణ సాహితి పేరున రెండు కథా సంకలనాలు వేసారు. అవి వేసిన చాలా ఏళ్ళ తర్వాత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి చిన్న కథల మీద చేసిన సిద్ధాంత గ్రంధాన్ని కూడా తరుణసాహితి పేరనే ప్రచురించారు.

సత్యం మావయ్య చాలా రచనలు చేసారు. అందులో కొన్ని బహుమతులు పొందాయి. కొన్ని నవలలు సినిమాలుగా కూడా వచ్చాయి. మావయ్య నవలికలూ కథా సంపుటులూ సమితి పేరుమీదే ప్రచురించారు. మావయ్య శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి గారి రచనలు కూడా తరుణసాహితీ సమితి ప్రచురించింది.

ఇక నాన్న రచనలు సరే. నాన్న కళ్యాణి అన్న పేరుతో రాసిన పెళ్ళికొడుకులు సమితి మొదటి ప్రచురణ. ఆ తర్వాత కే.కే. రామానుజాచార్యులు గారు వేసిన నాన్న కథా సంకలనాలు మూడూ తరుణసాహితి పేరనే ప్రచురించారు. మా తాతగారు పురాణపండ రామ్మూర్తి గారి పుస్తకాలు రెండు సమితి పేరనే ప్రచురించారు.

పుస్తకాలు ప్రచురించడమే కాదు – కొన్ని కొత్త ప్రక్రియలకి నాంది పలికారు. తెలుగుదేశమంతా ప్రచలితమైన భువనవిజయ కార్యక్రమానికి రూపకల్పన చేసింది ఈ మిత్ర త్రయమే. దాని వెనక ఉన్న ఆలోచన అంతా నాన్నదే.

1954 లో చింతలూరు వారమ్మాయి వివాహానికి – ఒక ప్రత్యేకమైన కార్యక్రమంలా – విశ్వనాథ, ఇంద్రగంటి, వెంపరాల, శ్రీపాద వంటి ప్రముఖులతో భువనవిజయాన్ని తొలిసారిగా జనంలోకి తీసుకు వచ్చారు తరుణసాహితీసమితి సభ్యులుగా ఈ ముగ్గురూ.

కార్యక్రమాలన్నీ ఆలమూరు వేదికగా జరుగుతుండేవి. తరవాత ఒక్కొక్కరే వేరే ఊళ్ళకి వెళ్ళిపోయారు. ఐనా సమితి కార్యక్రమాలు జరుగుతూనే ఉండేవి – ఆలమూరులో కాకుండా – వీళ్ళు ఏ ఊళ్ళో ఉంటే అక్కడ.

ఆలమూరు లాంటి ఓ పల్లెటూళ్ళో పుట్టిన ఒక సాహిత్య సంస్థ – స్వర్ణోత్సవం జరుపుకుందంటే – దాని వెనక ఉన్న ఈ ముగ్గురే దానికి కారణం.

ఆ సమితీ, దానికి వీరు చేసిన పనులే – ముగ్గురికీ – జీవితాలలో పైకెళ్ళడానికి సోపానాలు అయ్యాయి.

ఓ సాదాసీదా సూర్యప్రకాశ దీక్షితులు – ఉషశ్రీ గా మారిన చరిత్రకి – తరుణసాహితీసమితి – ప్రత్యక్ష సాక్షి మాత్రమే కాదు – పరిపూర్ణ సహకారి కూడా.

నాన్న నాటిన మొక్కే నాన్నని పెంచింది.

**ఒకటి నిండైన గళం; రెండు విషయం పట్ల సమగ్రావగాహన;**
**మూడు భాషపై ఆధిపత్యం; నాలుగు నిష్పాక్షిక దృక్పథం.**
**ఈ సులక్షణాలన్నీ ఉషశ్రీలో పుష్కలంగా నిక్షిప్తమై ఉన్నాయి కనుకే,**
**అతడి కావ్య వ్యాఖ్యానాకర్షణ అకుంఠితమై నిలిచింది**

**- శ్రీపతి**



# అమ్మా నాన్నా



మా అమ్మకీ నాన్నకీ పెళ్ళైంది 1956 లో మే ఐదున. అంటే అప్పటికి నాన్న భీమవరం కాలేజీలో బీయే చదువుతూ ఉండి ఉంటారు. నాన్న చదువు పూర్తైంది 1957 లో.

నాన్న పెళ్ళైంది అమ్మ పుట్టిల్లైన పల్లెపాలెంలో.

ఏదీ భద్రంగా దాచుకోని మా నాన్న తన పెళ్ళి శుభలేఖ ఎంత భద్రంగా దాచుకున్నారో. ఆ శుభలేఖకి షష్టి పూర్తి అయింది. దాన్ని నాన్న ఎంత భద్రంగా ఉంచారో – మేమూ అలాగే ప్రేమగా, అమ్మానాన్నల ఇద్దరి గుర్తుగా దాచి ఉంచాం.

పెళ్ళిచూపులకి నాన్న వెళ్ళలేదుట – తాత వెళ్ళి అమ్మను చూసారుట – ఒకరి ఫొటోలు ఒకరు చూసుకున్నారో లేదో – పెళ్ళిచూపులు లేని పెళ్ళి వాళ్ళది – కానీ వాళ్ళిద్దరికీ పెళ్ళిచూపులని తల్చుకుంటే మాత్రం నవ్వుగా అనిపిస్తుంది. ఏ పిల్లలకైనా అలాగే ఉండచ్చు.

తాత అమ్మలో ఏం చూసి నాన్నకి ఆ సంబంధం ఖాయం చేసారో. అమ్మది మధునాపంతుల వారి కుటుంబం. ఆంధ్రపురాణం లాంటి కావ్యాలు రాసిన మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు అమ్మకి అన్నయ్య అవుతారు. పండిత కుటుంబం అని చూసారేమో తాత.

అమ్మ పేరు వ్యాస సత్యవతి. ఆ పేరంతా భారతమే. భారతాన్ని రాసిన వాడు వ్యాసుడు. భారత కథకి ఆద్యురాలు సత్యవతి. ఆ రెండూ కలగలసి వ్యాస సత్యవతి. అమ్మ పేరు నచ్చుండచ్చు .

అమ్మ పల్లెపాలెంలో సంగీతం నేర్చుకుంది. వాళ్ళక్కాచెల్లెళ్ళకి కర్నాటక సంగీతం వచ్చు. అమ్మ కీర్తనలూ, పెళ్ళిపాటలూ, జానపదగీతాలూ – వంటింట్లో పనిచేసుకుంటూ పాడుకుంటూ ఉండేది. మేం వింటూనే ఉండేవాళ్ళం. అమ్మ పాట నచ్చిందేమో తాతకి.

ఇద్దరిలోనూ మా అమ్మే అందంగా ఉంటుంది. అమ్మ బావుంటుందని ఒప్పుకున్నారేమో తాత. నేను ఇలా అంటోంటే, మా నాన్న నా పక్కనుంటే నవ్వుకునేవారు – హాయిగా, సంతోషంగా, ఆనందంగా.





తాత సంగతి సరే – పెళ్ళికి ముందూ, పెళ్ళైన కొత్తలో రాసిన కథల్లో – కొత్తగా పెళ్ళైన జంటల ముచ్చట్లూ, ఆలోచనలూ ఎక్కువగానే రాసారు నాన్న. పెళ్ళి గురించీ, కాబోయే శ్రీమతి గురించీ మనస్సులో ఏవో ఊహలు ఉండే ఉంటాయి నాన్నకి. అమ్మలో నాన్నకి ఏం నచ్చిందో!

అమ్మ పెళ్ళి గురించి ఏమనుకుని ఉంటుందో తెలియదు. ఆ రోజుల్లో ఆడపిల్లలకి మొగుళ్ళ గురించి ఎలాంటి ఆలోచనలుండేవో . వాళ్ళిద్దరికీ ఒకరికొకరికి కుదిరిందా లేదా అని నేనిప్పుడు ఆలోచించకూడదు.

నాన్న రచనలు చదివే ఆసక్తీ, చదివినా అర్థం చేసుకోగల శక్తీ ఆవిడకి లేవు. అది ఆకాలంలో చాలా మంది విషయంలో నిజమయ్యే ఉంటుంది. అప్పుడు ఆడపిల్లలకి చదువు చెప్పించేవారు కాదు.

అమ్మకి చదువు లేకపోవడమే కాదు – కాస్త లోకజ్ఞానం కూడా తక్కువే. అప్పటి పెద్దవాళ్ళ భాషలో చెప్పుకోవాలంటే కాస్త వెర్రిమాలోకం.

అమ్మ వెర్రితనం నాన్న పనికి అడ్డం రాలేదు. రాకుండా చూసుకున్నారు. అలా చూసుకోడం సామాన్యమైన విషయం కాదు. ఒక్కోసారి వెనక్కి తిరిగి చూసుకుంటే – తనకి పూర్తిగా సహకరించని నేపథ్యాన్ని పక్కన పెట్టి నాన్న అంతపని ఎలా చెయ్యగలిగారా అని ఆశ్చర్యం కలుగుతుంది.

ఓ రకంగా చూస్తే అమ్మ మేధస్సుకి అందనంత ఎత్తుకి ఎదిగారు. నాన్న అంత ఎత్తున ఉన్నారని అమ్మకి తెలియదు. ఎత్తంటే నా ఉద్దేశం నాన్నకొచ్చిన పేరుప్రతిష్ఠలు కావు. అవి ఆవిడకి తెలుసు. నాన్న నేర్చిన చదువూ, నాన్న చేసే ఆలోచనలూ, ఆయన చెప్పే విషయాలూ – వాటి ఎత్తు గురించి నేననేది.

ఐతే ఆ ఎత్తేం వారిని దూరం చెయ్యలేదు.

ఆలుమగలంటే హెచ్చుతగ్గులు పట్టించుకోకపోడం.

* * *

అమ్మ వెర్రిబాగులదేమో కానీ వెర్రిది కాదు. అమ్మకి సంగీతం అబ్బినట్లే వంట కూడా స్వతస్సిద్ధంగా అబ్బేసింది. పుట్టడమే గరిటెతో పుట్టినట్లుంటుంది అమ్మ.

ఎవరు ఎప్పుడు ఏం అడిగినా – అమ్మ చెయ్యడానికి సిద్ధంగానే ఉంటుంది.

ఎప్పుడైనా ఏవిషయంలోనైనాసరే అమ్మ గొడవపడుతూనో, అరుస్తూనో ఉన్నప్పుడు నాన్న – "వ్యాసీ, పిల్లలకి ఆకలేస్తోంది – ఏదయినా చేసిపెట్టు " అని అడిగితే, అమ్మ – వెలిగి ఆరే చిచ్చుబుడ్డిలా చల్లపడిపోయేది. ఆవిడ మనస్సులోంచి, మొహంలోంచి, కళ్ళలోంచి, మొత్తం ఆవిడలోంచి కోపం మాయమైపోయేది. నవ్వుతూ "మీకు కావాలని అడగచ్చు కదా – పిల్లల నెపం ఎందుకు?" అనేది.

నాన్న నవ్వుతునే – "నాకైతే నాక్కావాలని అడగనా ఏంటి? పిల్లలకే – వాళ్ళకి ఆకలేస్తోంది" అనే వారు. అప్పుడప్పుడూ అమ్మని గార్లు చెయ్యమని అడిగేవారు."గార్లకి మినప్పప్పు నానబెట్టాలి. ఇంకేదన్నా చేస్తా" అనే అమ్మతో – "మినప్పప్పు నానబెట్టావుగా – అదిగో ఆ గిన్నెలో చూడు" అని నాన్న అనేవారు.

"నేనా? నేను నానపెట్టలేదు. ఎవరు పెట్టారో" అని అనుకుంటూ రుబ్బడానికి కూచునేది అమ్మ. ఆ నానబెట్టింది తనేనని – ఆపని గుట్టుగా ముందే చేసేసానని – చెప్పేవారు కాదు నాన్న.చెప్పకపోయినా నాన



బెట్టింది నాన్నేనని ఆవిడకీ తెలుసు.

అసలు ఇంట్లో ఏ పని చేసినా ముందుగా ఎవ్వరితోనూ చెప్పి చేసేవారు కాదు. ఇంటి బయట అంత పేరు ప్రతిష్ఠలున్నా, అందరూ గురువుగారూ అంటున్నా, నాన్న మాటలు వినడానికి వేలాది జనం వస్తున్నా, అందులో చాలామంది సాష్టాంగాలు చేస్తున్నా – అవన్నీ ఇంటి బయటే ఉంచేసే వారు. ఆ పొగడ్తలని ఇంటి గుమ్మం దాటి లోనికి రానిచ్చేవారు కాదు. ఇంట్లో మామూలు భర్తగా, నాన్నగానే ఉండేవారు.

మా ఇంట్లో 1983 వరకూ గేసుపొయ్యి లేదు. ఉదయం లేచీ లేవగానే – ఇనప కుంపట్లో బొగ్గులు వేసి కుంపటి కింద కాయితాలు మంటపెట్టి విసనకర్రతో బొగ్గుల కుంపటి వెలిగించే పని నిత్యం మా నాన్నే చేస్తూ ఉండేవారు. విసనకర్రతో విసరడం కష్టంగా అనిపించి – తర్వాత తర్వాత కుంపటి వెలిగించడానికి విసనకర్ర కాకుండా టేబుల్ ఫేను వాడేవారు. అది నాన్న కనుక్కున్న సులభ పద్ధతి.

ఇంట్లో బాయిలర్ వెలిగించడం నాన్న పనే. తన చిన్నప్పుడు మామ్మకి వంటలో సాయం చేసేవారు నాన్న. అప్పుడు పొట్టు పొయ్యి కూరేవారుట. పొట్టుపొయ్యి కూరడానికి నేర్పూ ఓర్పూ ఉండాలి. అవి రెండూ నాన్నకి ఉన్నాయి. మనం మాట్లాడుకుంటున్న కుంపట్లూ, పొయ్యిలూ ఇప్పుడు విజయవాడలోనే కాదు – ఆలమూరు లోనూ, పల్లెపాలెంలోనూ కూడా ఉండి ఉండవు.

అమ్మ వండడమే కాదు – రుచిగా వండుతుంది. ఆ రుచి కూడా మామూలు రుచి కాదు. మాంచి రుచి.

ఇక్కడో సంగతి చెప్పుకుతీరాలి. వంట ఆవిడదే ఐనా వడ్డన మాత్రం నాన్నది. ఎవరి కంచంలో ఏముందో లేదో, ఎవరికి ఏం ఇష్టమో కాదో, ఎవరు ఎంత తినగలరో లేదో నాన్నకి తెలుసు. తెలుసంటే గమనించి తెలుసుకున్నారు. మా ఇంట్లో వాళ్ళ అలవాట్లే కాదు, మా ఇంటికి వచ్చిన అతిథుల అలవాట్లు కూడా నాన్నకి తెలుసు. అందరినీ చూసుకుంటూ వడ్డిస్తూ, వడ్డింపచేస్తూ తినేవారు నాన్న.

వడ్డిస్తూ, ఆ వంటకం గురించి వర్ణిస్తూ తినేవారు. మధునాపంతుల వారి అలవాటో ఏమో – మా అమ్మ చేసే పులుసుల్లో బెల్లం ఎప్పుడూ ఎక్కువగానే ఉండేది. గుమ్మడికాయ పులుసులో ఐతే మరీను. అది చూడగానే గుమ్మడికాయ హల్వా తినండి అని వడ్డించేవారు నాన్న. ఈ నాటికీ గుమ్మడి కాయ పులుసు తింటూంటే ఆమాటలు తల్చుకోకుండా తినడం మాకు సాధ్యం కాదు. పులుసుకి ఆ జ్ఞాపకాలతీపి చేరి మరీ రుచిగా ఉంటోంది.

ఇంట్లో పిల్లలెవ్వరికీ ఏసమయంలోనూ ఏమీ తినడానికి లేకపోవడంలేదు. ఏదో ఒకటి సిద్ధంగా ఉండేది. ఒకవేళ ఏకారణంగానో అమ్మ ఎప్పుడైనా ఏ స్వీటైనా హాటైనా మర్నాటికని దాస్తే – దాన్నీ వెతికి బయటకి తీసి మాకిచ్చేసేవారు నాన్న. ఆవిడ వెతికి చూసుకుని లేదేంటని అడిగితే నేను తినేసానని చెప్పేవారు. నాన్న తిన్లేదని ఆవిడకి తెలియదా? ఆవిడకి తెలుసునని నాన్నకి తెలియదా?

ఆలుమగలంటే – ఒకరినొకరు అర్థం చేసుకోడం.

* * *

తెలుగునాట ఆడపిల్లలచేత పెళ్ళికాక ముందే రుక్మిణీ కళ్యాణం పద్యాలు చదివిస్తారు. రుక్మిణీ కళ్యాణం చదివితే పెళ్ళవుతుందని నమ్మకం.





అమ్మ – పెళ్ళై కాపురానికి వచ్చాక – మామ్మ దగ్గరా, నాన్న దగ్గరా భాగవతం పద్యాలు నేర్చుకున్నానని చెప్పేది. మరి రుక్మిణీ కళ్యాణం పద్యాలు కూడా పెళ్ళి తర్వాతే నేర్చుకుందేమో.

ఏం పోతన్న– ఇన్ని వందల సంవత్సరాల తర్వాత కూడా ఆయన రాసిన – గజేంద్రమోక్షం, ప్రహ్లాదచరిత్ర, రుక్మిణీ కళ్యాణం, వామనావతారం, నరకాసురవధ పద్యాలు నేర్చుకుని చదువుకుంటూనే ఉన్నారు. ఆడియోలూ వీడియోలూ ఉంటాయని కూడా తెలియని కాలంలో – పద్యాలతో సినిమా చూపించాడాయన. అల వైకుంఠ పురంబులో అని లాంగ్ షాట్లో మొదలెట్టి కెమేరాని నెమ్మదినెమ్మదిగా లక్ష్మీదేవితో ఆడుకుంటున్న విష్ణుమూర్తి మీదకి జూం చేసి – అక్కడ నుండి మొసలిని చంపి ఏనుగుని కాపాడే వరకూ మన కళ్ళని విష్ణుమూర్తి తోనే పరిగెత్తించగల అద్భుతమైన పద్యస్క్రిప్టుని అందించాడు. ఆయన రాసిన పద్యం అని నమ్మలేక దేవుడే దిగివచ్చి పద్యం రాసి ఉంటాడని అనుకునేలా రాసాడు.

తెలుగు నేర్చుకోడం మానేస్తే తెలుగు జాతి పోగొట్టుకునే సంపదేంటో తెలుగు వాళ్ళకి అర్థం అవుతోందో లేదో. తరతరాలుగా – తల్లితండ్రుల నుండి పిల్లలకి అలవోకగా వచ్చేస్తున్న పద్యాలవి. మా అదృష్టం – మా అమ్మా నాన్న చదువుతున్న పద్యాలు వింటూ వింటూ పెరిగాం మేం.

అమ్మ స్కూల్లో పెద్దగా చదువుకోలేదు. పెళ్ళయ్యాకే ఇంగ్లీష్ అక్షరాలు నేర్చుకుంది. అదీ నాన్న దగ్గర. అమ్మ ఎప్పుడైనా మనీఆర్డర్లకోసమో, బేంకులకోసమో – సంతకం చెయ్యాల్సి వచ్చినప్పుడు పొడి అక్షరాలతోనే సంతకం చేస్తూ – మీ నాన్న నేర్పారే అమ్మాయీ – అని గర్వంగా ఆనందంగా చెప్పుకునేది. అలా అంటున్న అమ్మని చూస్తోంటే ముచ్చటేసేది.

మా అమ్మా నాన్నా మాతో ఆడ్డమే కాకుండా – విడిగా ఒకరితో ఒకరు ఆడుకునే వాళ్ళు. ముఖ్యంగా వాళ్ళిద్దరూ కారమ్స్ ఆడడం ఎప్పటికీ మర్చిపోలేం.

అమ్మైతే ఆట గెలిచి తీరాలని ఆడేది. సరదాగానే ఆడినా అందులో ఆ పట్టుదల తెలిసేది.

నాన్నకి ఆట ఆడ్డం సరదా. గెలిచి తీరాలన్న కోరికా, కసీ లేవు. హాయిగా ఆడేసే వారు.

నాన్న ఆట బావున్నట్లు అనిపించేది నాకు. ఆయన స్ట్రైకర్ని పట్టుకోడంలోని ఒడుపూ, దాన్ని వేలితో నెమ్మదిగా జారవిడుస్తున్న విడుపూ – ఇప్పటికీ కళ్ళకి కట్టినట్లు కనిపిస్తున్నాయి. ఐతే అమ్మే ఎక్కువసార్లు గెలిచేది.

ఆట ఆపడం గమ్మత్తుగా ఉండేది. మధ్యలో ఎప్పుడో నాన్న పనుండో, ఇంక చాలనిపించో లేచేసే వారు. "ఏంటీ గెలవడం లేదని లేచేస్తున్నారా?" అనేది అమ్మ. టీ అనో పకోడీ అనో అనేవారు నాన్న. అంతే. ఆవిడ వంటింట్లోకి వెళ్ళిపోయేది.

ఆలుమగలంటే సరదాగా ఆటలాడుకోడం.

* * *



అమ్మా నాన్నా సరదాగా ఆట్లాడుకోడం, మాట్లాడుకోడమే కాదు – అప్పుడప్పుడు పోట్లాడుకునే వారు కూడా. ఇద్దరి గొంతులూ పైకి లేచేవి. మాటల్లో సౌమ్యం పోయేది. పోట్లాడుకునే విషయం పెద్దది కాకపోయినా పోట్లాట పెద్దదిగా అనిపించేది. నాకైతే చాలా భయం వేసేది.

అమ్మ విసురుగా వంటింట్లోకీ, నాన్న కోపంగా వీధిలోకీ వెళ్ళిపోయేవారు. కొంతసేపయ్యాక ఇద్దరూ కలిసిపోయేవారు. అంతలా అరుచుకున్నది వీరేనా అని అనిపించేలా అయిపోయేవారు.

నాకు పెళ్ళై హైదరాబాదులో ఉండడం మొదలెట్టిన కొన్నె నెలలకే – అమ్మకి హార్ట్ అటాక్ వచ్చింది. హాస్పిటల్లో చేర్పించారు. నేనూ విజయవాడ వెళ్ళాను.

అప్పుడు నాన్న అమ్మకి చేసిన సేవ చూస్తే వీళ్ళేనా అంతలా కీచులాడుకున్న వాళ్లని అనిపించింది. నాన్నే సమయానికి మందులు ఇచ్చేవారు. పళ్ళరసాలు తాగించేవారు. ఇడ్లీలు తినిపించేవారు. ఇంటి పనంతా చెల్లెళ్లకి అప్పగించి – లోకమంతా ఆవిడే అన్నట్లు అమ్మతోనే ఉండిపోయారు.

ఆవిడకి కొంచెం తగ్గగానే – ఆవిడ అలవాటు కొద్దీ ఆవిడ వంటింట్లో పనిలోకి వెళ్ళిపోయింది. ఇద్దరూ అలవాటు కొద్దీ మళ్ళీ మామూలుగా దెబ్బలాట మొదలెట్టేసారు.

పూర్తి నమ్మకం, ప్రేమా ఉన్న చోటే – అరుచుకోడం, దెబ్బలాడుకోడం – ఉంటాయేమో. అలాంటి వాళ్ళకే – పోట్లాటల వల్ల అవతల వాళ్ళు మనల్ని ప్రేమించడం మానెయ్యరన్న ధైర్యం ఉంటుందేమో.

ఆలుమగలంటే హాయిగా కీచులాడుకోడం.

**విశ్వనాథ మీద విరుచుకుపడ్డ**

**మారీచ, సుబాహు, ఖర, దూషణ సంతానానికి**


**విశ్రాంతి లేని పని కల్పించారు ఉషశ్రీ**

**– కె.కె. రామానుజాచార్యులు**





# నాన్న ప్రకృతి



ఇంట్లో ఉన్నప్పుడల్లా ఉత్తి పంచెతోనే ఉండేవారు నాన్న. చొక్కాలూ, బనియన్లూ నాన్న ఒంటికి పడేవి కావు. ఆ పంచె కూడా పైకి మడతపెట్టి కట్టేసే వారు. ఒక్కో సారి అలానే వీధిలోకి కూడా వెళ్ళిపోయేవారు.

అలా ఉంటే గాలి బాగా తగులుతుందని అనిపించేది నాన్నకి. చల్ల గాలి తగిలితే చాలు చిన్నపిల్లాడిలా సంబరపడిపోయేవారు.

కొంచెం గాలి వీచడం మొదలెట్టగానే ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో అటూ ఇటూ తిరిగేస్తూ ఆహా, ఓహో ఏం గాలి అంటూ ఆనందించేవారు.

ఇంక ఆ గాలికి చినుకులు కూడా తోడయ్యాయా, నాన్న సంతోషానికి అవధులు ఉండేవి కావు.

అప్పుడు తన చిన్నప్పటి ఆలమూరు రోజులు గుర్తు తెచ్చుకుని, అక్కడ వేపచెట్టు గురించి చెప్పేవారు. ఎంతైనా ఆ వేపచెట్టు గాలి ఇక్కడ రాదనేవారు. ఆ ఊరి చెరువుగట్టు గురించి చెప్పేవారు. ఆనీళ్ళలో ఈదులాడ్డం గురించి చెబుతూండేవారు.

మా నాన్న ప్రకృతి మనిషి. మట్టీ, నీళ్ళూ, మొక్కలూ వాటితో ఎంత మమేకం అయిపోయేవారో.

ఇదంతా మేం సొంతిల్లు కట్టుకున్న తర్వాతే తెలిసింది. అద్దె ఇళ్ళలో ఉన్నన్నాళ్ళూ చుట్టూ నేల ఉన్న ఇళ్ళు ఎక్కడవి?

సొంతింటి ముందు ఖాళీ స్థలంలో ఎన్ని మొక్కలు వేసారో. పొద్దున్న లేస్తూనే మొక్కల దగ్గరకి వెళ్ళిపోయి, ఏ మొక్కకి మొగ్గేసిందో, ఏ మొగ్గ పువ్వైందో, ఏ పువ్వులోంచి పిందె వస్తోందో, ఏ పిందె కాయై పండవుతోందో చూస్తూ మురిసిపోయేవారు. లేత చిక్కుడుకాయలో, బెండకాయలో కనిపిస్తే – వాటిని ఆప్యాయంగా నిమురుతూండేవారు.



గేట్‌కి అటూ ఇటూ రెండు కొబ్బరి మొక్కలు వేయించారు. ఇంట్లో ఓ వేపచెట్టు కూడా వేయించారు, ఆలమూరు ఇంట్లో లాగ. వేపగాలి ఆరోగ్యం అంటూ ఉండేవారు. వేపుల్ల తోనే దంతధావనం. అదీ మొక్కల మధ్య తిరుగుతూనే. మొహం కడిగినా, కాళ్ళు కడిగినా – నీళ్ళు మొక్కల్లోకి పోవల్సిందే.

మనవరాల్ని చంకనేసుకుని ఇంటి చుట్టూ తిరిగేవారు. అది ఒక్కో పువ్వుని చూపిస్తూ "పువ్వా పువ్వా" అనేది. అది చూపించిన ప్రతి పువ్వు దగ్గరకీ దాన్ని తీసుకెళ్ళేవారు. ఎంత ఆహ్లాదకరమైన దృశ్యం. ఎలా మరిచిపోతాను అంతటి కమనీయమైన సంఘటనని.

గాలీ, నీరూ, నేలా, ఆకాశం, కొండా, కొమ్మా, పువ్వూ – అన్నీ నాన్నని గుర్తుకు తీసుకువస్తాయి. ఎందుకంటే అవన్నీ అంటే నాన్నకి చాలా ఇష్టం.

సాయంత్రం సూర్యాస్తమయం నుండి ఉదయం సూర్యోదయం వరకూ మా ఇంటి డాబా నాన్న సామ్రాజ్యం. దాని మీదే నడక. దాని మీదే పడక. ఆకాశంలో నక్షత్రాలు నాన్న నేస్తాలు. మా ఇంటికి ఓ పక్కనున్న కొండలు నాన్న స్నేహితులు.

నాన్న వెనకే మేమూ ఒకరొకరమే డాబా మీదకి చేరే వాళ్ళం. ఎన్ని నేర్చుకున్నాం నాన్న దగ్గర. నాన్న పాఠంలా చెప్పి కాదు. అలా నాన్న దగ్గర కూచుని, నాన్న పక్కన నడిచి.

ఎన్ని నేర్చుకున్నాం అన్న మాట నిజమే కానీ, ఎంత నేర్చుకుని ఉండాల్సింది. నాన్నని గురువు గారిగా ఆంధ్రదేశం అంతా గౌరవిస్తోంటే, ఇంట్లో ఆ వాసనే పడనియ్యలేదు నాన్న. మాకు నాన్నగానే ఉన్నారు. అది నాన్న గొప్పతనం. మేమూ ఆయనని మా నాన్న గానే అనుకున్నాం. అది మా అజ్ఞానం. ఐతే అందులో ఆనందం లేకపోలేదు కానీ చాలా నేర్చుకోలేకపోయామే అన్న విచారమూ ఉంది.

నాన్న దగ్గర నేర్చుకోవల్సినవి ఎన్నున్నాయి?

ఈ రోజు నేను అందరికీ ఆయుర్వేదంలో అనారోగ్యం రాకుండా ఉండేందుకు పాటించాల్సిన దినచర్యల గురించి చెప్పేవన్నీ నాన్న ఆనాడు పాటిస్తూనే ఉండేవారు. నాన్న ఆహార విహారాలు ప్రకృతి నియమానుసారం ఉండేవి.

మా ఇంట్లో దంపుడు బియ్యం అన్నమే తినేవాళ్ళం.

ప్రతిరోజూ ఉదయమే క్రమం తప్పకుండా వాకింగుకి వెళ్ళేవారు నాన్న. సరదాగా చేత్తో ఒక కఱ్ఱ తీసుకెళ్ళేవారు, ఆయనకి దాని అవసరం లేకపోయినా. అది వీధి కుక్కల్ని తరమడానికి ఉపయోగించేది.

రాగిచెంబులో రాత్రి నీళ్ళు పోసుకుని ఉంచుకుని ఉదయమే తాగేవారు.

రాగిచెంబంటే – రాగి కడియం గుర్తొస్తోంది. నాన్న భుజం నొప్పితో బాధ పడేవారు. ఆనొప్పి ఎందుకు వచ్చేదో తెలియదు కానీ – తన డైరీల్లో భుజం నొప్పి వల్ల ఈ రోజు ఏపనీ చెయ్యలేకపోయానని రాసుకున్న రోజులు చాలానే ఉన్నాయి. దేనికైనా డాక్టర్ దగ్గరకి వెళ్లిపోడం, మందులు వేసేసుకోడం – నాన్న వల్ల కాని పని. ఎవరో చెప్పారని – భుజం నొప్పి తగ్గడానికి – రాగి కడియం వేసుకోడం మొదలెట్టారు. అది బానే పని చేసింది కూడా. రాగి కడియం ప్రయోజనాల గురించి ధర్మసందేహాలలోనూ, ఇతరత్రాకూడా నాన్న చెప్పేవారు. అవసరానికి

కొందరూ, అందానికి కొందరూ రాగి కడియాలు వాడడం మొదలెట్టారు ఆ రోజుల్లో. రాగి కడియం ఓ ట్రెండ్ గా మారింది అప్పట్లో.

నాన్నకి చిన్నప్పట్నుంచీ వచ్చిన అలవాట్లు – వారానికోసారి చెవిలో నూనె పోసుకోడం, మూణ్ణెల్లకోసారి కడుపులో ఆముదం పోసుకోడం. మా చిన్నప్పుడు మాకూ అలవాటు చేసారు.

నాన్న అలవాట్లు చాలా వరకూ ప్రకృతికి దగ్గరగానే ఉండేవి.

* * *

ప్రకృతికి దగ్గరై పోవడం నాన్న నైజం. అలాగే మనుషుల్ని దగ్గరగా చేర్చుకోడం నాన్న ప్రకృతి.

చిన్నప్పుడు ఆలమూరులో కలిసి పెరిగిన సత్యం మావయ్యా, కనకాల బాబయ్యా, నాన్నా– ఎంత పెద్దై, ఏం పనులు చేస్తున్నా – కలుస్తూనే ఉండేవారు. సుబ్బామవయ్య (చిర్రావూరి సుబ్రహ్మణ్యం గారు) ఐతే చెప్పనే అక్కర్లేదు. మేం విజయవాడకి వెళ్ళిన కొత్తలో – కొన్ని నెలలు ఆయన ఇంట్లోనే ఉన్నాం. ఆయన మా ఇంటికి వస్తూనే ఉండేవారు.

భీమవరం కాలేజీ రోజుల్లో నాన్నతో జతకట్టిన – కే కే రామానుజాచార్యులు గారిదీ, నాన్నదీ ఎంత గాఢమైన బంధమో! అరవైలలో నాన్న కథాసంకలనాలు వెయ్యడమైనా, ఎనభైలలో నా పెళ్ళి పనుల్లో సాయం చెయ్యడమైనా, నాన్న రిటైరయ్యాక వచ్చిన డబ్బుని బేంకుల్లో పెట్టించడమైనా – అన్నీ ఆయన సొంత పనుల్లా చేసారు.

నాన్న తన కష్టాలనీ, బాధలనీ – అన్నింటినీ ఆయనకి రాసుకునే వారు. అలానే ఆనందాలని కూడా ఆయనతో పంచుకునే వారు. నాన్న అరవైలలో ఆయనకి రాసిన ఉత్తరాలని దశాబ్దాల పాటు అలా భద్రంగా దాచుకున్నారు ఆచార్యులు గారు. అందులో కొన్ని నాన్న జ్ఞాపకంగా మాకు ఇచ్చారు. ఆ అనుబంధం అపూర్వం.

జీవితంలో ధనాన్ని పెద్దగా సంపాదించుకోలేదు కానీ ముఖ్యమైనవాటిని మూడింటిని సాధించుకున్నారు. సాహిత్యం మీద పట్టు. ప్రజల అభిమానం. ఈ రెండింటి కన్న ముఖ్యమైంది – మంచి స్నేహితులు.

ఎంతమంది స్నేహితులు మా ఇంటికి వస్తూ ఉండేవారో. ఎంతమంది మిత్రుల దగ్గరకి నాన్న వెళ్తూండేవారో.

విశాలాంధ్ర సంపాదకులు రాఘవాచారి గారిల్లు విజయవాడలో మా ఇంటికి దగ్గర్లోనే ఉండేది. చూసేవాళ్లకి వైరుధ్యాల కలయికలా ఉండేది కానీ – వాళ్ళిద్దరికీ మాత్రం ఒకరంటే ఒకరికి అభిమానపూర్వకమైన గౌరవం ఉండేది.

ఇద్దరూ కలిసి నడవడం చూసిన వాళ్ళు – కార్ల్ మార్క్సు వేద వ్యాసుడు కలిసి నడుస్తున్నారని అనేవారు.

సిద్ధాంతాల విభేదంతో ఇద్దరికీ పెద్దగా పనిలేదు. నిజానికి లోతుగా చూస్తే – రెండింటికీ తేడా లేకపోవచ్చు కూడా. అందరి బాగుని కోరుతూ జీవించమని చెప్పే మన ఇతిహాసాలు సోషలిజానికీ కమ్యూనిజానికీ వ్యతిరేకం కాదు. వ్యతిరేకం అనుకునే ఛాందసం నాన్నకి లేదు. రాఘవాచారి గారు మన వేదాలూ, ఉపనిత్తులూ కూలంకషంగా నేర్చినాయన.



వాళ్ళిద్దరూ రెండు గొప్ప ఆలోచనలకు వారసులు. రెండింటికీ మధ్య వారధులు.

అభిసారిక పత్రిక నడిపే రాంషా గారు, అభ్యుదయకవిత్వం రాసే ఆవంత్స సోమసుందర్ గారూ, పుస్తకాలు ప్రచురించే నవోదయా రామ్మోహనరావు గారూ, చెట్లు కూలుతున్న దృశ్యాలని చూసే అజంతాగారు, పత్రికా సంపాదకులు పొత్తూరి వేంకటేశ్వర రావు గారూ, వాకాటి పాండురంగారావు గారూ, స్వాతి సంస్థాపకులు వేమూరి బలరాంగారూ, లలిత సంగీతంలోని లాలిత్యాన్ని పుణికి పుచ్చుకున్న పాలగుమ్మి విశ్వనాథం గారూ, అవధాన కవి బేతవోలు రామబ్రహ్మం గారూ – ఒకరని ఏంటి – ఓ నేపథ్యం అని ఏంటి – ఎందరో నాన్న సన్నిహితులు – అందరూ అలా కళ్ళ ముందు కనిపిస్తూనే ఉన్నారు.

వాళ్ళతో సాహిత్యం గురించి మాట్లాడుతూనే ఉండేవారు. కొత్త రచయితల రచనలు చదువుతూ వాళ్లతో ముచ్చటిస్తూ మురిసిపోతూ ఉండేవారు.

ఓ పక్క పండితులూ, అవధానులూ, కవులూ, రచయితలూ, పత్రికా సంపాదకులూ నాన్న స్నేహితులు.


మరో పక్క మంగలి రాములూ, చాకలి పిచ్చయ్యా, పళ్ళ ఆదిలక్ష్మీ, ఆముదం అమ్మే వాడూ, రిక్షా రవీ, ఇడ్లీ పంతులూ – అందరూ నాన్నకి ఆప్తులే.

మా చిన్నప్పుడు నాన్నకి పని చెయ్యడానికి ఓ మంగలి ఇంటికి వచ్చేవాడు. పని చెయ్యడానికి అన్నమాట ఆలమూరులో నేర్చుకున్నాను. నాన్నా అదే మాట వాడేవారు. పని చేయించుకోడం అంటే క్షవరం చేయించుకోవడం. క్షవరం చెయ్యడంతో పాటు నాన్నకి ఒళ్ళు పట్టేవాడా మంగలి. ఒంటికి నూనె పట్టించుకుని – ఒళ్ళు అతని చేత పట్టించుకునేవారు. అతనే జయంతికీ, బుజ్జికీ జుట్టు కత్తిరించేవాడు. స్నానాలు కూడా చేయించేవాడు.

అలానే చాకలితోనూనూ. సూర్యారావు పేటలో మేం ఎన్ని ఇళ్ళు తిరిగినా ఆ చాకలే బట్టలు తీసుకెళ్ళి ఉతికిచ్చేవాడు. మేం ఐటీఐ కోలనీలో సొంత ఇంటికి మారాక కూడా అక్కడకి వచ్చేవాడు. అమ్మాయి గారి పెళ్ళికి నాకు బట్టలు పెట్టాలని అంటూ ఉండేవాడు.

మాకు సూర్యారావుపేటలో ఉండగా మొదలెట్టి సొంతింటికి వెళ్ళాక కూడా పళ్ళు తీసుకొచ్చేది ఆదిలక్ష్మి. ఆదిలక్ష్మిది అసలు శ్రీకాకుళం. తూర్పు యాసలో ఆత్మీయంగా మాట్లాడే ఆ ఆదిలక్ష్మి మాటలు ఇంకా అలానే గుర్తున్నాయి. ఎక్కడ కనిపించినా గట్టిగా నవ్వేస్తూ ఇంకా గట్టిగా పట్టేసుకునేది. దానికి మా ఇంట్లో అందరితోనూ అనుబంధమే. దానిచేతే అమ్మ నాన్నకి దిష్టి తీయించేది. అమ్మ కానీ, మేం కానీ నాన్నకి దిష్టి తియ్యకూడదు కదా? రూపానికి కాదు నాన్న కంఠానికి ఎంత దిష్టి తగులుతూ ఉండేదో. దిష్టి మీద నమ్మకం లేకపోయినా – ఆదిలక్ష్మి దిష్టి తీస్తోంటే – ముసిముసి నవ్వులు నవ్వుతూ – ఇవన్నీ ఏంటని అంటూనే – చిన్నపిల్లాడిలా దిష్టి తీయించుకునే వారు నాన్న.

మూడేసి నెలలకో సారి మా చేత ఆముదం తాగించేసేవారు. నాన్న చిన్నప్పటి అలవాటది. ఓ తమలపాకులో ఇంత ఆముదం పోసి ఒక్కొక్కరి నోట్లోకి పోసేసేవారు. మేం ఏడుపులూ, పెడబొబ్బలూనూ. అదో ప్రహసనం. అందరికీ తాగడానికి ఆముదం కావాలి కదా? అది ఎక్కువ కాకపోయినా, నాన్న రోజూ పాదాలకి ఆముదం





మర్దన చేసుకునేవారు. దాంతో మా ఇంట్లో ఆముదం వాడకం ఎక్కువే. ఇంటికి ఆముదం తెచ్చే వాడొకడుండేవాడు. వాడితో నాన్న నవ్వుతూ కబుర్లు చెప్పేవారు.

అలానే ఓ ఇడ్లీ పంతులు ఉండేవారు. మాకు కొనుక్కోవాల్సిన అవసరం ఉండేది కాదు కానీ, ఆయన మా ఇంటికి వస్తూ ఉండేవారు. పాపం ఇంటికి వస్తున్నారని అంటూ – ఆయన దగ్గర అప్పుడప్పుడు ఇడ్లీలు కొనేవారు నాన్న. వాళ్ళమ్మాయి చదువుకి నాన్న తన చేతనయినంత సాయం చేశారు.

ఇంక రిక్షారవైతే మా ఇంటి రిక్షావాడు. మాకు బాగా అలవాటై పోయాడు.

ఎవ్వరితో కలవడానికైనా, చేరడానికైనా – నాన్నకి భేదభావం లేదు. అందరితో కులాసాగా కబుర్లు చెప్పేవారు.

మనుషుల్ని దగ్గరగా చేర్చుకోడం నాన్నకి ఇష్టమే ఐనా – దూరంగా ఉంచాల్సిన వాళ్ళని దూరంగా ఉంచడానికి భయం కానీ మొహమాటం కానీ లేవు. ఉన్నది ఉన్నట్లు చెప్పేసేందుకు నాన్న ఎప్పుడూ వెనకాడేవారు కారు.

ఈ కాలం పెర్సనాలిటీ డెవలప్మెంట్ పుస్తకాలలో నో చెప్పడం ఎలాగో మనిషి నేర్చుకోవాలని రాస్తారు. నో చెప్పలేక మనుషులు ఇష్టంలేని పరిస్థితుల్లో ఇరుక్కుపోతారు. అందువల్ల వాళ్ళు ఇబ్బంది పడడమే కాదు – తర్వాత్తర్వాత నేనిదంతా చేసానని అవతలి వాళ్ళ ముందుగానో చాటుగానో అనడం మొదలెడతారు. అది మానవ సంబంధాలకి మంచిది కాదు.

అందుకే మనవాళ్ళు ఆది నిష్టూరం మేలంటారు. అవసరం వచ్చినప్పుడు గట్టిగా వద్దని చెప్పడానికి మొహమాటం లేదు నాన్నకి. కొందరితో ఎంత నిర్మొహమాటంగా మాట్లాడేవారో చూసాను నేను.

ఒక్కోసారి నాన్న మాట కరుగ్గా వచ్చేది. అది కొందరికి కష్టంగా అనిపించి ఉండచ్చును కూడా. మాట కరుకుదనం, నాన్నకి విశ్వనాథ సత్యనారాయణ గారి నుండి అబ్బింది. ఇది నేను అంటున్న మాట కాదు , నాన్నే చెబుతూండేవారు. .

ఐతే ఆ మాట తీరు నాన్న మామూలు మాట తీరు అయిపోయింది. తెలిసిన వాళ్ళెవ్వరూ దాన్ని పట్టించుకునే వారు కాదు. నన్నయ్య గారి నిండు మనంబు నవ్యనవనీత సమానము, పల్కు దారుణాఖండల శస్త్ర తుల్యము లా ఉండేవారు.

మనుషుల మీద సానుభూతీ, నమ్మకం ఎక్కువ నాన్నకి. ఇల్లు కట్టించేడప్పుడు స్టూడెంట్స్ బుక్ సెంటర్ గోపాలరావుగారికి డబ్బివ్వడమే కానీ లెక్కలు చూసుకోలేదు. గోపాలరావు గారైతే తెలిసిన పెద్ద మనిషి. నమ్మారు.

ముక్కూ మొహం తెలియని వాళ్లని కూడా నాన్న నమ్మిన సందర్భాలు ఉన్నాయి. ఒకసారెప్పుడో ఎక్కడో కొట్లో బియ్యం కొని – ఇంకెక్కడో పనుండి వెళ్ళిపోతూ – కొట్టు దగ్గరున్న ఓ రిక్షావాడికి మా ఇంటి అడ్రెస్ చెప్పి ఇంట్లో ఇచ్చెయ్యమని పంపించేసారు. అతనేం మాకు తెలిసిన రిక్షావాడు కాదు. మాకు ఇవ్వకుండా వెళ్ళిపోతే అని మాలో ఎవరో అడిగితే – వాడికైనా బియ్యం కావాలి కదమ్మా– వాళ్ల పిల్లలు తింటారు అని అన్నారు.



ఆ మాట నాన్న పైకి అన్నది కాదు. నిజంగా నమ్మి ఆచరించింది. ఎవరికైనా సాయం కావాలని అనిపిస్తే చెయ్యడానికి ఎన్నడూ నాన్న వెనకాడలేదు.

చివరగా – మేము ఎప్పుడూ చెప్పుకునే ఒక మాట , ఈ మాట ఇంతకు ముందు చెప్పినా, ఇక ముందు చెప్పినా – మనస్సులో నిలిచిపోయిన ఈ మాట ఎన్ని సార్లు చెప్పుకున్నా చెప్పుకుంటూ ఉండాలనే ఉంటుంది.

బయట తనకి ఉన్న పేరు ప్రఖ్యాతులని నాన్న మా ఇంటి గుమ్మంలోపలకి రానివ్వలేదు. ఇంట్లో అతి మామూలుగా ఉండేవారు. ఊరూరా సన్మానాలు జరుగుతున్నా – ఎక్కడివక్కడ వదిలేసి ఇంటికి మా నాన్నగా వచ్చేవారు. నాన్న ఇంటికి వస్తున్నారంటే – ఎదురొచ్చి మేం సేవలు చెయ్యాలని ఏ నాడూ అనుకోలేదు. పైపెచ్చు ఇంటికి వస్తూనే ఇంటి పనిలో దూరిపోయేవారు.

నాన్న పాండిత్యాన్నీ, నాన్న ఉపన్యాసాలనీ, నాన్న పేరు ప్రఖ్యాతుల్నీ, జనం చేసే పాదాభివందనాల్నీ – అన్నింటినీ ఇంటి గుమ్మం దగ్గరే వదిలేసి ఇంట్లోకి నాన్నలా వచ్చేవారు.

అర్వదేడులుషశ్రీకి ననుట సరియె
కొన్ని వందల కోట్ల నిగూఢ సమల
కంటు కట్టిన కుఱుచైన ఆమ్రశాఖ
అవ్వర! ఏ నాటి ముసలి ఈ ద్రవిడ శిశువ్వ

– పాలపర్తి శ్యామలానంద ప్రసాద్

# అన్నీ నాన్నతోనే



మా నాన్న మా నలుగురికీ పెట్టిన పేర్ల గురించి తల్చుకోకుండా ఉండలేక పోతున్నా.

ఇప్పుడు పిల్లలకి పేరు పెట్టడానికి, పుస్తకాలూ, ఇంటర్నెట్లూ వచ్చాయి. తల్లితండ్రులు ఎంతో ఆలోచించి రెండు అక్షరాలతోనో, ఒక్కోసారి ఓ అక్షరంతోనో పేరు పెడుతున్నారు. అవి పిలవడానికి బావుంటున్నాయేమో కూడా. ఐతే ఆ పేర్ల అర్థం పిల్లలకి తెలియకపోవచ్చు. తల్లితండ్రులకీ తెలియకపోవచ్చు. ఈ అప్రస్తుత ప్రసంగం అంతా ఎందుకంటే – నాన్న మా పేర్లు ఎలా పెట్టారో చెప్పడానికే.

నాపేరు గాయత్రీ కళ్యాణీ కామాక్షీ కనకదుర్గ . ఎంత లయాత్మకంగా పెట్టారో నాన్న. నా స్నేహితురాళ్ళకి కూడా నా పేరు పూర్తిగా తెలుసో లేదో.

నా పేరులో దేవతల పేర్లే కానీ ముందు తరాల వారి పేర్లు లేవు. అటు మా అమ్మమ్మ పేరు కానీ, ఇటు మా మామ్మ పేరు కానీ నాకు పెట్టలేదు. నిజానికి నా పేరు నాలుగు పేర్లని కలిపి పెట్టిన పేరు. ఐతే నాలుగూ గమ్మత్తుగా కలిసిపోయి ఒక పేరులానే వినిపిస్తాయి.

అన్నింటి కన్నా చివరిగా ఉన్న పేరనో, బెజవాడ కనకదుర్గమ్మ పేరనో, నన్ను చిన్నప్పుడు దుర్గని పిలిచేవారు ఆలమూరులో. స్కూల్లో వేసేడప్పుడు గాయత్రీదేవి అని ఒక్క పేరే రాసారు నాన్న. ఆ దేవి ఎలా వచ్చి చేరిందో తెలియదు. కానీ దాంతో పేరుకి ఓ గాంభీర్యం వచ్చినట్లు అనిపిస్తుంది నాకు.



రెండో చెల్లి పద్మ పేరైతే – సావిత్రీ కళ్యాణీ పూర్ణ పద్మ. ఇందులోనూ నాలుగు పేర్లు ఉన్నాయి. ఐతే వాటిని కలిపే లయ ఉంది. గాయత్రికి ప్రాసగా సావిత్రి కలిసింది. కళ్యాణి నాన్నకి ఇష్టమైన పేరు – నా పేరులోనూ ఉంది. ఇంక పూర్ణ మా మామ్మ పేరు అన్నపూర్ణ లోంచి వచ్చింది. మా అమ్మ అందుకే దాన్ని అత్తగారని అంటూ ఉండేది, సరదాగా. మా పెద్ద చెల్లి పుట్టే సమయానికే వేంకటేశ్వర కళ్యాణం నృత్యనాటిక రాసారు నాన్న. అందుకేనేమో పద్మ పేరుని కలిపారు. స్కూల్లో పద్మావతి అయిందది.

మూడో చెల్లి పేరులో కళ్యాణి లేదు. ఎందుకో తెలియదు. ఐతే అమ్మమ్మ పేరు కామేశ్వరి చేరింది. దానిదీ నాలుగు పేర్ల పేరే. సుబ్రహ్మణ్య కామేశ్వరీ రోహిణీ వైజయంతి. దానిది రోహిణి నక్షత్రం. అమ్మకి పాములతో ఉన్న మొక్కు కోసం సుబ్రహ్మణ్యం చేరినట్లుంది. ఐతే తమాషా ఏంటంటే – జయంతి భర్త పేరు సుబ్రహ్మణ్యం. దీన్ని నాన్న ముందే ఊహించారేమో! ఇద్దరు సుబ్రహ్మణ్యాలు అంటాం మేం. అది తన పేరు వైజయంతి అని రాసుకుంటుంది. మేం అందరం జయంతి అనే పిలుస్తాం.

నాలుగో చెల్లి పేరు పెట్టేటప్పటికి, నాన్నలో ఈ నాలుగు పేర్ల సరదా తగ్గిందేమో, చిన్నదానికి చిన్నపేరే బావుంటుందని అనుకున్నారో – కళ్యాణ లక్ష్మి అని పెట్టారు. నాన్నకి చాలా ఇష్టమైన కళ్యాణి పేరుని మళ్ళీ గుర్తు చేసుకున్నారు. పెద్దవాళ్ళం మా ముగ్గురికీ లేనిది, దానికి ఓ ముద్దు పేరుంది. బుజ్జి అని. ఇప్పటికీ అది మాకు అందరికీ బుజ్జే, బుజ్జిది కదా.

నాన్న నా పేరు పెట్టి ఎప్పుడూ నన్ను పిలవలేదు. పెద్దమ్మాయి అనే అనేవారు. పద్మని పద్మా అనేవారు. అప్పుడప్పుడు ముద్దుగా పబ్బీ అని పిలిచేవారు. జయంతిని జయంతని పిలిచేవారు, జంతూ అని కూడా అనేవారు. బుజ్జి బుజ్జే.

తలచుకున్నప్పుడల్లా ఇలాంటి పేర్లు ఎందుకు పెట్టారో, ఎలా పెట్టారో అని అనిపిస్తుంది.

మా పేర్లు పెట్టడం లానే మా పుట్టిన రోజులు రికార్డుల్లో వెయ్యడంలోనూ ఓ వైవిధ్యం ఉంది. స్కూల్లో చేర్పించేడప్పుడు గుర్తు పెట్టుకోడానికి ఏ తేదీ సులభంగా ఉంటుందో అది వేసేసారు. పుట్టిన నెల ఏదో పుట్టిన తేదీ కూడా అదే.

అక్టోబర్‌లో పుట్టాను నేను – నా పుట్టిన రోజు 10/10 అని వేసారు, నిజానికి నేను పుట్టింది అక్టోబర్ 22. అలానే పద్మ ఫిబ్రవరిలో పుట్టింది కదాని దాని పుట్టిన రోజు 2/2 అని వేసారు. జయంతిదీ 7/7 అని వేసారు. మరి ఆ తేదీ ఎందుకు వచ్చిందో. కళ్యాణి దగ్గరకి వచ్చే సరికి ఇలా తారీఖులు మార్చాల్సిన పని లేకుండా పోయింది. అది నాన్న ఆలోచనకి అనుగుణంగా 5/5 న పుట్టింది. ఆ తేదీని అలా ఉంచేశారు.

అలా మేము పుట్టిన తేదీలు మార్చకుండా ఉంటే – ఈ మాటలే ఉండేవి కావు.

నాన్న మాకు పెట్టిన పేర్లు మాత్రం – హాయిగా ఉన్నాయి – నాన్నలా, నాన్న నవ్వులా, నాన్న మనస్సులా.

* * *

దీపావళి పండక్కి నాన్నా అమ్మా ఎంత హడావిడి చేసేవారో. పండక్కి కొన్నాళ్ళ ముందే మతాబాలూ, తారాజువ్వలూ తయారు చేసేవారు. మేమంతా మా వంతు సాయం చేసేవాళ్ళం. వాటిల్లోకి కావల్సిన సూరేకారం,





భాస్వరం లాంటివాటిని ఎంతెంత వెయ్యాలో వేసి, సూరి, కాయితాల్లోనో, తాటాకుల్లోనో చుట్టించేవారు. మేమంతా సరదాగా చుట్టేవాళ్ళం.

ఇంట్లో చేసినవి కాకుండా ఓ బుట్టెడు కాకరపువ్వొత్తులూ, పేలే టపాకాయలు లాంటివి కొని తెచ్చేవారు నాన్న. అవి మేము నలుగురం వంతులు వేసుకుని పంచుకునే వాళ్ళం. పంచుకోడం అందరం అన్నీ సమంగా పంచుకున్నా, పేలే టపాకాయలు తక్కిన వాళ్ళకి భయం కావడంతో కాల్చేటప్పుడు మా నాన్నో, పెద్ద చెల్లి పద్మో కాల్చేవాళ్ళు.

కాల్చడానికి ముందు ఇంటి ముంగిట్లో గోంగూర కాడల్ని దిబ్బూ దిబ్బూ దీపావళీ మళ్ళీ వచ్చే నాగులచవితీ అని అమ్మా నాన్నా ఇద్దరూ మా నలుగురి చేతా తిప్పించేవాళ్ళు. అది గోదావరి జిల్లాలోనే ఉండే ఆచారం ఏమో. హైదరాబాద్ లోనూ విజయవాడలోనూ కూడా చుట్టుపక్కల వాళ్ళు వింతగా చూసేవాళ్ళు. మా నాన్న పక్కనుండి చేయిస్తోంటే, ఎవరెలా చూస్తున్నా మనస్సుకి ఏమీ పట్టేవి కాదు.

వీటితో పాటు అగ్గి మీద గుగ్గిలం వేసేవారు. అది ఇంటి పెద్దగా నాన్నే వెయ్యాలి. నాన్న ఇంటికి వచ్చేవరకూ ఎదురుచూస్తూ కూచునే వాళ్ళం. నాన్న వచ్చాకే – గుగ్గిలం వేసాకే – పండగ కళ వచ్చేది ఇంటికి. అప్పుడే సరదా మొదలయ్యేది మాకు. అప్పట్నుంచీ నాన్నతో హాయిగా గడిచిపోయేది పండగంతా.

పండగలకి కొత్త బట్టలు కట్టుకు తీరాలని మేం అనుకునే వాళ్ళం కాదు. నాన్న కూడా పండగలకనే కొనేవారు కాదు. కానీ నాన్న మాకు బట్టలు కొనడం తమాషాగా ఉండేది. నలుగురికీ ఒకే రంగు గౌన్లు తెచ్చేసేవారు. యూనిఫారంలా బానే ఉండేది. నాన్న కొనడం మానేసి మాకు మేము కొనుక్కోడం మొదలెట్టాకే – ఒక్కొక్కరం ఒక్కో రంగూ, డిజైనూ వేసుకునేవాళ్ళం.

ఒక్క దీపావళికే కాదు, పండగలన్నింటికీ కూడా నాన్న మాతో పాటే ఉండేవారు. దసరాకీ, సంక్రాంతికీ మేము బొమ్మలకొలువు పెడుతోంటే – పక్కనే నిలబడి, సలహాలిస్తూ, సహాయం చేస్తూ సంబరపడిపోయేవారు.

వినాయకచవితికి మాత్రం తప్పకుండా పూజ ఉండేది మా ఇంట్లో. ఐతే అది అందరి ఇళ్ళల్లో పూజ మొదలెట్టే సమయానికి ఐపోయేది. అమ్మ వంట ఎంత తొందరగా చేసేదో – నాన్న వ్రతం అంత కన్న తొందరగా అవగొట్టేసేవారు. వినాయక వ్రతకల్పంలో మంత్రాలు నాన్న చదువుతుంటే ఆ వేగం వినవలసిందే.

నాన్నకి వ్రతాల మీద పెద్ద నమ్మకం ఏమీ లేదు. సత్యనారాయణ వ్రతం లాంటివి మా ఇంట్లో ఉండేవి కావు. ఎప్పుడైనా అమ్మ పోరితే వ్రతానికి పీటల మీద కూచుంటే మాత్రం – వ్రతం చేయించే బ్రహ్మ గారిని వేగంగా చేయించెయ్యమని తొందరపెట్టే వారు. మేం భోజనానికి ఆగలేమని – మాపై నెపం పెట్టేసేవారు.

నాన్నకి పండగలంటే మాతో సరదాగా ఉండడమే. మాకూ నాన్నతో హాయిగా గడపడమే పండగ. ఎప్పుడూ పిండివంటలు చేస్తూనే ఉండే అమ్మ చేత మరిన్ని పిండివంటలు ప్రత్యేకంగా చేయించుకోడమే.

గుళ్ళకి వెళ్లాలనీ, పూజలు చేయించాలనీ నాన్న అనుకున్నట్లు నాకు గుర్తుకు రావడంలేదు.

నాన్న పూజా విధానమే వేరు. ప్రశాంతంగా పడక్కుర్చీలో కూచుని సుందరకాండ పారాయణం చేసేవారు. కళ్ళు మూసుకు పడుక్కుని ధ్యానం చేసేవారు.



ధ్యానం అంటే ఏమిటి – అంతుచిక్కని బ్రహ్మపదార్థానికీ – దాన్ని అందుకోవాలని ఆరాటపడే జీవికీ – మధ్య మౌనంగా సాగిపోయే సంభాషణ.

* * *

నాన్నతో అడ్డాట ఆడేవాళ్ళం మేం. కాకరపర్రు వాళ్ళం కదా పేకాట రాకపోతే ఎలా అనేవారు నాన్న.

అడ్డాట తూర్పులో ఎక్కువ ఆడతారని చెప్తూ మనది తూర్పు గోదావరి జిల్లాయే అని నవ్వేసే వారు.

దేనికి ఏది తూర్పో. కృష్ణా జిల్లాల వారికి గోదావరి జిల్లాల వాళ్ళు తూర్పు ఐతే, గోదావరి జిల్లాల వారికి, విశాఖపట్నం వాళ్ళు తూర్పు. వాళ్ళకి శ్రీకాకుళం వాళ్ళు తూర్పు. వాళ్ళకి ఒరిస్సా వాళ్ళు. అంతా మనం చూడ్డంలోనే ఉంది.

నాన్న అడ్డాట ఆడ్డం భలే ఉండేది. ఈ ఆట గురించి ఎంత మందికి తెలుస్తుందో తెలియదు. కానీ అందులో తురపు చెప్పడం ఉంటుంది. సామాన్యంగా అందరూ ఏ రంగు ముక్కలు బావున్నాయో ఆ రంగు తురపు చెప్తారు. ఐతే నాన్న తన దగ్గర అవసరమయిన ముక్కలు లేకపోయినా చెప్పేసేవారు. దాంతో నాన్న తురపు చెప్పినప్పుడు మిగతా వాళ్ళకి ఎలా ఆడాలో తెలిసేది కాదు. పెద్ద సస్పెన్స్ – నాన్నకి ముక్కలు బావుండి చెప్పారా, ఏమీ లేకుండా చెప్పారా అని. ఆట రంజుగా ఉండేది.

అలానే గాడిదాట ఆడినా, అడుగుడు సెట్లాట ఆడినా. ఆట ఆటలా ఆడేవారు. పోటీలా కాదు.

నాన్నతో ఆడిన వైకుంఠపాళి ఆట మరిచిపోలేం. మాతో చిన్న పిల్లాడిలా కలిసిపోయి ఆడేవారు నాన్న. నాన్న పావు నిచ్చెనెక్కినా, పాముదిగినా – నవ్వుతూనే ఆడేసేవారు.. ఆట ఆడుతున్నప్పుడే కాదు – ఐపోయాక కూడా వైకుంఠపాళిలో పాములు పడేచోట్ల ఉన్న రాక్షసుల పేర్లు చెప్తూండే వారు. అసలా ఆటే సరదా ఆట. ఎవరు నిచ్చెనలెక్కుతారో, ఎవరు పాముల్లో పడతారో – అని అందరూ చూస్తోంటే – పందెం వెయ్యాలి. పందెం వేసే వాళ్ళూ, చూసే తక్కిన ఆటగాళ్ళూ, గళ్ళు లెక్కెట్టుకుంటూ ఆడతారు. అరుస్తూ ఉంటారు. ఉడుక్కుంటూ ఉంటారు. అలాంటి ఆట నాన్నతో ఆడ్డం అంటే మహా సరదాగా ఉండేది.

మేమొక్కోసారి చింతగింజలు కుప్ప పోసుకుని, ఊదుకుని, ఏరుకునే ఆట ఆడేవాళ్ళం. తోచనప్పుడు ఎప్పుడైనా నాన్న కూడా వచ్చి ఊదేవారు. ఒక్క ఊదుకు మొత్తం చింతగింజలన్నీ చెదిరిపోయేవి. అది తలచుకుంటోంటే నాన్న రసాల మామిడిపళ్ళు తినడం గుర్తొస్తోంది. ఒక్క సారి పండును నోట్లో పెట్టుకుని పీల్చుకోడం మొదలెడితే – బయటకి తొక్కా, టెంకా మాత్రం వచ్చేవి. రసం అంతా నోట్లోకి ఒక్క సారిగా జుర్రేసేవారు. అదో ఒడుపేమో. నాన్న చాలా పనులు చేసే తీరులో ఒక ప్రత్యేకత ఉండేది.

* * *

మేం స్వంత ఇంటికి మారిన కొన్నాళ్ళకే నా పెళ్ళి అయింది. దాంతో మా సొంతింట్లో నేను నాన్నతో గడిపిన కాలం కొంత తక్కువే. కానీ అది చాలా విలువైనది – క్వాలిటీ టైం అంటారు – అదీ.





నేను హైదరాబాదూ, బొంబాయిల నుండి మా ఇంటికి వెళ్తూ ఉండేదాన్ని. నాన్న1986 లో ఆకాశవాణి నుండి రిటైరైపోయారు. దాంతో నాన్నతో గడిపే సమయం కూడా ఎక్కువ దొరికింది. నాన్నతోనూ, అమ్మతోనూ, అప్పటికింకా పెళ్ళిళ్ళు కాని చెల్లెళ్ళతోనూ హాయిగా గడిపేదాన్ని.

మధ్యలో ఈ ప్రస్తావన ఎందుకంటే, విజయవాడలోని మా సొంతింటి దగ్గర ఓ ఖాళీ స్థలంలో నాన్న మాతో షటిల్ ఆడేవారు. పంచె పైకి కట్టేసుకుని, బనియన్ తోనే బయటకి వచ్చి ఆడేవారు. నాన్న వేషం, ఆడే వేగం, అదంతా నాకు వీడియోలాగా కనిపిస్తూనే ఉంటుంది.

నాన్నకి చిన్నపిల్లలతో ఆడ్డం మహా సరదాగా ఉండేది. ఎవరైనా చిన్న పిల్లలు మా ఇంటికి వస్తే – వాళ్లతో కారూ, బాలూ – ఏదుంటే దాంతో ఆడుతూ ఉండేవారు. మా ఎదురింట్లో సాయి ఆర్ట్స్ వాళ్ళ పిల్లాడితో గంటలు గంటలు కారు తోస్తూ ఆడుతూనే ఉండేవారు.

పల్లెటూరి వామనగుంటలూ, విదేశాల బిజినెస్సూ – ఎన్ని ఆటలు ఆడించారో నాన్న మాచేత!


ఎన్ని జ్ఞాపకాలో ? ఏవి నాన్నా అపుడు విరిసిన సుమ సుగంధములు? అని నాలో నేనే అనుకుంటూ ఉంటాను

క్రాంతింబొందిరి ఆంధ్ర హైందవులు వీరత్వాభిమానంబుతో
క్లాంతింబొందిరి దుర్మతోద్ధకులు దుర్గర్వ్యాతిపారంబుతో
శ్రాంతింబొందిరి తృప్తితో విబుధులాశ్చర్యంబుషశ్రీబుధుం
డంతర్వాణి మహా ప్రబోధమున ధర్మావేశమున్ జూపగన్

- ప్రసాదరాయ కులపతి



# భారతం పెట్టె




నాకూ మా నాన్నకీ 1988 చాలా ముఖ్యమైన సంవత్సరం. ఎందుకంటే అదే మా అమ్మాయి అపరాజిత పుట్టిన సంవత్సరం. అదే నాన్న షష్టిపూర్తి సంవత్సరం కూడా. మా అమ్మాయి పుట్టింది అక్టోబర్ ఇరవైన – విజయదశమి రోజున. నాన్న షష్టిపూర్తి మార్చ్ పదహారున.

షష్టిపూర్తి కార్యక్రమాన్ని ఉషశ్రీ సన్మాన కార్యక్రమంలా జరిపించారు – నాన్న అభిమానులూ, ఆప్తులూ, హితులూ, సన్నిహితులూ.

సన్మాన సంఘానికి కార్యదర్శి విశ్వనాథ పావనశాస్త్రి గారు. నాన్న విశ్వనాథ సత్యనారాయణ గారికి ఎన్నో చోట్ల సన్మానం చేయించారు. ఆయన పుత్రుడే – పావనశాస్త్రి బాబయ్య – ఆయనే నాన్న షష్టిపూర్తి సన్మానానికి ముందు నిలబడ్డారు.

సంఘం అధ్యక్షులు లక్ష్మణయతీంద్రులు. సభ్యులు విజయవాడ హూ ఈజ్ హూ లు. జువ్వాడ గౌతమరావు గారూ, శనగన నరసింహస్వామిగారూ, పేరాల భరతశర్మగారూ, ధారా రామనాధశాస్త్రి గారూ, బేతవోలు రామబ్రహ్మం గారూ – ఒకరనేలా? వాళ్లతోపాటే తరుణసాహితీసమితి మిత్రులు – పోలాప్రగడా, కనక్ ప్రవాసీ. అందరిలోకీ చివరగా పేరేయించుకున్న కే కే రామానుజాచార్యులు గారు. ఆ పేరు కూడా వేయించుకోని చిర్రావూరి సుబ్రహ్మణ్యం గారు.

కార్యక్రమానికి నేను విజయవాడ వెళ్ళలేకపోయాను కానీ – ఆ కార్యక్రమం వీడియో కేసెట్టుని నేనెన్ని సార్లు చూసానో – చూస్తూ ఉన్నానో. ఒక ఆత్మీయ వేడుకలా జరిగిపోయింది కార్యక్రమం అంతా.

మా ఆఖరి చెల్లి బుజ్జి (కళ్యాణి) పూజానృత్యంతో కార్యక్రమం మొదలు. నాన్న షష్టిపూర్తి కార్యక్రమంలో నాట్యం చెయ్యడం దాని అదృష్టం.





సభకి అధ్యక్షులు లక్ష్మణ యతీంద్రుల వారు. ముఖ్య అతిథి – విజయవాడ మేయరుగా పని చేసిన జంధ్యాల శంకర్ గారు.

సంఘం వారు తలపెట్టింది నాన్నకి సన్మానం. ఐతే ఆ సన్మానానికి ముందు – నాన్నే సన్మానాలు చేశారు. నాన్నకి భీమవరం కాలేజీలో గురువులైన నండూరి రామకృష్ణమాచార్యుల గారికీ, ఆలిండియోరేడియోలో నాన్న ప్రతిభని బయటకు తీసిన బాలంత్రపు రజనీకాంతరావుగారికీ కృతజ్ఞతా పూర్వకంగా సన్మానం చేశారు.

ఎంత మంచి ఆలోచనో అది? అదే విషయాన్ని తర్వాత నాన్న గురించి రాసిన ఓ వ్యాసంలో ఆనందంగా ప్రస్తావించుకున్నారు నండూరి రామకృష్ణమాచార్యులు గారు.

నాన్న గురించి ఏలూరిపాటి అనంతరామయ్య గారూ, విశాలాంధ్ర రాఘవాచారి గారూ మాట్లాడారు.

ఆ సభలోనే నాన్న రచనలు – మనుచరిత్ర, సుందరకాండల ఆవిష్కారంతో పాటు, కేసెట్లు కూడా విడుదల అయ్యాయి.

ఆ సభ అసలు ప్రత్యేకత – దేశమంతా పేరు తెచ్చిన ధర్మసందేహాలు కార్యక్రమాన్ని – నాన్నే స్టేజీ మీద నిర్వహించడం. అందులో భాగంగానే కృష్ణ రాయబారం ఘట్టం వినిపించారు. సహకారం అందించింది – ఆలిండియా రేడియోలో సహోద్యోగులుగా ఉన్న మల్లిక్ గారూ, ఆనంద్ గారూ. మల్లిక్ గారు పద్యాలు చదివారు. ఆనంద్‌గారు ప్రశ్నలు అడిగారు. నాన్న రేడియోలో ధర్మసందేహాలు కార్యక్రమం చేస్తున్నప్పుడు కూడా – చాలాకాలం శ్రోతల ప్రశ్నలు అడిగింది ఆనంద్ గారే.

సభలో మాట్లాడిన వాళ్ళూ, సోవనీర్లో రాసిన వాళ్ళూ – అందరూ – ఉషశ్రీకీ అరవై ఏళ్ళా – అని ఆశ్చర్యపడ్డవాళ్ళే, అనుమాన పడ్డవాళ్ళే. ఆ సభలో నాన్నని చూసిన వాళ్ళెవ్వరికైనా అలాగే అనిపించి ఉంటుంది.

కార్యక్రమం జరుగుతున్నంతసేపూ – నాన్న సంబరపడిపోతూ, సరదాగా మాట్లాడేస్తూ, సంతోషంగా నవ్వేస్తూ – సభంతా తానే ఐపోయారు. నాన్నని చూసిన వాళ్లెవ్వరికైనా – అరవై ఏళ్ళంటే నమ్మగలిగేలా లేరు నాన్న.

ఆ సభలోనే అమ్మకీ నాన్నకీ కలిపి చేసిన సన్మానంలో ఐతే – ఇద్దరినీ చూడ్డానికి ఎన్ని కళ్ళు కావల్సి వచ్చేవో. ఏం రోజు అది? అమ్మనీ నాన్ననీ ఓ పెద్ద దండలో ముంచెత్తేసారు–ఇద్దరూ ఒకే దండలో మునిగిపోయి – అంతకు మించి ఆనందంలో మునిగిపోయి – ఆపుకోలేని నవ్వుల్లో మునిగిపోయారు.

ఇప్పటికీ ఆ విడియోనీ, ఆ ఫొటోనీ – చూస్తూ నేనూ మరో లోకంలో మునిగిపోతూంటా.

ఇంటికి వెళ్ళి ఇద్దరూ ఆదిలక్ష్మి చేత దిష్టి తీయించుకుని ఉంటారు.

*  *  *

సన్మానాలు కొత్తేం కాదు నాన్నకి. ఎందరికో ఎన్నో చేయించారు నాన్న. నాన్నకీ ఎన్నో జరిగాయి.

అందులో ముఖ్యంగా నాన్న చెప్పుకునేవి రెండున్నాయి. ఒకటి 1976 లో జిల్లెళ్ళమూడి అమ్మ సన్మానం. రెండోది 1987 లో శృంగేరీ పీఠాధిపతుల సత్కారం.



జిల్లెళ్ళమూడి సన్మానానికి నన్ను కూడా తీసికెళ్ళారు. సన్మానం వివరాలు నాకు గుర్తు లేవు. కానీ జిల్లెళ్ళమూడి అమ్మ నాన్నకి ప్రసాదం తినిపించడం నాకు స్పష్టంగా గుర్తొస్తోంది. అక్కడ ఆశ్రమంలో ప్రతిరోజూ వందల మందికి అన్నదానం జరుగుతుంది. అది అమ్మ ప్రసాదంగా జరిగే నిరతాన్నదానం. ఆరోజు అమ్మ మమ్మల్ని తన దగ్గరే కూచోపెట్టుకుని, ఒక ముద్ద నాన్నకి తినిపించారు. ఆ సంఘటన గుర్తు చేసుకుంటూ – అమ్మ అమృత హృదయం అందుకున్నాను – అని రాసుకున్నారు.

శృంగేరీ పీఠాధిపతులు నాన్నని శృంగేరీకి పిలిచి అమ్మవారి సమక్షంలో సత్కరించారు. అక్కడకి నేను వెళ్ళ లేదు.

ఈ జన్మకివి చాలని నాన్న మనస్ఫూర్తిగా చెప్పుకునేవి ఇవి రెండూ. రెండూ అమ్మకి సంబంధించినవే. ఒకటి అమ్మ చేసింది. రెండోది అమ్మవారి సమక్షంలో జరిగింది.

అవి రెండూ ఏ ప్రభుత్వ సంస్థో ఆనవాయితీగా చేసినవి కావు. ఏ సన్మానాల సంఘమో – ధనంకోసమో, జనంకోసమో చేసినవీ కావు. అలాంటివి నాన్న మనస్సుకు పడేవీ కావు.

బిరుదుల్నీ, అవార్డుల్నీ – తప్పించుకున్నారు నాన్న. ఒక విధంగా – ఏ నోరైతే నాన్నని ప్రజలకి దగ్గరగా తీసికెళ్ళిందో – ఆ నోరే నాన్నని అలాంటి వాటికి దూరంగా తీసికెళ్ళింది కూడా. ఎవరి వెనకైనా తిరగడం, చేతులు కట్టుకు నిల్చోడం, భజన చెయ్యడం – నాన్న తత్వం కాదు.

ఈ రెండే కాకుండా మరో సత్కారం కూడా నాన్న ఆనందంగా తల్చుకునేవారు. అది తిరుమల తిరుపతి దేవస్థానం వారు నాన్నని ఆహ్వానించి చేసిన సత్కారం. నాన్న రాసిన భాగవతం విడుదల కార్యక్రమం ఏర్పాటు చేసి 1979 లో తిరుమలకి ఆహ్వానించారు. అది బ్రహ్మోత్సవాల సమయం. అందరం వెళ్ళాం. మా అందరినీ వేదమంత్రాల ఆశీర్వాదంతో, ఆలయంలోకి ప్రత్యేకంగా తీసికెళ్ళడం ఇప్పటికీ కళ్ళముందు విడియోలా కనిపిస్తూనే ఉంది. అది నాన్నకే కాదు మాకు కూడా మరపు రాని ఆనంద సమయం.

* * *

1975 అక్టోబరులో మా నాన్నతోపాటుగా మామ్మనీ తాతనీ విజయవాడ తీసుకొచ్చి కొత్తగుళ్ళలో సత్కారం చేసారు. గొప్పవాడైన కొడుకు చేతుల్లో సన్మానం అందుకున్న మా తాతా మామ్మలది ఎంత అదృష్టం. వాళ్ళు బతికి ఉండగానే అంత పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్న మా నాన్నది ఇంకెంత అదృష్టం. అటువంటి తండ్రికి పుట్టడం మా అదృష్టం.

ఎవరి ఉన్నతినైనా తల్లితండ్రులు ఆనందించినట్లు – ఇంకెవ్వరూ ఆనందించలేరు. మామ్మా తాతలు నాన్న పేరుప్రఖ్యాతుల్ని స్వయంగా చూడగలిగారు. వాళ్ళు చూడ్డం నాన్న చూడగలిగారు. నాకు ఆ అదృష్టం లేదు.

ఈ సందర్భంలో నాకు ఖలీల్ గిబ్రాన్ రాసింది గుర్తొస్తోంది. పిల్లలు బాణాల్లాంటి వాళ్ళు. తల్లితండ్రులు విల్లుల లాంటి వాళ్ళు. అమ్మానాన్నలు వింటి నారుల్లా ఎంత వంగుతారో, పిల్లలు బాణాల్లా వేగంగా అంత ముందుకు సాగగలుగుతారు. ఎంత చక్కగా చెప్పాడు ఖలీల్.





ఈ రోజు నేను ముందుకు ఏ మాత్రం సాగుతున్నా – దాని వెనక మా నాన్నా, ఆయన కృషీ ఉన్నాయి. అది ఎప్పటికీ నేను మర్చిపోలేను.

నేనేం నాన్నంత గొప్పదాన్ని కాదు. కాదు కానీ నాకున్న పరిధిలో నేనేదో చేస్తోంటే – చూసేందుకు నాన్న లేరు. అమ్మ కొన్నాళ్ళు ఉంది. ఇప్పుడు అమ్మా లేదు.

నేను చిన్నప్పుడు చేసిన చిన్ని చిన్ని పనులకే పెద్దగా సంతోషించేవారు నాన్న. ఈ రోజు నాన్న ఉండి ఉంటే నాకెంత బావుండేదో. ఉన్నారు ఉన్నారు అని అనుకుంటూ ఉండాలని అనుకుంటా – కానీ లేని లోటు తెలుస్తుంటుంది ఒక్కోసారి. ఆలోటు నా బాధలో కన్న ఆనందంలో ఎక్కువ తెలుస్తుంది. నా సంతోషానికి నాన్న కన్న సంతోషించే వారెవరుంటారు?

* * *

విజయవాడ కొత్తగుళ్ళలో నాన్నకి సన్మాన కార్యక్రమాన్ని పెట్టిన వాళ్ళు మనికొండ కాశీవిశ్వనాథంగారూ, ఆయన కొడుకు మనికొండ శంకరనారాయణగారూ. నాన్నని సన్మానించడం కోసం పెట్టుకున్న కార్యక్రమంలో నాన్న మామ్మకీ తాతకీ సత్కారం చేసారు.

సభకి విశ్వనాథ సత్యనారాయణ గారూ, కరుణశ్రీ గారూ వచ్చారు. సభ చాలా వైభవంగా జరిగింది. నాన్నకి జనం, నాన్న తన జననీ జనకులకీ – సత్కారాలు చేసుకున్నారు.

నాన్నకి భాగవత పద్యాలు నేర్పిన తొలి గురువు మామ్మ. అలానే అక్షరాభ్యాసం చేయించి తొలి పాఠాలు చెప్పిన గురువు తాత.

తాత దగ్గర నుండి సంస్కృతాన్నీ, మామ్మ దగ్గర నుండి సంస్కృతినీ నేర్చుకున్నారు నాన్న.

భారత రామాయణాలను మా తాత విడమరిస్తే, జీవితపు విలువల్ని మా మామ్మ వివరించింది.

వాటన్నింటినీ నలుగురిలోనూ గుర్తు చేసుకున్నారు నాన్న. వాళ్ల మనస్సులు ఆర్ద్రతతోనూ, నాన్న హృదయం ఆనందంతోనూ నిండిపోయిన రోజది.

అందులో ఉన్న గొప్పతనం ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న నాకు పూర్తిగా అర్థం కాలేదు. ఈ రోజు తలచుకుంటే ఆ రోజు జరిగిందేమిటో తెలుస్తోంది.

ఆరోజుని మరిచిపోకుండా మా ఇంట్లోకి వచ్చిన ఒక వస్తువు ఇప్పటికీ మా దగ్గర ఉంది.

సన్మానంలో భాగంగా మనికొండవాళ్ళు ఒక పెట్టెని ఇచ్చారు. అది ఒక చెక్క పెట్టె. మూసి ఉన్నప్పుడు చూడ్డానికి ఒక పెద్ద పుస్తకంలా ఉంటుంది. తెరిస్తే లోపల వస్తువులు పెట్టుకోవచ్చు. దాని మీద కొత్తగుళ్ళలో నాన్నకి జరిగిన సన్మానం గురించి రాసుంటుంది.

దాన్నే మేం భారతం పెట్టె అని అంటాం. ఆరోజు మా ఇంటికి వచ్చిన ఆ పెట్టె మా ఇంట్లో ఈ రోజు కూడా ఉంది. ఇప్పటికీ దాని పేరు భారతం పెట్టే. ఆ పెట్టె వయసు నలభై రెండేళ్లు దాటింది.



అందులోనే రూపాయి కాయితాలు ఉంచేవారు నాన్న. అందులోనే తను రాసుకుంటున్న కాయితాలనీ పెట్టుకునేవారు. అందులోనే కే కే రామానుజాచార్యులుగారు బలవంతంగా నాన్న చేత బేంకులో పెట్టించిన డిపాజిట్ కాయితాలు జాగ్రత్త చేసేవారు. అది పది అంగుళాల వెడల్పూ, పన్నెండు అంగుళాల పొడవూ, నాలుగు అంగుళాల ఎత్తూ ఉన్న చక్కని టేకుపెట్టె. తాళాలు లేని పెట్టె.

బేంకులూ డబ్బు దాచడాలూ తెలియవు నాన్నకి. చాలా ఏళ్ళు దాచేందుకే లేదు. రిటైరయ్యాక వచ్చిన ప్రావిడెంట్ ఫండ్ డబ్బుని ఆచార్యులు గారి బలవంతం మీద బేంకులో పెట్టారు.

ఇంట్లో ఎవరికి ఎంత డబ్బు కావాలన్నా ఆ పెట్టెలోంచే తియ్యడం. ఎప్పుడు ఎక్కడ నుండి డబ్బు వచ్చినా నాన్న అందులోనే పెట్టేవారు. తాళం లేని ఆ పెట్టె లోంచి ఇంట్లో ఎవరెవరు డబ్బు తీస్తున్నా, ఆ పెట్టెలో డబ్బు గురించి అసలు పట్టించుకోనట్లు కనిపించినా, అందులో ఎప్పుడు ఎంత డబ్బు ఉండాలో నాన్నకి సరిగ్గా తెలిసిపోయేది.

భారతం పెట్టె మా ఇంట్లో భాగం ఐపోయింది , భారతం లాగానే.

మౌని ప్రాచేతసుని గంటమేని
కంఠమల పరాశర సూను మహా ప్రబంధ
మేని ఊపిరి, మారుతి ఎవని ఒజ్జ-
ఆ "ఉషశ్రీ"కి నేడు షష్ట్యబ్ది పూర్తి -
- లక్ష్మణ యతీంద్రులు





# మనవరాలి మాయ



తన అరైవై రెండేళ్ళ జీవితంలో ఆఖరి రెండేళ్ళూ మాయలో పడిపోయారు నాన్న– మనవరాలి మాయలో.

అది నా కడుపులో మాయలో ఉన్నప్పుడే – నాన్న దాని మాయలో ఉన్నారు.

అది పుట్టడానికి ఓ రెండు నెల్ల ముందు నేను బొంబాయి నుండి విజయవాడ వెళ్ళాను. విమానాశ్రయానికి వచ్చి నన్నింటికి తీసికెళ్ళారు. ఆ రెండు నెల్లూ నన్నెంతో జాగ్రత్తగా చూసుకున్నారు.

మా అమ్మాయి 1988 అక్టోబర్ ఇరవైన విజయదశమి నాడు పుట్టింది. ఆ రోజు నాన్న ఊళ్ళో లేరు. నొప్పులు మొదలైతే – మా పక్కింట్లో ఉండే ఉదయం రామచంద్రమూర్తి గారి సాయంతో – హాస్పిటలుకి వెళ్ళాం. నాకు చదువు చెప్పిన ప్రభా మేడమే – డెలివెరీ చేసిన డాక్టర్.

నాన్న ఊళ్ళోకి వస్తూనే పిల్ల ఎలా ఉందని అడిగారుట చెల్లెళ్ళని. వాళ్ళు నేను బావున్నానని చెప్పి – నువ్వు అడిగింది అక్క గురించా – అక్క పిల్ల గురించా? అని ఆరా తీస్తే – నాన్న నవ్వేసారుట.

మమ్మల్ని చూసుకుంటూ నాన్న ఎంత మురిసిపోయుంటారో నాకు తెలియదు. కానీ అపరాజితని చూసుకుని ఎంత మురిసిపోయారో నాకు తెలుసు. దాన్ని చూసి మురిసిపోతున్న నాన్నని చూస్తూ నేనెంత మురిసిపోయేదాన్నో. అది నాన్నకి తెలుసో తెలియదో. అప్పుడు చెప్పలేదు. ఇప్పుడు చెప్పలేను.

అది పుట్టినప్పుడు నాన్న ఇంట్లో చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. ఇల్లంతా దాని కోసమన్నట్లే తయారు చేసేసారు. తనకి మరో లోకం లేకుండా చేసేసుకున్నారు.

ఆ సమయంలో నాన్నని ఎవ్వరైనా చూస్తే గంభీర ఉపన్యాసాలు ఇచ్చే ఉషశ్రీగారేనా అని అనుకునేట్లు ఉండేవారు. అప్పటికి దానికింకా మాటలు కావు కదా కూతలు కూడా రావు. అది రోజులో చాలా భాగం నిద్రపోతూనే ఉండేది. ఐనా – రోజుల పిల్లతోనే జీవితాన్ని అల్లేసుకున్నారు నాన్న. ఎప్పుడూ అదేం చేస్తోందీ – దానికి నేనేం చెయ్యాలి అనే ధ్యాస. దానికి ఏదన్నా అవుతుందేమోననే కంగారు.



పిల్ల పిల్ల, పిల్ల నాన్నకి ఎలా ఉంటుందో అని నాకు తెలియడానికి నాన్నే నాకు నిదర్శనం. జీవితంలో ఎందరి దగ్గరో ఎన్నో సన్మానాలు పొందినప్పుడు కూడా అంత పొంగిపోయుండరు.

పిల్లకి మూడో నెలొచ్చి మేం బొంబాయి వెళ్తోంటే నాన్న పడ్డ బాధ – తర్వాత నాన్న రాసిన ఉత్తరంలో తెలిసింది.

మనవరాలి ప్రలోభంలో ఎంతగా పడి పోయారంటే – మేం బొంబాయి నుండి వస్తున్నామంటే – దింపుకుందుకు స్టేషనుకి వచ్చేసేవారు.

వచ్చిన ప్రతీసారీ మనవరాలు కాస్త కాస్త పెద్దదయ్యేది. కూతలు కూసేది. ఆ కూతలు నాన్నకి లతా మంగేష్కర్ పాటల్లా వినిపించేవి. అది పడుక్కుని నవ్వుకునేది. ఆ నవ్వులో నాన్నకి వివేకానందం కనిపించేది. అది నా అజ్ఞానాన్ని చూసి నవ్వుతోన్న పరమహంస అని మైమరచిపోయేవారు.

దాని నామకరణం, అన్నప్రాశనా – అన్నీ పండగలే నాన్నకి. ఇంక అది ఉన్నప్పుడు ఇంట్లో పండగ వస్తే నాన్నకి పండగే పండగ.

అదింకా రోజుల పిల్లగా ఉన్నప్పుడే దీపావళికి దాని చేత కాకరపువ్వొత్తులు కాల్పించారు. సంక్రాంతికి భోగిపళ్ళు పోయించారు.

దాన్ని తన పొట్ట మీద పడుక్కోపెట్టుకుని, అది తల పైకెత్తి తన వైపు చూస్తోంటే – దైవదర్శనం ఐనంత పొంగిపోయేవారు. అలా తల పైకెత్తి అది నవ్వినా, అరిచినా – ఆనందమే ఆనందం నాన్నకి.

దాన్ని చిన్న ఉయ్యాల్లో కూచోపెట్టి ఊపుకుంటూ – ఆ ఉయ్యాల ఊపునంతా తన మొహంలో తెచ్చేసుకుని – ఆడిస్తూ – ఆడేసుకునేవారు నాన్న.

ఆ ఫొటోలు ఉన్నాయి. అప్పుడప్పుడు వాటిని తీసుకుని చూస్తుంటా నేను. మా పిల్లా చూస్తుంది. దానికి ఈ ఫొటోలంటే ఎంత ఇష్టమో.

దాన్ని ఎత్తుకుని మొక్కల మధ్య తిరిగేవారు నాన్న. అది పువ్వా పువ్వా అంటూ ఒక్కో పువ్వునీ చూపిస్తోంటే – దాన్ని ప్రతి పువ్వు దగ్గరకీ తీసికెళ్ళిపోయేవారు.

దానికి సరదాగా నేను సుందరకాండ కథలో హనుమంతుడు యాపిల్ పళ్ళూ ఆల్బకరా పళ్ళూ తిన్నట్లు చెప్తే – అది అలాగే చెప్పేది. ఎవరొచ్చినా నా మనవరాలు మోడర్న్ సుందరకాండ చెప్తోందంటూ చెప్పేవారు మురిసిపోతూ. దాని చేత చెప్పించేవారు. మళ్ళీ మళ్ళీ చెప్పించుకునేవారు.

దాన్ని తీసుకుని నేను బొంబాయి వెళ్ళినప్పుడల్లా నాన్నకి దిగులే. ఆ దిగులు నాన్న ఉత్తరాల్లో కనిపించేది. నాన్న దాన్ని పరమహంసా అని సంబోధిస్తూ ఉత్తరాలు రాసేవారు. అవి పేరుకి మాత్రమే మనవరాలికి రాసిన ఉత్తరాలు. – నిజానికి అవి నాన్న తనకి తాను రాసుకున్న ఉత్తరాలే. వాటిలో మచ్చుకి కొన్ని వాక్యాలు –

"నువ్వు నా బొజ్జ మీద పడుకుని కింది పెదవి చప్పరిస్తూ ఆదిశేషుని పడగలా తలపైకెత్తుతున్నట్లే ఉన్నావు."





"మత్స్యావతారంలా మంచంమీద కొట్టుకోకుండా కూర్మావతారానివై పాకడం మొదలెట్టావు. ఇక డబుల్ ప్రమోషన్‌తో నృసింహావతారంలా కన్నులెర్రజేస్తావనుకుంటా ఇక్కడికి వచ్చేసరికి"

"రామకృష్ణ పరమహంసలా లోకం అవివేకాన్ని చూసి నవ్వుతూంటావు. స్వామి వివేకానందునివలె హుంకరిస్తావు."

"నేను బొంబాయి ఎప్పుడు వస్తానో నాకు తెలియదు. నీకు తెలిసినా నువ్వు చెప్పవు. నవ్వుతూ లోకాన్ని చూసి కాళ్ళూ చేతులూ ఊపుతూ జాలిపడే జ్ఞానివి నువ్వు."

"ఇలా నేను రాస్తే మా పెద్ద చెల్లి తన అన్నగారు ఎంత అజ్ఞానంలో పడ్డాడో అనుకుంటుంది."

భగవద్గీత ఒంట పట్టించుకున్నాననుకున్నా అని –

మన్ని మనం తెలుసుకున్నా – మన మనోభావాలు మనకి బాగా అర్థం ఐనా – మనలో మార్పు రాడానికి అవి చాలవు.

గీతని చెప్పినవాడు జగద్గురువు. విన్నవాడు సాక్షాత్తూ నరుడు. విని యుద్ధం మొదలెట్టాడు. మారాడేమో అని అనుకుంటే – పదిహేను రోజులు కూడా కాకుండా – అభిమన్యుడు అంతమయ్యాడని తెలియగానే – ముందు దుఃఖానికీ, తర్వాత కోపానికీ లొంగిపోయాడు. సూర్యుడు కృంగేలోగా సైంధవుణ్ణి సంహరించకపోతే మరణిస్తానని శపథం చేసాడు.

జనన మరణాలు సర్వ సాధారణమనీ, వాటి గురించి పొంగి కృంగి పోవడం తగదని బోధించిన కృష్ణుడి ముందే – బావ చెప్పిందంతా మరిచిపోయి ఏడ్చాడు. ప్రతిజ్ఞ చేసాడు. అదీ మాయ.

మాయ తొలగిపోతే మనిషికి మిగిలేదేమిటో నాకైతే తెలియదు. నాన్నకి ఈపాటికి తెలిసిందేమో తెలియదు. తెలిసినా నాన్న చెప్పరు – చెప్పలేరు.

ఐతే మాయలోనూ ఆనందం ఉంది – అదే మనవరాలి మాయలో పడి అనుభవించారు నాన్న. నాకు జీవితంలో మిగిలిన పెద్ద తృప్తి – నాన్నకి నేను ఆ ఆనందాన్ని ఇవ్వడం.

**ప్రయోగాత్మకంగా ఒక ఐదు నిమిషాలు శనివారాలు మధ్యాహ్నం**
**భారతం కథను ఉషశ్రీ చేత చెప్పించడం మొదలెట్టింది విజయవాడ ఆకాశవాణి.**
**అది ఎంత ప్రజాదరణ పొందిందంటే**
**అతి తొందరలో ఆదివారాలు మధ్యాహ్నం అరగంట కార్యక్రమం అయిపోయింది.**
**అదీ ఉషశ్రీ అంటే**

**- బాలాంత్రపు రజనీకాంతరావు**



# కర్కాటకం

ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు నాలుగు రోజులు తేడాతో ఐపోయాయి. 1990 ఫిబ్రవరి ఒకటిన పద్మది, నాలుగున జయంతిది.

అప్పుడే నాన్న నడ్డి నొప్పి బయటపడింది. నాన్నకి అంతకు ముందే తెలిసుండచ్చు. మాతో అనలేదు. తన బాధ గురించి మాతో చెప్పుకునే అలవాటే లేదు నాన్నకి. అడిగి తెలుసుకోవాలనే జ్ఞానం అలవడలేదు మాకు.

ఊళ్ళో డాక్టర్లకి చూపిస్తే నడుం నొప్పికి మందిచ్చారే తప్ప దానికి అసలు కారణం గురించి ఆలోచించలేదు ఎవ్వరూ. ఆ నొప్పి చేతికి పాకినప్పుడు కూడా దాని అంతం చూడ్డానికి – దాని ఆది అర్థం చేసుకోవాలని అనిపించలేదు. ఎవ్వరినీ ఏమీ అనలేం. అసలది పెద్దగా పట్టించుకునే వ్యవహారం అని అనిపించనేలేదు ఎవ్వరికీ.

ఆ ధైర్యంతోనే చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు అయ్యాక నేను పిల్లని తీసుకుని బొంబాయి వెళ్ళిపోయాను. నిజానికి అది ధైర్యం కాదు, భ్రమ – ఏమీ అవదన్న భ్రమ. అమాయకత్వం – ఏదో అవుతుందేమో అని తెలియని అమాయకత్వం. ఆ భ్రమా అమాయకత్వం లేకపోతే మనిషికి మనశ్శాంతే ఉండదేమో.

మా ఇంట్లో నా చిన్నప్పట్నుండీ ఎవరి ఆరోగ్యం గురించీ పెద్దగా ఆందోళన పడిపోడం లేదు. అది సరైనదా కాదా అన్న మీమాంసతో ఇప్పుడు పని కూడా లేదు.

అంతగా అర్థంకాని అమ్మ అజ్ఞానం, డాక్టర్లని తప్పించుకునే నాన్న పిరికితనం – మా ఇంట్లో ఎవరికి ఏం వచ్చినా మామూలుగా ఇళ్ళలో తెలిసిన వైద్యం తో గడిచిపోయేదే తప్ప – హాస్పిటళ్ళకి వెళ్ళడం అనేదే లేదు. హాస్పిటల్ మొదట తెలిసింది నేను మెడిసిన్ లో చేరాకేనేమో. ఆ తర్వాత మాఅమ్మకి గుండె నొప్పి వచ్చినప్పుడు.

నాన్న లేవలేకపోతున్నారని – నేను జూలై రెండో వారంలో మళ్ళీ విజయవాడ వెళ్ళాను.





అప్పుడు రోజూ కొంతసేపు నాచేత సుందరకాండ చదివించుకునేవారు నాన్న. నాన్న నరనరాల్లో నిండిపోయిన హనుమంతుడి కథను ఆయన ముందు కూచుని చదవడాన్ని – ఏమనాలి? హనుమంతుడి ముందు కుప్పిగంతులనా? నేను చదివే తీరు నాన్నకెలా అనిపించేదో. భరించారు  నాన్న, ఎప్పటిలాగే, నన్ను.

ఆరోజు నాన్నకేదో అయిందని కానీ అవుతుందని కానీ – నాకు తెలియదు. దేవుడెంత నిర్దయుడో అంత దయామయుడు కూడా.

నాన్నకి అంత అనారోగ్యం ఇచ్చినా – దాని బాధ తాలూకు నీడ మా మీద పడకుండా చూసుకున్నాడు.

చాలా రోజులు నాన్నకి వచ్చింది పెద్ద జబ్బని తెలియకుండా ఉంచాడు. అది పెద్దదని తెలిసాక అజ్ఞానంలో ఎక్కువ రోజులు ఉంచకుండా – తన దగ్గరకి తీసికెళ్ళిపోయాడు. ఆ కొన్నాళ్ళూ కూడా అది తగ్గిపోతుందని అనుకునేలా పరిస్థితులు కలిగించాడు.

నేను విజయవాడ వచ్చాకే – కృష్ణలీలలు రికార్డింగుకి ఆకాశవాణి నుండి పిలుపు వచ్చింది నాన్నకి. అది రేడియో ఆర్కైవుల కోసమని చేసిన రికార్డింగు. అప్పటికి ఉద్యోగంలోంచి రిటైరైపోయారు నాన్న.

అంతనొప్పితోనూ నాన్న రికార్డింగుకి వెళ్ళి వచ్చారు.  చాలాసేపే రికార్డింగ్ చేసారు. అదే ఆలిండియా రేడియోలో నాన్న ఆఖరి రికార్డింగ్. ఆ రికార్డ్ ఇప్పుడు వాళ్ళ దగ్గర ఉందో లేదో. ఎప్పుడో అక్కడ అడిగితే నాన్న ప్రసంగాల రికార్డులు ఏవీ లేవని అన్నారు. ఐతే నాన్న అభిమానులు కొందరు ఇళ్ళలో తమ తమ కేసట్ల మీద రికార్డ్ చేసుకుని ఉండచ్చు. కేసట్లు పోయి సీడీలు వచ్చాక వాటి మీదకి ఎక్కించుకుని ఉండచ్చు. ఇప్పుడు అవేం అవసరం లేకుండా కంప్యూటర్ల మీదా నెట్ మీదా దాచుకుంటూ ఉండచ్చు.

ఆ రికార్డింగుకి వెళ్ళి వచ్చాక – రికార్డింగ్ జరుగుతున్నంతసేపూ ఏ బాధా లేదమ్మా – ఇదంతా ఏ పనీ లేకుండా ఉండడం వల్లనేనమ్మా అని ఆనందపడిపోయారు. ఆ ఆనందం ఎంతో సేపు లేదు.

కేన్సర్ బాధ సామాన్యమైనదా? అది లోపల ముదిరే దాకా బాధ తెలియనివ్వదు. తెలిసాక రోజులో, వారాలో, నెలలో, సంవత్సరాలో – ఎవరి అదృష్టం వాళ్లది. నా అదృష్టం కొన్ని వారాలే. నేను జూలై మధ్యలో బొంబాయి నుండి విజయవాడ వచ్చాను. అప్పటికి  జబ్బేమిటో తెలియదు. నడుంలోనూ చేతిలోనూ నొప్పి అని తప్ప.

ఇలాంటి నొప్పులకి న్యూరాలజీతో సంబంధం ఉంటుందని డాక్టర్ రంగారావు గారి దగ్గరకి వెళ్ళాం. ఇప్పట్లా యెమ్మారైలు చేసే లేబొరేటరీలు అప్పటికి విజయవాడలో వచ్చెయ్యలేదు. ఆయన దైతో ఎక్స్–రే తీయించి వెన్నెముక దగ్గర గడ్డ ఉందని అన్నారు. అని – "అది మేలిగ్నంటో కాదో బయాప్సీలో కానీ తెలియదు. బయాప్సీ అంటే సర్జరీ చెయ్యాలి. సర్జరీ చేస్తే ఏం సమస్యలు వస్తాయో చెప్పలేం. అమెరికాలో చేయించినా వెన్నెముక దగ్గర సర్జరీ ప్రమాదకరమే. అంతే కాదు. ఒకవేళ అది కేన్సర్ ఐతే – ఆ సర్జరీ వల్ల అది తొందరగా పాకిపోయే అవకాశం ఉంది. అది చాలా అపాయకరం" – అని చెప్పారు.

ఆయన రోగ నిర్ధారణ చెయ్యలేదు. కానీ రాబోయే ప్రమాదాన్ని సూచించారు.



ఆయన మాటలు నాకు నచ్చలేదు. సాయంగా వచ్చిన నాన్న స్నేహితుడికీ నచ్చలేదు. వాటిని మేము నమ్మలేదు. అది మనిషి బలహీనత. తీపి అబద్ధాన్ని నమ్మినట్లు కటువు నిజాలని నమ్మం. నేనూ అదే చేశా. హైదరాబాదుకి తీసికెళ్ళి పెద్ద డాక్టర్లకి చూపిద్దాం అని అనుకున్నా. ఆ మాటే నాన్నతో అంటే –

హైదరాబాద్ ఎందుకమ్మా? ఇక్కడే చేయించుకుందాం వైద్యం – ఇక్కడైతే మనకి తెలిసిన వాళ్ళు ఉన్నారు – అందరికీ దగ్గర కూడానూ అని అన్నారు. ఐనా నేను వినలేదు. నా బలవంతం మీదా, స్నేహితుల సలహా మీదా, కొందరు డాక్టర్ మిత్రుల భరోసా మీదా – హైదరాబాద్ వెళ్ళడానికి ఒప్పుకున్నారు.

ఏంచేస్తే ఏంజరుగుతుందో – ముందే తెలిస్తే – మనుషుల జీవితాలు మనుషుల చేతుల్లోనే ఉండేవి. అలా ఉండవు కదా జీవితాలు.

నాన్నా, నేనూ, రెండేళ్ళు కూడా నిండని మా అమ్మాయి అపరాజితా – మాతోపాటు నాన్న స్నేహితులు పెండ్యాలగారూ – రైల్లో ప్రయాణం. ఆఖరి చెల్లి కళ్యాణి రెండురోజుల ముందే హైదరాబాద్ వెళ్ళింది.

రిజర్వేషన్ల గురించీ సీట్ల గురించీ  పెండ్యాలగారే టీసీతో మాట్లాడారు. అవన్నీ మనకి చేతకాదమ్మా – వాడే సరి అన్నారు నాన్న.

స్థానబలం అంటారు. ఎక్కడైనా సరే స్టేజెక్కి – జనంలో ఎలాంటి వారున్నా అనర్గళంగా నిర్భయంగా ప్రసంగం చెయ్యగలరు నాన్న. అదే నాన్న తక్కిన వాళ్ళు మామూలుగా చేసెయ్యగలిగిన పనులు చెయ్యలేరు. ఆఖరికి మా ఇంటి కరెంట్ బిల్లులు

నాన్న లోని ఈ పార్శ్వం గురించి –  మా ఇల్లు కట్టిస్తున్నప్పుడూ, నా పెళ్ళి చేయిస్తున్నప్పుడూ – బాగా అర్థం అయింది నాకు.

ఇరవై ఏళ్ళ క్రితం వదిలేసిన హైదరాబాదుకి మళ్ళీ రైల్లో ప్రయాణం చేసాం. అప్పుడు  విజయవాడ వెళ్ళడం ఇష్టం లేదు నాకు. నాన్న నచ్చచెప్పి తీసుకుని వెళ్ళారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రయాణం నాన్నకి ఇష్టంలేదు. నేను నచ్చచెప్పి తీసుకు వెళ్ళాను.

ఆగస్ట్ మొదటివారంలో హైదరాబాద్ చేరాం. అక్కడకి చేరడం చేరడం మేం మూర్తిగారింటికి వెళ్ళాం. మూర్తిగారంటే రామచంద్రమూర్తి గారు. అంతకు కొన్నాళ్ళక్రితం వరకూ ఆయన విజయవాడలో ఉదయంలో పనిచేస్తూ ఉండేవారు. మా ఇంటికి పక్క ఇంట్లోనే ఉండేవారు. నాన్నకీ ఆయనకీ మంచి స్నేహం. ఆయన భార్య కమలా, అమ్మా బాగా కలిసిపోయారు. అప్పటికే నేను పెళ్ళై హైదరాబాద్, బొంబాయిలలో ఉంటూండేదాన్ని. అందుకని నాకు చెల్లీ వాళ్ళకున్నట్లు వాళ్ళతో చనువు లేదు. ఎందుకు నాన్నా వాళ్ళింట్లో అని అన్నట్లు గుర్తు. ఎంతమ్మా ఓ వారం రోజులేగా. డాక్టర్కి చూపించుకోడం – వెనక్కెళ్ళిపోడం – అని నాకు ధైర్యం చెప్తూ తనకి తాను ధైర్యం చెప్పుకున్నారు నాన్న.

నాన్నని గోటేటి రామచంద్రరావు గారి సాయంతో ఉస్మానియా హాస్పిటల్లో చేర్చాను. అక్కడ ఉండలేకపోయారు నాన్న. అప్పటికీ ఓ వార్డులోంచి ఇంకోవార్డులోకి మార్పించాను. ఐనా అక్కడ ఉండడం నాన్న వల్ల కాలేదు.





హాస్పిటళ్ళనీ, డాక్టర్లనీ ఎలాగైనా తప్పించుకోవాలనుకుంటారు నాన్న. అందుకే అక్కడి డాక్టరుతో – రేపు మానాన్న తద్దినం ఉంది పెట్టేసుకుని వచ్చి ఎల్లుండి మళ్ళీ చేరతాను – అని చిన్నపిల్లాడిలా అబద్ధం చెప్పి హాస్పిటల్ నుండి వచ్చేసారు.

ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నప్పుడు పాలగుమ్మి విశ్వనాథం గారు డాక్టర్ రామకృష్ణప్రసాద్ గారి పేరు చెప్పారు. రామకృష్ణప్రసాద్ గారు మూర్తి గారి ఇంటికే వచ్చి నాన్నని చూశారు. నాన్నగారి వెన్నుకి సర్జరీ చేస్తాను, వారం రోజులు – సరిగ్గా వారం రోజుల్లో – నాన్నగారు లేచి నిలబడి నడుచుకుంటూ ఇంటికి వెళ్తారు అని అభయం ఇచ్చారు.

విజయవాడలో రంగారావు గారు నాకు చెప్పిందంతా నేను నాన్నకి చెప్పలేదు. అందుకే నాన్న ముందు కాక, బయటకి వెళ్ళి రామకృష్ణప్రసాద్ గారితో విజయవాడ లో రంగారావు గారు చెప్పిన మాటలు చెప్పాను. ఆయన గట్టిగా నవ్వేసి –

మా అమ్మకి నేనే సర్జరీ చేసాను – ఆవిడ ఇప్పటికీ హాయిగా తిరుగుతోంది – అని ధైర్యం చెప్పారు.

మునిగిపోతున్న వాడు ఎక్కడ ఏ ఆధారం దొరికినా దాన్ని గట్టిగా పట్టుకుంటాడు. విజయవాడలో రంగారావు గారు ఆ ఆధారం ఇవ్వలేదు. హైదరాబాద్ లో రామకృష్ణప్రసాద్ గారు ఆ ఆధారాన్ని చూపించారు.

విశ్వనాథం గారూ, మూర్తి గారూ నాతో మాట్లాడారు. డాక్టర్ చూపించిన అరచేతిలో స్వర్గం అందంగా ఉంది. ఆయనకి నాన్నని అప్పగించేసాము.

ఆ తర్వాత ఆలోచించుకుందుకూ ముందు వెనకలూ చూసుకుందుకూ సమయం దొరకలేదు. రామకృష్ణప్రసాద్ గారు ఇవ్వలేదు.

ఆయన్ని కలిసిన రెండోరోజునో మూడో రోజునో – ఇంకా చేయించిన అన్ని పరీక్షల రిపోర్టులూ రాకుండా – సర్జరీ చెయ్యడానికి సిద్ధమైపోయారు.

మూర్తి గారి కార్లోనే మేం హైదరాబాద్ నర్సింగ్ హెూం కి వెళ్ళాం. చెయ్యబోయే సర్జరీ గురించి కానీ దాని వల్ల కలిగే పరిణామాల గురించి కానీ నాన్నకి అవగాహన లేదు. నాన్న తనదయిన ధోరణిలో – మనకి స్వంత కారు లేకపోయినా మంచి వాహన యోగం ఉంది. ఎప్పుడూ కారు ప్రయాణాలే అని జోకులేసారు.

సర్జరీ జరిగింది ఆగస్ట్ పధ్నాలుగో తారీకున. సర్జరీ చాలా పెద్దది. ఐదారు గంటలు పట్టినట్లు గుర్తు. అంతసేపూ నేనూ – నాకు సాయంగా మూర్తిగారూ, విశ్వనాథం గారూ, పెండ్యాల గారూ. పిల్లని పెట్టుకుని ఇంట్లో కళ్యాణి.

సర్జరీ జరిగిన ఒకట్రెండు రోజులకి నాన్న లేవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు తెలిసింది నాన్న తన కాళ్ళని కదపలేకపోతున్నారనీ, సర్జరీకి ముందే పరిస్థితి నయంగా ఉందనీ.

తనేదో తప్పు చేసాడని తెలిసిపోయింది వాడికి అన్నారు నాన్న. అదెంత తప్పో నెమ్మదిగా అర్థం అయింది నాకు. మొదటసారిగా భయం వేసింది.



నాన్న మామూలు మనిషి అవుతారా అవరా,

సర్జరీ అయిన వారం రోజులకి బయాప్సీ రిపోర్ట్ వచ్చింది. దాంతో స్పష్టంగా తెలిసింది – నాన్న వెన్నులో ఉన్న గడ్డ కేన్సర్ గడ్డే అనీ – దానికి కత్తి తగలగానే అది అన్ని పక్కలకీ పాకిపోయిందనీ – అందువల్లే పరిస్థితి సర్జరీ తో బాగా క్షీణించిదనీ.

ప్రసాద్ గారు సర్జరీ చెయ్యడానికి అంత తొందర ఎందుకు పడ్డారో ఇప్పటికీ తెలియదు. డబ్బు కోసం అనుకుందామంటే ఆయన తన ఫీజంటూ ఏమీ అడగలేదు. మరి ఆయన్ని సర్జరీ వైపు ఏ శక్తి తరిమిందో. మమ్మల్ని తరిమించిందో.

ఆయన్ని నమ్మి ఆయన చేతుల్లో నాన్న శరీరాన్నీ, ఆరోగ్యాన్నీ, ఆయుర్దాయాన్నీ పెడితే – ఆయన ఏం చేసారో తెలియదు. వచ్చింది కేన్సరని పేరు పెట్టడానికి ఇంత బాధ పెట్టాలా?

ఇంక తను చేసేదేం లేదని – రేడియో కెమో థెరపీలకి బీబీ కేన్సర్ హాస్పిటలుకి తీసికెళ్లమన్నారు.

వాస్తవికతను కల్పిపుచ్చడం కాక,

కళాత్మకంగా ప్రదర్శించడం ఉషశ్రీ ప్రత్యేకత.

అందుకు మంచి ఉదాహరణ జ్వలితజ్వాల.

జ్వలితజ్వాలలో ఉషశ్రీ ప్రదర్శించిన శిల్ప నైపుణ్యం అతి విశిష్టమైంది; అద్భుతమైంది.

అందుకు రచయిత అస్తమానం గర్వపడవచ్చు

– త్రిపురనేని గోపీచంద్

# మళ్ళీ దొడ్డమ్మ ఇంటికి



ఉవ్వెత్తున ఉప్పొంగుతున్న ఉద్రేకాన్నీ, వరదలా ఉరుకుతున్న కన్నీరునీ అణచుకుని, మలక్‌పేటలో ఉన్న బీబీ హాస్పిటలుకి తీసుకుని వెళ్లాను. అది ఆగస్ట్ ఇరవై నాలుగో ఇరవై అయిదో తారీకు అయ్యుంటుంది. అక్కడకి వెళ్ళాక నాన్నకీ అర్థం అయింది తనకి వచ్చింది కేన్సరని. అంతకు కొన్ని నెలల ముందు అక్కడే విశ్వనాథ సత్యనారాయణ గారి అమ్మాయికీ, అల్లుడికీ కాన్సర్ వైద్యం జరగడం నాన్నకి తెలుసు. అందుకే ఆ హాస్పిటల్ పేరు చూడగానే నాన్నకి తన అనారోగ్యం ఏమిటో తెలిసింది. తనకి తెలిసినట్లు నా ముందు వ్యక్తం చెయ్యలేదు నాన్న. అదే మా నాన్న ప్రత్యేక లక్షణం. తనకి తెలిసిన ప్రతీదాని గురించీ మాట్లాడెయ్యరు, ఎటువంటి పరిస్థితిలోనయినా సరే.

మలకపేట దిల్సుఖ్ నగర్‌కి దగ్గరే అని దిల్సుఖ్ నగర్‌లో ఉంటున్న మా దొడ్డమ్మ వాళ్ళింటికి మకాం మార్చాం. అప్పటి వరకూ విజయవాడలోనే ఉన్న మా అమ్మ కూడా హైదరాబాద్ వచ్చింది.

ఇప్పుడు తలుచుకుంటే సంఘటనలు ఎంత చిత్రంగా జరుగుతాయా అని అనిపిస్తుంది. నన్ను చిన్నపిల్లగా హైదరాబాద్ తీసుకొచ్చిన కొత్తలో నన్నూ అమ్మనూ దొడ్డమ్మ దగ్గరే ఉంచారు నాన్న. నాన్న చివరి రోజుల్లో మేం ఇద్దరం మళ్ళీ అక్కడే ఉన్నాం. దొడ్డమ్మా, పెద్దనాన్నా కూడా మహా దొడ్డ మనస్సున్న వాళ్ళు. వాళ్లిద్దరి దగ్గరా బాగా చనువు నాన్నకి. దొడ్డమ్మా నాన్నా ఐతే ఒకరి మీదొకరు జోకులేసుకునేవారు. నాన్న బీబీలో ఉన్న పన్నెండు రోజులూ దొడ్డమ్మ ఆరోజుల్నే తల్చుకుంటూ ఉండేది.

అప్పుడే వినాయక చవితి వచ్చింది. దొడ్డమ్మ నాన్న కోసం ఉండ్రాళ్ళూ, పరవాన్నం చేసి తీసుకొచ్చింది. అప్పుడు కూడా నాన్న దొడ్డమ్మతో హాస్య ధోరణిలో మాట్లాడారు తప్ప జబ్బు గురించి మాట మాత్రం మాట్లాడలేదు. దొడ్డమ్మా, పెద్దనాన్నా – ఇద్దరూ నాకు ధైర్యం చెప్తూనే ఉండేవారు. పిల్లకైతే వాళ్లతో బాగా కాలక్షేపం. వాళ్లింటి దొడ్లో ఉన్న మొక్కల్లో తిరుగుతూ ఉండేది.



ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. అంత చిన్నపిల్లైనా – అది మేం హైదరాబాదులో ఉన్న నెల రోజుల్లో ఒక్క రోజు కూడా – కష్టపెట్టలేదు. ఎవరింట్లో ఉంటే వాళ్లతో సరిపెట్టుకునేది. ఎక్కడ ఉంటే అక్కడ మనుషులకీ, భోజనానికీ, గదులకీ, సమయాలకీ అలవాటు పడిపోయేది.

నాన్న గురించి చెప్పేది ఏముంది? ఒక్కసారి కూడా నన్ను హైదరాబాద్ తీసుకొచ్చావెందుకమ్మా అని అనలేదు. ఎంత బాధనైనా భరించారు. అంత బాధలోనూ నువ్వు భోంచేసావా? పిల్ల ఎలా ఉంది అని అడిగారే కానీ ఒక్కసారి కూడా తన బాధను గురించి నాతో అనలేదు. నన్ను కష్టపెట్టకూడదనే నాన్న తాపత్రయం అంతా.

అంతే కాదు. తనకెంతో ఇష్టమైన మనవరాల్ని ఒక్కసారి కూడా హాస్పిటలుకి తీసుకు రమ్మనలేదు. చిన్నపిల్లని హాస్పిటలుకి తీసుకు రాకూడదన్న వివేకాన్ని – అంత బాధలోనూ కోల్పోలేదు నాన్న. అంత కష్టంలోనూ సంయమనాన్ని వదులుకోలేదు. ఇప్పుడు తలచుకుంటే ఎంత బాధగానో అనిపిస్తుంది.

తన బాధంతా పెండ్యాలగారితో చెప్పుకునేవారుట. ఆ తర్వాత చెప్పారాయన. కేన్సరూ, దాని ట్రీట్మెంటూ అంతా ఒక బాధ. అంత బాధ అనుభవించాల్సి వచ్చింది. ఒక్కోసారి బాధని భరించలేక కరెంట్ స్విచ్చిల్లో వేళ్ళు పెట్టెయ్యాలని అనిపిస్తోందని అనేవారుట ఆయనతో.

అంత బాధ పడుతూ కూడా తన హాస్యాన్ని వదిలిపెట్టలేదు. నాన్నని గదిలోంచి ట్రీట్మెంట్ రూంకి తీసికెళ్ళడానికి వచ్చిన వార్డ్ బాయ్స్‌తో – వచ్చారా వాహకులు మోసెయ్యండి అని హాస్యమాడేవారు. తనని చూడ్డానికి వచ్చిన స్నేహితులతో – ఇదిగో అంపశయ్యమీద ఉన్నానని అనేవారు.

కే కే రామానుజాచార్యులి గారి బావగారు – నల్లాంచక్రవర్తుల రామానుజాచార్యుల గారిని హాస్పిటలుకి పిలిపించుకుని – ఆయన చేత ఆయన రాస్తున్న రామాయణంలోని పద్యాలు చదివించుకునేవారు. ఆయన తరవాత ఒకచోట రాసుకున్నారు – రామాయణాన్ని పద్యంలో రాయమని ఆయన్ని ప్రోత్సహించింది నాన్నేనట.

హైదరాబాద్ లో ఉన్నన్నాళ్ళూ నాన్నని అంటిపెట్టుకుని ఉన్నది పెండ్యాలగారే. ఏజన్మ అనుబంధమో అనిపిస్తుంది తలచుకున్నప్పుడల్లా.

మేం హైదరాబాద్ వెళ్తున్నప్పుడు మాతో ప్రయాణమైన ఆయన్ని నేను నా జీవితంలో మొట్టమొదటి సారి చూసాను. మా ఇంటికి ఆయన వచ్చిందే లేదు. ఆయన గురించి నాన్న దగ్గర కూడా నేనెక్కువ విన్న గుర్తే లేదు. ఐతే నాన్న చివరి రోజులన్నీ ఆయన సేవతోనే గడిచిపోయాయి. ఆయన నాన్నకి చేసిందాన్ని ఏమనాలో నాకు తెలియదు.

మధ్యలో ఒకట్రెండు రోజులు ఏదో పనుండి వెళ్లింది వదిలేస్తే – ఆయన నాన్నని వదిలి పెట్టి ఉన్నది లేదు. ఒక్కోసారి నాన్న తిన్నది గొంతు దిగక బయటకొచ్చేస్తోంటే – తన కండువాతో నాన్న నోరు తుడిచే వారాయన. ఆ దృశ్యం నా కళ్ళకి కట్టినట్లు కనిపించాలి కానీ ఒక్కసారి కూడా కనిపించదు. ఎప్పుడు ఆ విషయాన్ని తల్చుకున్నా కళ్ళకీ, గుండెకీ తడవుతుంది. అంతా మసక మసక గా కనిపిస్తుంది.

ఆయన లాంటి స్నేహితుల్ని సంపాదించుకున్న నాన్న జన్మ ధన్యం. నాన్న ద్వారా అలాంటి సత్సాంగత్యం అబ్బించుకున్న మా జన్మా ధన్యం.





కొన్నాళ్ళు బీబీలో ఉన్నాక అర్థమైందేమిటంటే – నాన్నకింక ఏ ట్రీట్మెంటూ అవసరం లేదని. ఈ రోజుల్లో ఎక్కువగా వాడుతున్న పేలియాటివ్ కేర్ లాంటిది అప్పుడు ఎక్కువగా వినిపించేది కాదు. నాకైతే తెలియదు. నిజానికి అప్పుడు కావల్సింది అలాంటి ఆలంబన.

నాన్న శరీరానికి రేడియంలనీ, కెమికల్స్నీ భరించే శక్తీ లేదు. కావల్సింది నొప్పిని తగ్గించే ఉపశమనపు వైద్యం.

అలాంటి ఉపశమనం కోసం కొన్నాళ్ళు ఏదైనా మంచి హాస్పిటల్లో ఉంచి – కొంత తగ్గగానే విజయవాడ ఇంటికి తీసికెళ్ళిపోదామని మసాబ్ టేంక్ దగ్గర మహావీర్ హాస్పిటల్లో చేర్చాను.

నా స్కూలూ, కాలేజీ రికార్డులన్నింట్లోనూ – తండ్రిగా నాన్నే నాకు గార్డియన్. ఐతే హైదరాబాద్లో నాన్నని చేర్చిన మూడు హాస్పిటళ్ళ రికార్డుల్లోనూ నేనే నాన్నకి గార్డియన్ని.

నేను నాన్నకి గార్డియన్నేంటి ? ఏమనుకోవాలి అలాంటి రికార్డుని?

ఉషశ్రీకి కథకులు శ్రీపాద వారి మీద గాఢాభిమానం.
ఉషశ్రీ కథన విధానం, వాక్యాలు అమర్చేతీరు, వాడే భాష,
గవ్వల గుత్తిలాగ సంభాషణలు నిర్వహించే వైఖరి
శ్రీపాద వారిని గుర్తుతెస్తాయి

– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

# మహా నిర్యాణం




బుద్ధుడి లాగానే మహావీరుడు కూడా శాంతి కోసం ఉపదేశం చేసిన గొప్ప ప్రవక్త. ఆయన పేరున్న హాస్పిటలే మాకా సమయానికి కావల్సింది.

అక్కడ డాక్టర్ల కన్న నర్సుల తోటే పని ఎక్కువగా ఉండేది. పెండ్యాల గారు నాన్నతోనే ఉండేవారు. నేను పగలంతా హాస్పిటల్లో ఉండి, రాత్రుళ్ళు ఇంటికి పిల్లదగ్గరకి వెళ్ళి వస్తూండేదాన్ని.

మూడు నాలుగు రోజులు ఉన్నామేమో మహావీర్ హాస్పిటల్లో. సెప్టెంబర్ ఎనిమిదో తారీకు విజయవాడ ప్రయాణానికి టిక్కట్లు కొనుకున్నాం. నాన్నకూ, నాకూ, అమ్మకూ, బుజ్జికీ, పెండ్యాలగారికీ. పిల్లకింకా టిక్కట్ వయస్సు రాలేదు.

ట్రీట్మెంట్ మానేసాక నాన్న మొహంలో కాస్త తెరిపి వచ్చింది. ఇంక విజయవాడ వెళ్ళిపోతున్నామంటే బాగా ఉత్సాహమూ వచ్చింది.

ఆ ఉత్సాహంలోనే 'ఎవరైనా హాస్పిటల్లకి ఆంబులన్సులలో వచ్చి కార్లలో వెనక్కి వెళ్తారు. మనం కార్లలో వచ్చి ఆంబులన్సులలో వెళ్తున్నాం' అని జోకేసారు.

సెప్టెంబర్ ఏడో తారీకు.

మర్నాడు ప్రయాణం కదా అని పసుపూ కుంకుమలతో చీర పెట్టడానికి దొడ్డమ్మవాళ్ళ ఇంటికి రమ్మంటే మా అమ్మవెళ్ళింది. అదే అమ్మ అందుకున్న ఆఖరి పసుపూకుంకుమ అవుతుందని ఎవరనుకుని ఉంటారు?





మరుక్షణం ఏమవుతుందో తెలియకుండా సాగుతుంది జీవిత నాటకం. పాత్రధారులకి ఎప్పటికప్పుడు స్క్రిప్ట్ అందిస్తూ ఉంటాడు కనిపించని అజ్ఞాత దర్శకుడు. నవ్వుతున్న పాత్ర హటాత్తుగా ఏడవాల్సి రావచ్చు. ఏడుస్తున్న పాత్రకి నవ్వే అవకాశం రావచ్చు. ఈ నాటకం విచిత్రం ఏమిటంటే – నాటకం వేసేవాళ్ళే చూసేవాళ్ళు కూడా.

పెండ్యాలగారూ నాన్నా నేనూ మర్నాడు ప్రయాణం గురించి మాట్లాడుకుంటున్నాం.

మాటల మధ్యలో పెండ్యాల గారు బాత్రూంకి వెళ్ళారు. నాన్నా నేనూ ఇద్దరమే ఉన్నాం. నేను నాన్న తాగడానికి కాంప్లాన్ కలిపి, దగ్గరకి వెళ్ళి చెంచాతో గొంతులో పోస్తున్నాను. ఒక్క గుక్క వెళ్ళిందో లేదో – మరో చెంచాడు తీసేడప్పటికి – నాన్న నోట్లోంచి బయటకి కారిపోతోంది. నాకు కంగారొచ్చి పెండ్యాలగారిని పిలిచాను. ఆయన హడావిడిగా వచ్చి డాక్టర్ని పిలుచుకొచ్చారు. డాక్టరొచ్చి చూసారు. అంతే.

నాన్న ఆఖరి క్షణాల్లో కూడా నాన్న దగ్గర ఉన్నానన్న తృప్తి మిగిలిందేమో తెలియదు. కానీ నాన్నని ఆఖరి క్షణాల్లో చూడాల్సొచ్చిందే అన్న బాధ కూడా మిగిలింది.

ఐతే ఆ క్షణం తృప్తి బాధా ఏమీ తెలియవు. నాకేమవుతోందో తెలియలేదు. నేను కుర్చీలో వాలిపోయాను. నన్నలా చూసుంటే నాన్న ఎంత బెంబేలు పడిపోయేవారో. ఐతే చూడ్డానికి నాన్న లేరు. అప్పట్నుంచీ – నేనేం చేసినా చూసేందుకు నాన్న లేరు.

అదే నాన్నని ప్రాణాలతో ఆఖరిసారి చూడ్డం. ఆ తర్వాత కొన్ని గంటలు నాన్నతోనే గడిపాను. ఆ అచేతన శరీరంతో. మర్నాడు విజయవాడ ప్రయాణం కోసం కొనుక్కున్న రైల్ టిక్కట్లు అవసరం లేకుండా పోయాయి. రాత్రికి రాత్రి విజయవాడకి ఆంబులెన్సులో బయల్దేరాల్సి వచ్చింది.

అందులో నాన్నా, అమ్మా, నేనూ, దొడ్డమ్మా, శ్యామలానందప్రసాద్ గారూ. పాలపర్తి శ్యామలానందప్రసాద్ గారు మా ఇంట్లో మనిషి లాంటి వారే. ఆయన ఏదో పని మీద హైదరాబాద్ వచ్చి నాన్నని చూద్దామని మహావీర్ హాస్పిటల్‌కి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఆయనే నాన్నకీ నాకూ సాయం. నిజానికి – నాన్నది సాయం అవసరం లేని స్థితి. సాయం కావాలో అక్కర్లేదో తెలియని స్థితి నాది.

పిల్లా, కళ్యాణి, పెండ్యాలగారూ విడిగా బయల్దేరారు.

అంతవరకూ చేసిన ప్రయాణాలన్నీ నాన్న నాచేత చేయించినవి. అప్పటికి రెండు నెలల క్రితం విజయవాడ నుండి హైదరాబాద్ నాన్నని నేను తీసుకువెళ్ళాను కానీ – అప్పుడు నాన్న ఉన్నారన్న ధైర్యం ఉంది. తిరుగు ప్రయాణంలో నాతో నాన్న ఉన్నారో లేరో తెలియని స్థితి.

చాలా ఏళ్ళ క్రితం హైదరాబాద్ నుండి విజయవాడ రైలు ప్రయాణం చేసాను నాన్నతో. ఆ ప్రయాణం నాన్న విజయయాత్రకి నాంది. ఆంబులెన్సులో ప్రయాణం నాన్న అంతిమయాత్రకి నాంది.

నాన్న పక్కనే ఉన్నా లేనట్లు సాగిన ఆ ఆరుగంటల ప్రయాణం అయ్యేసరికి – నేను శారీరకంగా, మానసికంగా అలసిపోయాను.

విజయవాడలో మా ఇంటికి చేరేసరికి ఇంటి ముందంతా జనం. నాన్న ఆఖరి యాత్రకి సన్నాహాలు జరుగుతున్నాయి. ఆ కోలాహలం చూస్తే అది మరణానిదో కళ్యాణానిదో తెలియనట్లుంది.



వాళ్ళకి నాన్నని అప్పగించేసి నేను లోపలకెళ్ళిపోయాను. ఆ తర్వాత ఎవరు ఏం చేసారో నాకు తెలియదు.

ఊరేగింపుగా నాన్నని పెద్ద కార్లో తీసికెళ్ళిపోయారు. సన్మానాలూ ఊరేగింపులూ కొత్త కాదు నాన్నకి. బంధువులూ, స్నేహితులూ, అభిమానులూ, ఆఖరికి నాన్నని కొంచెం తెలిసిన వాళ్ళూ – నాన్న ఆఖరియాత్రలో నాన్నతో ఉన్నారు. మా నాన్న అంతిమ యాత్ర నాన్న ఉపన్యాసంలానే గంభీరంగా సాగిపోయింది.

అమ్మ ముచ్చటపడితే అమ్మా నాన్నా ఇద్దరూ ఉపనయనం చేసిన రాఘవబాబయ్యే అంత్యక్రియలు చేసాడు. రాఘవబాబయ్య ఎప్పుడూ మా ఇంటి పనులన్నీ నెత్తిన వేసుకుని చేసేవాడు. ఆ చెయ్యడంలో ఎప్పుడూ ఏదో చేస్తున్నాంలే అన్న ధోరణి ఉండదు. శ్రద్ధగా, అభిమానంతో చేసాడు. నాన్న అంత్యక్రియలూ అలాగే చేసాడు.

ఆరోజూ, మర్నాడూ – రేడియో, టీవీ, పేపర్లూ – అన్నీ నాన్న గురించి చెప్తూనే ఉన్నాయి. ఏ మీడియా మీదైతే నాన్న ఆధిపత్యం సంపాదించుకుని దానికి ఓ గౌరవాన్ని అందించారో – అది నాన్న అంతిమ నివాళులు నాన్నకి ఘనంగా సమర్పించుకుంది.

నాన్న శరీరం నాన్న ప్రేమించే ప్రకృతిలో కలిసిపోయింది. ఉందోలేదో తెలియని ఆత్మ ఎటెళ్ళిపోయిందో, ఏం చేస్తోందో.

నాన్న వదిలివెళ్ళిన నాన్న పుస్తకాలూ, ఉపన్యాసాలూ మాత్రం ఈలోకంలో ఇంకా ఉన్నాయి. అవి ఉన్నంతకాలం నాన్న ఉన్నట్లే.

**ఉషశ్రీ నిరాడంబరత, నిజాయితీ గొప్పవి.**
**ఒక ఋషి తుల్యుడిగా ముద్రపడ్డాక జనంతో వ్యాపారం చేయడం**
**మన దేశంలో ఎంత తేలికో అందరికీ తెలుసు.**
**లోభప్రలోభాలకి అతీతంగా స్వస్వరూప జ్ఞానంతో చరించడం వల్లనే**
**ఉషశ్రీ పెద్ద మనిషిగా మిగిలారు.**
**వందే రేడియో కోకిలమ్**

**– శ్రీరమణ**





# పునరావలోకనం



పుట్టింది పండితులకు పుట్టిల్లైన కాకరపర్రు అగ్రహారంలో – 1928 మార్చ్ 16 న.

కాలచక్రం ప్రభవను ప్రభవించిన పదకొండు మాసాల ఇరువది యేడు రోజులకు ఈ భూగోళం మీద నేను కన్ను తెరిచాను – అని రాసుకున్నారు నాన్న.

పుట్టినప్పుడు తెరిచిన కన్నును అలా తెరిచే ఉంచుకున్నారు. కన్నునే కాదు, చెవిని కూడా తెరిచే ఉంచారు. ఎంతో ఎంతెంతో కంటూ, వింటూ నేర్చుకుంటూనే ఉన్నారు.

మామ్మ చదివిన భాగవత పద్యాలతో మొదలైంది నాన్న నేర్చుకోవడం. ఆవిడ దగ్గరే శతకాల పద్యాలు కూడా నేర్చారు.

పద్దెనిమిది పురాణాలనీ, పద్ధెనిమిది ఉపపురాణాలనీ అవుపోసన పట్టిన మా తాత మా నాన్నకి అక్షరాభ్యాసం చేసిన గురువు. ఆయన దగ్గరే నాన్న భారత రామాయణ భాగవతాలని అభ్యసించారు.

అమరం వల్లె వేసారు. సంస్కృతంలో, తెలుగులో పద్యం గద్యం చదివారు.

రామచంద్రపురం హైస్కూల్లో ప్రఖ్యాత వైయాకరణి వెంపరాల సూర్యనారాయణ గారి దగ్గర చిన్నయసూరిని అధ్యయనం చేసారు. బాలవ్యాకరణం, నీతిచంద్రికా ఒంట పట్టించుకున్నారు.

ఇంటర్ పరీక్ష మీద ఎన్ని సార్లో దండయాత్ర చేసారు. అదే సమయంలో సాహిత్యం మీద విజయయాత్రకి మార్గం వేసుకున్నారు.

ఒక పక్క కాకినాడ కాలేజీ ఇంటర్ చదువు పడుతూ లేస్తూ ఉంటే – మరో పక్క సాహిత్యాధ్యయనాన్ని పరిగెత్తించారు.

ఆలమూరు లైబ్రరీలో ఉన్న ప్రాచీన గ్రంధాల దగ్గర మొదలెట్టి – విశ్వనాథనీ, కృష్ణశాస్త్రినీ, శ్రీశ్రీనీ చదువుతూనే ఉన్నారు. వాళ్ళ ముగ్గురినీ సమానంగా అభిమానించి చేతులు కాల్చుకున్న పిచ్చివాడని నాన్న గురించి ఏలూరుపాటి అనంతరామయ్య గారు గుర్తు చేసుకునేలా వాళ్ల కవిత్వాన్ని ప్రేమించారు.



పుస్తకాలు చదవడమే కాదు – కవుల గురించీ, వాళ్ళ కవిత్వం గురించీ – అన్నాలూ, నిద్రలూ మాని – ఇంటి అరుగుల మీద – చింకి చాపల మీద కూచుని – నాన్నా, తరుణసాహితీసమితీ బృందం చర్చించుకుంటూనే ఉండేవాళ్ళమని రాసారు సత్యం మావయ్య.

పరీక్షలకోసం చదివిన చదువు కాదు మా నాన్నది. సాహిత్యమే జీవితంగా బతికి నేర్చిన విద్య. అది పరీక్షలైన కొన్ని నెలలకి మర్చిపోయేది కాదు. జీవితాంతం అంటిపెట్టుకుని ఉన్నది.

ఎందరెందరో ఉద్దండుల రచనల్ని చదివి మళ్ళీ మళ్ళీ పునశ్చరణ చేసుకుని ఆకళింపు చేసుకున్నారు.

సాహితీ వనాల్లో విహరించి విహరించి జాగ్రత్తగా ఏరుకున్న పువ్వులు ఎన్ని ఉన్నాయో నాన్న దగ్గర. నన్నయ్య గారి సురపొన్నలూ, పింగళి సూరన గారి శిరీషాలూ, ముక్కు తిమ్మన గారి పారిజాతాలూ, విశ్వనాథ సత్యనారాయణ గారి విరజాజులూ, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి సురభిళాలూ, మల్లాది రామకృష్ణ శాస్త్రి గారి మల్లియలూ – ఎన్నో ఎన్నెన్నో. వాడిపోని, వాసన పోని పూలు.

పరీక్షలు పోయినా, సొమ్ము తగలడినా, పెద్దవాళ్ళు కేకలేసినా, ఇంట్లో వాళ్ళు బాధపడినా, ఒక్కోసారి తనకే ఏంటిలా అయిపోతున్నానని అనిపించినా –

మానకుండా విడవకుండా సాహిత్యాది రంగాలలో శిఖరాలవంటి వాళ్ల వెంటబడి, సేవించి, ఆరాధించి, పోట్లాడి, పదిజన్మలకు సరిపోయేంత జ్ఞానాన్ని సంపాదించుకున్నారు. దాన్ని జాగ్రత్తగా పోషించుకుంటూ బలపరచుకుంటూ పెంచుకుంటూ పెరిగారు.

ఆ రోజుల్లోనే మహాత్మా గాంధీగారి అంతిమయాత్రకి ప్రత్యక్షప్రసారం చేసిన డిమెల్లో మాటలకి ముగ్ధులైపోయారు. ఎలా మాట్లాడితే బావుంటుందా అని ఆలోచించుకోడం మొదలెట్టారు. అలా మాట్లాడ్డం అలవాటు చేసుకున్నారు.

ఇంటర్ పూర్తయ్యాక – భీమవరంలో నాన్న కోసం ప్రారంభించిన తెలుగు సాహిత్యం బీయేలో చేరాక – దిగుమర్తి సీతారామస్వామి గారి దగ్గర, నండూరి రామకృష్ణమాచార్యులగారి దగ్గర ఎన్నో విషయ విన్యాసాలు గ్రహించారు.

భద్రాచలంలో సీతారామకళ్యాణానికి ప్రత్యక్షప్రసారం చేసే జమ్ములమడక మాధవరామశర్మ గారి దగ్గర మెళకువలు నేర్చుకున్నారు.

ఇన్ని నేర్చిన తర్వాత కూడా – జానకితో జనాంతికం అని దువ్వూరి వెంకటరమణ శాస్త్రి గారు వినిపిస్తోంటే విని – ఆయనకి సాష్టాంగ ప్రణామం చేసారు.

ఎక్కడ విద్య ఉందో – అక్కడ వినయం ప్రదర్శించి – ఆ విద్యను నేరుస్తూనే ఉన్నారు. అంత నేర్చారు కాబట్టే – ఇంత చెయ్యగలిగారు మా నాన్న.

కాలేజీ రోజుల్లోనే పద్యాలు రాయడం మొదలెట్టారు. గంభీర సమాసాలతో అనర్గళంగా ఉపన్యాసాలు ఇవ్వడం ప్రారంభించారు.

స్నేహితులతో కలిసి తరుణసాహితీ సమితిని స్థాపించారు. ఎందరో పండితులనీ, కవులనీ – తరుణసాహితి కార్యక్రమాలకి ఆలమూరు తీసికెళ్ళారు. అలాగే భీమవరం కాలేజీకి పిలిచారు.

కవుల సమావేశాలు ఏర్పాటు చేసారు. తనకి నచ్చిన కవుల్ని నెత్తిన పెట్టుకు మోసారు. విశ్వనాథ సత్యనారాయణ గారి మీద ప్రత్యేక సంచికే వేసారు.





తాతగారు తలపెట్టిన వ్యాసభారతం తెలుగు వచన రచనకి సంపాదకత్వం వహించారు.

ఏ ఊళ్ళో ఉంటే ఆ ఊళ్ళో కవులతో, రచయితలతో కలిసిపోయారు. ఒక్కో సారి వివాదంతో మొదలెట్టి – వినోదంగా ముగిసాయి నాన్న సావాసాలు.

కథలు రాసారు. నవలలు రాసారు. వీరభద్రాచారిగారితో కలిసి నృత్యనాటికలు రాసారు. నాన్న రచన పడని పత్రిక లేనట్లు రాస్తూనే ఉన్నారు. పత్రికల్లో అచ్చైన కొన్ని కథలు – జ్వలితజ్వాల, అమృతకలశం, మల్లెపందిరి కథాసంపుటాలలో వచ్చాయి. ఇంకా ఎన్నో ఉన్నాయి.

రచయితగా ఎదిగారు. పత్రికల్లో పనిచేసారు. ఆలిండియా రేడియోలో ఉద్యోగం సంపాదించుకున్నారు. హైదరాబాదు నుండి విజయవాడకి మారారు.

అక్కడ నుండి భారత, రామాయణ భాగవతాల సారాన్ని జనానికి అందిస్తూనే వచ్చారు.

వ్యాసవాల్మీకులు అందించిన ఉద్గ్రంధాలు. ఎన్ని వేల సంవత్సరాలు గడిచినా భారతజాతంతా చదువుకుని, విని తరించే పుస్తకాలవి.

అవి జరిగాయా లేవా అన్న బెంగ లేదు నాన్నకి. రాముడూ, కృష్ణుడూ దేవుళ్ళా కాదా అన్న బాధ అసలే లేదు.

ఆదికవీ, వేదవ్యాసుడూ–యావత్ప్రపంచానికీ – స్థలకాలాలకి అతీతంగా ఏం చెప్పదలచుకున్నారన్నదొక్కటే నాన్నకి కావల్సింది.

భారతం కానీ భాగవతం కానీ రామాయణం కానీ – తెలుగు వాళ్లకి కొత్త కాదు. కవిత్రయం, పోతన్న, మొల్ల, విశ్వనాథ – పద్యంలో మహాద్భుతంగా రాసారు. తరతరాలు నిలిచిపోయే పుస్తకాలని ఇచ్చారు.

సంస్కృత గ్రంథాలలోనూ, తెలుగు పుస్తకాలలోనూ ఉన్నది అందరికీ అందాలన్నదే నాన్న జీవితాశయం. దానికి కంకణం కట్టుకున్నారు. బాలాంత్రపు రజనీకాంతరావు గారు మార్గం చూపించారు. ఆలిండియో రేడియో ముందుకు నడిపే రథమైంది. నడిపించిన సారథి నాన్న.

ఎప్పుడైతే నాన్న ప్రజలకి దగ్గరగా తీసికెళ్ళడం కోసం అనుకున్నారో – అప్పుడు నాన్న భాషలో మార్పు వచ్చింది. భాష మీద మోహం తగ్గింది.

సమాసాలతో గ్రాంధికంగా సాగే భాష సరళమైన వ్యావహారికంగా మారింది.

పెద్దపెద్ద వాక్యాల స్థానంలో చిన్ని చిన్న వాక్యాలు చోటుచేసుకున్నాయి.

క్రియతో మొదలయ్యే – చూసాడు కృష్ణుడు – లాంటి వాక్యాలు ఎక్కువయ్యాయి.

నాన్న రామాయణ భారత భాగవతాలు ఎందుకు చెప్పారు? అవి తెలియని వాళ్లు ఎవరు? ఐతే అసలు వాటి అసలు రహస్యం తెలిసిన వాళ్ళు ఎంత మంది? వాటిని ఏ దృష్టితో చూడాలి ఎలా చదవాలి ఎలా అర్థం చేసుకోవాలి? అని తెలియచెప్పేవాళ్ళు కావాలి. ఆ పని మా నాన్న చేశారు.

నాన్న శ్లోకాలు అప్పగించలేదు. అంతరార్థాలు అంటూ కష్టపడి ఏదో పైకి లాగి ముడిపెట్టి వివరించలేదు.

ఐతే నాన్న ఉపన్యాసాలు విన్నవారికీ, పుస్తకాలు చదివిన వారికీ – మన పురాణాల్లో, ఇతిహాసాల్లో ఇంత ఉందా అని అనిపించేలా చేసారు. అవి చదవాలన్న కుతూహలం కలిగేలా చేసారు.

నాన్న చెప్పే విధానం జనం గుండెల్లోకి సూటిగా వెళ్ళేటట్లు చేసుకున్నారు. నాన్న మాట్లాడితే పుస్తకం చదివినట్లు ఉందనుకునేవారు. నాన్న రాసిన పుస్తకం చదువుతోంటే నాన్న మాట వింటున్నట్లు ఉందని అనేవారు.



రామాయణాది పుస్తకాలు రాస్తూ, ఉపన్యసిస్తున్న నాన్నని కొంత మంది పాతభావాలతో ఛాందసంగా ఉంటారని అనుకుని ఉంటారు. సంస్కృతినీ, సాంప్రదాయాన్ని గౌరవించడం ఛాందసం కాదు.

నాన్నని దగ్గరగా తెలిసున్న వాళ్లకి నాన్నలో ఉన్న విప్లవవాది కనిపిస్తాడు. పద్మపెళ్ళి ఏ ఆర్భాటాలు లేకుండా చెయ్యడం, తాత పోయినప్పుడు మామ్మకి జుట్టు తీయించకుండా ఉంచడం, పూజలూ పునస్కారాలూ నోములూ వంటి వాటిలో ఇరుక్కోకపోవడం – ఇవన్నీ అందరికీ తెలియవు. నాన్న అభ్యుదయ రచయిత ఆవంత్స సోమసుందర్ గారితోనూ, విశాలాంధ్ర సంపాదకులు రాఘవాచారి గారితోనూ స్నేహంగా ఉండేవారు.

కొండముది రామచంద్రమూర్తి గారు అన్నట్లు – ఉషశ్రీ అంటే సంప్రదాయం ప్లస్ విప్లవం.

అటు హేతువాదులూ, ఇటు మతోన్మాదులూ – మనం మన రామాయణ భారత భాగవతాల గురించి మాట్లాడుకుందుకే సిగ్గూ భయమూ పడేలా చేస్తున్న రోజుల్లో – వాటి గురించి అందరూ అర్థం చేసుకునేలా గర్వ పడేలా చేసారు నాన్న. ఎంత గొప్ప పని అది?

హనుమంతుడినీ, శ్రీకృష్ణుడినీ, శంకరాచార్యుడినీ, వివేకానందుడినీ – తెలుగు వాళ్ళకి దగ్గరగా తీసుకొచ్చారు.

భగవద్గీతనీ, సుందరకాండనీ – అందరికీ అర్థం అయ్యేలా అందించారు.

1990 సెప్టెంబర్ ఏడో తారీకున నాన్న శరీరం ప్రకృతిలో కలిసిపోయి ఇప్పటికి పాతికేళ్ళు దాటిపోయినా – తెలుగుజాతి నాన్నని మర్చిపోవడంలేదు. ఎక్కడెక్కడి తెలుగువాళ్ళో నాన్న పుస్తకాలు చదువుకుంటున్నారు. నాన్న ఉపన్యాసాలు ఇంటర్నెట్లో వింటున్నారు.

అవి ఉన్నంత కాలం ఈ లోకంలో మా నాన్న ఉన్నట్లే.

**శ్రీకృష్ణ నిర్యాణంతో అర్జునుడు పడే బాధనూ,**
**ఆవేదననూ, ఇప్పుడు స్వాతి అనుభవిస్తోంది.**
**ఉషశ్రీ అస్తమయం స్వాతికి శరాఘాతం**

**– స్వాతి వారపత్రిక**





# మధ్యలో ఓ మాట

## అపూర్వం

గాయత్రీదేవి చెప్పిన ఉషశ్రీ కథ ఐపోయింది. కథ పునరావలోకనం కూడా ఐపోయింది.

ఐతే గాయత్రీదేవి జీవితంలో ఉషశ్రీ కథ నడుస్తూనే ఉంది.

గాయత్రీదేవి జీవితంలో తొలి ఐదేళ్ళూ ఏమీ తెలియకుండా గడిచిపోయుంటాయి. ఆ తర్వాత పాతికేళ్ళూ ఉషశ్రీతో గడిచాయి. ఉషశ్రీ గతించాక కూడా ఉషశ్రీ తోనే. అంటే ఉషశ్రీ జ్ఞాపకాలతో అనికాదు. అవి అందరి పిల్లలకీ ఉంటాయి.

గాయత్రీదేవి చేసే వైద్యవృత్తికీ, రాసే పుస్తకాలకీ, గీసే బొమ్మలకీ – అన్నింటా వెన్నంటి ఉంటున్నది – నాన్న ఉషశ్రీయే.

దానికి నిరంతర ప్రత్యక్ష సాక్షిని నేను. తను ఎవరినైనా కలుసుకున్నప్పుడైనా – తనని ఎవరైనా కలిసినప్పుడైనా – సంభాషణ మొదలూ చివరా ఉషశ్రీయే.

మా మిత్రులొకరు సరదాగా – ఎవరిని కలవడానికైనా ఆవిడ దగ్గర పాస్పోర్ట్ ఉందిగా – అదే వాళ్ళ నాన్న పేరు – అని అంటూంటారు. అది నిజంగా నిజం.

భౌతికంగా లేరన్న కొరత ఉంటూనే ఉంటుంది కానీ – తన జీవితంలో ఉషశ్రీ లేని సమయం లేదు.


అందుకే గాయత్రీదేవి చెప్తున్న కథ ఉషశ్రీ మహా నిర్యాణంతో ముగిసిపోలేదు. ఆ కథ నడుస్తూనే ఉంది. అది రాయకపోతే కథ అసంపూర్ణంగా ఉండిపోతుంది, ఐతే అంతా చెప్తే అది గాయత్రీదేవి చెప్పిన కథలా కాక గాయత్రీదేవి కథలా ఐపోతుంది. అందుకే మచ్చుకి ముచ్చటగా కొన్ని సంఘటనలు.

ఇంతవరకూ గాయత్రీదేవి చెప్పిన కథ, ఉషశ్రీ శరీరాన్ని వదిలి వెళ్ళడానికి పూర్వం జరిగిన కథ – అది పూర్వం. ఇప్పుడు చెప్పబోయే కథ తర్వాత కథ – అంటే అపూర్వం.

– అనామకుడు



# రామాయణంలో హనుమంతుడు




నాన్న అంతిమ సంస్కారాలు అయ్యాక నేను బొంబాయి వెళ్ళాను. అప్పుడు నాకు ఎంతో వెలితిగా అనిపించేది. ఆ వెలితిని తప్పించుకోడానికి నాన్న అంతకు ముందు రాసిన ఉత్తరాల్ని ఆశ్రయించాను. అవే నాకు మందులయ్యాయి.

నాన్న నాకు రాసిన ఉత్తరాలు కాసిన్నే. అందులో ఆప్యాయతా, అనునయం, ఓదార్పు, ప్రోత్సాహం – అన్నీ ఉండేవి. మచ్చుకు రెండు ఉత్తరాలు.

“ఆయుర్వేదం చదివి వైద్యం చేస్తున్నదానివి మనస్సుని దుర్బలం చేసుకోకూడదని నా చేత వ్రాయించకూడదు. మనోజవంతు మాండవ్యం– అన్నిటికీ అదీ కారణం. పిడుగులు కూడా దూరంగా పోతాయి మనస్సునిలబడితే. పరమేశ్వరుడున్నాడే వాడు మనలను భూమి మీదికి పంపుతూ అంతా ముందే నిశ్చయించి చూస్తూ ఉంటాడు. అది తెలియక గంతులేసి కేకలేయడం మనిషి అవివేకం.

ఏమయినా హాయిగా సుందరకాండ పారాయణం, రామనామం సర్వశుభదాయకం – నీ నాన్న”

“పెద్దమ్మాయికి ఆశీస్సులు రోజూ రెండు మూడు గంటలు చదువుతూ ఏదో ఒకటి వ్రాయడం ఆరంభించు–

ఏం చదివాం, ఏం వ్రాశాం, అన్న ఆలోచన అనవసరం–ఏది చదివినా వ్యర్థం కాదు. వ్రాసినదంతా వాసికి రాదు. కాని ఆ పునాది అవసరం. – నాన్న”





ఇవి మా అమ్మాయి పుట్టడానికి ముందు నాకు నలత చేసినప్పుడు నాన్న రాసిన ఉత్తరాలు. నాన్న నాకు ధైర్యం చెప్తూ రాశారు. అప్పుడు వాటిని చదువుకునే దాన్ని. వాటిలో నాన్న రాసినట్లు సుందరకాండ కూడా చదివేదాన్ని. ఆ ఉత్తరాలూ, సుందరకాండా చదువుతోంటే – నాన్న నాతోనే ఉన్నట్లుండి ఊరట కలిగేది. అదే పని నాన్న పోయిన తర్వాతా కూడా చేసాను. నాన్న రాసిన ఉత్తరాలూ, నాన్న చెప్పిన సుందరకాండా చదువుతూండేదాన్ని.

వాటితో పాటుగా – విజయవాడ నుండి తెచ్చుకున్న నాన్న పాత డైరీలూ, అసంపూర్ణ రచనలూ తిరగేస్తూండేదాన్ని. అవన్నీ నాన్న కర్మకాండ పూర్తైపోయాక – ఇల్లంతా వెతికి జాగ్రత్త పెట్టుకున్నవి. వాటిని చూస్తోంటే – కొంత బాధ కలిగినా – చాలా ఊరట దొరికేది. ఇప్పటికీ నా దగ్గర అవన్నీ అలానే ఉన్నాయి.

నాన్న డైరీల్లో ఎన్ని విషయాలు ఉన్నాయో. చాలా పేజీలు నాన్న ప్రోగ్రాముల కోసం వాడినా, కొన్నింటిలో నాన్నకు నచ్చిన విషయాలు రాసుకున్నారు. కొన్నైతే ఎవరో ఎక్కడో అన్న మాటలు.

అలా నాన్న పాత కాగితాలన్నీ తిరగేస్తోంటే – నాన్న రాయడం మొదలెట్టి ఆపేసిన రామాయణంలో హనుమంతుడు కనిపించింది.

నాన్న హనుమంతుడిని కేవలం రాముడి బంటుగా చూళ్ళేదు. హనుమంతుడు తనంతటి వాడు తను అన్నదే నాన్న వాదన. అన్నింటి కన్న ముఖ్యంగా హనుమంతుడి వాక్చాతుర్యమంటే – నాన్నకు చాలా ఇష్టం. ఎవరితో ఎలా మాట్లాడాలో హనుమంతుడి ద్వారా వాల్మీకీ మనకి నేర్పించాడని నాన్న ఎన్నో సార్లు అనడం నేను విన్నాను. నాన్న అసంపూర్ణంగా వదిలేసిన కాగితాల్లో కూడా ఇదే రాయడానికి పూనుకున్నారని నాకు అనిపించింది.

నాకెందుకో ఆ రచన అసంపూర్ణంగా ఉండడం నచ్చలేదు. దాన్ని పూర్తి చెయ్యాలని అనిపించింది. అదేం సామాన్యమైన పని కాదు.

నాన్న రచనని పూర్తి చెయ్యడం అంటే నాలాంటి దానికి సాధ్యమా అని అనిపించింది కానీ – ఆ ఆలోచన ఎక్కువ కాలం నిలబడలేదు. నిలబడకపోడానికి కారణం నాన్న రచన అసంపూర్ణంగా ఉండకూడదన్న నా తపనే ఐనా – అంత కన్న నన్ను వెన్ను తట్టి ముందుకు నడిపించింది మాత్రం నాన్న వెన్నంటే ఉండాలన్న నా తాపత్రయం. నాన్న అసంపూర్ణ రచనను చదువుతూ, పూర్తి చేస్తోంటే నేను నాన్న ఆలోచనల్లో మునిగిపోగలుగుతానన్న నా కోరికే నన్ను నాన్న రచనని పూర్తి చేసే పనికి పూనుకొలిపింది.

ఎవరికో ఇచ్చి పూర్తి చేయిద్దామన్న ఊహే రాలేదు. చెయ్యగలనా అన్న భయం కలిగింది కానీ చెయ్యడం మానేద్దామని మాత్రం అనిపించలేదు.

పుస్తకంలో నాన్న ఏం రాయదల్చుకున్నారో – నాన్న రాసింది చదివితే అర్థం అయింది. దానికి తోడు అంతకు ముందు నుండీ హనుమంతుడి వాక్చాతుర్యం గురించీ నాన్న చెప్తూండడం విన్నది గుర్తుండడంతో ఏం రాయాలో తెలిసింది. సమస్యల్లా ఎలా రాయాలా అనే.

నాన్న భాషా, శైలీ అద్భుతం. అనితర సాధ్యం. నాన్న రచనలు చదువుతోంటే వింటున్నట్లూ, నాన్న ప్రసంగం వింటోంటే చదువుతున్నట్లూ ఉంటుందనీ – నాన్నకున్న ప్రఖ్యాతి.



నాన్న శైలి పట్టుపడ్డానికి నాన్న రచనలన్నీ చదివాను. చదివానన్నది సరైన మాట కాదు. వాటిని పాఠ్యగ్రంథాల్లా పఠించాను. పరిశోధకురాలిలా భాషనీ, శైలినీ, భావ వ్యక్తీకరణనీ పరిశీలించాను.

మూడు నెలలు పైనే పట్టిందేమో పూర్తి చెయ్యడానికి. అది రాయడం బొంబాయిలోనే పూర్తి చేసాను. పూర్తయ్యేసరికి బావకి మద్రాసు ట్రాన్స్ఫరైంది.

మద్రాసు వెళ్ళాక – ఉషశ్రీ మిషన్ అన్న పేరుతో రామాయణంలో హనుమంతుడు పుస్తకాన్ని ప్రచురించాను. నాన్న పేరుతో నాపేరు వేసుకుందుకు జంకాను. లోపల ఉషశ్రీ అసంపూర్ణ రచనను కుమార్తె గాయత్రీదేవి పూరించారు అని మాత్రం రాసుకున్నాను.

అదే నేను ప్రచురించిన మొదటి పుస్తకం. ఆ తర్వాత నాన్నవీ, ఇంకా ఆ తర్వాత నావీ – చాలా పుస్తకాలే ప్రచురించాను. కానీ మొదలెట్టింది నాన్న పుస్తకం తోనే. ఎంత బావుందో అలా అనుకుంటోంటే – నాన్నది – అంటే – మా ఇద్దరి పుస్తకం.

ఆ పుస్తకం వేసేనాటికి నాకు పుస్తకాలు ఎలా వేయించాలో తెలియదు. నాన్న స్నేహితులు నవోదయా రామ్మోహనరావు గారే అన్ని విషయాలూ చెప్పే వారు. ఎవరి చేత ప్రింట్ చేయించుకోవాలో ఆయనే చెప్పారు. ప్రూఫులు దిద్దడం లాంటి పనులు నాకు నాన్న పుస్తకాలు వేస్తున్నప్పటి నుండీ తెలుసు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయం తీసుకున్నాను. నాన్న పుస్తకాలకీ దేవస్థానం వారికీ ఎన్నేళ్ళగానో సాగుతున్న సంబంధం నాన్న స్వామివారిని చేరిన తర్వాత కూడా కొనసాగింది.

పుస్తకానికి ముఖ చిత్రం కావాలి. ఉషశ్రీ కుమార్తెగా పరిచయం చేసుకుని, వెయ్యబోయే పుస్తకం గురించి చెప్పి, ముఖచిత్రం గీసి ఇస్తారా అని బాపుగారిని మొహమాట పడుతూ అడిగాను. ఆయన ఆనందంగా అందంగా వేసి ఇచ్చారు. బొమ్మగీసినందుకు ప్రతిగా నేనేమివ్వాలో ఎలా అడగాలో కూడా తెలియక నసుగుతూ బాపు గారికి నా భావం వ్యక్తం చేశాను, అచ్చువేశాక నాకు రెండూ కాపీలు ఇవ్వండి, నేను దాచుకుంటాను అన్నారు. ఆయనకి హృదయపూర్వకంగా నమస్కరించుకున్నాను.

పుస్తకం వేస్తున్నట్లు సమాచారం ప్రచురించమని స్వాతి బలరాం గారిని కోరితే – ఆయన అరపేజీ ప్రకటన ఉచితంగా వేశారు. ఆంధ్రుల అభిమాన పత్రికలో అంత పెద్ద ప్రకటన వేసియ్యడం – ఆయనకి నాన్న మీదున్న అభిమానానికీ గౌరవానికీ నిదర్శనం.

ఇలా నేను వేసిన మొదటి పుస్తకానికి నాన్న ఆత్మీయులే ఆసరాగా నిలబడ్డారు. నాన్న అసంపూర్తిగా వదిలివెళ్ళిన రామాయణంలో హనుమంతుడు, నాన్న మొదటి వర్ధంతి నాడు విడుదల అయ్యింది.

ఆ పుస్తకం ఎంతో ఆదరణ పొందింది. వేసిన వెయ్యి కాపీలూ తొందరగా అయిపోయాయి.

విజయవాడ దగ్గర్లోనే ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త దేవినేని మధుసూదనరావు గారు – స్వంత ఖర్చులతో – రెండువేల కాపీలు వేసారు. అప్పటి అసెంబ్లీ సభ్యులకి పెట్టిన ఓ కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని – ఎలా మాట్లాడాలో నేర్చుకోడానికి – రెఫెరెన్స్‌గా ఇచ్చారు. ఎన్నో సంస్థల వాళ్ళు తమ సంస్థలలో పని చేస్తున్నవాళ్ళకీ, అనుబంధం ఉన్నవారికీ ఈ పుస్తకాన్ని పంచిపెట్టడం మొదలెట్టారు.





నాన్న ఏ ఉద్దేశంతో ఆ పుస్తకం రాయడం మొదలెట్టారో అది సంపూర్ణంగా నెరవేరుతోంది. అది చూస్తోంటే నాకెంతో ఆనందంగా ఉంటోంది.

రామాయణంలో హనుమంతుడు అన్న పుస్తకం పేరు చూడగానే అందులో రాసిందేమిటో అందరికీ పూర్తిగా అర్థం అవదేమో అని అనిపించి – నాన్న ఏం ఊహించుకుని ఆ పుస్తకం రాయడం మొదలెట్టారో – ఆ పేరుతో – ఎవరితో ఎలా మాట్లాడాలి అని మా ఇద్దరి పేరనా అచ్చు వేసాను మూడో ముద్రణగా.

ఆ పుస్తకాన్ని ఎందరో కొంటూనే ఉన్నారు. ఎంతో మందికి ఎంతో ఉపయోగపడుతోంది.

దాన్ని ఇంగ్లిష్‌లో అనువాదం చేసుకుని "వర్డ్స్ మైటీ వర్డ్స్" అన్న పేరుతో ప్రచురించుకోడానికి అనుమతి అడిగాడు తూములూరి సూర్యనారాయణ అనే కుర్రాడు. తను మనదేశంలో పుట్టి పెరిగాడు. పైచదువులకి అమెరికా వెళ్ళాడు. ఇంగ్లిష్‌లో ప్రచురిస్తే – తెలుగు చదవడం రాని వాళ్లకి కూడా నాన్న రచన అందుతుందని అన్నాడు. ఆనందంగా ఒప్పుకున్నాను నేను.

వాల్మీకి హనుమంతుడి ద్వారా ప్రపంచానికి ఏం చెప్పదలచుకున్నాడో – దాన్ని తెలుగు పాఠకులకి అందించారు నాన్న.

> నా జీవితంలో నాకు దక్కిన గొప్ప అదృష్టం – నాన్న నా పెళ్ళి చెయ్యడం. కూతుళ్ళ పెళ్ళిళ్ళు నాన్నలే చేస్తారు – అందులో గొప్ప ఏముంది అని అనిపించచ్చు. నా పెళ్ళి నాన్న చేయించింది ఒక్క నాన్నగానే కాదు – పెళ్ళికి మంత్రాలు చదివిన పురోహితుడిగా కూడా.
>
> నా పెళ్ళి మా యింట్లోనే జరిగింది. అటూ ఇటూ బంధువులు అందరూ కలిసి పాతికదాటరు. మేం ఇద్దరం దండలు మార్చుకుంటోంటే కన్యాదానం చేస్తూ కన్యాదాన మంత్రాలు చదివింది నాన్న. ఎంతమంది ఆడపిల్లలకి కలుగుతుంది అలాంటి అదృష్టం?
>
> – పద్మావతి



# అంతా నాన్నమయం



నా జీవితంలో నేను ఆయుర్వేదం పాఠ్య పుస్తకాలు రాస్తున్నానంటే దానికి కారణం నాన్నే.

ఐతే నేనీ పుస్తకాలు రాయడం నాన్న ఉండగా జరగలేదు. నాన్న చూస్తోంటే ఎంత బావుండేదో అని నాకు అనిపిస్తూ ఉంటుంది. నా జీవితంలో నాకిదో అసంతృప్తి. అది తీరేది కాదు కూడా.

నాన్న లేకుండా నా పుస్తకాలు రాయడానికి కారణం నాన్నెలా అయ్యారంటే –

నాన్న పోయిన కొన్ని నెలలకే బొంబాయి నుండి మద్రాస్ వెళ్లాం. అక్కడ మా అమ్మాయిని దగ్గర్లోనే ఉన్న స్కూల్లో చేర్చాక నేను కూడా అది స్కూలుకి వెళ్ళొచ్చే మూడు గంటలూ దగ్గర్లో ఉన్న ఓ ఆయుర్వేద క్లినిక్కి వెళ్ళి రావడం మొదలెట్టా. ఐతే నేను చదివిన చదువుకి సరిపడే పని చెయ్యలేకపోతున్నానని బెంగగా ఉండేది. ఆ సమయంలోనే రామాయణంలో హనుమంతుడు అచ్చేయించింది. ఆ పుస్తకానికి సంబంధించిన ప్రకటన స్వాతిలో బలరాం గారు వేశారు.

ఆ ప్రకటనలో నాపేరూ, ఫోన్ నంబరూ కూడా ఉన్నాయి.

అది చూసారుట – మద్రాసులో ఉన్న వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న కుటుంబరావు గారు. నా పేరుని నాన్నతో కలుపుకుంటే నేనెవరో తెలిసింది ఆయనకి. నేను విజయవాడలో ఆయుర్వేద కాలేజీలో చదువుతున్నప్పుడు నాకు ఆయన ప్రొఫెసర్.





విజయవాడలో ఎవరైనా మమ్మల్ని నాన్న పేరుతోనే కలుపుకుంటారు. కొన్ని నెలల క్రితం స్కూల్లో నాతో చదువుకున్న ఒక అమ్మాయి ఫోన్ చేసి – ఇంకో గాయత్రికీ నాకూ తేడాగా – నన్ను ఉషశ్రీ గారమ్మాయిగా అందరం గుర్తు చేసుకుంటామంది. కుటుంబరావుగారికే కాదు నేను చదువుకున్న స్కూల్లోనూ, కాలేజీలోనూ – అందరికీ – నేను నాన్న అమ్మాయిగా తెలుసు.

ఇంతకీ అసలు జరిగిందేమిటంటే – కుటుంబరావు గారు నాతో మాట్లాడి నన్ను కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్ గా తీసుకున్నారు. నాకు ఆయన చెప్పడానికి ఇచ్చిన సబ్జెక్ట్ పదార్థ విజ్ఞానం.

చదువుకుంటున్న రోజుల్లో నాకు ఆ సబ్జెక్ట్ అంటే ఏ మాత్రం ఇష్టం ఉండేది కాదు. అసలది ఎందుకు చదవాలో కూడా అర్థం అయ్యేది కాదు. శరీర ఆరోగ్యం గురించి చదువుతూ ఆత్మ గురించిన వేదాంతంతో పనేమిటని అనిపించేది. దర్శనాలు అంటేనే నవ్వుగా ఉండేది.

పదేళ్ళ తర్వాత చదువుతోంటే పదార్థ విజ్ఞానం మీద ఉన్న అభిప్రాయమే మారిపోయింది. దర్శన ఋషులు అన్నేళ్ళ క్రితం ఎంత ఆలోచించారో తెలియసాగింది. ఒక్కో సంవత్సరం గడిచేకొద్దీ దాని మీద మక్కువా పట్టూ పెరిగాయి. నేను కాలేజీ మానేసేనాటికి నా దగ్గర ఓ పుస్తకం రాయడానికి కావల్సినంత నోట్సు తయారైంది.

అందుకే – ఆ తర్వాత కొన్నేళ్ళకి చౌకాంబా పబ్లిషర్స్ నా చేత – ఆయుర్వేదం డిగ్రీ విద్యార్థులకి పాఠ్య పుస్తకం రాయించుకోవాలని అనుకున్నప్పుడు – నేను పదార్థ విజ్ఞానం మీద రాస్తానని అన్నా. వాళ్ళు ఆనందంగా ఒప్పుకున్నారు. అదే నేను రాసిన మొట్టమొదటి ఆయుర్వేద పాఠ్య పుస్తకం. ఆ పుస్తకానికి విద్యార్థుల స్పందన బావుండడంతో – ప్రసూతి, కాయ చికిత్సల మీద కూడా నాచేతే పుస్తకాలు రాయించుకున్నారు వాళ్ళు.

ఇంతకీ అసలు సంగతి ఏంటంటే నేను ఇలా పాఠ్యపుస్తకాలు రాయడానికి బీజం పడింది – నేను నాన్న పుస్తకానికి నా పేరూ ఫోన్ నంబరూ ఇవ్వడం వల్లే.

అదొక్కటే కాదు. నేనేం చేసినా – పరోక్షంగా నాన్న ఉంటున్నట్లే ఉంది. అందుకే నాన్న లేనట్లుండదు నాకు. పాఠ్య పుస్తకాలే కాదు – ఆయుర్వేదాన్ని సామాన్యులకి అందుబాటులో ఉంచడానికి నేను ప్రచురిస్తున్న పుస్తకాలకి నాంది కూడా నాన్నవల్లే జరిగింది.

మద్రాసులో ఉన్నప్పుడు పిల్లకి సెలవులొచ్చినప్పుడల్లా – పిల్లను తీసుకుని విజయవాడ వెళ్ళేదాన్ని.

అలా– ఓ సారి మద్రాస్ నుండి విజయవాడ వెళ్ళినప్పుడే – పావనశాస్త్రి గారి అమ్మాయి పెళ్ళికి వెళ్ళాను. పావనశాస్త్రి గారు నాన్నని అన్నయ్యా అంటూ ఉండేవారు. విశ్వనాథ సత్యనారాయణ గారికి నాన్న సాహితీ పుత్రుడు కదా! పావనశాస్త్రి గారు మా ఇంటికి వస్తూండేవారు. మా అమ్మాయిని డింగ్ డింగ్ అంటూ ఆడిస్తూ ఉండేవారు. ఆయన్ని డింగ్ డింగ్ తాతయ్య అని అనేది మా అమ్మాయి.

విజయవాడలో పెళ్ళంటే అందరూ తెలిసిన వాళ్ళే. బంధువులు కాని బంధువులు. రేడియో బంధువులు. సాహితీ బంధువులు. అందరూ నాన్నవాళ్ళే. అందువల్ల నన్నెరిగిన వాళ్ళే. కావల్సిన వాళ్ళే.

అందరితోనూ మాట్లాడుతూ మాట్లాడుతూ – మధ్యలో విజయవాడలో రేడియోలో కొన్నాళ్ళు పనిచేసిన ప్రసాద్ భార్య సరోజతో మాట్లాడుతున్నా నేను. పరిచయం చెయ్యడానికి ఓ కుర్రాణ్ణి తీసుకొచ్చారు ప్రసాద్. పేరు షణ్ముఖశర్మగారు అని చెప్పి – నన్ను మమూలుగానే – ఉషశ్రీ గారి పెద్దమ్మాయి గాయత్రీదేవి అని చెప్పి, ఆయుర్వేదం అని ఒక తోక తగిలించారు.



షణ్ముఖశర్మ గారు– అప్పుడప్పుడే సినిమాలకి పాటలు రాస్తూ మద్రాసులో ఉండేవారు. స్వాతిలో పని చేస్తున్నప్పుడు – మా ఇంటికి వస్తూ ఉండడం తెలుసు నాకు. అదే మాట అన్నాను నేను. అందుకు శర్మ గారు "మీకోసమే చూస్తున్నాను నేను. స్వాతిలో మీ ఆయుర్వేద వ్యాసాలు వేసినప్పుడు నేను స్వాతిలోనే పని చేస్తుండేవాడిని. మేము ఋషిపీఠం అని ఒక సనాతన ధర్మ పత్రికని తీసుకు వస్తున్నాం. అందులో ఆయుర్వేదం గురించి రాయమని అడగడానికి మిమ్మల్ని కలుద్దామనుకుంటున్నాను. ఉషశ్రీ గారమ్మాయిని మించిన వాళ్ళెవరు దొరుకుతారు మాకు?" అని అన్నారు.

ఋషిపీఠం మాసపత్రిక 1999 జూలైలో మొదలైంది. నేను ఆగస్టులో రెండవ సంచిక నుండి ఆరోగ్యపీఠం అన్న శీర్షికన ఆయుర్వేదం గురించి రాయడం మొదలెట్టాను. అలా మొదలైన నా శీర్షిక ఈ నాటికీ కొనసాగుతూనే ఉంది. ఇక్కడో చిన్న సంఘటన గుర్తుకు వస్తోంది.

నేను రాయడం మొదలెట్టిన ఒకటిన్నర సంవత్సరాలకనుకుంటా –మా వారికి మద్రాసు నుండి బొంబాయి ట్రాన్స్‌ఫరైంది. అప్పుడు నేను షణ్ముఖశర్మ గారిని – "మేము బొంబాయి వెళ్తున్నాం – మరి ఇంక నాచేత రాయించుకుంటారా?" అని అడిగాను. అందుకు ఆయన "ఋషిపీఠం ఉన్నాన్నాళ్ళు మీరే ఆయుర్వేదం గురించి రాస్తారు – ఋషిపీఠం ఎప్పటికీ ఉంటుంది". తను అన్న మొదటి మాట తనచేతిలోదే. నా చేతరాయించుకుంటూనే ఉన్నారు.

రెండో మాట తన పట్టుదలతో నిజం చేసుకున్నారు. మొదలెట్టి పద్దెనిమిదేళ్ళ పైనైనా ఋషిపీఠం రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది.

ఆశీర్షికకి మూలికల గురించి రాసాను. వాటిని ప్రకృతివరాలు అన్న పేరుతో పుస్తకంగా వేసాను. ఆ తర్వాత రాసిన ఇంకొన్ని మూలికలని ప్రకృతివరాలు రెండోభాగంగా అచ్చేసాను. అలానే ఆడవాళ్ళ ఆరోగ్య సమస్యలకి పరిష్కారాలను అమ్మాయి అమ్మ అమ్మమ్మ అనే పుస్తకంగా వేసాను.

అన్నింటికీ మూలం ఆరోజు పావనశాస్త్రి గారమ్మాయి పెళ్ళికి వెళ్ళడం. అక్కడ సరోజతో మాట్లాడ్డం. అప్పుడు ప్రసాద్ ద్వారా శర్మ గారిని కలవడం. పావనశాస్త్రి గారైనా, ప్రసాదైనా, శర్మ గారైనా – నాకు తెలిసింది నాన్న ద్వారానే – వాళ్ళు నన్ను గుర్తించిందీ నాన్న ద్వారానే. అందుకే మాటిమాటికి అదే మాట అంటున్నా. నా జీవితం నాన్న ఉన్నప్పుడూ లేనప్పుడూ కూడా నాన్నతోనే గడుస్తోంది. వీటన్నింటికీ కారణం – నాన్న ఎందరికో దగ్గరవడం. వాళ్ళందరూ నాన్న మీద పెంచుకున్న గౌరవం, అభిమానం. అదే నేను నా జీవితంలో సాధించిన ఈ కొంచానికీ – పెట్టుబడి.

నేను వెళ్ళిన చాలా చోట్ల నన్ను గుర్తు పడుతున్నారంటే దానికి కారణం – నేనూ టీవీల్లో ఆయుర్వేదం కార్యక్రమాలు చెయ్యడం. వాటి వెనకా నాన్నే.

నాన్న రాసిన వేంకటేశ్వరకళ్యాణం తిరుమల తిరుపతి దేవస్థానం వారు వాళ్ళ ఛానెల్లో నృత్య నాటికగా వేసేందుకు అవకాశం ఉంటుందేమో అని కనుక్కుందుకు మేమక్కడ పనిచేస్తున్న కొందరితో మాట్లాడాం. అలా మాట్లాడిన వారిలో ఒకరు బాచంపల్లి సంతోషకుమారశాస్త్రి గారు. అలా మాట్లాడడంతో ఆయనకీ నాకూ పరిచయమైంది.





ఆ తర్వాత కొన్నాళ్ళకి దేవస్థానం వారు తమ టీవీ ఛానెల్లో రమణీయం అని ఒక స్త్రీల కార్యక్రమం ప్రసారం చెయ్యాలనుకున్నారు. అందులో భాగంగా ఆయుర్వేద వైద్య విశేషాల్ని అందించాలనుకున్నారు. ఆయుర్వేద వైద్యురాలిగా నన్ను ఆ కార్యక్రమం నిర్వహించడానికి ఆహ్వానించారు సంతోషకుమారశాస్త్రిగారు.

ఆ కార్యక్రమం కొన్నాళ్ళు నడిచింది. ఏ కార్యక్రమానికైనా మొదలూ చివరా ఉంటాయి. దేవస్థానం వారు షూటింగులు తిరుపతికి మార్చేసుకుంటూ – ఈ కార్యక్రమాన్ని నిలిపివేసారు.

ఐతే అది నిలిచిన కొన్నాళ్ళకే ఈటీవీ నుండి పిలుపొచ్చింది. వాళ్ళది జీవనజ్యోతి అని ఆయుర్వేదం–యోగాల మీద ఒక కార్యక్రమం ఉంది. అందులో ఆయుర్వేదం గురించి చెప్పడానికి నన్ను పిలిచారు. ఆ పిలవడానికి వెనక కథ ఉంది. జీవనజ్యోతి కార్యక్రమం అప్పటికే ఒక సంవత్సరంగా నడుస్తోంది. కొన్ని మార్పులు చేస్తూ ఆయుర్వేదం గురించి చెప్పడానికి ఎవరున్నారా అని చూస్తున్నారు. ఆ కార్యక్రమానికి యాంకరింగ్ చేస్తున్న శ్రీవాణి నేను తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఛానెల్‌కి చేస్తున్నప్పుడు ఆ కార్యక్రమానికి యాంకర్.

ఆ అమ్మాయికి నేను కార్యక్రమం ఎలా చేస్తానో తెలుసు. అందుకని నా పేరుని ఈటీవీ నిర్వాహకులకి చెప్పింది. వాళ్ళు కొన్ని వారాలు చూద్దామని మొదలెట్టారు. అలా మొదలెట్టిన నా ఈటీవీ జీవనజ్యోతి యాత్ర ఆ కార్యక్రమం ఆపేసేవరకూ సాగుతూనే ఉంది. ఆ కార్యక్రమం ఆపేసాక కూడా శుభమస్తు అన్న కార్యక్రమంలో నా చేత ఆయుర్వేదం చెప్పించుకున్నారు. అంతే కాదు ఈటీవీ2 లో సుఖీభవ అనే ఆరోగ్యం కార్యక్రమంలో నెలకి రెండుసార్లు ఆయుర్వేదం నాచేత చెప్పించుకుంటున్నారు. ఈటీవి లైఫ్‌లో ఆయుష్ కార్యక్రమం చేయించుకుంటున్నారు.

ఈ కథంతా ఎందుకంటే – నేను చేస్తున్న ప్రతి పని వెనక ఉన్నది మా నాన్నే.


చిన్నప్పుడు నాన్న నేర్పించిన అడుగులే – నాన్న చెప్పించిన పలుకులే – నాన్న దిద్దించిన అక్షరాలే – నన్ను నడిపిస్తున్నవి, మాట్లాడిస్తున్నవి, రాయిస్తున్నవి. అవన్నీ ఒక ఎత్తైతే – నేను పడిపోకుండా నన్నెత్తుకుని నిరంతరం నిలపెడుతున్నది కూడా మా నాన్నే.

నన్నెవ్వరైనా నా జీవితంలో అపూరూపమైన కాలం ఏదని అడిగితే – అది నాన్నతో కలిసి మార్నింగ్ వాక్‌లకి వెళ్ళడం అని నిస్సందేహంగా చెప్తాను. ఏ జన్మలోనో నేను చేసుకున్న పుణ్యానికి నాకు దక్కిన అమోఘమైన వరం. ఆ సమయాలలో నాన్న ఎన్ని విషయాలు చెప్పారో. అవన్నీ నాకు అప్పుడు అర్థమైపోలేదు. ఐతే – అప్పుడు విన్న విషయాలే ఈనాడూ నా ఉద్యోగంలోనూ, నా రాతల్లోనూ ఉపయోగిస్తున్నాయి.

అప్పుడు పడిన పునాదే – తర్వాత నేను ఎమ్మే చెయ్యడానికీ, పిహెచ్.డి చెయ్యడానికీ ఉపయోగించింది. నా పిహెచ్.డి నాన్న సాహిత్యం మీదే. నాకు డాక్టరేట్ రావడం కన్న ఆ డాక్టరేట్ నాన్న సాహిత్యంమీద అవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది.

– వైజయంతి

# స్వస్తి




ఆ మధ్య దూరదర్శన్‌లో కార్యక్రమాలు చేస్తున్న ఒక యాంకర్ కలిసినప్పుడు. మీ ప్రోగ్రామ్స్ చూస్తూంటాను మేడం, దూరదర్శన్‌లో మీతో కలిసి చెయ్యాలనుంది అంటూ మాటలు కలిపింది. మాటల మధ్యలో తనపేరు ఉషశ్రీ అని చెప్పింది. ఆ పేరు విన్న నా మొహంలో ఏం కనిపించిందో ఏమో – "ఏంటలా చూస్తున్నారు" అని అడిగింది.

"అది మా నాన్నగారి పేరు – అసలు పేరు కాదు – మగవాళ్ళు ఆ పేరు పెట్టుకోరుగా – అది కలంపేరు లాంటిది" అని నేనంటోంటే –

"మీ నాన్నగారు రామాయణ భారతాలు చెప్పేవారా?" అని అడిగింది. అవునన్నాను.

"మీ నాన్నగారి పేరే పెట్టారు నాకు" అంది ఆనందంగా. నాకు అర్థం కాలేదన్నట్లు మొహం పెట్టానేమో.

"మా నాన్నగారికి మీ నాన్నగారంటే వల్లమాలిన అభిమానం, గౌరవం. ఆయన కేసట్లు మా ఇంట్లో ఊరికే ఉండడం కాదు – ఎప్పుడు మోగుతూ ఉండేవి. మా అమ్మకీ మీ నాన్నగారంటే చెప్పలేని అభిమానం





గౌరవం. అందుకే వాళ్ళు ఏరికోరి నాకు మీ నాన్నగారి పేరు పెట్టారు. నాకు ఎవరి పేరు పెట్టారో ఆయనని చూడాలని ఉండేది నాకు. ఆ అదృష్టం కలగలేదు. నాకు మిమ్మల్ని చూస్తోంటే బలే సంతోషంగా ఉంది. నా పేరు ఎవరిదో ఆయన్ని చూళ్ళేక పోయా కానీ, ఇలా వాళ్ళమ్మాయిని కలవడం." అంది మహా ఆనంద పడిపోతూ.

నాన్న పేరు జనంలోకి ఎంతగా పాకిపోయిందో చెప్పడానికి ఇంతకన్న నిదర్శనం ఏం కావాలి?

చిన్నప్పుడు నాన్న ప్రోత్సాహంతో నేను నాట్యం నేర్చుకున్నాను. నాన్న షష్టి పూర్తి కార్యక్రమంలో నేను ప్రారంభ నృత్యం చేసాను. నా జీవితంలో నేను మర్చిపోలేని సంఘటన అది. నాన్నకి జరిగిన సన్మాన కార్యక్రమంలో నేనూ నా అడుగు కలపగలిగానన్న తృప్తి నాకు జీవితాంతం ఉండిపోతుంది.

నాన్న పాతికేళ్ళ వర్ధంతి సందర్భంగా 2015 సెప్టెంబర్ ఏడో తారీకున విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కూడా నేను నాన్న వేంకటేశ్వర కళ్యాణంలోని ఒక గీతానికి నాట్యం చేశాను. అదీ మరపురాని సంఘటనే.

– కళ్యాణలక్ష్మి


















పత్రికల్లో ఉద్యోగం (1962)




Now Ushasri is the father of three daughters.

ఆడపిల్లల తండ్రి (1963)



ఆకాశవాణి ఉద్యోగం (1964)




Alamuru
March 1 + April 1

పెద్దమ్మాయి నామకరణం (1960)

**(కె.కె. రామానుజాచార్యులవారికి రాసుకున్న ఉత్తరాలు)**





ఉషశ్రీ

కళ్యాణ స్వాగతం

★

వివాహం :

ది 5-5-56 శని ఉదయం గం 9-49 నిలకు

శ్రీరస్తు — శుభమస్తు

వివాహ మహోత్సవాహ్వాన శుభపత్రిక

పురాణపండ రామమూర్తి వ్రాయు శుభలేఖార్థములు

(అనగా ది 5-5-1956 తేదీ శనివారం ఉదయం గం 9-49 నిలకు)


చి॥ సూర్యనారాయణ ప్రకాశదీక్షితులుకు

చి॥ సౌ॥ వ్యాసవేంకటసత్యవతిని

మదర్పితచందనతాంబూలాది సత్కారములు గైకొని నన్నానందింపజేయగోరుచున్నాను.

28-4-56. } మంగళంపహాడ్ శ్రీశ్రీశ్రీ పురాణపండ రామమూర్తి

ఉషశ్రీ కళ్యాణం



కళ్యాణలేఖ

వధువు :
చిరంజీవి సౌభాగ్యవతి డాక్టర్ గాయత్రి

వరుడు :
చిరంజీవి రామశాస్త్రి M. Sc.,

పాణిగ్రహణం


కార్తీక బహుళ విదియా శనివారం నవంబరు 10 రాత్రి గం॥ 1-23 లకు సింహలగ్నమందు జరుగును గాన తామెల్లరూ విచ్చేసి ఆశీర్వదించి తాంబూల సత్కారం పొంద ప్రార్థన.

ఆడపిల్లవారు :
ఉషశ్రీ దంపతులు

మగ పెళ్ళివారు :
A. S. మూర్తి దంపతులు

కళ్యాణ వేదిక : 5 వ నెంబరు బస్సు రూటులో ఐ. టి. ఐ. కాలేజీవద్ద రేడియో కాలనీలో మా స్వగృహం.

పెద్దమ్మాయి పెళ్ళి




ఉషశ్రీ
గృహప్రవేశ స్వాగతం
పరమేశ్వర సంకల్పంగా విజయవాడలోని
ఐ. టి. ఐ. సమీపాన రేడియో ఆర్టిస్టుల కాలనీలో
వ్యాసపీఠం
నూతన గృహప్రవేశం జూలై 29 రాత్రి గం. 1-20 ని॥లకు
30 వ తేది శుక్రవారం ఉదయం 10 గంటలకు
సీతాకళ్యాణం
తిలకించి మా చిరంజీవులను ఆశీర్వదింప ప్రార్థన.

విజయవాడ
23-7-82

ఇట్లు,
పురాణపండ రామమూర్తి


గృహ ప్రవేశం




ఉషశ్రీ
షష్టిపూర్తి సన్మానం
స్వాగతం
1988 మార్చి 16 వ తేది సాయంత్రం గం॥ 6-30 ని॥లకు రోటరీ ఆడిటోరియంలో (విజయవాడ - గాంధీనగర్)
శ్రీ నండూరి రామకృష్ణమాచార్య – శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావులకు ఉషశ్రీ గురుపూజ
సన్మానసభా వివరాలు :
స్వాగత వచనం : శ్రీ విశ్వనాథ పావనిశాస్త్రి
అధ్వర్యం : శ్రీ లక్ష్మణ యతీంద్రులు
సంచిక ఆవిష్కరణ : శ్రీ జంధ్యాల శంకర్ (మేయర్)
కృష్ణరాయబారం, సుందర ఆంజనేయం,
కావేరీ కాసెట్స్ విడుదల : శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు,
ఆంధ్రప్రభ సంపాదకులు.
మనుచరిత్ర, సుందరకాండ ఆవిష్కరణ : శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య
ఉషశ్రీ దంపతులకు సన్మానం
వక్తలు : శ్రీ సి. రాఘవాచారి (విశాలాంధ్ర)
శ్రీ బేతవోలు రామబ్రహ్మం (నాగార్జున)
కృష్ణరాయబారం - ఉషశ్రీ ఉపన్యాసం — మల్లిక్ పద్యపఠనం
సన్మాన సంఘం - విజయవాడ.

షష్టిపూర్తి







జననీజనకులు
పురాణపండ రామమూర్తి
కాశీ అన్నపూర్ణ



గురువులు
నండూరి రామకృష్ణమాచార్యులు
గురుతుల్యులు
బాలాంత్రపు రజనీకాంతరావు



పితృసమానులు
విశ్వనాథ సత్యనారాయణ




రాఘవాచారి
లక్ష్మణ యతీంద్రులతో




జిల్లెళ్ళమూడి అమ్మ
సమక్షంలో




మధునాపంతుల
సత్యనారాయణ
సన్మానంలో





చిరకాల మిత్రులు
చిర్రావూరి సుబ్రహ్మణ్యం




సాహితీ మిత్రులు
సుప్రసన్న
న.చ. రామానుజచార్యులు




ఆప్తమిత్రులు
కె.కె. రామానుజాచార్యులు



మల్లిక్
పావనిశాస్త్రి



కొండముది
శ్రీరామచంద్రమూర్తి



విజయవాడు మేయర్
జంధ్యాల శంకర్



# ఉషశ్రీ ఇష్టాలు

సుందరకాండ
రామాయణ కల్పవృక్షం

విశ్వనాథ సత్యనారాయణ గారు
నండూరి కృష్ణమాచార్యులు గారు
వెంపరాల సూర్యనారాయణమూర్తి గారు

జున్ను, పల్లిపట్టీలు
తేనెపాకంతో దిబ్బరొట్టె
గుమ్మడికాయపులుసు, పనసపొట్టు కూర, కొబ్బరి–మామిడి పచ్చడి
మామిడి పళ్ళు, పనసతొనలు, సీతాఫలాలు, నేరేడు పళ్ళు

ఇల్లు, సైకిల్, నడక, తోటపని
తెలుపురంగు, మల్లెపువ్వు
పిల్లలతో ఆడడం – బేడ్మింటన్ నుండి అడ్డాటా చింతగింజలు దాకా
క్రికెట్, పటౌడీ, గవాస్కర్, మార్షల్

ఝణక్ ఝణక్ పాయల్ బాజే, దో ఆంఖే బారహ్ హాథ్, చంద్రలేఖ
బాలరాజ్ సహానీ, దిలీప్ కుమార్, శాంతారాం
భానుమతి, నర్గీస్, మీనాకుమారి, హేమమాలిని
సైగల్, లతామంగేష్కర్
కాలే కాలే బాదల్ గిర్ గిర్ ఆగయీ, ముడ్ ముడ్ న దేఖ్, సో జావో రాజకుమారీ

రైల్లో ప్రయాణం చేస్తూ చెప్పులు సీట్ల కింద పెట్టేసి,
చొక్కా హుక్కులకి తగిలించేసి నిద్రపోడం

ఇతరులని నిందించకపోవడం





# ఉషశ్రీ ముందూ వెనకా

ప్రపితామహులు
పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు
మునెమ్మ

పితామహులు
పురాణపండ సూర్యనారాయణ
వెంకమ్మ

తల్లితండ్రులు
పురాణపండ రామ్మూర్తి
కాశీ అన్నపూర్ణ

**పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు (ఉషశ్రీ)**

చెల్లెళ్ళు
అల్లంరాజు సుబ్బలక్ష్మి
ద్విభాష్యం కామేశ్వరి
కూచిభొట్ల రాజ్యలక్ష్మి
అల్లంరాజు సూర్యప్రభ

తమ్ముళ్ళు
పురాణపండ రాధాకృష్ణ
పురాణపండ కామేశ్వర రావు
పురాణపండ రంగనాథ్
పురాణపండ రాఘవరావు



**ఉషశ్రీ**

**వ్యాస సత్యవతి**

పెద్దమ్మాయి గాయత్రీదేవి
అల్లుడు అల్లంరాజు రామశాస్త్రి
మనవరాలు అపరాజిత

రెండో అమ్మాయి పద్మావతి
అల్లుడు విష్ణువజ్జుల మురళీ కృష్ణ
మనవలు ఉషశ్రీ దీక్షిత్, నరేన్ దీక్షిత్

మూడో అమ్మాయి వైజయంతి
అల్లుడు కూచిమంచి సుబ్రహ్మణ్యం
మనవడు సూర్యప్రకాశ్

నాలుగో అమ్మాయి కళ్యాణలక్ష్మి
అల్లుడు బాపూజీ
మనవరాలు స్పందన, మనవడు సిద్ధార్థ





# ఉషశ్రీ రచనలు

## పురాణేతిహాసాలు

మహాభారతం

రామాయణం

భాగవతం

భగవద్గీత

సుందరకాండ

## ప్రత్యేక రచనలు

భారతంలో రాయబారాలు

(ఎవరు ఎలా మాట్లాడతారు)

రామాయణంలో హనుమంతుడు

(ఎవరితో ఎలా మాట్లాడాలి)

ఏది సత్యం? ఏదసత్యం?

(ధర్మసందేహాలు)

రామాయణ భారతాలు – ఉషశ్రీ ఉపన్యాసాలు

వివేకానందం

## యక్షగానాలు

వేంకటేశ్వర కళ్యాణం

రాగ హృదయం

## వచన ప్రబంధాలు

మనుచరిత్ర

కళాపూర్ణోదయం

## నవలా లేఖావళి

పెళ్ళాడే బొమ్మా



## నవలికలు

ఒక్కరాత్రి

ప్రేయసి-ప్రియంవద

సంతప్తులు

కాంతం-కనకారావు

తరాలు-అంతరాలు

## కథా సంపుటాలు

అమృతకలశం (అమృతకలశం, మేనక, దేవయాని, విశ్వశాంతి)

మల్లెపందిరి (అభిధ, దౌహృది, కడుపులో పాపాయి, మల్లెపందిరి, ప్రదక్షిణ, కులపాలిక)

జ్వలితజ్వాల (జ్వలితజ్వాల, నాతిచరామి, అంతర్వత్ని)

## ఇతర కథలు

పార్వతి పెళ్ళి సమస్య – కృష్ణా పత్రిక, 15–12–1951

మల్లిమీద మమకారం – ఆంధ్రపత్రిక, 6–5–1953

పట్టభద్రుడు – కృష్ణా పత్రిక, 20–6–1953

పరీక్ష – కృష్ణా పత్రిక, 12–6–1954

శరన్మేఘాలు – కృష్ణా పత్రిక, 3–7–1954

బొమ్మా బొరుసూ – కృష్ణా పత్రిక, 2–10–54

సౌందర్యం – ఆంధ్రపత్రిక, 15–6–1955

సుందర జీవితం – ఆంధ్రపత్రిక, 21–3–1956

రమా రమణులు – ఆంధ్రపత్రిక, 22–7–1956

సీమంతిని – ఆంధ్రపత్రిక, 19–5–1957

కాళీ హైమవతీ – ఆంధ్రపత్రిక, 14–8–1957

గోరువంక – ఆంధ్రప్రభ, 22–11–1958

చిలుకు – ఆంధ్రప్రభ, 24–1–1959

ఇయం గేహే లక్ష్మీ – ఆంధ్రపత్రిక, 30–9–1959

తోబుట్టువు – ఆంధ్రప్రభ, 21–10–1959

మధుర వాణి – ఆంధ్రపత్రిక, 20–7–1960

ప్రణయ కలహం – సైనిక సమాచార్, 27–5–1962





సుమ హృదయం - సైనిక సమాచార్, 22-7-1962

జనానా మే - కృష్ణా పత్రిక, 4-8-1962

పిచ్చి కుక్క - కృష్ణా పత్రిక, 17-7-1971

నిప్పచ్చరం - స్వాతి మాసపత్రిక, 1977

అమరా నిర్జరా దేవా

**ఇంకా**

పద్యాలూ, వ్యాసాలూ, విమర్శలూ

**కలంపేర్లు**

అనామిక

శుచిముఖి

కళ్యాణి

వైశంపాయన

వ్యాస శ్రీమతి

గాయత్రి

ఉషశ్రీ రచనల వివరాలు సంపూర్ణంగా తయారు చేసే ప్రయాసలో రెండు ఇబ్బందులు ఎదురయ్యాయి.

మొదటిది - ఉషశ్రీ ఎన్నో కలంపేర్లతో రచనలు చెయ్యడం.

పైన ఉదహరించిన కలంపేర్లు కాకుండా ఇంకొన్ని ఉండి ఉండచ్చు.

రెండోది - ఉషశ్రీకి తన రచనలను భద్రపెట్టుకునే అలవాటు లేకపోవడం.

**పై వివరాలు ఉషశ్రీ రచనల మీద పరిశోధన చేస్తున్న సమయంలో**
**ఉషశ్రీ మూడో కూతురు వైజయంతి ఉషశ్రీ మిత్రుల నుండి సేకరించగా లభించినవి.**



# ఉషశ్రీ మిషన్ కార్యక్రమాలు

1990 లో తను దివంగతులయ్యేంత వరకూ
పురాణేతిహాసాల సారాన్ని అందరికీ అందించడం కోసం కృషి చేసారు ఉషశ్రీ
ఆ కృషిని కొనసాగించే ఆశయంతో ఉషశ్రీ నలుగురు కుమార్తెలూ
గాయత్రీదేవి, పద్మావతి, వైజయంతి, కళ్యాణలక్ష్మి
1991 లో స్థాపించిందే ఉషశ్రీ మిషన్
ఆ కృషిలో భాగంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోంది

## పోటీలు

ప్రతిసంవత్సరం పాఠశాల / కళాశాల విదార్థినీ విద్యార్థులకు వ్యాసరచన / వక్తృత్వ పోటీల నిర్వహణ

## పుస్తక ప్రచురణలు

రామాయణంలో హనుమంతుడు (1992)
అమృతకలశం (1994)
ఉషశ్రీ ఉపన్యాసాలు (1995)
ఏది సత్యం? ఏదసత్యం? (1996)
వేంకటేశ్వర కళ్యాణం (2007)
ఎవరు ఎలా మాట్లాడతారు (భారతంలో రాయబారాలు) (2016)

## ఉషశ్రీ సంస్కృతీ సత్కారం

దాశరథి రంగాచార్య (2002)
పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ (2003)
మాడుగుల నాగఫణిశర్మ (2004)
బేతవోలు రామబ్రహ్మం (2005)
రాళ్ళబండి కవితాప్రసాద్ (2006)
పుల్లెల శ్రీరామచంద్రుడు (2007)
గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ (2008)
తాతా సందీప్ శర్మ (2017)





## ఉషశ్రీ ఉభయకుశలోపరి

గుంటూరు (2011)

హైదరాబాదు (2012)

హైదరాబాదు (2013)

విజయవాడ (2015)

విజయవాడ (2016)

## ఇంకా

ఉషశ్రీ సాహిత్యం – సమగ్ర పరిశీలన అన్న అంశంపై
ఉషశ్రీ మూడో అమ్మాయి వైజయంతి పీహెచ్డీ (2003)

వేంకటేశ్వర కళ్యాణం యక్షగాన ప్రదర్శన
ఉమా రామారావు (2007)

Words Mighty Words
(రామాయణంలో హనుమంతుడు ఆంగ్లంలో) (2007)

బ్రెయిలీ లిపిలో ఉషశ్రీ రామాయణం, భారతం, భాగవతం (2013)



# చివరో మాట

## రాసిన అనామకుడు

1957లో – మద్రాసులో – మెరీనా తీరంలో – జననం

ముప్ఫై ఐదేళ్ళకి పైగా – రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో – ఉద్యోగం

ప్రస్తుతం – హైదరాబాదులో – RBI-IDRBT డైరెక్టర్

మద్రాసు యూనివర్సిటీ నుండి బీయెస్సే ఎమ్మెస్సీలలో ఫస్ట్ ర్యాంక్

మద్రాస్ ఐఐటీ నుండి డాక్టరేట్

Oxford, Kellog లలో మేనేజ్మెంట్ కోర్సులు

Valuation of Financial Assets, Quantitative Methods for Banking

అనే పుస్తకాలు ఇంగ్లీషులో

అందులో మొదటిది – చైనీసులో కూడా

తెలుగులో రెండు రేడియో నాటికలూ, రెండు నవలికలూ, అరవై దాకా కథలూ

అందులో రేడియో నాటికకీ, పదిహేను కథలకి బహుమతులు

రమణీయం, శీలమా అది ఏమి? కథాసంపుటులు

ramasastri@hotmail.com



ఉషశ్రీ

# ఉషశ్రీ

ఇంతింతై వటుడింతయై

ఎందరి ఆశీస్సులో నన్ను అక్షరదీక్ష నుండి అటూ ఇటూ
కదలనీయకపోవడం వల్లనే ఇంకా కలం గళం సజీవంగా ఉన్నాయి
ఈ జీవితగౌతమి భారతరామాయణాలు అనే
గట్టి గట్ల మధ్య ప్రవహిస్తూనే ఉంది

- ఉషశ్రీ

నా మొదటి ఐదేళ్ళూ నాకు అంతగాతెలియకుండా గడిచిపోయుంటాయి
ఆ తర్వాత యాభైయేళ్ళలో - మొదటి పాతికేళ్ళు నాన్నతో
తర్వాత పాతికేళ్ళూ నాన్నతోనే

- డా గాయత్రీదేవి

ప్రత్యేకమైన కంఠాన్ని వాహనంగా చేసుకుని ఉషశ్రీ ఆత్మ మనకిచ్చిన
భారతరామాయణాది పురాణాలసారం మనలో నిలిచి ఉన్నంతకాలం
ఉషశ్రీ చిరంజీవిగానే ఉంటాడు
అది మన భాగ్యం

- అనామకుడు



ISBN 9789352915279

anupamaprinters@yahoo.co.in